

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 81

బుధవారం 6-12-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



భారత్ 'పంచ్' పవర్

ప్రపంచ జూనియర్ బాక్సింగ్ టోర్నీలో 17 పతకాలు సొంతం - 12లో



మూడో అతిపెద్ద ఎకానమీ

2030కల్లా భారత్ అవతరించనుందని ఎస్అండ్‌పీ గ్లోబల్ నివేదిక - 13లో



భూకక్ష్య వైపు ప్రొపల్షన్ మాడ్యూల్

చంద్రయాన్-3లో భాగమైన ప్రొపల్షన్ మాడ్యూల్‌ను చంద్రుడి కక్ష్య నుంచి భూకక్ష్య వైపు మళ్లించినట్లు ఇస్రో తెలిపింది.

వివరాలు 6లో ▸



'ఇండియా' భేటీ వాయిదా

బుధవారం జరగాల్సిన ప్రతిపక్ష ఇండియా కూటమి అగ్ర నేతల సమావేశం డిసెంబర్ మూడో వారానికి వాయిదా పడింది.

వివరాలు 6లో ▸



'గోమూత్ర రాష్ట్రాల్లోనే గెలుపు'

గోమూత్ర రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తుందంటూ డీఎంకే ఎంపీ సెంథిల్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ, కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేశాయి.

వివరాలు 6లో ▸



కర్ణిసేన చీఫ్ కాల్చివేత

రాజస్తాన్‌లోని జైపూర్‌లో శ్రీ రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణిసేన అధ్యక్షుడు సుఖ్‌దేవ్ సింగ్ గొగామెడిని దుండగులు హత్య చేశారు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

జగన్ వచ్చాకే దళితులు, గిరిజనులకు రక్షణ

- చంద్రబాబు హయాంలో నిత్యం ఈ వర్గాలపై దమనకాండ
- నాడు సీఎం హోదాలో బాబే నీచంగా మాట్లాడిన వైనం
- చింతమనేని దాడులు, వర్ల రామయ్య వ్యాఖ్యలూ దళితులు మరవలేదు
- జగన్ పాలనలో ఎస్సీ, ఎస్టీలపై తగ్గిన దాడులు.. ఎన్సీఆర్‌బీ నివేదికను వక్రీకరిస్తూ ఈనాడు దుష్ప్రచారం

14లో

బాబు కోసం ఇంత బరితెగింపా!?

- యావత్తు దేశం ఆరోగ్యశ్రీని ప్రశంసిస్తుంటే రామోజీ వికృత రాతలు
- టీడీపీ హయాంలో కేవలం 1,059 ప్రొసీజర్లకే చికిత్స
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అవి 3,257కు పెంపు
- 2019 నుంచి ఇప్పటికి 4.53 లక్షల మంది హృద్రోగ బాధితులకు ఉచిత చికిత్సలు
- ఇందుకు రూ.2,074 కోట్లు ఖర్చుచేసిన సీఎం జగన్

10లో



తిరుపతి జిల్లా నాయుడుపేట వద్ద స్వర్ణముఖి నది కాజ్‌వే మునిగి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు



కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం కాటూరులో నీట మునిగిన వరి పనలను దిగాలుగా చూస్తున్న రైతు

వణికించిన 'మిచాంగ్'

తీవ్ర తుపానుతో తిరుపతి, నెల్లూరు జిల్లాలు అతలాకుతలం

- రికార్డు స్థాయిలో వర్షాలతో నీట మునిగిన పలు ప్రాంతాలు
- తిరుపతి జిల్లా చింతవరంలో 42 సెంటీమీటర్ల వర్షం
- కుండపోత వర్షాలతో పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- తిరుమలలో పాపవినాశం, ఆకాశగంగ, గోగర్భం డ్యామ్‌ల గేట్లు ఎత్తివేత.. వందలాది గ్రామాలకు రాకపోకలు బంద్
- మరో 9 జిల్లాల్లోనూ భారీ వర్షాలు.. నీట మునిగిన పంటలు
- మంగళవారం మధ్యాహ్నం బాపట్ల వద్ద తీరం దాటిన తుపాను
- ఆ సమయంలో గంటకు 100 కి.మీల వేగంతో పెనుగాలులు
- ఆపై తుపాన్ బలహీన పడుతూ ఉత్తర దిశగా పయనం

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: మిచాంగ్ తుపాను తిరుపతి, నెల్లూరు జిల్లాలను కుదిపేసింది. పలు జిల్లాలను వణికించింది. దీని ప్రభావంతో కురుస్తున్న కుండపోత వర్షాలకు తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో జన జీవనం పూర్తిగా స్తంభించిపోయింది. రికార్డు స్థాయిలో కురిసిన వర్షాలు.. 80 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురు గాలులతో పట్టణాలు, పల్లెలు చిగురుటాకుల్లా వణికిపోయాయి. 3 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన అతి తీవ్ర వర్షాలతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రోడ్లపై మోకాళ్ల లోతుకుపైగా నీళ్లు ఉండడంతో రాకపోకలు దాదాపు నిలిచిపోయాయి. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. దీంతో పలుచోట్ల రోడ్లు తెగిపోయాయి. ఈదురు గాలులకు నెల్లూరు జిల్లాలో కరెంటు స్తంభాలు, పలు చోట్ల గుడిసెలు నేలకూలాయి. అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్లపై చెట్లు కూలిపోయాయి. అయితే ప్రభుత్వం సహాయక చర్యల్ని వేగంగా చేపట్టడంతో యుద్ధ ప్రాతిపదికన కరెంటును పునరుద్ధరించగలిగారు. కూలిన చెట్లను రోడ్లపై నుంచి తొలగించే పనులు చేపట్టారు. మరోవైపు

మిగతా 3వ పేజీలో ▶



ఒంగోలు ముంగమూరురోడ్డులోని స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో భోజనం చేస్తున్న ప్రజలు

పింఛన్ల పంపిణీ మరో రోజు పొడిగింపు

- తుపాను నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం
- మంగళవారం కూడా 81,702 మందికి పైగా పింఛన్ అందజేసిన వలంటీర్లు

- వివరాలు 14లో

ముమ్మరంగా సహాయక చర్యలు

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలతో ఆగమేఘాలపై సాయం
- 8 జిల్లాల్లో పునరావాస కేంద్రాలు.. 15,173 మంది తరలింపు
- భోజనం, వసతి, తాగునీరు సౌకర్యం.. 80కిపైగా శిబిరాల ద్వారా వైద్య సేవలు
- అత్యవసర సహాయక చర్యల కోసం రూ.23 కోట్లు విడుదల
- ఎస్డీఆర్ఎఫ్ బృందాల ద్వారా విరిగిన పడిన చెట్ల తొలగింపు
- యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

2లో

సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా..

సమర్థంగా రేషన్ పంపిణీ

- 'తుపాను' ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టండి
- విద్యుత్ సరఫరా వ్యవస్థను హుటాహుటిన పునరుద్ధరించండి
- బాధితులకు సౌకర్యాల కల్పనలో ఎలాంటి పొరపాట్లు రావద్దు
- తుపాను సహాయ కార్యక్రమాలపై సీఎం వైఎస్ జగన్ సమీక్ష

2లో

వలంటీర్లే సైనికులు

- తుపాను ప్రాంతాల్లో విస్తృత సేవలు.. బాధితులకు ముందుండి తోడ్పాటు
- ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలింపులో సాయం

3లో

నేడు విద్యా సంస్థలకు సెలవు

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సెలవు ప్రకటించిన విద్యాశాఖ

2లో

ఎస్సై రాత పరీక్ష ఫలితాలపై

స్టే ఎత్తివేత

- అభ్యర్థుల ఆరోపణల్లో వాస్తవం లేదని తేల్చిన హైకోర్టు
- న్యాయస్థానంలోనే అభ్యర్థుల ఎత్తు కొలిపించిన ధర్మాసనం
- పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కొలతలు సరిగానే ఉన్నాయని స్పష్టీకరణ
- అభ్యర్థులు రూ.లక్ష చొప్పున చెల్లించాల్సిందేనన్న ధర్మాసనం

- వివరాలు 5లో

తెలంగాణ సీఎం రేవంత్



నాటకీయ పరిణామాల మధ్య ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానం

- గురువారం ఉదయం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం.. మంగళవారం ఢిల్లీలో రోజంతా హైడ్రామా
- చివరి వరకు సీఎం పదవి కోసం ఉత్తమ్, భట్టి ప్రయత్నాలు
- ఉప ముఖ్యమంత్రులుగా భట్టితోపాటు మరొకరికి అవకాశం?
- ఉత్తమ్, దామోదర, శ్రీధర్‌బాబు, సీతక్కలకు కీలక శాఖలు

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నూతన ముఖ్యమంత్రిగా పీసీసీ చీఫ్, కొడంగల్ ఎమ్మెల్యే ఎనుముల రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. గురువారం ఉదయం 10.28 గంటలకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతోపాటు డిప్యూటీ సీఎంలు, మంత్రులుగా ఎవరెవరు ఉంటారన్న దానిపై బుధవారం నిర్ణయం తీసుకోనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచాక రెండు రోజులపాటు అనేక తర్జనభర్జనలు, సంప్రదింపులు జరిపి, నేతల అభిప్రాయాలు తీసుకున్న కాంగ్రెస్ అధిష్టానం పార్టీ శాసనసభాపక్ష (సీఎల్పీ) నేతగా

మిగతా 2వ పేజీలో ▶

అనంతపురం జిల్లా రాయదుర్గంలో సామాజిక సాధికార సభకు హాజరైన భారీ జనవాహినిలో ఓ భాగం



రాయదుర్గంలో విజయ యాత్ర

- సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- వీధివీధిలో వెల్లివిరిసిన సామాజికన్యాయం.. బైక్ ర్యాలీతో యువత సందడి
- సీఎం జగన్‌ను మరోసారి సీఎం చేయాలన్న పిలుపునకు పెద్ద ఎత్తున మద్దతు

2లో

ఇదండీ సంగతి



హైదరాబాద్‌ను డెవలప్ చేసింది మీరేనని ఎలా ప్రచారం చేశామో.. కాంగ్రెస్‌ను గెలిపించింది మనమేనని అలానే చేద్దాం సార్!

పోలవరం తొలి దశ సవరించిన అంచనా వ్యయం

రూ.31,625.36 కోట్లు



- ఆమోదించే ప్రక్రియను వేగవంతం చేసిన కేంద్ర ప్రభుత్వం
- వచ్చే సోమవారం కేంద్ర జల్ శక్తి శాఖకు నివేదిస్తామన్న ఆర్‌సీసీ చైర్మన్
- దీని ఆధారంగా పీఐబీకి ప్రతిపాదన పంపనున్న కేంద్ర జల్ శక్తి శాఖ
- పీఐబీ ఆమోదిస్తే తొలి దశ పనులకు తాజా ధరల ప్రకారం నిధులు

- వివరాలు 10లో

రెండుచోట్లా ఓటేయకుండా

చర్యలు తీసుకోండి

- తెలంగాణలో ఓటేసి.. మళ్లీ ఏపీలో ఓటేసేందుకు సిద్ధమయ్యారు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కోరిన వైఎస్సార్‌సీపీ బృందం
- హైదరాబాద్‌లో టీడీపీ ఆధ్వర్యంలో ఏపీ న్యూ ఓటర్ రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు ఫిర్యాదు.. ఆధారాలు సమర్పణ

- వివరాలు 14లో



శాంతికి భద్రత.. నేరానికి శిక్ష

ప్రభుత్వ చర్యలతో రాష్ట్రంలో శాంతిభద్రతలు భేష్

2021లో కంటే రాష్ట్రంలో నేరాలు తగ్గుదల

- 2021లో 2.22 లక్షల కేసులు.. 2022లో 1.95 లక్షల కేసులు
- తగ్గిన హత్యలు, హింసాత్మక ఘటనలు, అవినీతి కేసులు, రైతుల ఆత్మహత్యలు
- ఎన్‌సీఆర్‌బీ నివేదిక-2022 వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలు, చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. గతంతో పోలిస్తే రాష్ట్రంలో నేరాలు గణనీయంగా తగ్గాయి. హత్యలు, హింసాత్మక ఘటనలు, అవినీతి కేసులు బాగా తగ్గుముఖం పట్టడం ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో నేరాలు తగ్గుతున్నాయని జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక వెల్లడించడం ప్రాధాన్యత సంతరించుకుంది. 2022లో దేశంలో వివిధ నేరాల గణాంకాలను వెల్లడిస్తూ ఎన్‌సీఆర్‌బీ తాజా నివేదికను వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రకాల నేరాలు తగ్గడంతోపాటు రైతుల ఆత్మహత్యలు తగ్గాయని ఆ నివేదిక

మిగతా 14వ పేజీలో ▶

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

నాలుగు మెతుకులు తింటున్నాం..



ఇదిగో మంచం మీద కూచున్నాడే ఆయన నా పెనిమిటి లక్ష్మయ్య. సరిగ్గా కనపడదు, వినపడదు. ఏ పనీ చేయలేకపోతున్నాడు. నా ఆరోగ్యం కూడా అంతంతే.. ఇద్దరం ఒకేసారి మూలన పడిపోయాం. తప్పదన్నట్లు నేనే సత్తువ తెచ్చుకుని ముసలాయనకి దగ్గరుండి అన్ని పనులు చేసిపెడుతున్నా. కొడుకో..కూతురో ఉండుంటే ఒక ముద్ద పెట్టేవాళ్లు. కానీ మాకా భాగ్యం లేదు. మా గతి ఏంగానూ అనుకున్న సమయంలో వలంటీర్ వచ్చి పింఛన్ సొమ్ము నెలకు రూ. 2,500 ఇచ్చేళ్తోంది. ఇప్పుడు మూడు పూటలా నాలుగు మెతుకులు తింటున్నామంటే ఆ మహానుభావుడి దయే. ఆసరా లేని మాకు పింఛను ఇచ్చి పెద్ద దిక్కయ్యాడు. చెరువు కట్టమీద ఉన్న ఇదిగో ఈ చిన్న గుడిసెలోనే ఇద్దరం తల దాచుకుంటున్నాము. పిల్లలు లేని మేము కూలీ నాలీ చేసుకుని బతికేటోళ్లం. ఇప్పుడెటూ కదల్లేకపోతున్నాం. ఏ సమయంలో ఎలా ఉంటుందా? అని గాబరా పడుతున్న సమయంలో పింఛనే మమ్మల్ని బతికిస్తోంది. ఐదేళ్ల కిందట పింఛన్ కోసం పంచాయతీ ఆఫీసు దగ్గరకెళ్లి పడిగాపులు కాసేటోళ్లం. కాళ్లరిగేలా నాలుగైదురోజులు తిరిగితే తప్ప పింఛన్ డబ్బులు దక్కేవి కావు. రేషన్ బియ్యానికిక్కాడా చాలా దూరం నడిచెళ్లి గంటలు తరబడి లైన్లో నిలబడేటోళ్లం. ఈ ప్రభుత్వం దయతో ఇప్పుడు తిన్నగా ఇంటికే తీసుకొచ్చిస్తున్నారు. ఆ బియ్యం, పింఛన్ డబ్బులతో హాయిగా బతుకుతున్నాం. పిల్లలు లేని మాకు జగనే కొడుకులా బతికిస్తున్నాడు.

– బండి మునెమ్మ, అల్లూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
(ఎస్‌కె.మన్సూర్, విలేకరి, అల్లూరు)

ఈ షాపునకు నేనే యజమాని



పలమనేరులోని కంసాలీ వీధిలో పాత పెంకుటింట్లో ఐదుగురు పిల్లలతో కలిసి ఉండేవాళ్లం. నా భర్త పనికెళ్తున్నప్పటికీ కుటుంబాన్ని పోషించడం చాలా కష్టంగా ఉండేది. డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా చిన్న చిన్న రుణాలు తీసుకొని కుటుంబ అవసరాలకు వాడుకుంటూ వచ్చా. గ్రూపులో బ్యాంకు లింకేజి రుణంగా రూ.80 వేలు తీసుకొని పట్టణంలోని మారెమ్మగుడి వెనుక చిన్న చిల్లర కొట్టు పెట్టాను. తీసుకున్న రుణాన్ని కట్టుకుంటూ మెల్ల మెల్లగా దుకాణాన్ని అభివృద్ధి చేసుకుంటూ వచ్చా. మా కుటుంబానికి దుకాణమే ఆధారంగా మారింది. ఈ ప్రభుత్వంలో రెండుదఫాలు రూ.18,750 చొప్పున రూ.37,500 వైఎస్సార్ చేయూత ద్వారా ఆర్థిక సాయం అందింది. దీంతో వ్యాపారాన్ని అభి వృద్ధి చేసుకుంటూ చిన్న దుకాణాన్ని ఇప్పుడు ఎస్‌ఎంబీ జనరల్ స్టోర్ అండ్ హోల్ సేల్ దుకాణంగా మార్చా. ఇప్పుడు చిన్న కొట్లకు అవసరమైన సరుకులను నా హోల్‌సేల్ దుకాణం నుంచి అమ్ముతున్నా. ఐదుగురు పిల్లల చదువులు, పెళ్లిళ్ల గురించి ఇప్పుడు దిగుల్లేదు. పెద్ద కొడుకు కరీముల్లాను ఎంబీఏ దాకా చదివించా. ఇప్పుడు కర్ణాటకలోని కోలార్‌లో మార్కెటింగ్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ముగ్గురు ఆడపిల్లల్లో ఇద్దరిని టెన్త్‌దాకా చదివించా. ఇంకో అమ్మాయిని డిగ్రీ దాకా చదివించి ముగ్గురికి పెళ్లిళ్లు చేశా. ఇప్పుడు ముగ్గురు కుమార్తెలు అత్తారింట్లో సంతోషంగా ఉన్నారు. చిన్నోడు ఇలియాజ్ డిగ్రీ దాకా చదువుకున్నాడు. నా భర్త మహబూబ్‌బాషా నాకు సాయంగా దుకాణంలో ఉంటున్నారు. రోజుకు రూ.7 వేల దాకా వ్యాపారం నడుస్తోంది. ఈ ప్రభుత్వ పథకాల వల్లే మేం సంతోషంగా ఉన్నామని ధైర్యంగా చెబుతున్నాం.

– షేక్, నూర్జహాన్ బేగం, ఓంశక్తి ఎస్‌హెచ్‌జీ, కంసాలి వీధి, పలమనేరు, చిత్తూరు జిల్లా
(పిచ్చిగుంట్ల సుబ్రమణ్యం, విలేకరి, పలమనేరు)

దిగుల్లేదిక..



మాది నిరుపేద రజక కుటుంబం. నేను, మా ఆయన కలసి ఎంత మంది బట్టలు ఉతికినా కుటుంబ పోషణ కష్టంగానే ఉండేది. పూట గడవడానికి నానా పాట్లు పడాల్సి వచ్చేది. తప్పనిసరి పరిస్థితుల్లో ఉన్న ఒక్క కొడుకూ చదువు మానేసి బతుకుదెరువు కోసం ముంబాయి వలస వెళ్లిపోయాడు. ఈ ప్రభుత్వం వచ్చాక మా బతుకులు మారాయి. శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం మండలం ఈదుపురం గ్రామానికి చెందిన నేను నరసింహస్వామి స్వయం శక్తి సంఘంలో సభ్యురాలిని. 2014 ఏప్రిల్ 11వ తేదీ నాటికి బ్యాంకుకు బకాయి పడిన మొత్తాన్ని వైఎస్సార్ ఆసరా కింద నాలుగు విడతల్లో అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. దాని ప్రకారం ఏడాదికి నాకు రూ.12,800 వంతున మూడేళ్లుగా బ్యాంకు ఖాతాలో జమయింది. దానికి అదనంగా బ్యాంక్ లింకేజీ రుణం లక్ష రూపాయలు తీసుకొని మా ఇంటి వద్దనే కూరగాయల వ్యాపారం ప్రారంభించాను. తాజా కాయగూరలు తెస్తుండటంతో మంచి డిమాండ్ ఉంటోంది. రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు లాభం వస్తోంది. దానివల్ల నెలవారీ బ్యాంకు లింకేజీ రుణాన్ని తీర్చగలుగుతున్నాను. మా ఆయన నొవాడ బాలరాజు ఇంటి వద్దనే బట్టలు ఇస్త్రీ చేస్తుంటారు. ఆయనకు కూడా జగనన్న చేదోడు పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేలు వంతున వస్తోంది. ఈ ప్రభుత్వం వచ్చాకే మా తల రాతలు మారి మా కుటుంబమంతా సంతోషంగా ఉంది. దిగుల్లేదిక.

– నొవాడ బుడ్డెమ్మ, ఈదుపురం
(మద్దిలి కేశవరావు, విలేకరి, ఇచ్చాపురం రూరల్)



సభలో ఐక్యత చాటుతున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు



అనంతపురం జిల్లా రాయదుర్గంలో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

రాయదుర్గంలో బడుగు, బలహీన వర్గాల విజయ యాత్ర

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం జిల్లా రాయదుర్గంలో బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీలు విజయయాత్ర చేశారు. మంగళవారం ఇక్కడ జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో వేలాదిగా పాల్గొని వైఎస్ జగన్ అండతో తాము ఎంత ఉన్నతంగా బతుకుతున్నదీ వెల్లడించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి తరలి వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలతో రాయదుర్గం కళకళలాడింది. వీధివీధిలో సామాజిక న్యాయం వెల్లివిరిసింది. యువత బైక్ ర్యాలీతో సందడి చేశారు. ముందుగా శాంతినగర్‌లోని వైఎస్ విగ్రహానికి మంత్రులు గుమ్మనూరు జయరాం, ఉషశ్రీచరణ్, విప్ కాపు రామచంద్రారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అక్కడి నుంచి వేలాది మందితో ప్రారంభమైన బస్సు యాత్ర తేరుబజారులో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్దకు చేరుకుంది. అప్పటికే వేలాది మందితో సభా ప్రాంగణం నిండిపోయింది. వారికి యాత్రలో వచ్చిన ప్రజలు కలిసి ఆ ప్రాంతమంతా జనసంద్రంలా కనిపించింది. 14 ఏళ్ల అధికారంలో ఉన్న చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేయగా.. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత అన్ని విధాలా పెద్దపీట వేసి రాజ్యాధికారం కల్పించారని వక్తలు చెప్పడంతో సభికుల నుంచి పెద్దఎత్తున హర్షం వ్యక్తమైంది. మనకు సాధికారత కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోమారు అధికారం కట్టబెడదామని మంత్రులు, నేతలు పిలుపునివ్వడంతో ప్రజలు ఈలలు, కేకలతో మద్దతు ప్రకటించారు.

పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమం: మంత్రి ఉషశ్రీచరణ్

బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలకు అండగా నిలిచి, అనేక కార్యక్రమాలతో వారిని ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న దేశంలో ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు సిఫారసు చేస్తేనే పేదలకు పథకాలు అందేవని, సీఎంగా వైఎస్ జగన్ వచ్చాక పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందిస్తున్నారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలు సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉండి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. జగనన్న స్కీమ్‌ల ముఖ్యమంత్రి అయితే, చంద్రబాబు స్కామ్‌ల సీఎం అని వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో సీఎం జగనన్నపై ఎల్లో మీడియా దుష్ప్రచారం మరీ ఎక్కువవుతుందని, ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సోదరుడూ సైనికుడిలా దానిని తిప్పికొట్టాలని అన్నారు.

తలరాతలు మార్చిన బ్రహ్మ సీఎం జగన్: మంత్రి గుమ్మనూరు జయరాం

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల తలరాతలు మార్చిన బ్రహ్మ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఐదు కోట్ల ప్రజలకు మేలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి. అట్టడుగు వర్గాలను నవరత్నాల పథకాలతో ఆదుకున్న ముఖ్యమంత్రి జగన్ అని తెలిపారు. ఏకంగా రూ.2.50 లక్షల కోట్లు వారికి పంచిపెట్టారని అన్నారు. 2019లో ఒక ఓటు వేసినందుకే ఇన్ని కోట్లు పేదలకు పంచిపెట్టారని, 2024లో మళ్లీ సీఎం అయితే మన జీవితాలు మరింత బాగుపడతాయని వివరించారు. 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు ఏరోజైనా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల గురించి పట్టించుకున్నాడా అని ప్రశ్నించారు. తెలంగాణలో పోటీ చేసిన ఎనిమిది చోట్లా డిపాజిట్లు కూడా రాని పవన్ కళ్యాణ్ ఇక్కడ ఏమి ఉద్ధరిస్తారని నిలదీశారు. ముగ్గురు భార్యలకు గ్యారంటీ ఇవ్వలేని పవన్ ఇక ప్రజలకు ఏమి గ్యారంటీ ఇస్తారని అన్నారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు బీసీ కాదని, కే బ్రాండ్ బీసీ అని వ్యాఖ్యానించారు.

ముమ్మరంగా సహాయక చర్యలు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: మిచాంగ్ తుపాను రాష్ట్రంపై విరుచుకుపడిన నేపథ్యంలో ప్రభుత్వం ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టింది. 4 రోజుల ముందు నుంచే అప్రమత్తమై అన్ని చర్యలు తీసుకోవడంతోపాటు ప్రభావిత జిల్లాలను సైతం ముందే సంసిద్ధం చేసింది. ప్రజలు ఇబ్బందులు పడకుండా, సాధ్యమైనంత వరకు నష్టాన్ని నివారించాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించడంతోపాటు అందుకు అనుగుణంగా అన్నీ సమకూర్చారు. ప్రభావిత 8 జిల్లాల్లో ప్రమాదకరమైన లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకి తరలించారు. 204 సహాయక శిబిరాలు ఏర్పాటు చేసి అక్కడ 15,173 మందికి పునరావాసం కల్పించారు. పునరావాస కేంద్రాల్లో వారికి ఆహారం, మంచి నీటి సౌకర్యం కల్పించారు. 80కి పైగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల ప్రజలకు ఎలాంటి వైద్య పరమైన సమస్యలు వచ్చినా చికిత్స అందిస్తున్నారు. అల్పపీడనం ఏర్పడినప్పటి నుంచి విపత్తుల సంస్థలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి తుపాను కదలికలు పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు కలెక్టర్లకు సూచనలు జారీ చేస్తూ వచ్చారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులను నాలుగు రోజుల ముందే ప్రభుత్వం వెనక్కి పిలిపించింది. వర్షాలు, ఈదురు గాలుల గురించి ఫోన్లకు హెచ్చరిక సందేశాలు పంపి అప్రమత్తం చేసింది. బాధిత కుటుంబాలకు 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, ఒక లీటర్ పామాయిల్, కేజీ చొప్పున ఉల్లిపాయలు, బంగాళాదుంపలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

సహాయక చర్యల కోసం రూ.23 కోట్లు విడుదల

తుపాను సహాయక చర్యల కోసం ప్రభుత్వం 11 జిల్లాలకు రూ.23 కోట్లు విడుదల చేసింది. పునరావాస కేంద్రాలు, బాధితులకు ఆహారం, నిత్యావసరాలు ఇతరత్రా అవసరాల కోసం రూ.11 కోట్లు, అత్యవసరంగా బాధిత కుటుంబాలకు రూ.1,000 నుంచి రూ.2,500 ఆర్థిక సహాయం అందించడం.. కూలిన, దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం ఇవ్వడం వంటి అవసరాలకు రూ.13 కోట్లను కలెక్టర్లకు విడుదల చేశారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు రూ.6 కోట్లు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలకు రూ.2 కోట్ల చొప్పున, గుంటూరు, ఎన్టీఆర్, తూ.గోదావరి జిల్లాలకు రూ.కోటి చొప్పున కేటాయించారు. ఈ నిధులతో కలెక్టర్లు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగంగా నిర్వహిస్తున్నారు. ఆయా జిల్లాల్లో వలంటీర్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులంతా తుపాను పర్యవేక్షక పనుల్లో నిమగ్నమై ఉన్నారు.



నెల్లూరులో విరిగిపడిన కరెంటు స్తంభాలు, చెట్లను తొలగిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది



ఏలూరు జిల్లా వట్లూరులో వర్షపు నీటిపారుదలకు ఆటంకం లేకుండా డ్రెయిన్‌లను శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరుస్తున్న ఎస్డీఆర్ఎఫ్

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర విపత్తుల స్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్) ముమ్మరంగా సహాయక కార్యక్రమాలు చేపడుతోంది. 3 బెటాలియన్లకు చెందిన 6 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కృష్ణా, ప్రకాశం, బాపట్ల, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల్లో సహాయక కార్యక్రమాల్లో నిమగ్నమయ్యాయి. విరిగిపడిన చెట్లను తొలగిస్తూ.. రోడ్డు మార్గంలో రాకపోకలను పునరుద్ధరిస్తున్నాయి. వరదలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకువస్తున్నాయి.

సమష్టిగా సహాయక చర్యలు

- తిరుపతి జిల్లా యంత్రాంగం సమష్టిగా సహాయక చర్యలు చేపట్టింది. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను 54 పునరావాస కేంద్రాలకు తరలించింది. యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. నీట మునిగిన పంటల గురించి వ్యవసాయ శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. పునరావాస కేంద్రాలను కలెక్టర్ వెంకటరమణారెడ్డితో కలసి స్పెషల్ ఆఫీసర్ శ్యామలరావు మంగళవారం పరిశీలించారు.
- నెల్లూరులోని మాగుంట లేఅవుట్ ప్రధాన రహదారి, మూలాపేట తదితర ప్రాంతాల్లో రోడ్లపై విరిగిపడిన చెట్లను జేసీబీ సాయంతో తొలగించారు. ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు సజావుగా ప్రవహించేలా డ్రెయిన్లు, పంట కాలువలు తదితరాల్లో పూడిక తీశారు.
- పశ్చిమగోదావరి జిల్లాలో తీర ప్రాంత గ్రామాల నుంచి 5,113 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆహార అవసరాల కోసం కేంద్రాల వద్ద 608.56 కిలోల బియ్యం, 1202 కేజీల గోధుమ పిండి, 2640 కిలోల పంచదారను అందుబాటులో ఉంచారు. 11 మంది గర్భిణులను ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్పించారు. అగ్నిమాపక, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో సిబ్బందితో ఏర్పాటుచేసిన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బృందాలు రోడ్లపై పడిన చెట్లు, విద్యుత్ స్తంభాలను తొలగించి పరిస్థితిని చక్కదిద్దుతున్నారు.
- ఉమ్మడి కృష్ణా జిల్లాలో సివిల్ సప్లయిస్ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, కలెక్టర్లు ఢిల్లీరావు, పి.రాజాబాబు పర్యవేక్షణలో రెవెన్యూ, వ్యవసాయశాఖ, సివిల్ సప్లయిస్ అధికారులు ధాన్యం రవాణాపై దృష్టి సారించారు. 3,300 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఏలూరు జిల్లాలో రోడ్లపై అడ్డంగా పడిపోయిన చెట్లను పంచాయతీ సిబ్బంది, ఆర్‌అండ్‌బీ సిబ్బంది జోరువానలో తొలగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ప్రకాశం జిల్లాలో పునరావాస కేంద్రాలను మంత్రి ఆదిమూలపు సురేష్ తదితరులు పరిశీలించారు.
- కాకినాడ జిల్లా పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు తీర ప్రాంతంలో పర్యటించి పునరావాస ఏర్పాట్లను పర్యవేక్షించారు. మంగళవారం రాత్రి తీరం వెంబడి ఉన్న 150 గృహాలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మంత్రులు విశ్వరూప్, చెల్లుబోయిన తదితరులు ముంపుబారిన పడిన వరిచేలను పరిశీలించారు.
- కోనసీమ జిల్లాలో 9 మండలాల్లో 41 గ్రామాలు తుపాను ప్రభావానికి గురికాగా, 37 పునరావస కేంద్రాలకు 910 మందిని తరలించారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

సాక్షి, అమరావతి: తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని విద్యా సంస్థలకు బుధవారం కూడా ప్రభుత్వం సెలవు ప్రకటించింది. తుపాను తీవ్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో అన్ని విద్యా సంస్థలను మూసివేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్, ఇంటర్ బోర్డు కార్యదర్శి సౌరభ్‌గౌర్ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం కూడా కాకినాడ నుంచి నెల్లూరు వరకు ఉన్న జిల్లాల్లో విద్యా సంస్థలు తెరవరాదని ఆదేశించారు.

తెలంగాణ సీఎం రేవంత్

▶ మొదటి పేజీ తరువాయి

రేవంత్‌రెడ్డిని ఎంపిక చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీసుకున్న నిర్ణయాన్ని పార్టీ సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మంగళవారం సాయంత్రం ఢిల్లీలో ప్రకటించారు. గురువారం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. డిప్యూటీ సీఎం సహా ఇతర మంత్రి పదవుల అంశంపై బుధవారం నిర్ణయం తీసుకోనున్నట్టు వివరించారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ సుపరిపాలన అందించబోతోందని.. తాము ఇచ్చిన ఆరు గ్యారంటీలను నెరవేరుస్తామని చెప్పారు. ప్రభుత్వంలో వన్‌మ్యాన్ షో ఉండదని, అందరినీ కలుపుకొంటూ కలసి టీమ్‌గా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు.

వరుస భేటీలు.. విస్తృత సంప్రదింపులు

మంగళవారం ఉదయం ఢిల్లీకి చేరుకున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు కొద్దిసేపు పదవుల అంశంపై చర్చించుకున్నారు. 10.45 గంటలకు ఉత్తమ్ డీకే శివకుమార్‌తో భేటీ అయి.. సీఎం, డిప్యూటీ సీఎం పదవులు, పీసీసీ కొత్త అధ్యక్షుడి ఎంపిక, కీలక శాఖలకు మంత్రులు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా తనకు సీఎం పదవికి అర్హత ఉందని నొక్కి చెప్పినట్టు తెలుస్తోంది. ఏడుసార్లు ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశానని.. తనకు మెజార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ల మద్దతు ఉందని వివరించినట్టు సమాచారం. అయితే, భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ అధిష్టానం సీఎంగా ఎవరిని ఎంపిక చేసినా తనకు ఆమోదమేనని ప్రకటించారు. డీకేతో ఉత్తమ్ భేటీ జరుగుతున్న సమయంలోనే.. భట్టి విక్రమార్క రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేతో భేటీ అయ్యారు. సీఎం పదవి కోసం తన అర్హతను పరిశీలించాలని కోరారు. ఈ భేటీలు సాగుతున్న సమయంలోనే ఖర్గే నివాసంలో మరో కీలక భేటీ జరిగింది.

రేవంత్‌రెడ్డి వైపే మొగ్గు

మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఖర్గే నివాసానికి పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులు చేరుకుని సీఎల్పీ నేత ఎంపికపై చర్చించారు. పదవికి పోటీ పడుతున్న రేవంత్, ఉత్తమ్, భట్టి పేర్లను పరిశీలించారు. పార్టీకి పని చేసిన అనుభవంతోపాటు రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు, రానున్న పార్లమెంట్ ఎన్నికలు, మెజార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయాలు, ప్రజల్లో ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని రేవంత్‌రెడ్డి వైపే అంతా మొగ్గు చూపినట్టు తెలిసింది. ఈ భేటీ మొదలైన అరగంటకు డీకే శివకుమార్, ఠాక్రే కూడా ఖర్గే నివాసానికి చేరుకుని.. ఎమ్మెల్యేల తీర్మానం కాపీ, వారి అభిప్రాయాల నివేదికను అగ్రనేతలకు అందించారు. ఈ సందర్భంగా అంతా కలసి పార్టీ సీనియర్ నేతల నుంచి వస్తున్న డిమాండ్లు, కీలక శాఖల అప్పగింత, పీసీసీ కొత్త అధ్యక్షుడి ఎంపికపై చర్చించారు. రేవంత్ ఎంపికను ఖరారు చేసి, ఈ విషయాన్ని అగ్రనేత సోనియాగాంధీకి తెలిపి ఆమోదం తీసుకున్నారు. భట్టి విక్రమార్కకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఇదే సమయంలో ఉత్తమ్, దామోదర, శ్రీధర్‌బాబు, సీతక్కలకు కీలక శాఖలు ఇవ్వాలన్న ఆలోచనకు వచ్చినట్టు సమాచారం.

ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు వెంటనే ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై ఆమె మంగళవారం రాత్రి సచివాలయంలో సమీక్షించారు.

భట్టికి డిప్యూటీ సీఎం+పీసీసీ పగ్గాలు?

- కాంగ్రెస్ హైకమాండ్ ఆఫర్
- పీసీసీ చీఫ్ పదవిని ఆయన వద్దంటే బీసీ నేత పొన్నంకు అవకాశం
- మంత్రి పదవితో పాటు బోనస్‌గా ఇచ్చే చాన్స్
- మధుయాష్కీ, మహేశ్‌కుమార్, జీవన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, మల్లు రవిల పేర్లు కూడా పరిగణనలోకి



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ హైకమాండ్ సీఎల్పీ నాయకుడిగా ఎంపిక చేసిన నేపథ్యంలో కొత్త పీసీసీ అధ్యక్షుడు ఎవరన్నది ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. రేవంత్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగే అవకాశం లేకపోవడంతో ఆయన స్థానంలో కొత్త నేతను అధిష్టానం ఎంపిక చేయనుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో పాటు హుస్నాబాద్ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, మల్లురవిల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. కాగా సీఎల్పీ నాయకుడి ఎంపిక కసరత్తు కోసం ఢిల్లీ వెళ్లిన భట్టి ముందు అధిష్టానం ఓ ప్రతిపాదన చేసినట్టు తెలిసింది. కొత్త ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి హోదాతో పాటు పీసీసీ అధ్యక్ష బాధ్యతలు కూడా తీసుకోవాలని కేసీ వేణుగోపాల్ కోరినట్టు సమాచారం. అయితే సీఎం పదవి కావాలని అధిష్టానం వద్ద పట్టుబట్టిన భట్టి, ఈ విషయంలో ఏమీ తేల్చి చెప్పలేదని చెబుతున్నారు.

బీసీ కోటాలో పలువురి పేర్ల పరిశీలన!

పీసీసీ చీఫ్ పదవిని భట్టి నిరాకరించిన పక్షంలో.. సీఎం రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం, డిప్యూటీ సీఎం ఎస్సీ నేతకు ఇచ్చే పక్షంలో పీసీసీ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలనే ఆలోచనలో హైకమాండ్ ఉన్నట్టు సమాచారం. ఈ కోటాలో వినిపిస్తున్న మొదటి పేరు పొన్నం ప్రభాకర్. విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటున్న ప్రభాకర్.. అటు పార్టీకి, ఇటు గాంధీ కుటుంబానికి విధేయుడిగా గుర్తింపు పొందారు. ఎంపీగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎంపీల ఫోరం కన్వీనర్‌గా పనిచేసిన పొన్నం ఇటీవల జరిగిన ఎన్నికల్లో హుస్నాబాద్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వంలో ఆయనకు మంత్రి పదవి ఇవ్వడంతో పాటు పీసీసీ అధ్యక్ష పదవి ఇస్తారనే చర్చ జరుగుతోంది. గతంలో డి.శ్రీనివాస్ కూడా పీసీసీ అధ్యక్షుడిగా ఉండి మంత్రిపదవి నిర్వహించడాన్ని దృష్టిలో పెట్టుకుని అధిష్టానం ఈ ప్రతిపాదనపై చర్చ జరుపుతోందని తెలుస్తోంది. అది సాధ్యం కాని పక్షంలో మరో ఇద్దరు బీసీ నేతలు మధుయాష్కీగౌడ్, మహేశ్‌కుమార్‌గౌడ్‌ల పేర్లు కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం లేకపోలేదని అంటున్నారు. అలాగే సామాజిక సమీకరణలను బట్టి సీనియర్ నేతలైన ప్రస్తుత ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, మైనార్టీ నేత షబ్బీర్‌అలీ, మాజీ ఎంపీ మల్లురవిల పేర్లను కూడా హైకమాండ్ పరిశీలించే అవకాశముందనే చర్చ జరుగుతోంది.

సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా.. సమర్థంగా రేషన్ పంపిణీ

- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టండి
- విద్యుత్ సరఫరా వ్యవస్థను హుటాహుటిన పునరుద్ధరించండి
- బాధితులకు సౌకర్యాల కల్పనలో ఎలాంటి పొరపాట్లు రానీయొద్దు
- తుపాను సహాయ కార్యక్రమాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమీక్ష



సాక్షి, అమరావతి: తుపాను బాధితులకు రేషన్ పంపిణీని గ్రామ, వార్డు సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా సమర్థవంతంగా చేపట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తుపాను బాధిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ స్పెషల్ సీఎస్ జి. సాయిప్రసాద్, సీసీఎల్ఏ సెక్రటరీ ఇంతియాజ్, సీఎంఓ అధికారులతో సీఎం జగన్ భేటీ అయి తుపాను పరిస్థితులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నెల్లూరు–కావలి మధ్య సగం ల్యాండ్ ఫాల్, సగం సముద్రంలో తుపాను గమనం ఉందని అధికారులు తెలిపారు. చీరాల–బాపట్ల మధ్య పయనించి అక్కడ పూర్తిగా తీరం దాటనుందని ముఖ్యమంత్రికి వారు వివరించారు. తిరుపతి, నెల్లూరు జిలాల్లో తుపాను ప్రభావం ఈ ఉదయం నుంచి క్రమంగా తగ్గుముఖం పడుతోందని తెలిపారు. ఇక తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో సహాయ కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయని.. ప్రకాశం, గుంటూరు, కృష్ణా తదితర జిల్లాల కలెక్టర్లనూ అప్రమత్తం చేశామన్నారు. ఇప్పటివరకూ 211 సహాయ శిబిరాల్లో సుమారు 9,500 మంది ఉన్నారని వెల్లడించారు. వారందరికీ మంచి సదుపాయాలు అందించాలని సీఎం జగన్ ఆదేశించారు. సౌకర్యాల కల్పనలో ఎలాంటి పొరపాట్లు రాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు.

యుద్ధప్రాతిపదికన కరెంటు పునరుద్ధరణ

నెల్లూరు, తిరుపతి సహా తుపానువల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన కరెంటు సరఫరా వ్యవస్థను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రాణ, పశు నష్టం జరిగినట్లు సమాచారం అందితే 48 గంటల్లోగా పరిహారం అందించాలని సీఎం ఆదేశించారు. తుపాను తగ్గిన వెంటనే ఎన్యూమరేషన్ కూడా ప్రారంభం కావాలన్నారు.

రైతులకు కలెక్టర్ల భరోసా..

మరోవైపు.. సీఎం జగన్ ఆదేశాలతో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బాధితులను ఆదుకునేందుకు జిల్లా కలెక్టర్ల నుంచి అధికార యంత్రాంగం అంతా క్షేత్రస్థాయికి వెళ్లింది. దగ్గరుండి సహాయక చర్యలను చేపట్టింది. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు కల్లాల్లో ధాన్యం గుట్టలను సందర్శించి అవి తడవకుండా టార్పాలిన్లు కప్పేలా చర్యలు తీసుకున్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో అధైర్యపడాల్సిన అవసరంలేదని, మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులకు కలెక్టర్లు భరోసా ఇచ్చారు.

వణికించిన మిచాంగ్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, గుంటూరు, ఎన్టీఆర్, తూర్పుగోదావరి జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. రెండు మూడు రోజులుగా రాష్ట్ర వాసులను భయపెడుతున్న మిచాంగ్ తుపాను ఎట్టకేలకు మంగళవారం మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల మధ్య బాపట్లకు నైరుతి దిశగా 15 కి.మీ.ల దూరంలో తీవ్ర తుపానుగా తీరాన్ని దాటింది. ఆ సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచాయి. తీరం దాటడానికి 3 రోజుల ముందు నుంచి బంగాళాఖాతంలో తుపాను 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో బాపట్ల వైపు దూసుకువచ్చింది. మొదట్లో దివిసీమ, మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉన్నట్లు కనిపించినా, చివరకు అది తీవ్ర తుపానుగా మారి బాపట్లకు దగ్గరగా వచ్చి ఆ సమీపంలోనే తీరం దాటింది. తీరం దాటిన తర్వాత భూమిపై 11 కిలోమీటర్ల వేగంతో నార్త్ వెస్ట్ వైపు పయనిస్తూ తుపానుగా బలహీనపడింది. మంగళవారం రాత్రి 9గంటలకు బాపట్లకు 20 కిలోమీటర్లు, ఒంగోలుకు 50 కిలోమీటర్ల దూరంలో పయనిస్తూ ఉంది. ఆరు గంటల్లో తీవ్ర వాయుగుండంగా అది బలహీన పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. తుపాను బలహీనపడినా బుధవారం పలు జిల్లాల్లో వర్షాలు పడతాయని పేర్కొంది. మరో రెండు రోజులు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని హెచ్చరించింది.

చింతవరంలో 42 సెంటీమీటర్ల వర్షం

తుపాను ప్రభావంతో మంగళవారం తిరుపతి జిల్లా వ్యాప్తంగా సగటున 9.3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సగటున 8.6 సెంటీమీటర్లు, బాపట్ల జిల్లాలో 6.4, కృష్ణాలో 5.5, నెల్లూరు జిల్లాలో 5.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం చింతవరంలో 24 గంటల వ్యవధిలో 42 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పోటెత్తిన వాగులు, వంకలు

మిచాంగ్ తుపాన్ వల్ల తిరుపతి జిల్లాలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. స్వర్ణముఖి, అరణియార్, కాళంగి, కళ్యాణీ డ్యాం, మల్లిమడుగు, సదాశివకోనతో పాటు తిరుమలలోని పాపవినాశం, ఆకాశగంగ, గోగర్భం జలాశయాలన్నీ పూర్తిగా నిండిపోవటంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 775 చెరువులకు భారీగా వరద నీరు చేరటంతో పొంగి ప్రవహిస్తున్నాయి. రేణిగుంట విమానాశ్రయంలో రెండు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. చేపలు పట్టేందుకు తాత, మేనమామతో కలిసి వెళ్లిన తిరుపతి జీవకోనకు చెందిన నిఖిల్ (10) వాగులో కొట్టుకుపోయాడు. బాలుడి ఆచూకీ కోసం రెస్క్యూ టీమ్ గాలింపు చర్యలు చేపట్టింది. ఏర్పేడు మండలం బండారుపల్లి వద్ద వరద నీటిలో చిక్కుకున్న ఇద్దరు రైతులను రెస్క్యూ టీమ్ రక్షించింది. సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి, సత్యవేడు నియోజక వర్గాల పరిధిలోని అనేక గ్రామాలు పూర్తిగా జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. కాళంగి రిజర్వాయర్ నుంచి 38 వేల క్యూసెక్కుల నీటిని కిందికి విడుదల చేయటంతో సూళ్లూరుపేట పట్టణం జలదిగ్బంధంలో చిక్కుకుంది. చెంగాళమ్మ ఆలయం పూర్తిగా వరద నీటితో నిండిపోయింది. చెన్నై- విజయవాడ జాతీయ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. కరివేటి కాలువ, కాళంగి నది, పాముల కాలువ పొంగి ప్రవహిస్తుండటంతో కాదలూరు, సూళ్లూరుపేట చెరువులకు గండ్లు పడ్డాయి. సూళ్లూరుపేట- శ్రీకాళహస్తి మధ్య రహదారిపై 3 కి.మీ మేర వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్తంభించాయి. శ్రీహరి కోట, పులికాట్‌కు వెళ్లే మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పిచ్చాటూరు పరిధిలోని అరణియార్ మత్స్య కేంద్రం నీట మునగటంతో 10 లక్షలకుపైగా చేప పిల్లలు సముద్రంలో కలిసిపోయాయి. వెంకటగిరి-గూడూరు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. తిరుపతి నగరంలోని కొన్ని కాలనీలు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. చెన్నారెడ్డి కాలనీలోని నివాసం ఒకటి కూలిపోవటంతో పక్కనే ఉన్న రెండు కార్లు ధ్వంసం అయ్యాయి. శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని స్వర్ణముఖి, నక్కలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. 31 సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. వెయ్యికిపైగా విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. 200పైగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. ఫలితంగా 279 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ పునరుద్ధణ పనుల కోసం 188 బృందాలు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

నీట మునిగిన పంటలు..

▲ బాపట్ల జిల్లాలో తుపాన్ తీరం దాటే సమయంలో సముద్రంలో భీకర హోరుతో అలలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. చీరాల ప్రాంతంలో 60 మీటర్లు, బాపట్ల, నిజాంపట్నం వద్ద 20-30 మీటర్ల మేర సముద్రం ముందుకు వచ్చింది. దీంతో తీరం కోతకు గురైంది. సూర్యలంకలో అవుట్‌పోస్టు దెబ్బతింది. పలుచోట్ల పూరిళ్లు, ప్రహరీలు కూలిపోయాయి. పంటలు నీట మునిగాయి.

▲ ప్రకాశం జిల్లాలో ఈదురు గాలులకు పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలలో ఉద్యాన, వ్యవసాయ పంటలు నీట మునిగాయి. భాకరాపేట సమీపంలో చెట్టు విరిగి మీదపడటంతో బైక్‌పై వెళుతున్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్ కానిస్టేబుల్ సత్యకుమార్ దుర్మరణం చెందారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో దాదాపు 30 గ్రామాల ప్రజలు బయటి ప్రాంతానికి రాలేకపోయారు.

▲ కాకినాడ జిల్లా ఉప్పాడ, కోనపాపపేట తదితర గ్రామాల్లోని తీరంలో మత్స్యకారుల గృహాలు ధ్వంసమయ్యాయి. బీచ్ రోడ్డు రెండు కిలోమీటర్ల మేర దెబ్బతింది. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వేలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. మోరి, వి.వి.మెరకలలో సుడిగాలి తీవ్రతకు ఇళ్ల మీద రేకులు ఎగిరిపోయాయి. భీమిలి నుంచి గుడ్లవానిపాలెం బీచ్ వరకు తీరం అల్లకల్లోలంగా మారింది. మంగమారిపేట, రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌ల వద్ద తీరం కోతకు గురైంది. రుషికొండ బీచ్‌లో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్కు, సాగర్‌నగర్‌లో కొబ్బరితోట పార్కు నీట మునిగాయి.

▲ ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎడతెరపి లేకుండా వర్షం పడుతోంది. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎనిమిది దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాల్లోకి వర్షపు నీరు చేరింది. పశ్చిమగోదావరి జిల్లాలో వేలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. వీరవాసరం, నరసాపురం మండలాల్లో సుడిగాలి తాకిడికి వందల కొద్దీ కొబ్బరి చెట్లు, అధిక సంఖ్యలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.


తిరుపతి లీలామహల్ సర్కిల్ నుంచి కరకంబాడి వెళ్లే మార్గంపై పొంగిపొర్లుతున్న వరద నీరు


కాకినాడ జిల్లా ఉప్పాడలో గ్రామంపైకి దూసుకువస్తున్న కెరటాలు


సూర్యలంక వద్ద తుపాన్ తీరం దాటే సమయంలో అల్లకల్లోలంగా ఉన్న సముద్రం


నెల్లూరు మూలపేటలో తుపాను ధాటికి కూలిన చెట్లను తొలగిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ


నెల్లూరు జిల్లాలో విద్యుత్ పునరుద్ధరణ చర్యలను పర్యవేక్షిస్తున్న ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు

సాక్షి, అమరావతి: మిచాంగ్ తుపాను విద్యుత్ వ్యవస్థను భారీగా దెబ్బతీస్తున్నా.. ప్రజలకు నిరంతర విద్యుత్ అందించేందుకు యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తోంది. తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, గుంటూరు, ప్రకాశం, కృష్ణా, చిత్తూరు, కర్నూలు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినచోట యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. ఇంధనశాఖ కార్యదర్శి నుంచి లైన్‌మెన్ వరకు అందరూ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి డిస్కం పరిధిలోను కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి ప్రత్యేక అధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

- ▶ నెల్లూరు, తిరుపతి, కడపలో 3 ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్లు, 33/11 కేవీ సబ్‌స్టేషన్లు 43 దెబ్బతినగా, సాధారణ స్థితికి తీసుకొచ్చినట్టు ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు తెలిపారు. డిస్కం పరిధిలో సుమారు 1,119 గ్రామాలు, 46 మండలాలు, 6 పట్టణాల్లో విద్యుత్ వ్యవస్థ ప్రభావితమైందని, 424 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు.
- ▶ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలో మూడు 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లు, 33 కేవీ ఫీడర్లు 23 తదితరాలు దెబ్బతిన్నట్లు ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. దాదాపు 153 గ్రామాలు, 3 మండలాల్లో ప్రభావం ఏర్పడగా అన్నిచోట్లా విద్యుత్‌ను పునరుద్ధరించామన్నారు.
- ▶ విజయవాడ, గుంటూరు, సీఆర్డీఏ, ఒంగోలు పరిధిలో 33/1 1కేవీ సబ్ స్టేషన్లు 64 దెబ్బతినగా సాధారణ స్థితికి తెచ్చామని సీపీడీసీఎల్ సీఎండీ పద్మ జనార్దనరెడ్డి తెలిపారు.

గాలి దుమారం.. ఇద్దరు దుర్మరణం

బుట్టాయగూడెం : సుడిగాలి ఇద్దరిని పొట్టన పెట్టుకుంది. ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం రాజానగరానికి చెందిన వెట్టి గంగరాజు, వెట్టి కన్నపరాజు, ఎస్.కోటేశ్వరరావు, మంగబాబు, జోడే రాముడు అనే వ్యక్తులు జోరుగా గాలి, వాన రావడంతో గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల సమీపంలో ఉన్న ఒక పాకలోకి వెళ్లారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో అక్కడ చలిమంట ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కసారిగా గాలి బీభత్సం సృష్టించడంతో పాక పడిపోవడంతో పాటు పక్కనే ఉన్న సిమెంట్ స్తంభం గంగరాజు (55) తలపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదే సమయంలో పాకకు మంటలు అంటుకుని జోడే రాముడు (65) బయటికొచ్చే అవకాశం లేక సజీవ దహనమయ్యాడు. కన్నపరాజుకు స్వల్ప గాయాలు కాగా.. కోటేశ్వరరావు, మంగరాజు సురక్షితంగా బయటపడ్డారు.

వర్షంలోనూ ఆగని ధాన్యం సేకరణ

- ఇప్పటివరకు 1.21 లక్షల టన్నుల కొనుగోలు
- రైతులకు వేగంగా మద్దతు ధర అందించేందుకు వివరాలను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది


తూర్పుగోదావరి జిల్లా ముగ్గళ్లలో ధాన్యం కొనుగోలు చేయిస్తున్న అధికారులు

సాక్షి, అమరావతి: తుపాను ప్రభావిత జిల్లాల్లో ధాన్యం సేకరణ యుద్ధప్రాతిపదికన జరుగుతోంది. ఎడతెరిపి లేని వర్షంలోనూ ప్రత్యేక భద్రత మధ్య అధికారులు ధాన్యాన్ని తరలిస్తున్నారు. తుపాను హెచ్చరికలతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ధాన్యం సేకరణపై ప్రత్యేక దృష్టిసారించింది. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో ప్రత్యేక అధికారులను నియమించి శరవేగంగా ధాన్యాన్ని మిల్లులకు చేరవేసింది. పారదర్శకమైనప్పటికీ ఆన్‌లైన్ విధానంలో జాప్యం జరిగే అవకాశం ఉండడంతో ప్రభుత్వం నిబంధనలు సడలించింది. దీంతో ఇప్పటివరకు 1.21లక్షల టన్నుల ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసింది. ఒక్క సోమవారమే సుమారు 15వేల టన్నుల వరకు ధాన్యాన్ని సేకరించారు. కృష్ణా జిల్లాలో 82 ప్రైవేటు వాహనాల ద్వారా రెండువేల టన్నుల వరకు మిల్లులకు తరలించగా.. మరో 6-7వేల టన్నుల ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో, లారీల్లో ప్రత్యేక భద్రత మధ్య ఉంచారు. వర్షం పెరుగుతుందనే భయంతో చాలా మంది రైతులు యంత్రాల సాయంతో పంటలు కోస్తున్నారు. వీటిల్లో తేమ శాతం ఎక్కువ వచ్చినప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది.

రైతులకు టార్పాలిన్ల సరఫరా..

అక్కడక్కడా రైతులు ధాన్యం రాశులు పోస్తే అధికారులు వారికి టార్పాలిన్లను సరఫరా చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో స్వల్ప మొత్తంలోని పంటను ముందుగానే మిల్లులకు చేర్చారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పొలాల్లో నిలిచిపోయిన నీటిని బయటకు పంపడంపై అధికార యంత్రాంగం దృష్టిపెట్టింది. ఏలూరు జిల్లాలో వర్షం తగ్గకపోవడంతో 3వేల టన్నులు మాత్రమే మిల్లులకు పంపించారు. వర్షం తెరిపిచ్చిన వెంటనే మరో 10వేల టన్నులు తరలించేందుకు ఏర్పాట్లుచేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 500 టన్నుల వరకు కల్లాల్లో సురక్షితంగా ఉంది. ఇక రైతులకు మద్దతు ధర చెల్లింపుల్లో జాప్యంలేకుండా ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు.

సురక్షిత ప్రాంతాలకు పశుసంపద తరలింపు

ప్రతి జీవానికి 500 గ్రాముల నుంచి 2 కిలోల వరకు సంపూర్ణ మిశ్రమ దాణా

సాక్షి, అమరావతి: మిచాంగ్ తుపాను ప్రభావిత జిల్లాల్లో పశుపోషకులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ రెడ్నం అమరేంద్రకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకున్న పశువులను ప్రత్యేక బృందాల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని పేర్కొన్నారు. తుపాను ప్రభావిత జిల్లాల్లో ఆవులు, గేదెలకు ఒక్కొక్క పశువుకు 2 కిలోలు,, గొర్రెలు, మేకలకు ఒక్కొక్క జీవానికి 500 గ్రాముల చొప్పున సంపూర్ణ మిశ్రమ దాణా అందిస్తామని వివరించారు. పశువులకు గొంతు, జబ్బవాపు, గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి టీకాలు వేయాలని ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. చనిపోయిన పశువులను గుర్తించి ఈ నెల 7వ తేదీలోపు నివేదిక అందించాలని ఆర్బీకే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. తుపాను ప్రభావం తగ్గిన వెంటనే ప్రత్యేక పశు వైద్య బృందాలను గ్రామాలకు పంపి పశువులకు అవసరమైన వైద్యసహాయం అందిస్తామని తెలిపారు.

తుపాను బాధితులను ఆదుకోవడంలో విఫలం

చంద్రబాబు ధ్వజం

సాక్షి, అమరావతి: తుపాను బాధిత ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ప్రతిపక్ష నేత చంద్రబాబు విమర్శించారు. ఆయన మంగళవారం ఉండవల్లిలోని తన నివాసం నుంచి ఫోనులో కొందరు తుపాను బాధితులతో మాట్లాడినట్లు టీడీపీ కార్యాలయం తెలిపింది. ఈ సందర్భంగా తమకు కనీసం భోజనం కూడా పెట్టలేదని, ప్రభుత్వ స్పందన సరిగా లేదని బాధితులు చెప్పినట్లు పేర్కొంది. అనంతరం పార్టీ నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పే మాటలు కోటలు దాటుతున్నా చేతలు గడప దాటడం లేదని విమర్శించారు. ఈ స్థాయి విపత్తు అని ముందే తెలిసినా ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తమ హయాంలో హుదూద్, తిత్లీ తుపాన్లు వచ్చినప్పుడు నష్టపరిహారాన్ని పెంచి ఇచ్చినట్లు పేర్కొన్నారు.

వలంటీర్లే సైనికులు

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విస్తృత సేవలు

- బాధితులకు అన్నింటా ముందుండి తోడ్పాటు
- ముంపు ప్రాంతాల ప్రజలను ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలింపులో సాయం
- రహదారులపై వాగులు పొంగే చోట ప్రత్యేక పహారా


నెల్లూరు జిల్లా ఓజిలి గ్రామంలో ప్రజలకు తాగునీరు అందిస్తున్న వలంటీర్


తిరుపతి జిల్లా వల్లివేడు గ్రామంలోని పునరావాస శిబిరంలో భోజనం అందిస్తున్న వలంటీర్

సాక్షి, అమరావతి: ప్రజలకు ఏ కష్టం వచ్చినా వలంటీర్లు సైనికులుగా మారి అవసరమైన సేవలు అందిస్తున్నారు. ఆపదవేళ అండగా ఉంటూ ప్రభుత్వ సాయాన్ని బాధితుల చెంతకు చేరుస్తున్నారు. ప్రస్తుతం మిచాంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ సహాయక చర్యల్లో వలంటీర్లు ముందుండి ప్రజలకు అండగా నిలిచారు. రాష్ట్రంలో ప్రతి 50 ఇళ్లకు ఒకరు చొప్పున ప్రభుత్వం నియమించిన వలంటీర్లు... ప్రస్తుతం మిచాంగ్ తుపాను ప్రభావంతో తమ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఇబ్బందిపడుతున్న ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలు అందిస్తున్నారు. ముంపు ప్రాంతాల్లో నివాసం ఉండే వారికి ముందుగానే తుపాను తీవ్రతను తెలియజేసి ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాలకు తరలించడంలో కీలకంగా వ్యవహరించారు. ఆయా శిబిరాల్లో వలంటీర్లే దగ్గరుండి బాధితులకు ఎప్పటికప్పుడు ఆహారం, మంచినీరు వంటివి అందజేస్తున్నారు.

రెండేళ్ల కిందటే ప్రభుత్వం శిక్షణ

ప్రభుత్వం రెండేళ్ల కిందట రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో ఇద్దరు చొప్పున వలంటీర్లను ఎంపిక చేసి వారికి 'ఆపద మిత్ర' పేరుతో వివిధ రకాల విపత్తుల సమయంలో సహాయక చర్యల్లో ఉపయోగపడేలా ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన కిట్లను కూడా అందజేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో వరద ముంపులో చిక్కుకునే వారిని కాపాడేందుకు 'ఆపదమిత్రలు' ప్రభుత్వం ఇచ్చిన కిట్లను ధరించి సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని అధికారులు వెల్లడించారు. అదేవిధంగా కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వివిధ రహదారులపై వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా విడతలవారీగా ఇద్దరు నుంచి నలుగురు వలంటీర్లు కాపలా ఉంటున్నారు. రహదారుల వద్ద వరద ఉధృతి ప్రమాదకర స్థాయిలో ఉన్న ప్రాంతాల్లో రెండు వైపులా వలంటీర్లు నిరంతరం కాపలాకాస్తూ ప్రజలు, వాహనచోదకులను అప్రమత్తం చేస్తున్నారు. వరద ప్రవాహం ఎక్కువగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో రాకపోకలను పూర్తిగా నియంత్రిస్తున్నారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలకు రక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ముందుగా సిద్ధం చేసిన ఆర్వో ప్లాంట్ల వాటర్ క్యాన్లను ఇంటింటికీ చేరుస్తున్నారు. రోడ్లకు అడ్డంగా చెట్లు, కరెంటు స్తంభాలు విరిగిపడితే తొలగింపు పనుల్లో ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి కూడా వలంటీర్లు సహకారం అందిస్తున్నారు. ఇలా అన్ని విధాలుగా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో వలంటీర్లు అమూల్యమైన సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.


కృష్ణా జిల్లాలో తుపాను బాధితులను సహాయక శిబిరాలకు తీసుకు వెళ్తున్న వార్డు వలంటీర్లు

గ్రామ వలంటీర్ సాహసం

గెడ్డ అవతల చిక్కుకున్న వారిని రక్షించిన నాగేశ్వరరావు



సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): పశువుల కాపునకు వెళ్లి గెడ్డ అవతల చిక్కుకుపోయిన ముగ్గురు గ్రామస్తులను వలంటీర్ కాపాడి సురక్షితంగా గ్రామానికి చేర్చాడు. ఈ ఘటన అల్లూరు సీతారామరాజు జిల్లా, పాడేరు మండలం, ఇరడాపల్లి పంచాయతీ మారుమూల దిగసంపలు గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం ఇద్దరు గిరిజనులు, పదేళ్ల బాలుడితో కలిసి పశువుల కాపలాకు గ్రామ సమీపంలోని గెడ్డ అవతల ప్రాంతానికి వెళ్లారు. సాయంత్రం వారు తిరిగి వచ్చే సమయానికి గెడ్డ ఉధృతి పెరగడంతో ముగ్గురు అక్కడ చిక్కుకుపోయారు. సహాయం కోసం కేకలు వేశారు. ఈ కేకలు విన్న దిగసంపలు గ్రామ వలంటీర్ వంతాల నాగేశ్వరరావు వెంటనే గెడ్డ వద్దకు హుటాహుటిన వెళ్లాడు. వారికి ధైర్యం చెప్పి, మరో ఇద్దరు గిరిజనుల సాయంలో వారిని గెడ్డ దాటించి సురక్షితంగా ఇంటికి చేర్చాడు. సాహసించి, సకాలంలో స్పందించిన వలంటీర్ నాగేశ్వరరావును గ్రామస్తులు అభినందించారు.

ప్రతి గింజా కొంటాం

తేమ శాతంతో సంబంధం లేకుండా మద్దతు ధర • రైతులకు మంత్రి కారుమూరి భరోసా


తణుకు మండలం దువ్వ గ్రామంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు


భట్టిప్రోలు-బాపట్ల రహదారిలో నీట మునిగిన వరి పనలను పరిశీలిస్తున్న మంత్రి నాగార్జున

తణుకు టౌన్/భట్టిప్రోలు : రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైస్ మిల్లర్లను ఆదేశించామని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం దువ్వ గ్రామంలో కల్లాల్లోనే ఉన్న ధాన్యాన్ని మంత్రి మంగళవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి నష్టం లేకుండా అన్ని విధాలుగా ఆదుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. ఇందులో భాగంగానే వరిగేడు గ్రామానికి చెందిన రైతుల నుంచి 20 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కూడా సోమవారం కొనుగోలు చేసినట్లు ఆయన చెప్పారు.

రూ.1,140 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు

రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ఇప్పటివరకు 1.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రం మొత్తం మీద రూ.1,140 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు మంత్రి చెప్పారు. ఇందులో రూ.800 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు కూడా జమచేసినట్లు ఆయన తెలిపారు. మరో రూ.200 కోట్లు రెండు మూడ్రోజుల్లో చెల్లిస్తామని చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న ముందు జాగ్రత్తల కారణంగా రాష్ట్రంలో తడిసిన ధాన్యం లేదన్నారు. స్వర్ణ రకం పంట ఎక్కువగా ఉండటంతో ఆ పంట కోతలు ఇప్పటికే 98 శాతం పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన పంటలో 1,318, మరికొన్ని వరి పంటలు దృఢంగా ఉండటంతో నేలకొరిగే అవకాశం లేదన్నారు. దీనివల్ల పంట నష్టం ఉండదన్నారు. పండించిన ధాన్యాన్ని ఏ మిల్లుకైనా తరలించే అవకాశం రైతులకు ఉందన్నారు. తుపాను ప్రభావం కోస్తా జిల్లాల్లోనే ఎక్కువగా ఉందన్నారు. రైతులకు ఏ విధంగా నష్టం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కారుమూరి వివరించారు.

రాజకీయాలకు తావులేకుండా పంట నష్టం అంచనా : మంత్రి మేరుగు

ఇక మిచాంగ్ తుపాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతునూ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుని అండగా నిలుస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున అన్నారు. భారీ వర్షాలకు భట్టిప్రోలు-బాపట్ల రహదారిలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని భరోసా ఇచ్చారు. పంట నష్టం అంచనాలలో రాజకీయాలకు తావులేకుండా జాబితాలను సిద్ధంచేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. వెంటనే ఎన్యూమరేషన్ ప్రారంభించాలని, నష్టపోయిన ప్రతి రైతు కుటుంబానికి ప్రభుత్వం నష్ట పరిహారం అందించేందుకు కృషిచేస్తానని చెప్పారు.

తేరుకుంటున్న చెన్నై

- నగరంలో తెరిపినిచ్చిన వర్షం
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తమిళనాడు సీఎం స్టాలిన్ పర్యటన
- వర్ష సంబంధిత ఘటనల్లో 12 మంది మృతి.. 11 మందికి గాయాలు

సాక్షి, చెన్నై: 'మిచాంగ్' సృష్టించిన విలయం నుంచి తమిళనాడు రాజధాని చెన్నై తేరుకుంటోంది. సోమవారం అర్ధరాత్రి నుంచి వర్షం తెరిపినివ్వడంతో తమిళనాడు ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. నీటమునిగిన చెన్నైలోని పలు ప్రధాన ప్రాంతాలను సాధారణ స్థితికి తీసుకువచ్చింది. పడవలు, ట్రాక్టర్లతో పాటు దాదాపు 5 వేల మంది సిబ్బంది సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఇప్పటివరకు తుపాను సంబంధిత ఘటనల్లో ఒక హెడ్‌కానిస్టేబుల్ సహా 12 మంది మృతి చెందగా, 11 మంది గాయపడ్డారు. చెన్నై విమానాశ్రయాన్ని మంగళవారం తెరిచారు. ప్రయాణికులు లేకపోవడంతో చెన్నై నుంచి వెళ్లాల్సిన 89, రావాల్సిన 88 విమాన సర్వీసులు రద్దయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తాంబరం, అశోక్‌నగర్, కట్టుపాక్కం, పెరుంగుడి ప్రాంతవాసులు ఇబ్బందులు పడ్డారు. చెన్నైలోని విద్యా సంస్థలకు బుధవారం కూడా సెలవు ప్రకటించారు.


షోళింగనల్లూర్ తాంబరం రోడ్డుపై పడవలతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న సిబ్బంది

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో స్టాలిన్ పర్యటన

తమిళనాడు సీఎం స్టాలిన్ మంగళవారం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 9 జిల్లాలపై తుపాను ప్రభావం పడిందని, 61 వేలకు పైగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రూ.5 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనాకు వచ్చామన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే సహించం

మిల్లర్లకు సివిల్ సప్లయిస్ శాఖ కమిషనర్ హెచ్చరిక


అధికారులు, మిల్లర్లకు సూచనలు ఇస్తున్న అరుణ్‌కుమార్

కంకిపాడు/ఉయ్యూరు: తేమశాతం పేరుతో ధాన్యాన్ని కొనకపోయినా, కొనుగోలు ప్రక్రియలో కావాలని జాప్యం చేసినా మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లయిస్ శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ హెచ్చరించారు. కృష్ణాజిల్లా దావులూరు రైస్‌మిల్లు, గండిగుంట రైతుభరోసా కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించారు. రైతులు నష్టపోకుండా మద్దతు ధర దక్కేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని అరుణ్‌కుమార్ తెలిపారు. ఆర్బీకేలో నమోదైన తేమశాతమే ఫైనల్ అని, మిల్లు వద్దకు వచ్చాక మళ్లీ తేమశాతం పరిశీలన పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేసినా, జాప్యం చేసినా సహించేది లేదన్నారు.



నీకు ఏం జరుగుతుందనే భయం వద్దు.
ఎవ్వరి మీదా ఆధారపడవద్దు. మన మొత్తం అస్తిత్వపు రహస్యం భయం లేకుండా ఉండటం!
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 6 డిసెంబర్ 2023

ఇంకా చల్లారని మణిపూర్

ఘర్షణల సమయంలో తప్ప సాధారణ పరిస్థితుల్లో ఎప్పుడూ వార్తలకెక్కని ఈశాన్య భారతం ఇంకా కుదుటపడలేదని మణిపూర్‌లో సోమవారం రెండు సాయుధ బృందాల మధ్య చోటుచేసుకున్న కాల్పుల ఉదంతం తెలియజెబుతోంది. ఈ కాల్పుల్లో 13 మంది యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఏడునెలల క్రితం అక్కడ మొదలైన తెగల ఘర్షణల్లో ఇంతవరకూ 175 మంది మరణించారని, 50,000 మంది నిరాశ్రయులయ్యారని గణాంకాలు చెబుతున్నాయి. సుప్రీంకోర్టు నియమించిన కమిటీ ఆ రాష్ట్రంలో పర్యటించి ఎక్కడెక్కడ మారణకాండ జరిగిందో, తాజా పరిస్థితులు ఎలా వున్నాయో వివరిస్తూ నివేదిక సమర్పించింది. దానిపై సర్వోన్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వానికి పలు ఆదేశాలు కూడా ఇచ్చింది. ఇంతలోనే తాజా ఉదంతం చోటుచేసుకుంది. మే 3 నుంచి వరస బెట్టి జరుగుతున్న దారుణాలు అన్నీ ఇన్నీ కాదు. రాష్ట్రంలో మెజారిటీగా వున్న మెయితీలకూ, కుకీ–చిన్‌లకూ మధ్య తలెత్తిన ఘర్షణలు ఏ స్థాయికి చేరాయంటే మహిళలపై గుంపులు దాడిచేసి వారిని వివస్త్రలను చేయటం, నగ్నంగా వూరేగించి అత్యాచారాలకు తెగబడటం యథేచ్ఛగా సాగాయి. ఇక గృహదహనాలు, ఇతర ఆస్తుల ధ్వంసం వంటివి సరేసరి. ఘర్షణల సందర్భంగా పోలీస్ స్టేషన్లపై, సాయుధ రిజర్వ్ బెటాలియన్ స్థావరాలపై గుంపులు దాడులకు దిగి వేలాది తుపాకులు, రాకెట్ లాంచర్లు, లక్షల తూటాలు అపహరించారు. ఆయుధాలు అప్పగించినవారిపై ఎలాంటి చర్యలూ తీసుకోబోమని ప్రభుత్వం హామీ ఇచ్చినా వీటిల్లో వెనక్కొచ్చినవి స్వల్పం. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు చక్కర్లు కొట్టడం పర్యవసానంగా హింసాత్మక ఘటనలు మొదలుకాగా, అటు తర్వాత జరిగిందంతా ప్రధాన స్రవంతి మీడియా నిర్వాకమని ఎడిటర్స్ గిల్డ్ నిజనిర్ధారణ కమిటీ ఆరోపించింది. అది 'మెయితీ మీడియా'గా మారి పక్షపాతం ప్రదర్శించిందన్నది ఆ కమిటీ అభియోగం. ఆ తర్వాత కమిటీ సభ్యులపై మణిపూర్ సర్కారు కేసులు పెట్టడం, ఆ సభ్యులు సుప్రీంకోర్టును ఆశ్రయించటం వేరే కథ.

రాష్ట్రంలోని 90 శాతం ప్రాంతాలు ఇప్పుడు ప్రశాంతంగా వున్నాయని బీరేంద్ర సింగ్ ప్రకటించి నెల్లాళ్లయింది. అయినా అడపా దడపా ఘర్షణల వార్తలు వస్తూనే వున్నాయి. సోమవారం నాటి ఉదంతం ఈమధ్యకాలంలో పెద్దది. మరణించినవారంతా ఎవరో, ఎక్కడివారో అధికారులు ఇంకా తేల్చలేదు. ఘటన జరిగిన ప్రాంతానికి భద్రతా బలగాల శిబిరం 10 కిలోమీటర్ల దూరంలో వున్నదంటే ఇన్ని నెలల మారణకాండ నుంచి ప్రభుత్వం నేర్చుకున్నదేమీ లేదన్నమాట. హింసాత్మక ఘటనల సంఖ్య తగ్గిందని అధికారులు సంబరపడుతూవుండొచ్చు. కానీ కనబడని హింస పీడిస్తూనే వుంది. సమాజం మొత్తం రెండుగా చీలిపోయింది. మెయితీలు, కుకీలు గతంలో మాదిరి స్వేచ్ఛగా సంచరించలేకపోతున్నారు. నెలల తరబడి సాగిన హింస పర్యవసానంగా ఆప్తుల్ని కోల్పోయి, ఎంతో విధ్వంసం చోటుచేసుకుని భవిష్యత్తు అగమ్యగోచరంగా వున్నచోట అంతా బాగున్నదని చెప్పటం పరిహాసాస్పదం అవుతుంది. కుటుంబాల్ని పోషించుకోవటానికీ, చదువుకోవటానికీ, ఇతరేతర వ్యాపకాల కోసం వెళ్లటానికీ స్వేచ్ఛ లేని ప్రశాంతత వల్ల సాధారణ పౌరులకు ఒరిగేదేముంటుంది? ప్రభుత్వ యంత్రాంగం సమగ్రమైన, అత్యవసరమైన చర్యలు తీసుకొనేవరకూ ఇదంతా సాధ్యపడదు. ముఖ్యంగా ఎక్కడికక్కడ రెండు తెగల నుంచి బాధ్యతాయుత వ్యక్తుల్ని గుర్తించి కమిటీలు ఏర్పాటుచేసి సామరస్యత సాధించే దిశగా ప్రయత్నిస్తే వేరుగా వుండేది. ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించిన 24 గంటల్లోగానే తాజా ఉదంతం చోటుచేసుకోవటం ఆందోళన కలిగించే అంశం. ఏడు నెలల హింసలో ప్రాణాలు కోల్పోయినవారికి సంబంధించిన 88 గుర్తు తెలియని మృతదేహాలు ఏడు నెలలుగా ఇంఫాల్‌లోని రెండు ఆస్పత్రుల శవాల గదుల్లో పడివున్నాయి. రెండు తెగలవారూ భయం భయంగా బతుకుతున్న వర్తమానంలో తమ తమ గ్రామాలొదిలి ఇంఫాల్ వరకూ పోవటం, ఆ మృతదేహాలను గుర్తించటం సాధ్యమేనా? హింస కొనసాగుతున్న కాలంలోనూ, ఆ తర్వాతా తమ వారి జాడ తెలియటం లేదని చెప్పినవారు అనేకులున్నారు. వీరిలో అనేకులు కుకీలు కాగా, మెయితీ తెగకు చెందినవారు కూడా వున్నారు. ఆ మృతదేహాలు కల్లోలం సృష్టించటానికి మయన్మార్ నుంచి వచ్చినవారికి సంబంధించినవేనని అధికారులు చెబుతున్నా అందుకు వారి దగ్గర కచ్చితమైన సాక్ష్యాధారాలు లేవు. ఆదివాసీ నేతల ఫోరం 22 మంది కుకీల జాడ తెలియటం లేదని ఆ మధ్య ప్రకటించింది. గుర్తుతెలియని మృతదేహాల్లో ఇలా అదృశ్యమైనవారివే అధికంగా వుండొచ్చు. ఇక ఎవరి కోసమూ వేచిచూడకుండా ఈ మృతదేహాలను ఖననం చేయాలని సుప్రీంకోర్టు తాజాగా ఆదేశించటం మణిపూర్‌లో విషాదస్థితికి అద్దం పడుతోంది.

ఈపాటికే శాంతి సాధనకు తగిన చర్యలు తీసుకునివుంటే, బాధిత వర్గాల్లో భరోసా కల్పించినట్టయితే 'గుర్తు తెలియని మృతదేహాల' సమస్య వుండేదే కాదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. హింసాత్మక ఘటనలకు కారకులైనవారినీ, ఇప్పటికీ ఉద్రిక్తతలను రెచ్చగొడుతున్నవారినీ గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటే శాంతియుత పరిస్థితులను ఏర్పర్చటం తేలికవుతుంది. ఈనాటికీ ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించటం లేదని, అది మెయితీల పట్ల మెతగ్గా వుంటున్నదని ఆదివాసీ సంస్థలు ఆరోపిస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలకు తావు లేకుండా చేసినప్పుడే తమ వారి మృత దేహాలను గుర్తించి, సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించటం బాధిత కుటుంబాలకు సాధ్యమవుతుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవటం మణిపూర్ సర్కారు బాధ్యత.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
కార్తీక మాసం, **తిథి:** బ.నవమి రా.12.48 వరకు
తదుపరి దశమి, **నక్షత్రం:** ఉత్తర తె.5.10 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి హస్త, **వర్జ్యం:** ఉ.10.35 నుండి 12.19 వరకు,
దుర్ముహూర్తం: ఉ.11.29 నుండి 12.17 వరకు,
అమృత ఘడియలు: రా.9.06 నుండి 10.54 వరకు.

సూర్యోదయం: 6.20
సూర్యాస్తమయం: 5.21
రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

ఈ ఫలితాలు ఏం చెబుతున్నాయి?

దేశంలో అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అనేక విలువైన అంశాలను వెలుగులోకి తెచ్చాయి. సాంఘిక సంక్షేమం, కుల గణన వంటివాటిని కేంద్రంగా చేసుకొని సాగిన ఎన్నికల పోరులో బీజేపీ ఆధిక్యత స్పష్టమయ్యింది. మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ విధానాలకు ప్రజలు మద్దతు ఇస్తున్న విషయాన్ని మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో బీజేపీ విజయం సూచిస్తోంది. బీజేపీ విజయంలో మహిళా ఓటర్లు కీలక పాత్ర పోషించారనేది ఒక కీలక అంశం.

కాంగ్రెస్ పాఠం నేర్చేనా?

అభిప్రాయం



బద్రీనారాయణ్

మూడు హిందీ ప్రాంత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో బీజేపీ సాధించిన అద్భుతమైన విజయం ఎన్నికల విజయం మాత్రమే కాదు. ఇది భారత రాజకీయాల వర్తమానంతోపాటు భవిష్యత్తు గురించి కూడా వివిధ వ్యక్తావ్యక్త సందేశాలను కలిగి ఉంది. ఉత్తర భారతదేశంలో ఆ పార్టీకి భారీఎత్తున ప్రజాభిమానం ఉందని బీజేపీ విజయాలు తెలియజేస్తున్నాయి. హిందీ ప్రాంత ఓటర్లతో ఆ పార్టీ అంత లోతైన సంబంధాన్ని ఎలా ఏర్పరచుకోగలిగింది, ముఖ్యంగా బీజేపీపై ప్రజల విశ్వాసం గురించి ఈ ఫలితాల నుండి వెలువడుతున్న పెద్ద సందేశం ఏమిటి?

సాంఘిక సంక్షేమ రాజకీయం, రిజర్వేషన్లకు సంబంధించి కులగణన కేంద్రక రాజకీయాలు అనే రెండు ప్రధాన అంశాలను కేంద్రంగా చేసుకొని ఈ ఎన్నికలు జరిగాయి. సంక్షేమ చర్యల రాజకీయాలను ప్రధాన పోటీదారులైన బీజేపీ, కాంగ్రెస్‌లు అనుసరించాయి. బీజేపీ తన ప్రణాళికాబద్ధమైన ఎన్నికల ప్రచారం ద్వారా, డబుల్ ఇంజిన్ సర్కార్‌తో కలిగే ప్రయోజనాలను ప్రచారం చేసింది. ఒకే సమయంలో కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఉన్నందున కలిగిన ప్రయోజనాలను ప్రచారంలో ఎత్తి చూపింది బీజేపీ. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో మోదీ ప్రభుత్వం చేపడుతున్న, చేపట్టనున్న సామాజిక సంక్షేమ కార్యక్రమాలను విశేషించి పేర్కొన్నారు కమలనాథులు.



కాంగ్రెస్, బీజేపీలు తమ పథకాల ద్వారా లబ్ధి పొందినవారిని ఎవరికి వారు తయారుచేసుకోగలిగాయి. కానీ కాంగ్రెస్ ఇంకా తన లబ్ధిదారులతో రాజకీయ సంస్థాగత సంబంధాలను ఏర్పరచుకోలేదు. అయితే, బీజేపీ తన లబ్ధిదారులను ఒక సంఘంగా – ఒక సముదాయంగా–వారితో సన్నిహిత సంబంధాన్ని ఏర్పరచుకుంది. మామా, లాడ్లీ బెహనా (ప్రియమైన సోదరి) వంటి కుటుంబ సంబంధ పదజాలాన్ని వాడటం ద్వారా, వారితో సన్నిహితంగా ఉండటం ద్వారా బీజేపీ ఈ పని చేయ గలిగింది. పార్టీ కార్యకర్తలు వివిధ పథకాల లబ్ధిదా రులతో హోలీ, దీపావళి, రక్షా బంధన్ వంటి పండు గలను జరుపుకోవడం ప్రారంభించారు. తన వంతుగా, కాంగ్రెస్ కూడా పేద ప్రజలకు పథకాలను అందించింది, కానీ వారితో దీర్ఘకాలిక భావోద్వేగ సంబంధాన్ని ఏర్పరచుకోలేకపోయింది. హిందీ ప్రాంత వాసి మనస్సు... తనతో గౌరవంగా, భావోద్వేగ సంబంధాన్ని కలిగి ఉన్న పార్టీతో స్పష్టంగా కనెక్ట్ అయి ఉంటుంది. బీజేపీ రాజకీయ పదజాలం... ఆర్థిక సమస్యలనూ, అభివృద్ధినీ అట్టడుగు స్థాయిలో ప్రతిధ్వనించే సాంస్కృతిక, సామాజిక భావోద్వేగాల చట్రంలో రూపొందించింది.

రెండవది – గ్రామీణ భారతదేశంలోని గ్రామీణ ప్రజలకు నమ్మకం చాలా ముఖ్యం. ప్రధాని నరేంద్ర మోదీ తన రాజకీయాలతో ప్రజలలో మత, సాంస్కృతిక భద్రతకు భరోసా కల్పించడం ద్వారా వారిలో అపారమైన నమ్మకాన్ని ఏర్పరచుకున్నారు. ఈ ఎన్నికలలో కూడా మోదీ తనకు తానుగా ప్రచారానికి పూనుకుని, ఓటర్లకు 'నేను ఇక్కడ ఉన్నాను, నేను మీ కోసం పని చేస్తాను' అనే భరోసా ఇచ్చే రిస్క్ తీసుకున్నారు. ఈ రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించకుంటే అది మోదీ ప్రతిష్ఠపై ప్రభావం చూపి ఉండేది.

మూడవది – హిందుత్వం. బీజేపీ తన రాజకీయాలను హిందుత్వ భావనపై నిర్మించి, పునరుద్ధరించే ఆధార్ భావాన్ని (ఫౌండేషనల్ ఎమోషన్) ను హిందువులు అధికంగా ఉన్న హిందీ ప్రాంత రాష్ట్రాల్లో అందించింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో సనాతన ధర్మానికి సంబంధించిన అంశాన్ని ప్రధాన ప్రచారాయుధంగా మలచుకొంది. రామ్ భద్రాచార్య వంటి అనేక మంది సనాతన ధర్మ సాధువులు ఈ ఎన్నికలను ధర్మం, అధర్మాల మధ్య యుద్ధంగా అంచనా వేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థి అయిన కమల్‌నాథ్ నియోజకవర్గమైన ఛింద్‌వారాలో జరిగిన ఓ మీటింగ్‌లో తమ ధర్మాన్ని కాపాడే పార్టీకి మద్దతు ఇవ్వాలని రామ్ భద్రాచార్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సాధువులు తమ సమావేశాల్లో ఇచ్చిన ప్రవచనాలలో, డీఎంకే నాయకుడు ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలను ఉటంకించారు. కాంగ్రెస్‌ను స్టాలిన్ పార్టీకి మద్దతుదారుగా చూపారు. అలా ఆ పార్టీని సనాతన విరోధిగా చిత్రించారు. సనాతన ధర్మంపై మధ్యప్రదేశ్‌లోని చిత్రకూట్ నుండి ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ వరకు సాగిన ఈ ప్రచారం హిందీ ప్రాంత ఓటర్లను ప్రభావితం చేసే ప్రజా కథనంగా ఉద్భవించింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలోని గిరిజనులు, దళితులపై కూడా ఇది ప్రభావం చూపింది.

ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) ఓటర్లను వారి కుల గుర్తింపుపై సమీకరించేందుకు కుల గణన డిమాండ్‌పై కాంగ్రెస్ ఎక్కువగా ఆధారపడింది. ఈ ఎన్నికల్లో దాని వ్యూహం పూర్తిగా విఫలమైంది. హిందీ ప్రాంత రాష్ట్రాల్లో కులం ప్రభావం కొనసాగుతోంది. కానీ ప్రజల మూడ్ మారిందని అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్ విఫలమైంది. ఇది బహుళ ఆకాంక్షల యుగం. కుల చైతన్యం ఒక ఆకాంక్ష మాత్రమే. 'కుల గుర్తింపు తర్వాత ఏమిటి' అనేది ఓటర్ల మనసులోని ప్రశ్న. బీజేపీ ఇకపై బ్రాహ్మణ–బనియా పార్టీ కాదనే వాస్తవాన్ని కాంగ్రెస్ కూడా అంగీకరించలేదు, బీజేపీ నాయకత్వంలో ఓబీసీలు ఉన్నారు. కాబట్టి, కుల గణన ద్వారా బీజేపీకి వ్యతిరేకంగా ఓబీసీల సంఘటిత సమీకరణ దాదాపు అసాధ్యం.

ఈ ఎన్నికల ఫలితాలు 2024 సార్వత్రిక ఎన్నికలను ఎలా ప్రభావితం చేస్తాయి. ఇవి ముఖ్యంగా హిందీ ప్రాంతంలో తన వ్యూహాలు, ప్రజలతో రాజకీయంగా వ్యవహరించే తీరు (డిక్షన్) గురించి పునరాలోచించడానికి కాంగ్రెస్‌పై ఒత్తిడి తెస్తాయి. ప్రతిపక్ష కూటమి 'ఇండియా'కు ఇరుసుగా కాంగ్రెస్‌కు దాని స్థానం దానికి ఉండవచ్చు. అయితే, కూటమిలో సీట్ల కేటాయింపు ప్రక్రియల్లో జరిగే చర్చలు, ప్రాధాన్యాలను ఈ ఎన్నికలు ప్రభావితం చేస్తాయి. తాజా ఫలితాలు ప్రధాని మోదీ ప్రతిష్ఠను బలోపేతం చేశాయి. ఇది నిస్సందేహంగా బీజేపీపై సానుకూల ప్రభావాన్ని సృష్టిస్తుంది.

వ్యాసకర్త అలహాబాద్‌లోని 'గోవింద్ వల్లభ్ పంత్ సోషల్ సైన్స్ ఇనిస్టిట్యూట్'లో ప్రొఫెసర్

మహిళలే ఆదుకున్నారా?

అభిప్రాయం



నీలాంజన్ సర్కార్

మూడు హిందీ ప్రాంత రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో బీజేపీ సమగ్ర విజయాన్ని సాధించింది. ప్రత్యేకించి నవంబర్‌లోనే ఎన్నికలు జరిగిన రాజస్థాన్ ఫలితం అయితే, కొన్ని అత్యంత ఆశాజనకమైన ఎగ్జిట్ పోల్స్‌ను కూడా అధిగమించింది. ఈ రాష్ట్రాలలో బీజేపీకి గట్టి మద్దతు లభించిందనేది రహస్యమేమీ కాదు: 2014, 2019 జాతీయ ఎన్నికలు రెండింటిలోనూ ఈ రాష్ట్రాల్లోని మొత్తం 65 లోక్‌సభ సీట్లలో 62 స్థానాలను బీజేపీ గెల్చుకుంది. 2018లో మూడు రాష్ట్రాల్లోని అసెంబ్లీ ఎన్నికలను గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ, 2023లో అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లేటప్పుడు కాస్త ఆశాజనకంగానే ఉండింది.

సంక్షేమంపై, ముఖ్యంగా మహిళా ఓటర్లకు సంబంధించిన సంక్షేమంపై కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. లింగ ప్రాతిపదికన సంక్షేమ వాదానికి చెందిన ఈ నమూనా 2021లో పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీకి, ఆమె పార్టీ తృణమూల్ కాంగ్రెస్‌కూ గొప్ప ప్రయోజనాలను అందించింది. కర్ణాటకలో బీజేపీపై కాంగ్రెస్ విజయానికి కూడా ఇదే కారణమైంది. ఈ అంచనాను బట్టి చూస్తే, కాంగ్రెస్ ఉత్తరాది మహిళా ఓటర్లలో మంచి పనితీరు కనబరుస్తుందని ఎవరైనా ఊహించవచ్చు. అయితే... డేటా, క్షేత్ర పరిశీలనలు కచ్చితమైన వ్యతిరేక విషయాలను ప్రతిబింబిస్తున్నాయి.

ప్రత్యేకించి యువతీ యువకులను సర్వే చేసే సంస్థల్లో ఒకటైన 'యాక్సిస్ – మై ఇండియా పోల్' మధ్యప్రదేశ్‌లో ఈసారి బీజేపీ విజయపు పరిమాణాన్ని అంచనా వేయడానికి సంబంధించి కొన్ని ఎగ్జిట్ పోల్స్ నిర్వహించింది. ఇందులో 50 శాతం మంది మహిళలు బీజేపీకి మద్దతు ఇచ్చారనీ, కాంగ్రెస్‌కు కేవలం 40 శాతం మంది మహిళలు సపోర్ట్ చేశారనీ తేలింది. ఇది 10 శాతం పాయింట్ల భారీ అంతరం. దీనికి విరుద్ధంగా 44 శాతం మంది పురుషులు బీజేపీకి మద్దతివ్వగా, 41 శాతం మంది కాంగ్రెస్‌కు మద్దతు పలికారు– కేవలం 3 శాతం పాయింట్ల తేడా! క్లుప్తంగా చెప్పాలంటే, మహిళా ఓటర్ల నుంచి వచ్చిన మద్దతుతో మధ్యప్రదేశ్‌లో బీజేపీ గెలుపు స్థాయి పెరిగింది. ప్రస్తుత ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ 23–60 ఏళ్ల మధ్య ఉన్న మహిళలకు అమలు చేసిన, ప్రత్యక్ష నగదు బదిలీ అయిన 'లాడ్లీ బెహనా' పథకం జనాదరణకు కొంత కారణమని చెప్పవచ్చు. ఇది అత్యధికసంఖ్యలో మధ్యప్రదేశ్‌లోని మెజారిటీ గృహాలకు చేరుకుంది.

నేను మధ్యప్రదేశ్‌లో ఎన్నికల ఫీల్డ్‌వర్క్‌ని నిర్వహించనప్పటికీ, రాజస్థాన్‌లో నా ఫీల్డ్‌వర్క్‌లో ఇలాంటి అంశాన్ని గమనించాను. పురుషుల కంటే మహిళలు బీజేపీకి ఎక్కువ మద్దతు ఇచ్చారు. మహిళా ఓటు ముఖ్యంగా యువ మహిళల్లో ఒక స్పష్టమైన రాజకీయ గుర్తింపుగా మారింది. ఇంట్లోని ఇతరుల మాదిరిగానే మహిళలు కూడా ఓటు వేస్తారని ఊహించడం సరి కాదు.

నాలుగుసార్లు ప్రజారంజక ముఖ్యమంత్రిగా శివరాజ్ చౌహాన్ పేరుపొందడం, విజయవంతమైన లాడ్లీ బెహనా పథకం అమలుతో మధ్యప్రదేశ్‌లో బీజేపీ అధికారంలో ఉంది. కానీ రాజస్థాన్‌లోని మహిళా ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపడాన్ని ఎలా వివరించాలి? అన్నింటికంటే, ప్రస్తుత కాంగ్రెస్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ ప్రజారంజకమైన సంక్షేమ పథకాలను అమలు చేశారు. మహిళా ఓటర్లను కూడా లక్ష్యంగా చేసుకున్నారు.

నితీష్ కుమార్ లేదా మమతా బెనర్జీలా కాకుండా, కాంగ్రెస్ పార్టీ మహిళా ఓటర్ల పట్ల దీర్ఘకాలిక నిబద్ధత చూపలేదు. రెండోది – మరీ ముఖ్యంగా, బీజేపీ, ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పట్టుదలతో స్త్రీలలో మద్దతును పెంచుకున్నారు. ఉదాహరణకు, హిందీ మాట్లాడే ప్రాంతాల్లో, గుజరాత్‌లో మహిళా ఓటరుతో చేసినట్లు నేరుగా మోదీ కమ్యూనికేట్ చేయడంతో చక్కటి ఫలితం వచ్చింది. వాస్తవానికి, ఛత్తీస్‌గఢ్‌లో మహిళా ఓటర్లలో బీజేపీకి ఉన్న సాను కూలతను కూడా యాక్సిస్ పోల్ ద్వారా గమనించవచ్చు. హిందీ ప్రాంతంలో, ముఖ్యంగా మహిళల్లో ప్రధాని మోదీకి ఉన్న ఈ ప్రజాదరణ, ఈ ప్రాంతంలోని ఏ రాష్ట్ర ఎన్నికలలోనైనా బీజేపీని బలీయమైన పార్టీగా, జాతీయ ఎన్నికలలో అభేద్యంగా చేస్తుంది.

తన కార్యాలయంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంక్షేమవాదంపై దృష్టి పెట్టి, 'లాభార్థి (లబ్ధిదారు) ఓటరును సృష్టించారు. గ్యాస్ సిలిండర్లు వంటివాటిపైనా, మహిళలపైనా దృష్టిపెట్టారు. పైగా మోదీ తనను తాను ఒక 'ప్రదాత'గా ఇమేజ్‌ని అభివృద్ధి చేసుకొన్నారు. కరోనా వైరస్ మహమ్మారి నేపథ్యంలో ఆయన నేరుగా, హిందీ బెల్ట్‌తో ఉచిత రేషన్ పథకాలతో సంబంధం కలిగి ఉన్నారు. దీంతో ఆయన 'పంపిణీ చేయగల ఏకైక వ్యక్తిగా ప్రజల మనసుల్లో చిత్రితమయ్యారు. దక్షిణ భారతదేశంలో నేను వివిధ రాష్ట్రాలలో ఎవరు వివిధ పథకాల పంపిణీలో ముందున్నారు అని అడిగినప్పుడు వేరు వేరు పేర్లు వినిపించేవి. కానీ ఉత్తర భారతదేశంలో పథకాల బట్వాడాకు బాధ్యత వహించే వ్యక్తిగా ప్రధానమంత్రిని మాత్రమే ఓటర్లు ఎక్కువగా పేర్కొంటున్నారు.

చాలా కాలం క్రితం తమ ప్రత్యేక ప్రయోజనాల పంపిణీ నమూనాలను అభివృద్ధి చేసిన కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల మాదిరిగా కాకుండా, నగదు బదిలీ ద్వారా ప్రయోజనాల పంపిణీని బీజేపీ, మోదీ పునర్నిర్వచించారు. వాటిని ప్రధానమంత్రి ముద్రతో బ్రాండ్ వేశారు. దురదృష్టవశాత్తు కాంగ్రెస్‌కు, హిందీ బెల్ట్‌లో బీజేపీపై నేరుగా పోటీ చేయడంపైనే మొగ్గు చూపాల్సి వస్తోంది.

కొత్త మహిళా ఓటరు సాంప్రదాయికమైన ప్రాంతీయ, కులాలవారీ గణనలను మెరుగుపరుస్తుంది. జైపూర్ వెలుపల ఉన్న ఫూలేరా నియోజకవర్గంలోని ఒక గ్రామంలో సూర్యుడు అస్తమిస్తుండగా, ఒక యువతి మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చి ఇలా చెప్పింది: 'ఎన్నికలను కవర్ చేయడానికి మీరు ఇక్కడ ఉన్నారని నేను చూస్తున్నాను. మా కుటుంబం ఎప్పుడూ కాంగ్రెస్‌కి ఓటేస్తుంది, కానీ ఈసారి ఓటు వేయడానికి నేను చాలా చిన్నదానిని. అయితే 2024లో నాకు ఓటు ఉంటుంది, నేను మోదీకే ఓటు వేస్తాను!'

వ్యాసకర్త 'సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్'లో సీనియర్ ఫెలో

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

అనుమానాలు వీడని అంబేడ్కర్ మరణం


సందర్భం



డాక్టర్ దేవరాజు మహారాజు

బాబా సాహెబ్ డా॥ బీఆర్ అంబేడ్కర్ 1956, అక్టోబర్ 14న నాగపూర్‌లో లక్షల మంది అనుచరులతో హిందూ మతాన్ని వదిలి, బౌద్ధం స్వీకరించారు. నాగపూర్ నాగజాతి ప్రజలు జీవించిన భూమి గనుక, వారంతా బౌద్ధులు గనుక, తాను బౌద్ధం స్వీకరించడానికి నాగపూర్‌ను ఎంచుకున్నానని ఆయన ప్రకటించారు. అంతే గాని, నాగ్‌పూర్‌లో ఆరెస్సెస్ వారి ప్రధాన కార్యాలయం ఉంది గనుక, వారి ప్రాముఖ్యం తగ్గించడానికి తను ఆ పట్టణాన్ని ఎంచుకోలేదనీ వివరణ ఇచ్చారు. అయితే, ఆ తర్వాత 52 రోజులకే (డిసెంబర్ 6) అంబేడ్కర్ కన్ను మూశారు. ఆయన మరణం వెనుక ఓ కుట్ర ఉందనీ, ఆయన మరణించిన నాటి నుండి నేటి దాకా ఒక ఆరోపణ ఉంది. ఆ ఆరోపణ నిజం కాదని అటు భారత ప్రభుత్వం గానీ, ఇటు ఆరోపణలు ఎదుర్కొన్న వర్గాలు గానీ ఆధారాలు, వివరణలు ప్రజల ముందు పెట్టలేదు. అందువల్ల అనుమానాలు అనుమానాల్లాగే ప్రజల మనసుల్లో సజీవంగా ఉన్నాయి.

ఆ రోజుల్లో జీవించి ఉన్న ఇ.వి.ఆర్. పెరియార్ తన వార్తా పత్రిక 'విడుదలై'లో ఇలా రాశారు. 'డాక్టర్ అంబేడ్కర్ చనిపోయారని అకస్మాత్తుగా ప్రకటించడం వెనుక ఏదో కుట్ర ఉందని నాకు అనిపిస్తోంది. గాంధీ మరణం వెనుక ఏ కారణం, ఏ కుట్ర ఉన్నాయో అలాంటివే అంబేడ్కర్ చనిపోవడం వెనక ఉన్నాయని నేను బలంగా నమ్ముతున్నాను' అంటూ చాలా వివరంగా రాశారు. మొత్తం మీద ఆయన వెలిబుచ్చిన ఆవేదనలోని సారాంశం ఏమిటంటే – గాంధీ మరణానికి కారకులెవరో, వారే అంబేడ్కర్ మరణాకి కూడా కారకులని! అందుకు అవకాశమిచ్చే పలు అంశాలు కూడా ఆ రోజుల్లో చాలా బయటికి వచ్చాయి. 'తన తండ్రికి విషమిచ్చి తెలియకుండా చంపేశారని' స్వయానా అంబేడ్కర్ కుమారుడు యశ్వంత్ ఒక అభిప్రాయం వెలిబుచ్చారు. అంబేడ్కర్ అభిమానులంతా యశ్వంత్‌ను బలపరిచారు. అంబేడ్కర్ మరణవార్త ఈ దేశ ప్రజలకు అనుమానాస్పదమైన వార్త అయింది. 'తన తండ్రిది సహజ మరణం కాదనీ, హత్య అనీ – దోషులెవరో తేల్చాలనీ – అంబేడ్కర్ కుమారుడు యశ్వంత్ నాటి ప్రధాని నివాసం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంబేడ్కర్ మరణం తర్వాత పదకొండవ రోజున, ఆయన అనుయాయులు ఢిల్లీ వీధుల్లో పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. నాటి ప్రధాని, రాష్ట్రపతులకు లిఖితపూర్వక నివేదికలు, విన్నపాలు అందజేశారు. అంబేడ్కర్ మరణం వెనక ఏం జరిగిందో తేల్చాలని వారు డిమాండ్ చేశారు.



నాటి ప్రధాని నెహ్రూ స్పందించి నిజనిర్ధారణ కమిటీని నియమించారు. కమిటీ భారత ప్రభుత్వానికి అందజేసిన రిపోర్టు ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రజల ముందుపెట్టలేదు. ఒకవేళ రహస్యాలేవీ లేకపోతే, అది బయటపెడితే అన్ని అనుమానాలకూ తెరపడినట్టయ్యేది కదా! ఢిల్లీ పోలీస్ ఐజీ ఇచ్చిన వివరణను మాత్రం 1957 నవంబర్ 27 నాడు – అంటే దాదాపు సంవత్సరం తర్వాత, అప్పటి హోంమంత్రి గోవింద్ వల్లభ్ పంత్‌తో పార్లమెంట్‌లో ఒక ప్రకటనగా ఇప్పించారు. 'అంబేడ్కర్ మరణం సహజమైందని' – ఆ ప్రకటన సారాంశం! అదొక కంటి తుడుపు ప్రకటన అని దేశ ప్రజలు ఆనాడే భావించారు. అసంతృప్తితో రగిలిపోయారు. ఆనాటి నుండి నిరసనలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. వ్యాసాలు, పుస్తకాలు ప్రచురింప బడుతూనే ఉన్నాయి. అసహనం, అసంతృప్తి ఏదోరకంగా బయట పడుతూనే ఉంది. తాజాగా ఈ మధ్యే 2021 జనవరి 26 నాడు నాగపూర్ ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయం ముందు – అంబేడ్కర్ ఎలా చనిపోయారో తేటతెల్లం చేయాలని పెద్దఎత్తున నిరసన ప్రదర్శన జరిగింది. జనవరి 26నే ఎందుకు ఎంచుకున్నా రంటే... ఆ తేదీన అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది గనుక! వారి పాత్ర లేకపోతే జనం వెళ్ళి వారి కార్యాలయం ముందు ఎందుకు నిరసన ప్రదర్శనలిస్తారూ? అర్థం చేసుకోవాల్సిన విషయం!

నెహ్రూజీ తొలి ప్రధాని అయ్యారు కాబట్టి, సోషలిజానికి, వైజ్ఞానిక ప్రగతికి ఆయన ప్రాధాన్యమిస్తూ వచ్చారు. అప్పుడు వీరి ఆటలు అంతగా సాగలేదు. అయినా, వారి లక్ష్యసాధనకు వారు నిరంతరం కృషి చేస్తూనే వస్తున్నారు. దాని ఫలితాలను నేడు కూడా మనం చూస్తూనే ఉన్నాం! అంబేడ్కర్‌ది సహజ మరణమా? లేక హత్యా అనేది ఆరోజుల్లో బయటికి రాలేదు.


67 ఏళ్ళ తర్వాత, ఆధారాలన్నీ చెదిరిపోయిన తర్వాత, ఇప్పుడు బయటికి వస్తుందన్న నమ్మకం లేదు గానీ – గతంలో జరిగిన కొన్ని వాస్తవాలు ఈ తరానికి తెలియజేయడం అవసరం అనిపించింది. అయితే, బాబా సాహెబ్ అర్ధంతరంగా వదిలేసిన కర్తవ్యాలనూ, రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధననూ ఈ తరం యువతీ యువకులు ముందుకు తీసుకుపోవాల్సి ఉంది. ఈ పోరాటం నిరంతరం కొనసాగుతూ ఉండాల్సిందే!

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత
(నేడు అంబేడ్కర్ వర్ధంతి)

ఎవరు గొప్ప?

నలుగురు మనుషులు ఒక చోట కూడారంటే వివాదాలు రాకమానవు. తమ ఆధిక్యాన్ని స్థాపించుకోవటానికి తమ మాట నెగ్గించుకోవటానికి ప్రతి ఒక్కరూ విశ్వప్రయత్నం చేస్తారు. ఈ పరిస్థితి కుటుంబంలోనూ, సమాజంలోనూ కనిపిస్తుంది. కుటుంబంలో ప్రతి ఒక్కరూ తన వల్లే కుటుంబం నడుస్తోందని తను లేకపోతే ఏమవుతుందో అనుకుంటూ అందరూ తన మాటే వినాలనుకుంటారు. మనిషిలో ఈ అహం నశించనంత వరకు ఈ వివాదాలు తప్పవు.

ఒకసారి ప్రాణం; ఇంకా కన్ను, చెవి, నోరు వంటి ఇంద్రియాలు నేను గొప్పంటే నేనని వాదించుకున్నాయి. కాని, విషయం తేలలేదు. ఇంద్రియాలన్నీ ఒక కుటుంబం లాంటివే. అన్నీ కలిసి దైవం దగ్గరకు వెళ్లి 'మాలో ఎవరు గొప్పో తేల్చి చెప్పు. నువ్వేం చెప్పినా మేం అంగీకరిస్తాం' అన్నాయి. అప్పుడు దేవుడు 'మీలో ఎవరు శరీరాన్ని విడిచి వెళ్ళిపోతే, శరీరం తేజస్సు తగ్గి పనులన్నీ ఆగిపోతాయో అదే గొప్పది' అని చెబుతాడు. మొదట వాక్కు శరీరాన్ని వదిలి బైటకు వెళ్ళిపోతుంది. తను లేనప్పుడు ఎలా వున్నారు అని అడుగుతుంది ఏడాది తర్వాత తిరిగి వచ్చి. మాట లేకపోయినా కళ్ళతో చూస్తూ, చెవులతో వింటూ, ఊపిరి పీలుస్తూ బాగానే ఉన్నాము. నువ్వు లేకపోతే మాకు ఇబ్బందేం కలగలేదు అన్నాయి ఇంద్రియాలు. అలాగే, కళ్ళు, చెవులు, నోరు ఒక్కొక్కటి వెళ్లిపోయినా మిగిలిన అవయవాలతో శరీరం బాగానే ఉంది. చివరకు ప్రాణం వెళ్లిపోవటానికి సిద్ధమవుతుంటే శరీరం చైతన్యం కోల్పోతూ ఉంది. ఇంద్రియాలు పనిచేయలేకపోయాయి. అవి అన్నీ ప్రాణంతో 'నువ్వే గొప్ప. నువ్వు వెళ్ళిపోవద్దు' అని ప్రార్థించాయి. ఇది ఒక ఉపనిషత్ కథ.



జ్యోతిర్మయం

అయితే కన్ను, చెవి, నోరు వంటి ఇంద్రియాలు పని చేయకుండా ప్రాణం మాత్రమే ఉన్నా, మనిషి జీవించి ప్రయోజనం లేదు. అన్ని ఇంద్రియాలూ వాటి పని అవి చేయాలి... ప్రాణం ఉండాలి. దేని కదే గొప్ప. అలాగే, ఇంటికి పెద్ద తండ్రో, అన్నో ఒకరు ఉన్నా, ఇంట్లో అందరి సహాయ సహకారాలు లేనిదే ఒక్కరూ అన్నీ చేయలేరు. అందరూ గొప్పవారే! అన్ని ఇంద్రియాలూ గొప్పవే!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

పలు విమాన సర్వీసులు రద్దు

సాక్షి, రాజమహేంద్రవరం/గన్నవరం/రేణిగుంట/గోపాలపట్నం: తుపాను కారణంగా విజయవాడ ఎయిర్‌పోర్ట్‌కు (గన్నవరం) వచ్చే పలు విమాన సర్వీస్‌లు మంగళవారం కూడా రద్దయ్యాయి. ఉదయం ఎయిరిండియాకు చెందిన షార్జా సర్వీస్, అలయన్స్ ఎయిర్‌కు చెందిన హైదరాబాద్, బెంగళూరు విమాన సర్వీస్‌లు మాత్రమే నడిచాయి. మిగిలిన 32 సర్వీస్‌లు రద్దయ్యాయి. వీటితోపాటు ఇండిగోకు చెందిన అన్ని సర్వీస్‌లు రద్దయ్యాయి. న్యూఢిల్లీకి ఉదయం, రాత్రి వేళలో నడిచే ఎయిరిండియా సర్వీస్‌లనూ రద్దు చేశారు. తుపాను ప్రభావం తగ్గకపోతే బుధవారం కూడా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది. అలాగే, తూర్పు గోదావరి జిల్లాలోని మధురపూడి విమానాశ్రయానికి రావాల్సిన 10 విమానాలను రద్దు చేశారు. విశాఖ విమానాశ్రయం నుంచి బుధవారం తిరుపతి, కర్నూలుకు వెళ్లే 4 సర్వీసులను రద్దు చేశారు.

విమాన సర్వీసుల పునరుద్ధరణ..

మంగళవారం మధ్యాహ్నానికి వర్షం తగ్గుముఖం పట్టడంతో తిరుపతి జిల్లాలోని రేణిగుంట విమానాశ్రయం నుంచి మూడు విమాన సర్వీసులు నడిపారు. బుధవారం అన్నీ సర్వీసులు యథావిధిగా నడిచే అవకాశం ఉంది.

'పశ్చిమ'లో సుడిగాలి విధ్వంసం



వీరవాసరం: పశ్చిమ గోదావరి జిల్లాలో మంగళవారం సుడిగాలి బీభత్సం సృష్టించింది. వీరవాసరంలోని గొంతేరు డ్రెయిన్ వద్ద ప్రారంభమై కొన్ని నిమిషాల పాటు ఏర్పడిన సుడిగాలి పలు షెడ్లు, పాకలను కూల్చివేసి.. వ్యాన్లు, ట్రాక్టర్లను తిరగబెట్టేసింది. కొన్ని వాహనాలు డ్రెయిన్‌లోకి వెళ్లిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. అక్కడ ఉన్న చర్చికి కుడివైపు నుంచి ప్రారంభమైన సుడిగాలి జాతీయ రహదారిని క్రాస్ చేసినట్లు పలువురు తెలిపారు. ఆ సమయంలో ఎవరికైనా గాయాలయ్యాయా, కారు లేదా వాహనాలతోపాటు డ్రెయిన్‌లోకి జారిపోయారా.. అనేది తెలియాల్సి ఉంది. దీని ప్రభావానికి విద్యుత్ స్తంభాలు కూడా విరిగిపడిపోయాయి.

మరికొన్ని రైళ్లు రద్దు

శబరిమలకు 32 ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): మిచాంగ్ తుపాను కారణంగా విజయవాడ డివిజన్ మీదుగా నడిచే మరికొన్ని రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. ఇప్పటికే రద్దు చేసిన రైళ్లతోపాటు తుపాను ప్రభావం ఉన్న ప్రాంతాల్లో మరిన్ని రైళ్లను రద్దు చేసింది.. కొన్నింటిని దారి మళ్లించింది. మరికొన్నింటిని పునరుద్ధరించింది. డివిజనులోని విజయవాడతోపాటు ముఖ్యమైన రైల్వే స్టేషన్‌ల్లో హెల్ప్‌డెస్క్‌లు, టోల్ ఫ్రీ నంబర్‌లను ఏర్పాటు చేసింది. శబరిమల వెళ్లే వారి కోసం డిసెంబర్, జనవరి నెలల్లో 32 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఎస్సై రాత పరీక్ష ఫలితాలపై స్టే ఎత్తివేత

అభ్యర్థుల ఆరోపణల్లో వాస్తవం లేదని తేల్చిన హైకోర్టు

న్యాయస్థానంలోనే అభ్యర్థుల ఎత్తు కొలిపించిన ధర్మాసనం

- పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కొలతలు సరిగానే ఉన్నాయని స్పష్టీకరణ
- ప్రభుత్వ వైద్యులిచ్చిన ధ్రువీకరణ పత్రాలపై దర్యాప్తునకు ఆదేశం
- అభ్యర్థులు రూ.లక్ష చొప్పున చెల్లించాల్సిందేనన్న ధర్మాసనం
- లేదంటే జైలుకెళ్లాల్సి ఉంటుందని స్పష్టీకరణ
- న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్‌కు చీవాట్లు
- తదుపరి విచారణ ఈ నెల 13వ తేదీకి వాయిదా



సాక్షి, అమరావతి: ఎస్సై అభ్యర్థుల 'ఎత్తు' వివాదం కీలక మలుపు తిరిగింది. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులు తమ 'ఎత్తు'ను సరిగా కొలవలేదంటూ పలువురు అభ్యర్థులు చేసిన వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. ఎస్సై రాత పరీక్ష ఫలితాల వెల్లడిపై సింగిల్ జడ్జి విధించిన స్టే ఉత్తర్వులను ఎత్తివేసింది. మంగళవారం కోర్టు హాలులో నిర్వహించిన ఎత్తు పరీక్ష ఫలితాలు, రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులు గతంలో నిర్వహించిన ఫలితాలతో సరిపోలడంతో పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుపై ఆరోపణలు చేస్తూ కోర్టుకొచ్చిన పిటిషనర్లపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అభ్యర్థులు ప్రభుత్వ వైద్యుల నుంచి ధ్రువీకరణ పత్రాలు తెచ్చి.. కోర్టు ముందుంచడంపైనా మండిపడింది. ఈ పత్రాల యథార్థతపై దర్యాప్తు చేయాలని గుంటూరు ఐజీ పాలరాజును ఆదేశించింది. ఆ వైద్యులను విచారించాలని కూడా స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేంద్ర, జస్టిస్ న్యాపతి విజయ్ ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎత్తు, ఛాతీ కొలతలపై వివాదం

ఎస్సై నియామక ప్రక్రియకు సంబంధించి దేహదారుఢ్య పరీక్షల్లో భాగమైన ఎత్తు, ఛాతీ చుట్టుకొలతను హైకోర్టు ఆదేశాల మేరకు మాన్యువల్‌గా కొలిచిన అధికారులు తమను అనర్హులుగా ప్రకటించారని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలంటూ ఆరుగొళ్ల దుర్గాప్రసాద్, మరో 23 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2018 నోటిఫికేషన్‌లో ఎత్తు విషయంలో అర్హులుగా ప్రకటించిన తమను తాజా నోటిఫికేషన్‌లో అనర్హులుగా ప్రకటించారని ఆరోపించారు. వాదనలు విన్న సింగిల్ జడ్జి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఎస్సై నియామకాల కోసం గత నెలలో నిర్వహించిన రాత పరీక్షకు సంబంధించిన ఫలితాలను తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకు వెల్లడించవద్దంటూ ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ నియామక బోర్డు ధర్మాసనం ముందు అప్పీల్ చేశాయి. దీనిపై ఇటీవల విచారణ జరిపిన జస్టిస్ నరేంద్ర ధర్మాసనం పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుపై చేసిన ఆరోపణలు అవాస్తవమని తేలితే రూ.లక్ష జరిమానా విధిస్తామని, అందుకు సిద్ధమైన అభ్యర్థులే ఎత్తు పరీక్షకు హాజరు కావాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పిటిషన్ దాఖలు చేసిన 24 మందిలో 19 మంది పరీక్షకు హాజరవుతున్నామని, రూ.లక్ష జరిమానా చెల్లించేందుకు సిద్ధమంటూ లిఖితపూర్వకంగా కోర్టుకు తెలిపారు.

రూ.లక్ష చొప్పున కట్టాల్సిందే

కాగా.. న్యాయస్థానంలో కొలతలకు హాజరైన అభ్యర్థులు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుపై తాము చేసిన ఆరోపణలు అవాస్తవం అని తేలితే రూ.లక్ష జరిమానా చెల్లిస్తామని రాసిచ్చిన నేపథ్యంలో ఆ మొత్తం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. తమకు అంత స్థోమత లేదని కొందరు అభ్యర్థులు చెప్పడంతో.. కోర్టు అంటే తమాషాగా ఉందా? అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాల ప్రకారం.. రూ.లక్ష చొప్పున చెల్లించాల్సిందేనని.. లేదంటే జైలుకెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది.

న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్‌పై ఆగ్రహం

మంగళవారం న్యాయస్థానంలోనే అభ్యర్థుల ఎత్తును ధర్మాసనం కొలిపించింది. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కొలతలు సరిగానే ఉన్నాయని స్పష్టం చేసింది. అభ్యర్థుల తరఫు న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్ స్పందిస్తూ.. పిటిషనర్లు నిబంధనల ప్రకారం ఉండాల్సినంత ఎత్తు ఉన్నారని ధ్రువీకరిస్తూ ప్రభుత్వ వైద్యులు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారంటూ వాటిని ధర్మాసనం ముందుంచారు. వాటిని పరిగణనలోకి తీసుకోవాలని నవ్వుతూ కోరారు. దీనిపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టునే శంకిస్తారా? అంటూ చీవాట్లు పెట్టింది. కోర్టు అంటే నవ్వులాటగా ఉందా అంటూ శ్రవణ్‌కుమార్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టును తేలిగ్గా తీసుకుంటే పర్యవసానాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలంది.

రామోజీ ఉడుత ఊపులకు బెదిరేది లేదు

- తప్పుడు కథనాలతో నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయలేరు
- 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరు
- విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఆధారాల్లేని అసత్య వార్తలు, తప్పుడు కథనాలతో ప్రతి నిత్యం విషం చిమ్ముతున్న ఈనాడు రామోజీరావు ఉడుత ఊపులకు అదిరే వారు, బెదిరేవారెవరూ లేరని వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కులాన్ని, కలాన్ని దుర్వినియోగం చేస్తూ నైతిక విలువలకు తిలోదకాలిచ్చి ఎంతగా దిగజారి కథనాలు ప్రచురించినా వైఎస్సార్‌సీపీ నాయకుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయలేరని, 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు పట్టం కట్టేందుకు ఇప్పటికే సిద్ధమయ్యారని తెలిపారు. మంగళవారం విజయనగరంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రజామద్దతు కోల్పోయి అధఃపాతాళానికి దిగజారిపోయిన టీడీపీని జాకీలతో లేపడానికి శతవిధాలా ప్రయత్నించినా ఫలితం శూన్యమన్నారు. ఈనాడు పత్రికను ప్రారంభించడానికి విశాఖపట్నంలో తీసుకున్న భూమిని లీజు కాలం ముగిసిన తర్వాత తిరిగి ఇవ్వడానికి యజమాని వర్మను ఎన్ని ఇబ్బందులకు గురి చేశారో అందరికీ తెలుసన్నారు. హైదరాబాద్‌లోని స్థలం విషయంలోనూ రామోజీరావు ఎన్ని కుయుక్తులు పన్నారో తెలుసని, కోర్టు మొట్టికాయలు వేస్తేకానీ స్థలాలను ఖాళీ చేయలేదని గుర్తు చేశారు. రామోజీరావు బంధువు, గీతం విద్యాసంస్థల అధినేత ఎంవీవీఎస్ మూర్తి రుషికొండలో 33 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే ఎందుకు కథనాలు రాయలేదని ప్రశ్నించారు. రామోజీరావు పత్రిక ప్రజావిశ్వాసాన్ని ఎప్పుడో కోల్పోయిందని చెప్పారు. అవినీతిరహితంగా, అర్హత ఒక్కటే ప్రామాణికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే శ్రీరామరక్షగా నిలుస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా తీసుకుంటున్న నిర్ణయాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని, కొన్ని రాష్ట్రాలు వాటిని అమలు చేస్తున్నాయని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

హజ్ యాత్రకు దరఖాస్తు గడువు ఈ నెల 20

- 2024 మే 9 నుంచి హజ్ యాత్ర ప్రారంభం
- విజయవాడలో ఎంబార్కేషన్ పాయింట్
- హజ్ యాత్ర గైడ్‌లైన్స్ జారీ
- ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్ వెల్లడి



సాక్షి, అమరావతి: హజ్ యాత్రకు వెళ్లే వారు డిసెంబర్ 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చైర్మన్ బద్వేల్ షేక్ గౌస్ లాజమ్ చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న హజ్ సొసైటీల్లో వలంటీర్లు రిజిస్ట్రేషన్ చేస్తారని తెలిపారు. విజయవాడలోని హజ్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో హజ్ కమిటీ డైరెక్టర్ ఇబాదుల్లా, కృష్ణా జిల్లా వక్ఫ్ డైరెక్టర్ ఫయాజ్‌తో కలిసి గౌస్ లాజమ్ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో విజయవాడకు గతేడాది ఎంబార్కేషన్ పాయింట్ సాధించినట్లు గౌస్ లాజమ్ తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు కంటే విమాన టికెట్ ధర విజయవాడ నుంచి ఎక్కువ ఉండడంతో ఆ భారం హజ్ యాత్రీకులపై పడకుండా సీఎం వైఎస్ జగన్ పెద్ద మనస్సుతో సాయమందించారన్నారు. హజ్ యాత్ర–2024కు సంబంధించిన మార్గదర్శకాలను కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ, కేంద్ర హజ్ కమిటీ సంయుక్తంగా జారీ చేశాయని చెప్పారు. ఆ ప్రకారం..

- 2024 మే 9న దేశవ్యాప్తంగా హజ్ యాత్ర మొదలై జూన్ 20వ తేదీతో ముగుస్తుంది.
- రాష్ట్రంనుంచి హజ్ యాత్రకు వెళ్లే వారు 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు (రిజిస్ట్రేషన్) చేసుకోవాలి.
- హజ్ యాత్ర–2024కు రాష్ట్రం నుంచి 2,930 మందికి అనుమతి.
- గతంలో దేశంలో ఏ యాత్రీకుడైనా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లో ఒకే ఎంబార్కేషన్ పాయింట్ ఎంపిక చేసుకోవాల్సి ఉండేది. ఇప్పుడు రెండు ఎంబార్కేషన్ పాయింట్‌లు ఎంపిక చేసుకోవచ్చు.
- గతంలో వయో పరిమితి (నిబంధన) ఉండేది. ఇకపై అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 70 సంవత్సరాల వయస్సు దాటిన వారు సైతం అర్హులే.
- గతంలో 45 ఏళ్లు దాటిన ఒంటరి మహిళలతో వారి రక్త సంబంధీకులు ఉంటేనే అనుమతించేవారు. ఇప్పుడు ఆ నిబంధనను సవరించి ఐదుగురిని ఒక గ్రూపుగా చేసి పంపిస్తారు.
- విజయవాడలో ఎంబార్కేషన్ పాయింట్ ఉంది.

విశాఖలో క్యాంపు కార్యాలయాల జీవో 2283పై పిటిషన్

నేడు విచారించనున్న జస్టిస్ నిమ్మగడ్డ

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర అభివృద్ధి పర్యవేక్షణ, సమీక్ష నిమిత్తం విశాఖపట్నంలో ప్రభుత్వ క్యాంప్ కార్యాలయాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలు గుర్తిస్తూ ఐఏఎస్‌ల కమిటీ ఇచ్చిన నివేదికకు అనుగుణంగా ప్రభుత్వం జారీచేసిన జీవో 2283ని సవాలు చేస్తూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. ఈ జీవో అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ అమరావతి పరిరక్షణ సమితి, రాజధాని ప్రాంత రైతులు కొందరు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై బుధవారం న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు విచారించనున్నారు. వాస్తవానికి ఈ వ్యాజ్యాన్ని ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) రూపంలో దాఖలు చేయాల్సి ఉన్నప్పటికీ, అందుకు విరుద్ధంగా రిట్ పిటిషన్ రూపంలో దాఖలు చేయడంపై హైకోర్టు వర్గాల్లో పెద్ద చర్చే జరుగుతోంది. ఫోరం షాపింగ్ (కావాల్సిన న్యాయమూర్తి వద్దకు కేసు వచ్చేలా చేయడం)లో భాగంగానే ఇలా రిట్ పిటిషన్ దాఖలు చేశారన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. ఫోరం షాపింగ్, నాట్ బిఫోర్‌లు టీడీపీ, దాని మద్దతుదారుల ట్రేడ్‌మార్క్ అస్త్రాలు. గతంలో ఎన్నోసార్లు ఈ అస్త్రాలు ప్రయోగించి విజయం సాధించారు. ఇటీవల స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలోనూ ప్రయోగించినా అది విఫలమైంది. జీవో 2283ని సవాలు చేస్తూ తాజాగా దాఖలు చేసిన ఈ వ్యాజ్యంలో రాజధాని గురించి పిటిషనర్లు ప్రముఖంగా ప్రస్తావించారు. విశాఖపట్నంలో క్యాంపు కార్యాలయాల ఏర్పాటు హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీర్పునకు విరుద్ధమని అందులో పేర్కొన్నారు. ఒకవేళ రిట్ దాఖలు చేయడం సమంజసమే అనుకున్నా రాజధానితో జీవో దీన్ని ముడిపెట్టిన నేపథ్యంలో తాజాగా దాఖలు చేసిన వ్యాజ్యం ధర్మాసనం ముందుకే రావాల్సి ఉంటుంది. పిటిషనర్ల దురుద్దేశాలను ప్రభుత్వ న్యాయవాదులు ఎత్తిచూపే అవకాశం కూడా ఉంది.

నిబంధనల ప్రకారమే ఇంజనీరింగ్ ఫీజులు: హైకోర్టు

సాక్షి, అమరావతి: ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 2023–26 సంవత్సరాలకు నిబంధనల ప్రకారమే ఫీజులను నిర్ణయించాలని హైకోర్టు మంగళవారం ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్‌ను ఆదేశించింది. ఆయా కాలేజీల ఆదాయ వ్యయాలను, ఇతర ధరలను పరిగణనలోకి తీసుకుని ఫీజులను నిర్ణయించాలని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు మంగళవారం తీర్పు వెలువరించారు. ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ నిర్ణయించిన ఫీజులను తప్పుబడుతూ పలు కాలేజీలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన జస్టిస్ నిమ్మగడ్డ తీర్పు వెలువరించారు.

క్లుప్తంగా...

'ఇండియా' భేటీ వాయిదా

న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఇండియా కూటమి అగ్ర నేతల సమావేశం డిసెంబర్ మూడో వారానికి వాయిదా పడింది. ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలతో బిజీగా ఉన్నందున బుధవారం జరగాల్సిన భేటీకి రాలేకపోతున్నట్లు కూటమిలోని కొన్ని పార్టీల నేతలు అశక్తత వ్యక్తం చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఇండియా కూటమి పార్టీలకు చెందిన ఫ్లోర్ లీడర్లతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తన నివాసంలో బుధవారం సాయంత్రం తలపెట్టిన సమావేశం మాత్రం కొనసాగనుంది. కూటమి అగ్ర నేతల సమావేశం డిసెంబర్ మూడో వారంలో అందరికీ అనుకూలమైన తేదీలో జరగనుందని 'ఇండియా' ప్రచార కమిటీ సభ్యుడు గుర్దీప్ సప్పాల్ తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని కలిసికట్టుగా ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాన్ని ఈ సమావేశంలో చర్చించనున్నారు. బుధవారం జరగాల్సిన భేటీకి తాము రాలేకపోతున్నట్లు ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, టీఎంసీ చీఫ్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తెలిపారు. బిహార్ సీఎం, జేడీయూ నితీశ్ కుమార్ అనారోగ్య కారణాలతో, తమిళనాడు సీఎం స్టాలిన్ తమ రాష్ట్రంపై తుపాను ప్రభావం తీవ్రంగా ఉండటంతో రాలేకపోతున్నట్లు తెలిపారని సప్పాల్ వివరించారు.

నైజీరియాలో డ్రోన్ దాడి.. 85 మంది మృతి

అబుజా: నైజీరియాలో మతపరమైన ఉత్సవంపై జరిగిన డ్రోన్ దాడిలో కనీసం 85 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మరో 66 మంది గాయపడ్డారు. ఈ దాడి పొరపాటున జరిగినట్లు ఆ దేశ సైన్యం ప్రకటించింది. ఆదివారం రాత్రి కదునా రాష్ట్రం టుడున్ బిరి గ్రామంలో మౌలిద్ అల్ నబీ వేడుక జరుగుతుండగా ఆర్మీ డ్రోన్ దాడి జరిపింది. మృతుల్లో చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఉన్నారని అధికారులు చెప్పారు. ఇప్పటి వరకు 85 మృతదేహాలను ఖననం చేశామన్నారు. ఘర్షణలతో అట్టుడుకుతున్న ప్రాంతాల్లో బందిపోట్లు, తీవ్రవాదులే లక్ష్యంగా జరుగుతున్న దాడుల్లో తరచూ ఇలాంటి పొరపాట్లు చోటుచేసుకోవడం ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆందోళన వ్యక్తం చేసింది.

ఎంఎన్ఎఫ్ చీఫ్ జోరామ్‌తాంగ రాజీనామా

ఐజ్వాల్: ఇటీవలి ఎన్నికల్లో ఘోర పరాజయం నేపథ్యంలో మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్ఎఫ్) అధ్యక్ష పదవికి సీఎం జోరామ్‌తాంగ (79) రాజీనామా చేశారు. ఆయన ఎంఎన్ఎఫ్ చీఫ్‌గా 33 ఏళ్ల పాటు కొనసాగారు. మంగళవారం రాజీనామా లేఖను పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు తౌన్‌లుయియాకు పంపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు అందులో జోరామ్‌తాంగ వివరించారు. ఆయన రాజీనామాను ఆమోదించాలా వద్దా అనే విషయం చర్చించేందుకు పార్టీ నేషనల్ కోర్ కమిటీ, పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ బుధవారం సమావేశం కానున్నట్లు పార్టీ జనరల్ సెక్రటరీ క్రోస్నెజోవా వెల్లడించారు.

పీఎం-కిసాన్ సాయం పెంపు ప్రతిపాదన లేదు

న్యూఢిల్లీ: ప్రధాన్‌మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద దేశవ్యాప్తంగా రైతులకు ఇచ్చే మొత్తాన్ని పెంచే ప్రతిపాదన ఏమీ లేదని మోదీ సర్కార్ స్పష్టంచేసింది. ఈ పథకం కింద రైతులకు ఏటా అందించే రూ.6,000 నగదు సాయం మొత్తాన్ని ప్రస్తుతానికి పెంచట్లేమని తేల్చి చెప్పింది. ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా లోక్‌సభలో వ్యవసాయ శాఖ నరేంద్ర సింగ్ తోమర్ ఈ విషయం చెప్పారు. దేశంలోని రైతులకు సాయం కింద 2018 నుంచి ఏటా మోదీ సర్కార్ రూ.6,000 చొప్పున పంపిణీ చేస్తున్న విషయం విదితమే.

ఇండోనేసియా ఘటనలో 23కు చేరిన మృతులు

బటు పలనో: ఇండోనేసియాలోని మరపీ అగ్ని పర్వతం బద్దలైన ఘటనలో మరణించిన పర్వతారోహకుల సంఖ్య 23కు చేరింది. ఈ ఘటనలో 11 మంది చనిపోయినట్లు సోమవారం అధికారులు ప్రకటించారు. మంగళవారం మరికొన్ని మృతదేహాలు లభ్యం కావడంతో మృతుల సంఖ్య పెరిగింది. అయితే, సోమవారం మరో విస్ఫోటనంతో 2,620 అడుగుల ఎత్తున వేడి బూడిద గాలిలోకి చిమ్మడంతో అన్వేషణ కార్యకలాపాలను నిలిపివేశారు. ఆదివారం మరపీ వైపుగా వెళ్లి ప్రమాదంలో పడిన సుమారు 75 మందిలో 50 మందిని రక్షించారు.

'సీఐడీ' నటుడు దినేశ్ హఠాన్మరణం



ముంబై: పాపులర్ టీవీ సీరియల్ 'సీఐడీ'లో ఫ్రెడ రిక్స్ పాత్ర పోషించిన నటుడు దినేశ్ ఫడ్నిస్(57) కన్నుమూశారు. కొంతకాలంగా లివర్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న దినేశ్ ముంబైలోని తుంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి సోమవారం అర్ధరాత్రి 12.8 గంటలకు దినేశ్ తుదిశ్వాస విడిచినట్లు ఆయన స్నేహితుడు, నటుడు ఆదిత్య శ్రీవాస్తవ చెప్పారు.

అవినీతి.. అంతర్గత పోరు

రాజస్తాన్‌లో కాంగ్రెస్ ఓటమికి ప్రధాన కారణాలివే

- మంత్రులు, ఎమ్మెల్యేలపై వ్యతిరేకత
- అయినా 90 శాతం మందికి టికెట్లు
- 17 మంది మంత్రులు, 31 మంది ఎమ్మెల్యేల ఓటమి
- పేపర్ లీకేజీలతో యువతలో చెడ్డ పేరు




రాజస్తాన్‌లో అసెంబ్లీ ఎన్నికలంటే అధికార పార్టీకి ఎప్పుడూ ముచ్చెమటలే. ప్రతి ఐదేళ్లకూ ప్రభుత్వాన్ని పడగొట్టడం అక్కడి ప్రజలకు అలవాటు. 30 ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ ఇది. అధికార కాంగ్రెస్ ఓడిపోవడంతో ఈసారీ అది కొనసాగింది. కానీ కాంగ్రెస్ ఓటమికి ఆనవాయితీ కంటే అంతర్గత పోరు, అవినీతిని కట్టడి చేయడంలో సీఎం గెహ్లోత్ వైఫల్యమే ముఖ్య కారణాలు. యువ నేత సచిన్ పైలట్‌కు, గెహ్లోత్‌కు మధ్య నెలకొన్న తీవ్ర విభేదాలు తూర్పు రాజస్తాన్‌లో కాంగ్రెస్‌ను బాగా దెబ్బ తీశాయి. ప్రజాకర్షక పథకాల మైలేజీని మంత్రులు, ఎమ్మెల్యేల అవినీతి తుడిచిపెట్టేసింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

కొంపముంచిన సిట్టింగులు

గత ఐదేళ్లలో రాజస్తాన్‌లో వరుసబెట్టి పలు అవినీతి కుంభకోణాలు జరిగాయి. నిరుద్యోగం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వీలైనన్ని నియామకాలు చేపట్టడం ద్వారా వారిలో అసంతృప్తిని చల్లార్చేందుకు గహ్లోత్ ప్రభుత్వం ప్రయత్నించకపోలేదు. కానీ ఆ క్రమంలో ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో ఏకంగా 12 సార్లు పేపర్లు లీకయ్యాయి! వాటికోసం రాత్రింబవళ్లు కష్టపడి సన్నద్ధమైన 50 లక్షల మంది యువతీ యువకులతో పాటు వారి కుటుంబాల్లో ఇది కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకతకు దారితీసింది. దీనికి తోడు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ప్రజల్లో తీవ్రస్థాయిలో అసమ్మతి నెలకొని ఉంది. కాంగ్రెస్ అంతర్గత సర్వే ఈ మేరకు స్పష్టంగా పేర్కొంది. అయినా ఈ కీలకమైన అంశాన్ని విస్మరించి 90 శాతానికి పైగా సిట్టింగులకు గెహ్లోత్ మళ్లీ టికెట్లిచ్చారు. తద్వారా కోలుకోలేని పొరపాటు చేశారు. తీరా ఫలితాలొచ్చాక మంత్రుల్లో ఏకంగా 17 మంది ఓటమిపాలవగా ఎమ్మెల్యేల్లోనూ 31 మంది అదే బాట పట్టారు. పైగా 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచార భారమంతటినీ సమర్థంగా మోసి కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడంలో కీలకంగా వ్యవహరించిన పైలట్‌ను ఈసారి గెహ్లోత్ పూర్తిగా దూరం పెట్టడం చేటు చేసింది.



ఓట్ల తేడా స్వల్పమే!

రాజస్తాన్‌లో కాంగ్రెస్ ఓటమి పాలైనా బీజేపీకి పోలైన ఓట్లతో పోలిస్తే అంతరం కేవలం 2.2 శాతమే కావడం గమనార్హం. బీజేపీకి 41.7 శాతం ఓట్లు రాగా కాంగ్రెస్ 39.5 శాతం దక్కించుకుంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలపై అసంతృప్తే ఆ పార్టీ ఓటమికి ప్రధానంగా కారణమైందనేందుకు ఇది మరో నిదర్శనం. ఎందుకంటే...

- మొత్తం 199 స్థానాలకుగాను ఏకంగా 111 చోట్ల కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచింది. బీజేపీ కేవలం 66 సీట్లలోనే రెండో స్థానంలో ఉంది.
- 20 వేల ఓట్లకు పైగా మెజారిటీతో గెలిచిన 77 స్థానాల్లో బీజేపీకి 45 దక్కగా కాంగ్రెస్ 22తో సరిపెట్టుకుంది.
- 5 శాతం కంటే తక్కువ మెజారిటీ నమోదైన 66 స్థానాల్లో బీజేపీకి 34, కాంగ్రెస్‌కు 23 దక్కాయి.
- అలాగే 10-20 శాతం మెజారిటీ వచ్చిన 61 స్థానాల్లోనూ బీజేపీకి 37 వస్తే కాంగ్రెస్‌కు 22 వచ్చాయి.
- మెజారిటీ 20 శాతాన్ని మించిన 19 స్థానాల్లో మాత్రం 11 బీజేపీ ఖాతాలో పడ్డాయి. కాంగ్రెస్ ఆరింటికి పరిమితమైంది.
- అలాగే 5-10 శాతం మెజారిటీ నమోదైన 53 సీట్లలోనూ బీజేపీకి 33 దక్కితే కాంగ్రెస్ 18తో సరిపెట్టుకుంది.

గాజాలో మళ్లీ బీభత్సం

- ఖాన్ యూనిస్ సిటీపై ఇజ్రాయెల్ భీకర దాడులు.. 43 మంది మృతి
- జబాలియా శరణార్థి శిబిరాన్ని చుట్టుముట్టిన ఇజ్రాయెల్ సైన్యం

ఖాన్ యూనిస్: హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన తర్వాత గాజా స్ట్రిప్‌లో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. మళ్లీ యుద్ధ బీభత్సం స్పష్టం కనిపిస్తోంది. జనం చెల్లాచెదురవుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సురక్షిత ప్రాంతాలను వెతుక్కుంటూ తరలివెళ్తున్నారు. హమాస్ మిలిటెంట్ల స్థావరాలు, మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం దాడులు తీవ్రతరం చేసింది. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ సిటీపై సోమవారం అర్ధ రాత్రి తర్వాత క్షిపణుల వర్షం కురిపించింది. ఖాన్ యూనిస్‌లో ఇజ్రాయెల్ తాజా దాడుల్లో 43 మంది మరణించారని హమాస్ వెల్లడించింది. సాధారణ జనావాసాలపై దాడులు చేయలేదని, హమాస్ స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఉత్తర గాజాలో అతిపెద్ద జబాలియా రెఫ్యూజీ క్యాంప్‌ను తమ సైన్యం చుట్టుముట్టిందని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ క్యాంప్‌లోపలి హమాస్ స్థావరాలను నేలమట్టం చేయబోతున్నామని వెల్లడించింది. గాజాలో ఇప్పుడు సురక్షిత ప్రాంతం అంటూ ఏదీ లేకుండాపోయిందని 'యూనిసెఫ్' ఆందోళన వ్యక్తం చేసింది. ఇక్కడ పరిస్థితి ప్రతి గంట గంటకూ దిగజారుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది.

గాజాలో 15,899కి చేరిన మృతులు

ఇజ్రాయెల్-హమాస్ మధ్య అక్టోబర్ 7న యుద్ధం మొదలైంది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటివరకు 15,899 మంది మృతిచెందారని గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన తర్వాత గత మూడు రోజుల వ్యవధిలోనే 700 మంది మరణించినట్లు తెలుస్తోంది.

కలుగుల్లోని ఎలుకలను రప్పించినట్లు..

గాజాలో హమాస్ మిలిటెంట్లు బలమైన సొరంగాల వ్యవస్థను నిర్మించుకున్నారు. అక్కడే వారి ఆయుధ నిల్వలు, కమ్యూనికేషన్ పరికరాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ కలుగుల్లో దాక్కొని ఇజ్రాయెల్ సైన్యంపై దాడులకు దిగుతున్నారు. అందుకే సొరంగాలను ధ్వంసం చేయడానికి , వాటిని సముద్రపు నీటితో నింపేయాలని ఇజ్రాయెల్ రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం నవంబర్‌లోనే అల్-షాతీ శరణార్థి శిబిరానికి మైలు దూరంలో 5 భారీ పంపులను ఏర్పాటు చేసినట్లు ఓ వార్తా సంస్థ వెల్లడించింది. ఇవి గంటకు కొన్ని వేల క్యూబిక్ మీటర్ల నీటిని పంప్ చేస్తాయని, వారాల వ్యవధిలోనే సొరంగాలను నింపుతాయని పేర్కొంది. దీంతో సొరంగాలు పనికిరాకుండాపోతాయి. అందులోని ఆయుధాలు, కమ్యూనికేషన్ పరికరాలు నిరుపయోగంగా మారతాయని ఇజ్రాయెల్ అంచనా. సొరంగాల్లోని మిలిటెంట్లను అంతం చేయడం తేలికవుతుందని భావిస్తోంది. ఇలా ఉండగా, బందీలను సొరంగాల్లో మిలిటెంట్లు దాచిపెట్టిన సంగతి తెలిసింది. వారంతా విడుదలైన తర్వాత సొరంగాలను నీటితో నింపే ప్రణాళికలను అమలు చేస్తారా? లేక ముందే చేస్తారా? అనేది తెలియరాలేదు.

హెచ్-1బీ రెన్యువల్స్.. కొత్త విధానంపై ఆందోళన!

వాషింగ్టన్: అమెరికా తాజాగా తెరపైకి తేనున్న ప్రయోగాత్మక హెచ్-1బీ వీసా రెన్యువల్ విధానాన్ని డిపెండెంట్స్(కుటుంబ సభ్యుల)కు వర్తింపజేయకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. హెచ్-1బీ వీసాలపై అమెరికాలో కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న వేలాదిమంది భారతీయ టెకీలకు ఇది పెద్ద సమస్య కానుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గత జనవరిలో ప్రకటించిన ఈ విధానం ప్రకారం హెచ్-1బీ వీసాదారులు రెన్యువల్/స్టాంపింగ్ కోసం మాతృదేశానికి వెళ్లాల్సిన అవసరముండదు. కేవలం ఆన్‌లైన్‌లో రెన్యువల్ దరఖాస్తు చేసుకుంటే చాలు. అయితే ఆ దరఖస్తు ఆమోదు ప్రక్రియలో ఉన్నకాలంలో వారు అమెరికాను వీడి వెళ్లకూడదు. 'అమెరికాలోనే రెన్యువల్/స్టాంపింగ్' అనేది ఇంకా పైలెట్ ప్రాజెక్టు దశలోనే ఉన్నందున తొలుత కేవలం 20,000 దరఖాస్తులనే అనుమతించనున్నట్లు కాన్సులర్ వ్యవహారాల డిప్యూటీ అసిస్టెంట్ సెక్రెటరీ జూలీ స్టఫ్ వెల్లడించారు. ''ఇది కొత్త విధానమేమీ కాదు. కాకపోతే గత 20 ఏళ్లలో ఎన్నడూ దీన్ని అమలు చేయలేదు. ఈ దృష్ట్యా ప్రయోగాత్మకంగా అమలు చేసి చూడనున్నాం. ఫలితాలను బట్టి దీన్ని ఏ మేరకు ముందుకు తీసుకెళ్లాలో నిర్ణయానికి వస్తాం'' అని వివరించారు. వీసాల జారీ, రెన్యువల్ ప్రక్రియలో ప్రస్తుతం సుదీర్ఘ వెయిటింగ్ పీరియడ్‌ను వీలైనంతగా తగ్గించడమే కొత్త విధానం ఉద్దేశం. దీన్ని హెచ్-1బీ వీసాదారుల కుటుంబీకులకు వర్తింపజేయడం లేదు కాబట్టి డిపెండెంట్స్ వారి రెన్యువల్ కోసం మాతృదేశం వెళ్లడం తప్పనిసరి. దీంతో వీసాదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. జూలీ స్టఫ్ మాత్రం కొత్త విధానాన్ని ప్రస్తుతానికి వర్క్ వీసాలకే పరిమితం చేయదలచినట్టు స్పష్టం చేశారు.

గోమూత్ర రాష్ట్రాల్లోనే గెలుపు

దక్షిణాదిన బీజేపీకి స్థానం లేదు

- లోక్‌సభలో డీఎంకే ఎంపీ సెంథిల్ కుమార్ వ్యాఖ్యలు
- బీజేపీ, కాంగ్రెస్ నేతల ఆగ్రహం



న్యూఢిల్లీ: హిందీ మాట్లాడే ఉత్తరాది రాష్ట్రాలను తమిళనాడుకు చెందిన డీఎంకే ఎంపీ డీఎన్‌వీ సెంథిల్ కుమార్ గోమూత్ర రాష్ట్రాలు అని అభివర్ణించారు. కేవలం గోమూత్ర రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తుందంటూ లోక్‌సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. దక్షిణాది రాష్ట్రాల్లో గెలిచే సత్తా బీజేపీకి లేదని ఆయన అన్నారు. సెంథిల్ కుమార్‌పై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్ష 'ఇండియా' కూటమిలో భాగస్వామి అయిన డీఎంకే ఎంపీ ఉత్తర భారతీయులను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను సమర్థిస్తున్నారా? అని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీని ప్రశ్నించారు. జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన రెండు బిల్లులపై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో సెంథిల్ కుమార్ మాట్లాడారు. మనం సాధారణంగా గోమూత్ర రాష్ట్రాలుగా పిలిచే ఉత్తరాది రాష్ట్రాల్లోనే బీజేపీ విజయం సాధిస్తుందని, ఈ విషయం ప్రజలు గుర్తించాలని అన్నారు. ''మీరు(బీజేపీ) దక్షిణ భారతదేశానికి చేరుకోలేరు. అక్కడ మీకు విజయం దక్కదు. స్థానం లేదు. కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ఎన్నికల్లో ఏం జరిగిందో చూడండి. దక్షిణాదిన మేము బలంగా ఉన్నాం'' అని స్పష్టంచేశారు. దక్షిణాది రాష్ట్రాలను కేంద్ర పాలిత ప్రాంతాలుగా మారిస్తే తప్ప బీజేపీకి అక్కడ అధికారం దక్కదని తేల్చిచెప్పారు. దక్షిణ భారతదేశంపై ఆధిపత్యం చెలాయించే సాహసాన్ని బీజేపీ కలలో కూడా చేయలేదని పేర్కొన్నారు. సెంథిల్‌కుమార్ వ్యాఖ్యలను తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కె.అన్నామలై తీవ్రంగా ఖండించారు. తమిళనాడులో డీఎంకే పతనం ప్రారంభమైందని, ఆ పార్టీ నేతల అహంకారమే ఇందుకు కారణమని 'ఎక్స్'లో పోస్టు చేశారు. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వ నిర్వాకం వల్లే చెన్నై నగరం నీట మునుగుతోందని విమర్శించారు. పుదుచ్చేరిలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వమే అధికారంలో ఉందని అన్నామలై గుర్తుచేశారు. సెంథిల్ కుమార్ వ్యాఖ్యలను రాహుల్ గాంధీ సమర్థిస్తున్నారా? అని కర్ణాటక మాజీ మంత్రి సి.టి.రవి నిలదీశారు. భారతీయులను కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అవమానిస్తున్నాయని మండిపడ్డారు. సెంథిల్ కుమార్ వెంటనే క్షమాపణ చెప్పాలని, వివాదాస్పద వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం డిమాండ్ చేశారు. సెంథిల్ కుమార్ వ్యాఖ్యలను బీజేపీ సీనియర్ నేత, బిహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోదీ, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ శుక్లా తదితరులు తప్పుపట్టారు. మరోవైపు, సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్‌పై కేసు నమోదు చేయాలని, పదవి నుంచి తొలగించాలని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు మంగళవారం తమిళనాడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సభ గౌరవాన్ని కాపాడాలి: ఓం బిర్లా

లోక్‌సభలోకి ఎంపీలు ప్లకార్డులు తీసుకురావడం పట్ల స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేశారు. సభ గౌరవాన్ని కాపాడాలని, క్రమశిక్షణ పాటించాలని సూచించారు. తనను కించపర్చేలా మాట్లాడిన బీజేపీ ఎంపీ రమేశ్ బిధూరీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ సభ్యుడు డానిష్ అలీ సోమవారం సభలో ప్లకార్డును మెడకు బిగించుకొని నిరసన తెలిపారు. ఈ ఘటనపై స్పీకర్ మంగళవారం సభలో స్పందించారు. సభలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేయడం సరైంది కాదని హితవు పలికారు. నియమ నిబంధనలకు సభ్యులంతా కట్టుబడి ఉండాలని చెప్పారు.

సెంథిల్ కుమార్ క్షమాపణ

లోక్‌సభలో తాను చేసిన వ్యాఖ్యల పట్ల డీఎంకే ఎంపీ సెంథిల్ కుమార్ క్షమాపణ చెప్పారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల గురించి ప్రస్తావించానని, ఇందులో భాగంగా ఒక వాక్యాన్ని సరైన రీతిలో ఉపయోగించలేదని పేర్కొన్నారు. తనకు ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. తన మాటలకు తప్పుడు అర్థాలు ప్రచారంలోకి వస్తుండడంతో క్షమాపణ కోరుతున్నానని వివరించారు.

కర్ణిసేన చీఫ్ కాల్చివేత

ఇంటికెళ్లి చంపిన దుండగులు | **తమదే బాధ్యతన్న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్**


సుఖ్‌దేవ్ సింగ్‌పైకి దుండగులు కాల్పులు జరుపుతున్న దృశ్యం

జైపూర్: శ్రీ రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణి సేన అధ్యక్షుడు సుఖ్‌దేవ్ సింగ్ గొగామెడి హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని ముగ్గురు దుండగులు మంగళవారం ఉదయం జైపూర్‌లోని సుఖ్‌దేవ్ ఇంటికి వెళ్లారు. ఆయనతో 10 నిమిషాల పాటు మాట్లాడాక కాల్పులకు దిగారు. ఈ ఘటనలో సుఖ్‌దేవ్ చనిపోగా ఎదురుకాల్పుల్లో దుండగుల్లో ఒకడు హతమయ్యాడు. సుఖ్‌దేవ్ అంగరక్షకుడు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీ రాజ్‌పుత్ కర్ణి సేన వ్యవస్థాపకుడు లోకేంద్ర సింగ్ కల్వితో విభేదాలు రావడంతో సుఖ్‌దేవ్ సింగ్ 2015లో సొంతంగా శ్రీ రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణి సేనను నెలకొల్పారు. ఈ రెండు సంఘాలు 2018లో విడుదలైన పద్మావత్ సినిమాకు వ్యతిరేకంగా ఆందోళనలకు దిగిన విషయం తెలిసిందే. ఆ సినిమాలో రాజ్‌పుత్‌లకు సంబంధించి చారిత్రక సత్యాలను వక్రీకరించారంటూ ఆరోపించారు. గొగామెడి హత్య ఘటనపై జైపూర్ పోలీస్ కమిషనర్ బిజు జార్జి జోసెఫ్ మీడియాతో మాట్లాడారు. 'ముగ్గురు దుండగులు గొగామెడి ఇంటికి వెళ్లారు. ఆయనతో మాట్లాడాలంటూ అక్కడి సెక్యూరిటీ గార్డులకు చెప్పారు. దీంతో, వారిని లోపలికి తీసుకెళ్లారు. గోగామెడితో 10 నిమిషాలపాటు మాట్లాడాక అకస్మాత్తుగా కాల్పులకు దిగారు. దుండగుల్లో నవీన్ సింగ్ షెకావత్ అనే వ్యక్తి ఎదురుకాల్పుల్లో చనిపోయాడు. మిగతా ఇద్దరు గోగామెడి ఇంటి బయట ఓ వ్యక్తి నుంచి స్కూటీని లాగేసుకుని పరారయ్యారు'అని వివరించారు. 'ఈ ఘటనలో గొగామెడి భద్రతా సిబ్బంది ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. అతడు ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. కాల్పుల ఘటన మొత్తం సీసీటీవీలో రికార్డయింది. తప్పించుకుపోయిన నిందితులను గుర్తించి, పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. హత్యకు కుట్ర పన్నిన వారిని సైతం పట్టుకుంటాం. హతమైన షెకావత్ స్థానికంగా దుకాణం నడుపుతున్నట్లు ప్రాథమికంగా తేలింది'అని చెప్పారు. గొగామెడి కాల్చివేత వార్త తెలిసిన వెంటనే మద్దతుదారులు అతడి ఇంటి వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. గత కొంతకాలంగా గొగామెడికి బెదిరింపులు వస్తున్నాయని అతడి బంధువొకరు తెలిపారు. ఈ సమాచారం పోలీసులకు కూడా అందించామన్నారు. గొగామెడి మృతదేహాన్ని తరలించిన ఆస్పత్రికి వెళ్లే రోడ్డును మద్దతుదారులు దిగ్బంధించారు. నిందితులను వెంటనే పట్టుకోవాలంటూ డిమాండ్ చేశారు. హత్యను నిరసిస్తూ కర్ణి సేన మద్దతుదారులు జైపూర్‌లో ర్యాలీ నిర్వహించారు. కాగా, గొగామెడి హత్యకు తమదే బాధ్యతని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన రోహిత్ గొదారా ఫేస్‌బుక్‌లో ప్రకటించాడు. తమ శత్రువులతో చేయి కలిపినందునే గొగామెడిని చంపేశామన్నాడు. శత్రువులకు కూడా ఇదే గతి పడుతుందని హెచ్చరించాడు.

కొన్ని విషయాలు చెప్పకపోవడమే మేలు



న్యూఢిల్లీ: హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకం, బదిలీల విషయంలో కొలీజియం సిఫార్సులపై చర్యలు తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తోందని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. వాస్తవానికి ఈ పిటిషన్లపై మంగళవారం విచారణ కొనసాగించాల్సి ఉంది. కానీ, జాబితా నుంచి వీటిని హఠాత్తుగా తొలగించారు. దీనిపై పిటిషన్ల తరఫు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాంశు ధూలియాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని ప్రశ్నించారు. తమ పిటిషన్లపై మంగళవారం విచారణ చేపట్టాలంటూ జ్యుడీషియల్ ఆర్డర్ సైతం ఉందని, అయినప్పటికీ ఈరోజు వ్యాజ్యాల జాబితా నుంచి హఠాత్తుగా తొలగించడానికి గల కారణం చెప్పాలని అన్నారు. తాము తొలగించలేదని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ బదులిచ్చారు. అయితే, సుప్రీంకోర్టు రిజిస్ట్రీ నుంచి వివరణ కోరాలని పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సూచించారు. జాబితా నుంచి పిటిషన్లను ఎవరికీ చెప్పకుండా తొలగించడం అసాధారణ పరిణామం అని అన్నారు. ''కొన్ని సార్లు కొన్ని విషయాలు చెప్పకుండా వదిలేయడమే మేలు'' అని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ ప్రతిస్పందించారు.

భూకక్ష్య వైపు ప్రొపల్షన్ మాడ్యూల్: ఇస్రో

బెంగళూరు: చంద్రయాన్-3 మిషన్‌లో మరో కీలక మలుపు. ఈ ప్రయోగంలో భాగమైన ప్రొపల్షన్ మాడ్యూల్ కక్ష్యను మార్చుతున్నట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ప్రకటించింది. ఈ మాడ్యూల్‌ను చంద్రుడి కక్ష్య నుంచి భూకక్ష్య వైపు మళ్లించినట్లు తెలియజేసింది. ఇదొక విశిష్టమైన ప్రయోగమని పేర్కొంది. ఈ మేరకు మంగళవారం 'ఎక్స్'లో పోస్టు చేసింది. చంద్రయాన్-3లోని మూడు ప్రధాన భాగాల్లో ల్యాండర్ మాడ్యూల్, రోవర్‌తోపాటు ప్రొపల్షన్ మాడ్యూల్ కూడా ఉంది. చంద్రయాన్-3 ప్రయోగానికి ముందు ప్రొపల్షన్ మాడ్యూల్‌తోపాటు ల్యాండర్ మాడ్యూల్ అనుసంధానమై ఉంది. ప్రొపల్షన్ మాడ్యూల్ వాహక నౌక నుంచి విడిపోయి, ల్యాండర్ మాడ్యూల్‌ను జాబిల్లికి 100 కిలోమీటర్ల సమీపంలోకి విజయవంతంగా తీసుకెళ్లింది. అనంతరం ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ మాడ్యూల్‌ను విడిపోయింది. చంద్రుడి ఉపరితలంపై అడుగుపెట్టింది. ప్రొపల్షన్ మాడ్యూల్ అప్పటి నుంచి చంద్రుడి కక్ష్యలో పరిభ్రమిస్తూనే ఉంది. అందులో 100 కిలోల ఇంధనం ఉండడంతో చక్కగా పనిచేస్తోంది. ప్రొపల్షన్ మాడ్యూల్‌ను ఇప్పుడు భూకక్ష్య వైపు మళ్లించడం ద్వారా భూమికి సంబంధించిన పరిశోధనలు చేయనున్నారు.

పాక్‌లో ఖలిస్తానీ ఉగ్రవాది లఖ్‌బీర్ సింగ్ మృతి



న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించిన ఖలిస్తాన్ వేర్పాటువాది లఖ్‌బీర్ సింగ్ అలియాస్ రోడ్(87) పాకిస్తాన్‌లో కన్నుమూశాడు. రావల్పిండిలోని ఓ ఆస్పత్రిలో ఇటీవల అతడు గుండెపోటుతో చనిపోయినట్లు ఒక అధికారి తెలిపారు. రోడ్ సోమవారం చనిపోయినట్లు కొందరు చెబుతుండగా, శనివారమే ఆయన తుదిశ్వాస విడిచినట్లు మరికొన్ని వార్తా కథనాలు పేర్కొంటున్నాయి. పంజాబ్‌లోని మోగా జిల్లా రోడ్ సుఖ్‌బీర్ స్వగ్రామం. 1982లో దుబాయ్ నుంచి పంజాబ్‌కు వచ్చినప్పటి నుంచి ఇతడు ఖలిస్తాన్ ఉద్యమంలో పాల్గొంటున్నాడు. 1984లో స్వర్ణదేవాలయంపై సైనిక చర్య అనంతరం నేపాల్‌కు, అక్కడి నుంచి మళ్లీ దుబాయ్‌కి పారిపోయాడు. 1991 నుంచి పాక్‌లో ఆశ్రయం పొందుతున్నాడు. ఇతడు ఏర్పాటు చేసిన ఖలిస్తాన్ లిబరేషన్ ఫ్రంట్(కేఎల్ఎఫ్), ఇంటర్నేషనల్ సిఖ్ యూత్ ఫెడరేషన్‌పై భారత ప్రభుత్వం నిషేధం విధించింది. ఇతడిపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది. 2001లో పార్లమెంట్‌పై జైషే మహ్మద్ ఉగ్రవాదుల దాడి ఘటనకు సంబంధించి భారత్..పాకిస్తాన్‌ను అప్పగించాలని కోరిన 20 మంది మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాలో రోడ్ పేరూ ఉంది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం । 6 । డిసెంబర్ । 2023

సాహస భక్తి



చిక్కమగళూరులో మంగళవారం వీరభద్రేశ్వర ఆలయంలో కెండోత్సవం జరిగింది. ఇందులో నిప్పుల మీద నడుస్తున్న దంపతులు

న్యూస్‌రీల్

న్యాయవాదిపై దాడి కేసు సీఐడీకి



బెళగావిలో న్యాయవాదుల నిరసన

యశవంతపుర: చిక్కమగళూరులో న్యాయవాది ప్రీతమ్‌ను హెల్మెట్ లేదని పోలీసులు పోలీస్ స్టేషన్‌లోకి లాక్కెళ్లి తీవ్రంగా కొట్టారనే కేసును సీఐడీకి బదిలీ చేస్తున్నట్లు హైకోర్టు అడ్వొకేట్ జనరల్ శశికిరణ్ శెట్టి తెలిపారు. హైకోర్టులో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారించిన కోర్టు ఈ దాడికి చెందిన మొత్తం ఐదు కేసులను సీఐడీతో దర్యాప్తు చేయిస్తామన్నారు. న్యాయవాదులు ధర్నాలు చేసిన కేసులు కూడా ఇందులో ఉన్నట్లు తెలిపారు. న్యాయవాదిని బయటకు గెంటి ఊరేగించారని న్యాయవాదుల సంఘం ఇచ్చిన ఫిర్యాదుపైనా విచారణ జరిపిస్తామన్నారు. కాగా, పోలీసులకు వ్యతిరేకంగా రాష్ట్రంలో న్యాయవాదుల ధర్నాలు కొనసాగుతున్నాయి. బెళగావిలో, ఉడుపి కోర్టు ఆవరణలో వకీళ్లు ధర్నాలు నిర్వహించారు.

అబార్షన్ల సమాచారం ఇస్తే నగదు కానుక

మైసూరు: లింగ నిర్ధారణ చేసి, ఆడ భ్రూణ హత్య చేస్తున్న ఆస్పత్రులు, వ్యక్తుల సమాచారం ఇచ్చిన వారికి రూ.50 వేల నగదు బహుమానం ఇస్తామని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రకటించింది. సాంస్కృతి నగరి మైసూరులో వందల సంఖ్యలో ఆడ శిశు భ్రూణ హత్యలు వెలుగులోకి రావడంతో అందరూ నిర్ఘాంతపోయారు. ఇక్కడి మాతా ఆస్పత్రిలో అబార్షన్ల వ్యవహారం జరుగుతోందని వెల్లడైంది. ఇందులో నిర్లక్ష్యం వహించారంటూ మైసూరు తాలూకా ఆరోగ్యశాఖ అధికారి రాజేశ్వరి, గతంలో పనిచేసిన జిల్లా కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రవిని సస్పెండ్ చేశారు. జిల్లాలోని సుమారు 139 స్కానింగ్ సెంటర్లపైన అధికారులు నిఘాపెట్టారు. అబార్షన్లు, భ్రూణహత్యలు చేసేవారి సమాచారం ఇస్తే రూ. 50 వేల నజరానా ఇస్తామని డీహెచ్‌ఓ డా.కుమారస్వామి తెలిపారు.

ప్రాణం తీసిన అక్రమ సంబంధం

మైసూరు: మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్న వ్యక్తిని ఆమె భర్త కొడవలితో నరికి చంపిన ఘటన నంజనగూడు తాలూకా హోసహళ్ళిలో జరిగింది. వివరాలు.. మహాదేవ స్వామి (36)కి, ఓ మహిళతో అక్రమ సంబంధం నడుస్తోంది. ఇది తెలిసి ఆమె భర్త సోమయ్య కక్ష పెంచుకున్నాడు. సోమవారం రాత్రి గ్రామంలోని చావడిలో పడుకొని ఉన్న మహాదేవస్వామిపై సోమయ్య వెళ్ళి నిన్ను వదలను అని అరుస్తూ కొడవలితో నరికాడు. ఇంతలో బాధితుని మామ వచ్చి అతన్ని నంజనగూడు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం మైసూరు నగరంలో కేఆర్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ చనిపోయాడు. గ్రామీణ పోలీసులు విచారించి నిందితున్ని అరెస్టుచేశారు.

పోలీసుల్లా వచ్చి ఇల్లు దోపిడీ

యశవంతపుర: పోలీసుల ముసుగులో పారిశ్రామికవేత్త ఇంట్లోకి చొరబడి కత్తులతో బెదిరించి రూ.60 లక్షలు నగదు, 500 గ్రాముల బంగారు నగలను దోచుకెళ్లిన ఘటన బెంగళూరు పీణ్యాలో జరిగింది. హెచ్ఎంటీ లేఔట్‌కు చెందిన పారిశ్రామికవేత్త మనోహర్ పీణ్యాలోని తన ఫ్యాక్టరీకి వెళ్లారు. ఇంట్లో భార్య సుజాత, కొడుకు రూపేశ్ ఉండగా సోమవారం రాత్రి 7:30 గంటల సమయంలో పోలీసులమంటూ ఐదారు మంది వచ్చారు. కత్తులు, కొడవళ్లు చూపి ఇద్దరినీ బాగా కొట్టారు. ఇల్లంతా వెతికి రూ. 60లక్షల నగదు, అర్ధకేజీ నగలను దోచుకెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చిన మనోహర్ విషయం తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయాలైన సుజాత, రూపేశ్‌లో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

బంగ్లాలు, కోట్లాది ఆస్తులు!

- 13 మంది అధికారులపై లోకాయుక్త దాడులు
- పెద్దమొత్తంలో అక్రమ ఆస్తుల గుర్తింపు
- రాష్ట్రంలో 63 ప్రాంతాల్లో తనిఖీలు



అధ్యాపకుని ఇంట్లో దొరికిన నగదు



బెంగళూరులో బెస్కాం ఇంజినీర్ చెన్నకేశవకు చెందిన భవనాలు

బనశంకరి: ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ ప్రజలకు సేవ చేయడానికి బదులు అడ్డదారుల్లో ఆస్తులు సంపాదించినవారిపై లోకాయుక్త ముమ్మర దాడులు చేసింది. బెంగళూరు, మైసూరు, బీదర్, బళ్లారి, విజయనగరతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 63కు పైగా ప్రాంతాల్లో 13 మంది అధికారులు, ఉద్యోగుల ఆఫీసులు, ఇళ్లు, వారి బంధువుల ఇళ్లలో మంగళవారం తెల్లవారుజాము నుంచి సోదాలు జరిపింది. ఇందులో కోట్లాది విలువ చేసే నగదు, బంగారం, స్థిరాస్తుల పత్రాలను స్వాధీనం చేసుకుంది.

లెక్చరర్ వ్యాపారాలు

మైసూరు నంజనగూడు ప్రభుత్వకాలేజీ లెక్చరర్ మహదేవస్వామికి చెందిన మైసూరు గురుకుల లేఔట్ నివాసంతో పాటు 12 చోట్ల దాడులు చేశారు. పేరుకే ఆయన అధ్యాపకుడు, కానీ ఎంఎస్ గ్రూప్ కంపెనీ నిర్వహిస్తున్నారు. భారీగా అక్రమాస్తులు పోగేసినట్లు తెలిసి సోదాలు చేపట్టారు. మైసూరులోని ఇళ్లు, కార్యాలయం, పాఠశాల, వాణిజ్య కట్టడాల్లో గాలింపు జరిపారు. ఒక విద్యాసంస్థ, స్టీల్, వస్త్ర దుకాణాలు గుర్తించారు. ఆయన కార్ల పార్కింగ్ కోసమే విశాలమైన స్థలాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

ఘనాపాటి తిమ్మరాజ

కేఆర్ఐడీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ తిమ్మరాజప్ప బంగ్లా చూసి లోకాయుక్త అధికారులు షాక్ తిన్నారు. కోలారు, బెంగళూరు, బెళగావితో పాటు 8 చోట్ల దాడులు చేశారు. కోలారు జిల్లా కేజీఎఫ్ తాలూకాలోని సొంతూరు మహదేవపురలో బృహత్ బంగ్లా కట్టుకున్నారు. బెంగళూరులోనూ తిమ్మరాజప్ప 7 ప్రాంతాల్లో ఇళ్లు, ఫ్లాట్లు ఉన్నాయి. కోట్లాది రూపాయల విలువచేసే నివాసం, ఆస్తులు, భూముల రికార్డులు లభ్యమయ్యాయి.

విజయేంద్ర బావమరిదిపై...

బళ్లారి గనులు, భూ విజ్ఞానశాఖ చంద్రశేఖర్, అటవీశాఖ డీఆర్ఎఫ్ఓ మారుతి ఇళ్లలో తనిఖీలు చేశారు. చంద్రశేఖర్ బళ్లారిలో పనిచేస్తుండగా ఇల్లు హోసపేటెలో ఉంది. బీదర్‌లో పశువైద్య యూనివర్సిటీ ఉద్యోగి సునీల్‌కుమార్ నివాసం, వాణిజ్య కాంప్లెక్స్‌లో సోదాలు జరుగుతున్నాయి. బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీవై. విజయేంద్ర భార్య సోదరుడు, యాదగిరి డీహెచ్‌ఓ డాక్టర్ ప్రభులింగ మానకర్ కలబురిగి నివాసంలోను సోదాలు చేపట్టారు. అందరి ఆస్తుల వివరాలు, బ్యాంకు ఖాతాలు, లాకర్లు తదితరాల తనిఖీ కొనసాగుతోంది.



అధ్యాపకుడు మహాదేవస్వామి భవనం

బెంగళూరులో ముగ్గురు..

బెంగళూరులో మూడుచోట్ల... బెస్కాం జాగృతి దళం అధికారి టీఎస్.సుధాకర్‌రెడ్డి, సహకార సంఘం సీఈఓ హెచ్ఎస్.కృష్ణమూర్తి, జయనగర బెస్కాం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హెచ్‌డీ. చెన్నకేశవల ఇళ్లు, ఆఫీసుల్లో తనిఖీలు చేశారు. చెన్నకేశవకు చెందిన అమృతహళ్లి ఇంటిలో రూ.6 లక్షలు నగదు, 3 కిలోల బంగారు నగలు, 28 కేజీల వెండి, రూ.25 లక్షల విలువచేసే వజ్రాభరణాలు, రూ.5 లక్షలు విలువైన 7 పురాతన వస్తువులు లభించాయి. వీటన్నింటి ప్రాథమిక విలువ రూ.1.5 కోట్లు ఉంటుందని అంచనా. ఈయన కరెంటు కనెక్షన్ ఇవ్వాలంటే లక్షలాది రూపాయల ముడుపులు తీసుకుంటారని ఆరోపణలున్నాయి. ఇటీవల ఫిర్యాదులు కూడా అందాయి.



చెన్నకేశవ ఇంట్లో బంగారు, వెండి సొత్తు (ఇన్‌సెట్లో) చెన్నకేశవ

మొదటి భార్య భవనం

చిక్కబళ్లాపురం: రామనగర జిల్లాలో వ్యవసాయశాఖ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేసే మునేగౌడపై లోకాయుక్త దాడులు చేసింది. ఇక్కడ నంది క్రాస్‌లో ఉన్న మొదటి భార్య ఉండే విలాసవంతమైన బంగ్లాలో సోదాలు చేశారు. పాలిహౌస్‌ల కొనుగోలులో భారీగా అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. రామనగర, బెంగళూరు, సొంతూరు శిడ్లఘట్ట, చిక్కబళ్లాపురంలోనూ బంధువుల ఇళ్లలో సోదాలు జరిపారు. బంగారం, నగదు, ఆస్తిపత్రాలు లభించాయి. చిక్కబళ్లాపురం లోకాయుక్త ఎస్పీ రామ్, డీఎస్పీ వీరేంద్రకుమార్, ఇన్స్‌పెక్టర్లు శివప్రసాద్, మోహన్ పాల్గొన్నారు.



చిక్కలో నందిక్రాస్ దగ్గర ఉన్న మునేగౌడ మొదటి భార్య ఇల్లు

చోరశిఖామణులు

- నగల షాపులో చైన్ తస్కరణ



సీసీ కెమెరా చిత్రంలో మహిళలు

తుమకూరు: తల్లీ కుమార్తెలుగా నగల షాపునకు వచ్చిన ఇద్దరు మహిళలు 32 గ్రాముల బంగారు చైన్‌ను తస్కరించారు. ఈ ఘటన సీసీ కెమెరాల్లో రికార్డయింది. వివరాలు.. తుమకూరు నగరంలోని గుంచి సర్కిల్‌లోని నగల దుకాణానికి 2వ తేదీన ఇద్దరు మహిళలు వచ్చారు. యజమానిని మాటల్లో పెట్టి ఖరీదైన నగలను చూపించాలని కోరారు. ఈ సమయంలో ఒక చైన్‌ను లాఘవంగా బ్యాగులోకి వేసుకున్నారు. వచ్చేటప్పుడు డబ్బులు మరిచిపోయామని, ఏటీఎంకు వెళ్లి తీసుకుని వస్తామని చెప్పి వెళ్లిపోయారు. షాపు యజమాని నగలను సరి చూసుకోగా ఒక చైన్ కనిపించలేదు. సీసీ చిత్రాలను పరిశీలించగా మహిళల ఘనకార్యం బయటపడింది. బాధితుడు నగర పోలీసులకు ఫిర్యాదు చేయగా చిత్రాల ఆధారంగా గాలింపు చేపట్టారు.

సర్వే అధికారి అరెస్టు

దొడ్డబళ్లాపురం: లంచం తీసుకుంటూ సర్వే అధికారి లోకాయుక్తకు చిక్కిన సంఘటన మాగడి పట్టణంలో చోటుచేసుకుంది. సర్వే అధికారి సంతోష్ మాగడి పట్టణంలోని ప్రైవేటు హోటల్‌లో రూ.20 వేలు లంచం తీసుకుంటూ దొరికాడు. తన భూమి సర్వే చేయాలని కోరినందుకు ఒక రైతు నుంచి రూ.25వేలు లంచం డిమాండు చేశాడు. ముందుగా రూ.5వేలు తీసుకుంటుండగా లోకాయుక్త పోలీసులు అరెస్టు చేసారు.

బీజేపీతో కలిసి పోటీ : దేవెగౌడ

యశవంతపుర: వచ్చే లోక్‌సభ ఎన్నికలలో బీజేపీతో పొత్తుతో 28 స్థానాల్లో పోటీ చేసి ఐక్యతను చాటుతామని జేడీఎస్ అధినేత మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడ తెలిపారు. మంగళవారం ఆయన హాసన్‌లో విలేకరులతో మాట్లాడారు. పొత్తు తరువాత సీట్ల సర్దుబాటు ఉంటుంది. వచ్చేవారం పొత్తుపై బీజేపీ పెద్దలు అమిత్‌షా, నరేంద్ర మోదీతో చర్చిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీకి సరైన సమాధానం ఇస్తామని, మోదీ నాయకత్వంలో ముందుకు సాగుతామన్నారు.

భర్తపై కోపం.. పోలీసులకు బాంబు బెదిరింపు

- అతని వాట్సప్ నుంచి పంపిన భార్య



బనశంకరి: భర్తపై ఉన్న కోపంతో తీసుకున్న ఓ అనాలోచిత నిర్ణయం ఓ మహిళను చిక్కుల్లో పడేలా చేసింది. వివరాలు.. ఆనేకల్ పట్టణం మారుతి లేఔట్‌కు చెందిన విద్యారాణికి ఆన్‌లైన్‌లో రామ్‌కుమార్ పరిచయం కావడంతో ఇద్దరూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. విద్యారాణి భర్త కిరణ్ విషయం గుర్తించి ఫోన్ పగలగొట్టారు. ఇది రామ్‌కుమార్‌కు తెలిపింది. ఈ సమయంలో ఇద్దరూ బాంబు బెదిరింపునకు కుట్ర పన్నారు. ఆ మేరకు విద్యారాణి ఆదివారం విద్యారాణి తన భర్త కిరణ్ వాట్సాప్ నుంచి ఆర్‌డీఎక్స్ బాంబు పెట్టారని పోలీసులకు మెసేజ్ పంపించింది. పోలీసులు కిరణ్ ఇంటికి వెళ్లి విచారించగా, విద్యారాణి బండారం బయటపడింది. స్నేహితుల సలహా మేరకు తన భర్తపై పగ తీర్చుకోవడానికి మెసేజ్ పంపినట్లు మహిళ నోరు విప్పింది. విద్యారాణి, ఇద్దరు స్నేహితులపై కేసు నమోదు చేశారు..

పాఠశాలలకు బాంబు బెదిరింపు... 22 కేసులు నమోదు

బెంగళూరులో పాఠశాలలకు బాంబు బెదిరింపు ఈ–మెయిల్ కేసుకు సంబంధించి ఇప్పటివరకు 22 కేసులు నమోదు చేశామని నగర పోలీస్ కమిషనర్ దయానంద్ తెలిపారు. బాంబు బెదిరింపు పాత కేసుకు కొత్త కేసుకు సంబంధం ఉందా అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామని, దీనిపై ఇంటర్‌పోల్, సీసీబీ సమాచారం అందించిందన్నారు. కొద్దిరోజుల క్రితం బెంగళూరుతో పాటు గ్రామాంతర ప్రైవేటు పాఠశాలలకు బాంబు బెదిరింపు ఈ–మెయిల్ వచ్చింది. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేకపోయినా తీవ్ర భయం కలిగించింది.

హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్

శివాజీనగర: రాష్ట్ర హైకోర్టు వెబ్‌సైట్‌ను ఎవరో దుండగులు హ్యాక్ చేశారు. మంగళవారం కోర్టు కలాపాల ప్రత్యక్ష ప్రసార విభాగంలో అశ్లీల దృశ్యాలను అప్‌లోడ్ చేశారు. హైకోర్టు యాప్‌లో కూడా అశ్లీల దృశ్యాలను చొప్పించారు. ఇది గుర్తించిన హైకోర్టు అధికారులు విచారణల ప్రత్యక్ష ప్రసారాన్ని నిలిపివేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రసన్న బీ.వరాళె మాట్లాడుతూ ప్రస్తుతానికి వీడియో కాన్ఫరెన్స్ వసతిని నిలిపివేశామని, హ్యాకర్స్‌పై విచారణ జరిపిస్తామని చెప్పారు. అధికారులు సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి సంఘటన జరగలేదు.

ప్రగతి బాట.. బ్రాండ్ బెంగళూరు

- అసెంబ్లీలో మంత్రి రామలింగారెడ్డి

శివాజీనగర/ బనశంకరి: నిత్యం విస్తరిస్తున్న బెంగళూరుకు ప్రణాళికాబద్ధంగా కొత్తరూపు ఇవ్వటానికి బ్రాండ్ బెంగళూరు పరికల్పనలో పథకం రూపొందిస్తున్నట్లు రవాణా మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. మంగళవారం బెళగావి సువర్ణసౌధలో విధానసభలో ప్రశ్నోత్తరాల చర్చలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంతో కీర్తి పొందిన బెంగళూరులో జనసంఖ్య అధికమవుతోంది. డిప్యూటీ సీఎం శివకుమార్ బ్రాండ్ బెంగళూరు పరికల్పన రూపొందించారు. ట్రాఫిక్, పర్యావరణం, ఆరోగ్యం, ప్రజాహితం, విద్యా, ఐటీ, జల సురక్ష అంశాలపై ప్రజల నుంచి సలహాలను స్వీకరించారని, ఆ మేరకు నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

అబ్కారీ లైసెన్సులపై రభస

రాష్ట్రంలోఎక్సైజ్ శాఖలో సీఎల్–7 లైసెన్సుల జారీలో అక్రమాలు జరిగాయని, దర్యాప్తు చేయాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. ఎమ్మెల్యే నారాయణస్వామి మాట్లాడుతూ కోలారు జిల్లాలో అబ్కారీ అధికారి రంగప్ప ఇష్టానుసారం బార్లకు లైసెన్సులు ఇచ్చారని, బార్లలో ఆయనకు వాటా ఉందని, చర్యలు తీసుకోవాలని కోరారు. గత బీజేపీ హయాంలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేయడంతో రభస జరిగింది.

మద్దెల తాళం



మంగళవారం బెళగావి విధానసౌధ ముందు.. డ్రమ్స్ వాయించిన మంగళూరు కళాకారులు

కెప్టెన్ అర్జునకు తూటా దెబ్బ

- అటవీ సిబ్బంది కాల్పుల్లో పొరపాటు?
- మరణం వెనుక అనుమానాలు



మైసూరు దసరా ఉత్సవాల్లో అర్జున (ఫైల్)

యశవంతపుర: మైసూరు దసరా సంబరాల్లో 8 సార్లు అంబారి ఎత్తి చాముండేశ్వరి అమ్మవారిని ఊరేగించిన ఏనుగు కెప్టెన్ అర్జున మృతిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం హాసన్ జిల్లా సకలేశపుర తాలూకా యసళూరు వద్ద అడవి ఏనుగును బంధించే ప్రయత్నంలో అర్జునపై ఆ ఏనుగు దాడి చేయడంతో మరణించడం తెలిసిందే. అంతమంది అటవీ సిబ్బంది ఉన్నప్పటికీ అడవి ఏనుగు దాడిచేసి ఎలా చంపేసిందనే ప్రశ్నలు హోరెత్తాయి. ఇందులో అటవీ అధికారుల నిర్లక్ష్యం ఉందని స్థానికులు, పరిసరవాదులు, మావటీలు ఆరోపించారు. ఇక్కడ జరిగిన ఆడియో సంభాషణ వైరల్‌గా మారింది.


ఏం జరిగింది?

అర్జున, ప్రశాంత్ అనే పెంపుడు ఏనుగులపై మదపటేనుగు దాడికి దిగింది. ఈ సమయంలో అటవీ సిబ్బంది కాల్పులు జరిపారు. అయితే నిర్లక్ష్యంగా తుపాకీ వాడడంతో ఒక తూటా అర్జున కాలికి తగిలి అది కుప్పకూలింది. ఈ సమయంలో మదపుటేనుగు కూడా తీవ్రంగా దాడి చేయడంతో అర్జునకు మరణం తప్పలేదు. అర్జునను అక్కడికి తీసుకెళ్లడమే తప్పని, పైగా తుపాకీతో కాల్చారని ప్రజలు, మావటీలు వాపోయారు.

జనం ధర్నా, లాఠీచార్జీ

సకలేశపుర తాలూకా దబ్బళ్లికట్టెలో మంగళవారం అర్జున అంత్యక్రియలు జరిపారు. ఈ సందర్భంగా ప్రజలు ఆందోళన చేశారు. అర్జున పేరుతో స్మారకం నిర్మిస్తామని హామీ ఇవ్వాలన్నారు. పరిస్థితి చేయి దాటడంతో పోలీసులు లాఠీచార్జీ చేసి చెదరగొట్టారు. అర్జున మరణంతో మావటి విను కన్నీరు మున్నీరుగా రోదించాడు. తనను కూడా అర్జునతో కలిపి అంత్యక్రియలు చేయాలని ఏనుగు మీద పడి విలపించాడు.

బెంగళూరుకు వెళ్లకున్నా.. ట్రాఫిక్ చలానా



చలానాలతో గ్రామస్తుల బెంబేలు



పోలీసులను ఆశ్రయించిన బాధితులు

- ఒక్కొక్కరికి రూ.50 వేల వరకూ బాదుడు
- ఓ పోకిరీ చేష్టలతో గ్రామస్తులకు వణుకు

దొడ్డబళ్లాపురం: బెంగళూరు నుంచి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామంలోని వాహనదారులకు బెంగళూరు ట్రాఫిక్ పోలీసుల నుంచి చలాన్లు వస్తూనే ఉన్నాయి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినట్టు అందులో వారి బైక్ ఫోటోలతో సహా ఉంది. సుమారు 60 మందికి చలాన్లు రాగా, మొత్తం విలువ లక్షలాది రూపాయలుగా ఉంది. అయితే వారెప్పుడూ ద్విచక్ర వాహనాల్లో రాజధానికి వెళ్లింది లేదు. కానీ చలాన్లు రావడం చూసి లబోదిబోమన్నారు. ఒక్కొక్కరికి ఏకంగా రూ.50 వేల వరకూ బాదుడు పడింది, గ్రామ వాటర్ మ్యాన్‌కు హెల్మెట్ లేదని రూ.48వేలు జరిమానా వచ్చింది. వణికిపోయిన బాధితులు కనకపుర గ్రామీణ పోలీసుల వద్దకు వెళ్లి మొరపెట్టుకున్నారు. ఎప్పుడూ బెంగళూరుకు వెళ్లకపోయినా చలాన్లు ఎలా వచ్చాయని అడిగారు. పోలీసులు కూడా మొదట అర్థం కాక ఆశ్చర్యం వ్యక్తం చేసారు. తీరా అసలు సంగతి తెలిశాక అవాక్కయ్యారు.

లోకేశ్ చేసిన పని..

గ్రామంలో నివసిస్తూ, బెంగళూరులో ఇంజినీర్‌గా పనిచేస్తున్న లోకేశ్ అనే పోకిరీ యువకుడు దీనంతటికీ కారణమని తెలిసింది. గ్రామస్తులపై ఏదో కారణం చేత కక్ష పెంచుకున్న లోకేశ్ తన ఇంటి ముందు సీసీటీవీ కెమెరా ఏర్పాటు చేసుకుని బైక్‌లు, కార్ల ఫోటోలను కట్ చేసి బెంగళూరు సిటీ పోలీసు (బీసీపీ) యాప్‌లో అప్‌లోడ్ చేసాడు. నాలుగు నెలల నుంచి ఈ దందా చేశాడు. బాధితుల గోడు విన్న సీఐ క్రిష్ణ లమాణి బెంగళూరు పోలీసులతో మాట్లాడి చలాన్లను రద్దు చేసేలా చూస్తానని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

ఘనంగా నారా జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నారా సూర్యనారాయణరెడ్డి

సాక్షి బళ్లారి: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కురుగోడు మాజీ ఎమ్మెల్యే, సమాజ సేవకుడు నారా సూర్యనారాయణరెడ్డి 70వ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. తన జన్మదినాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు కాలనీల్లో అన్నదానం చేశారు. ఆయన తనయుడు, నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డితో కలిసి కేక్ కట్ చేసి పరస్పరం స్వీట్లు పంచుకొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు గాంధీనగర్‌లోని తన కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

బైక్‌ను లారీ ఢీకొని ఇద్దరు మృతి

హుబ్లీ: బైక్, లారీల మధ్య మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కలఘటిగి వైపు నుంచి హుబ్లీ వైపునకు వస్తున్న లారీ వేగాన్ని నియంత్రించలేక హుబ్లీ నుంచి కలఘటిగి వైపునకు వస్తున్న బైక్‌పై బోల్తా పడింది. ఫలితంగా లారీ కింద బైక్ చోదకుడు గఫార్‌సాబ్, వెనుక సీట్లో కూర్చొన్న హుస్సేన్ నబీలపై లారీలో ఉన్న మొక్కజొన్న బస్తాలు పడిపోయాయి. దీంతో వారిద్దరూ గాయపడి ఊపిరి ఆడక మృతి చెందారు. ఘటనపై కలఘటిగి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా బసవేశ్వర రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, భక్తులు

రాయచూరు రూరల్: తాలూకాలోని హొసపేటిలో బసవేశ్వర జాతర, రథోత్సవం వైభవంగా జరిగింది. సోమవారం రాత్రి రథోత్సవాన్ని వందలాది మంది భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ తదితరులు హాజరయ్యారు.

ఓటరుగా పేరు నమోదు చేసుకోండి

రాయచూరు రూరల్: జిల్లాలో ఓటరు జాబితాలో 18 ఏళ్ల వయస్సు నిండిన యువతీ, యువకులు పేర్లు నమోదు చేసుకోవాలని అదనపు జిల్లాధికారి దురుగేష్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరు పేరు నమోదు చేసుకునేందుకు ముందుకు రావాలన్నారు.

హట్టిలో బైపాస్ రోడ్డు నిర్మించరూ



వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

రాయచూరు రూరల్: లింగసూగూరు తాలూకా హట్టిలో బైపాస్ రోడ్డు నిర్మించాలని హిందూ, దళిత సంఘర్ష సమితి అధ్యక్షుడు వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి మాట్లాడారు. హట్టిలో వంతెన నిర్మాణంలో జాప్యం జరగడంతో క్యాంప్ నుంచి హట్టికి వెళ్లడానికి ఇబ్బందులు నెలకొన్నాయన్నారు. అందుకోసం ప్రత్యామ్నాయంగా నిర్మించిన బైపాస్ రోడ్డు అధ్వానంగా మారిందని, దాన్ని పునర్నిర్మించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

పంచాక్షరి మంత్రంతో ప్రశాంతత



మంత్రాన్ని పఠిస్తున్న దృశ్యం

కంప్లి: నిత్యం పంచాక్షరి మంత్ర పఠనంతో మానసిక ప్రశాంతత పొందవచ్చని బాదనహట్టి కరిబసవ శరణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. బాదనహట్టి గ్రామంలోని బ్రహ్మనిష్ఠి బసయ్య తాత మఠంలో ఏర్పాటు చేసిన సోలాపుర సిద్దరామేశ్వర పురాణ ప్రవచనంలో ఆయన ఆశీర్వాదం అందించారు. లింగభస్మం, రుద్రాక్ష ధారణ చేయడం వల్ల రోగాల నుంచి కాపాడుకోవచ్చన్నారు. బాదనహట్టి కే.మౌనేష్ ఆచార్ పురాణ ప్రవచనం అందించగా, కే.మంజునాథ్ పురాణ పఠనం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి వేటలో వలస కూలీల మృత్యుఘోష



ప్రమాదస్థలిలో సహాయక చర్యలు చేపట్టిన దృశ్యం



సహాయక చర్యల్లో పాల్గొన్న పోలీసు, అగ్నిమాపక సిబ్బంది



మృతదేహాలను తరలిస్తున్న పోలీసులు

- మొక్కజొన్న రాశి కింద చిక్కిన కార్మికులు
- ఏడు మంది దుర్మరణం
- విజయపుర జిల్లాలో ఘోరం

సాక్షి, బళ్లారి: ఎక్కడో పరాయి రాష్ట్రం నుంచి వచ్చి కర్మాగారంలో పని చేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నారు. కానీ విధి చిన్నచూపు చూసింది. విజయపుర జిల్లా కేంద్రంలో ఘోర ప్రమాదంలో ఏడుమంది బిహార్ వలస కూలీలు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం రాత్రి రాజ్‌గురు ఇండస్ట్రీస్ మొక్కజొన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో పని చేస్తున్న 11 మంది కార్మికులపై ఒక పెద్ద కంటైనర్ ధ్వంసమై మొక్కజొన్న బస్తాలు పడ్డాయి. ఇవి సుమారు వంద టన్నుల వరకూ బరువు ఉంటాయని అంచనా.

భారీగా సహాయక చర్యలు

పెద్ద మొక్కజొన్న రాశి కింద అందరూ చిక్కుకుపోయారు. వెంటనే జిల్లా యంత్రాంగం జేసీబీలు, బుల్డోజర్లతో సహా పెద్దసంఖ్యలో సహాయక సిబ్బందితో రక్షణ చర్యలు చేపట్టి మంగళవారం మధ్యాహ్నం వరకు నలుగురిని రక్షించారు. మిగతా 7 మంది రాజేష్ ముఖియా (25), సంబు ముఖియా (26), రమ్రీద్ ముఖియా (29), రాంబాలక్ (38), లోకి జాధవ్ (56), కిషన్ కుమార్ (20), దాలచంద (30) అనేవారు అప్పటికే ఊపిరి ఆడక మృతి చెందారు. రక్షించినవారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారిని ఆస్పత్రికి తరలించారు.

రూ.7 లక్షల పరిహారం: మంత్రి

పరిశ్రమల మంత్రి ఎంబీ పాటిల్ ఘటనాస్థలిని పరిశీలించి మాట్లాడారు. పరిశ్రమ యజమాని కిషోర్‌కుమార్ జైన్ నుంచి రూ. 5 లక్షలు, సర్కారు నుంచి రూ. 2 లక్షలు చొప్పున ఒక్కో కుటుంబానికి రూ. 7 లక్షల పరిహారం ఇప్పిస్తామని మంత్రి ప్రకటించారు. గాయపడిన వారికి రూ.2 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చారు. మృతదేహాలను విమానంలో బిహార్‌కు పంపుతామని తెలిపారు. ఫ్యాక్టరీలో ప్రమాదం చోటు చేసుకోవడంతో సిబ్బంది పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఘటనపై ఎస్పీ రిషికేష్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సమాజంలో సౌహార్ధతకే పెద్దపీట

- సీఎం సిద్దరామయ్య



కార్యక్రమంలో పాల్గొన్న సీఎం సిద్దరామయ్యను అభినందిస్తున్న ముస్లిం పెద్దలు

హుబ్లీ: ఎట్టి పరిస్థితిలోను ముస్లింలెవరికీ అన్యాయం జరగడానికి అంగీకరించబోమని, వారి రక్షణకు తమ సర్కారు ఉందని, మైనార్టీ సంక్షేమం, ధార్మిక కేంద్రాల అభివృద్ధికి రూ.10 వేల కోట్లు ఇచ్చామని సీఎం సిద్దరామయ్య తెలిపారు. నగర శివారులోని పాల గ్రామంలో సూఫీ సంతుల సమావేశంలో మాట్లాడారు. తమ ప్రభుత్వంలో పెద్ద, చిన్న అనే భేదం లేదన్నారు. తాము అధికారంలో ఉన్నంత వరకు సమాజంలో సౌహార్ధత నెలకొల్పడానికి కృషి చేస్తామన్నారు. అన్ని మతాలు, ధర్మాలు మానవత్వాన్ని బోధించాయి. ముస్లింలు కూడా ఈ దేశ ప్రజలు. ఈ దేశ సంపదలో వారికీ వాటా ఉంది. అందరికీ సమానంగా సంపదను పంచాలన్నారు. కొన్ని శక్తులు రాజకీయ కారణాలతో సమాజంలో కులమతాల మధ్య విద్వేషాలు రగిలిస్తున్నారు. ఈ విషయంలో ప్రజలు చైతన్యవంతులు కావాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య కోరారు. కార్యక్రమంలో మంత్రులు హెచ్‌కే పాటిల్, సంతోష్ లాడ్, ఎమ్మెల్యేలు ప్రసాద్ అబ్బయ్య, కోనరెడ్డి, సలీం అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సౌకర్యాలచే లబ్ధి పొందాలి



యూనిఫాం పంపిణీ చేస్తున్న దృశ్యం

మాలూరు: పోటీ ప్రపంచంలో ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి దాతలు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని లక్కూరు ప్రభుత్వ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మంజునాథ్ తెలిపారు. మంగళవారం లక్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల సభాంగణంలో సమాజ సేవకుడు, ఏపీఎంసీ మాజీ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరెడ్డి కళాశాల విద్యార్థులకు యూనిఫాం, ఐడీ కార్డులు, విద్యా పరికరాలను అందించే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రామాణికత, క్రమశిక్షణతో మెలగాలని హితవు పలికారు. తల్లిదండ్రులు పిల్లలకు ఇళ్లలో సంస్కారాన్ని నేర్పించాలన్నారు. మొబైల్, టీవీలకు దూరంగా ఉంచాలన్నారు. డిగ్రీ కళాశాల కన్నడ విభాగం ప్రముఖుడు మనోహర్, కళాశాల ఉపన్యాసకుడు డాక్టర్ పి.శేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థిని అనుమానాస్పద మృతి

- కళాశాల ఎదుట కుటుంబ సభ్యుల, బంధువుల ఆందోళన



మేఘన(ఫైల్)



కళాశాల ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

శివమొగ్గ: ఓ విద్యార్థిని కళాశాలలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శివమొగ్గ నగరంలోని కువెంపు రోడ్డులో ఉన్న ఆదిచుంచనగిరి పీయూ కళాశాలలో చోటుచేసుకుంది. మృతురాలు మేఘన (17). వివరాలు... చెన్నగిరి తాలూకా సంతెబెన్నూరు గ్రామానికి చెందిన మేఘన ఆదిచుంచనగిరి విద్యా సంస్థ హాస్టల్లో ఉంటూ చదువుకుంటోంది. మంగళవారం కళాశాలలో పరీక్షలు రాస్తున్న మేఘన వాష్‌రూమ్‌కు వెళ్తున్నానని చెప్పి బయటకు వచ్చింది. అయితే ఆమె మెట్లపై నుంచి జారి పడటంతో హుటాహుటిన శివమొగ్గ నగరంలోని మెగ్గాన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఇదిలా ఉంటే మేఘన కుటుంబ సభ్యులు, బంధువులు కళాశాల వద్దకు వచ్చి గొడవకు దిగారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా తమ కుమార్తె మృతి చెందిందని ఆరోపించారు. ఆమె మరణంపై అనుమానం వ్యక్తం చేశారు. వెంటనే విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు కళాశాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కెప్టెన్ కుటుంబానికి రూ.50 లక్షల చెక్

శివాజీనగర: ఇటీవల జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అమరుడైన సైనిక కెప్టెన్ ఎం.వీ.ప్రాంజల్ కుటుంబానికి బెంగళూరు కలెక్టర్ దయానంద్ రూ.50 లక్షల చెక్కును అందజేశారు. ఆయన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఈ సహాయం ప్రకటించింది.

- సౌధ వద్ద ధర్నా



మంగళవారం బెళగావి నగర శివార్లలోని సువర్ణ సౌధ సమీపంలో తమ డిమాండ్ల సాధన కోసం ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఫ్యాక్టరీలో ప్రమాదం.. కార్మికుడు మృతి

మైసూరు: కర్మాగారంలో యంత్రం పడి కార్మికుడు మృతి చెందిన ఘటన నంజనగూడు పారిశ్రామికవాడలోని కృషి జియో ప్యాక్ సంస్థలో జరిగింది. ఆశిష్ సుఖదాస్ పాట్లె (24) మహారాష్ట్ర నుంచి వలసవచ్చి ఈ సంస్థలో నాలుగేళ్ల నుంచి మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం యంత్రానికి మరమ్మతులు చేస్తుండగా అది పాట్లె తలపై పడడంతో తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. నంజనగూడు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

మొబైల్ ప్రయోగశాలతో విజ్ఞాన పాఠాల బోధన



విజ్ఞాన పాఠాలను బోధిస్తున్న దృశ్యం

కోలారు: కుప్పంకు చెందిన అగస్త్య ఫౌండేషన్ సంస్థ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మొబైల్ ప్రయోగశాల ద్వారా విజ్ఞాన శాస్త్ర విషయాలను నేర్పిస్తుండడం హర్షణీయమని అరాభికొత్తనూరు ప్రభుత్వ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం అరాభికొత్తనూరు ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ విద్యార్థులు మొబైల్ ప్రయోగశాల ద్వారా విజ్ఞాన శాస్త్ర విషయాల అభ్యసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొబైల్ ప్రయోగాలయం విద్యార్థుల అభ్యాసానికి ఎంతో దోహద పడుతుందన్నారు. ఫౌండేషన్‌కు చెందిన కెఎస్ హరీష్, పాఠశాల ఉపాధ్యాయులు సుగుణ, శ్రీనివాసులు, రమాదేవి పాల్గొన్నారు.

చెక్‌పోస్టులు ప్రారంభం



వరిగడ్డిని ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

కంప్లి: పక్క రాష్ట్రానికి వరిగడ్డి రవాణాను అరికట్టేందుకు తాలూకా సరిహద్దు ప్రాంతాల్లో 4 చెక్‌పోస్ట్‌లను ప్రారంభించినట్లు తహసీల్దార్ హెచ్.విశ్వనాథ్ తెలిపారు. ఆయన మంగళవారం తాలూకా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చెక్‌పోస్ట్‌లో రెవెన్యూ సిబ్బంది, ఒక పోలీసు కానిస్టేబుల్ పని చేస్తున్నట్లు తెలిపారు. తమ గడ్డిని తమ వద్దనే మిగుల్చుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ప్రారంభించామన్నారు. వర్షాలు ఒక వైపు కనుమరుగై తాలూకా కరువు కోరల్లో చిక్కుకొని చాలీచాలని వరిగడ్డి దిగుబడి రావడంతో ఆ వచ్చిన దాంట్లో వరి గడ్డిని తమ తాలూకాలోని పశువుల కోసం మిగుల్చుకోవడం ఎంతో ముఖ్యమన్నారు.

భ్రూణహత్యలపై ఆందోళన



ధర్నా చేపట్టిన మహిళా సంఘాల కార్యకర్తలు

మండ్య: ఆడ భ్రూణ హత్యలను వ్యతిరేకిస్తూ పలు మహిళా సంఘాలు మంగళవారం మండ్య నగరంలో ధర్నా చేశారు. జయచామరాజేంద్ర ఒడెయార్ సర్కిల్ వద్దకు ఊరేగింపుగా తరలివచ్చి అక్కడి నుంచి కలెక్టరేట్ వరకూ వెళ్లారు. భ్రూణ హత్యలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లాలోని హాడ్య గ్రామంలో అబార్షన్లు ఎక్కువగా జరిగాయని, ఇది జిల్లాకు మచ్చ అని వాపోయారు. ఆరోగ్య శాఖ అధికారులు మేలుకుని ఆడపిల్లలకు రక్షణ కల్పించాలన్నారు.

సత్ఫలితాలు సాధించండి



మాట్లాడుతున్న సీఈఓ రాహుల్ తుకారాం పాండే

రాయచూరు రూరల్: 2023-24 విద్యా సంవత్సరానికి వచ్చే మార్చి నెలలో జరగనున్న టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే పేర్కొన్నారు. ఆయన మంగళవారం ప్రైవేట్ పాఠశాలలో హైస్కూల్ టీచర్లకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశంలో మాట్లాడారు. గతేడాది కంటే ఈ ఏడాది ఫలితాల్లో రెట్టింపు శాతం సాధించాలని, అధికారులు కూడా విద్యార్థుల నిష్పత్తికి తగ్గట్టుగా ఉపాధ్యాయులను నియమించాలన్నారు. సమావేశంలో డీడీపీఐ బడిగేర్, విద్యాశాఖాధికార్లు సుఖదేవ్, చంద్రశేఖర్, ప్రభు కన్నన్, వెంకటేశ్వరావులున్నారు.

బైక్ దొంగ అరెస్టు



పట్టుబడిన దొంగ, బైకలతో పోలీసులు

చింతామణి: చిక్కబళ్లాపుర పరిసర ప్రాంతాలో మేస్త్రి గంగాధర్ అనే దొంగను అరెస్టు చేసి 8 బైకులను స్వాధీనం చేసుకున్నారు. చింతామణి తాలుకాలోని కంచార్లపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని మిట్టపల్లి క్రాస్ దగ్గర మంగళవారం నిందితున్ని పట్టుకున్నారు. మిట్టపల్లి దగ్గర అనుమానాస్పదంగా బైక్‌పై వెళ్తుండగా పోలీసులు అనుమానం వచ్చి ప్రశ్నించారు. దీంతో చోరీల సంగతి రట్టయింది. ఎస్ఐ శివకుమార్, పోలీసులు పాల్గొన్నారు.

గల్లంతైన పౌర కార్మికులు మృతి

మైసూరు: వరుణ కాలువలో ఈతకు వెళ్లిన ఇద్దరు పౌర కార్మికులు నీట మునిగి మృతి చెందిన ఘటన మైసూరులోని శ్యాదనహళ్లిలో జరిగింది. కుంభారకొప్పలులో నివసించే నందన్, కిరణ్‌లు పాలికెలో పౌర కార్మికులుగా పనిచేస్తున్నారు. శనివారం వరుణ కాలువలోకి ఈతకు వెళ్లిన ఇద్దరూ మళ్లీ కనిపించలేదు. దాంతో కేఆర్ఎస్ పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. కాలువలో నీటి ప్రమాణం తగ్గడంతో మంగళవారం శ్యాదనహళ్లి వద్ద ఇద్దరి మృతదేహాలు కనిపించాయి. శవ పరీక్షలు జరిపి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పాత్రికేయుల కృషి అమోఘం: గవర్నర్

శివాజీనగర: కర్ణాటక పాత్రికేయుల సహకార సంఘం 75వ సంస్థాపక దినాచరణను బెంగళూరులో మంగళవారం గవర్నర్ గెహ్లాట్ ప్రారంభించారు. పాత్రికేయులు రాజ్యాంగంలో నాలుగో స్తంభం. సమాజంలో అట్టడుగు వర్గానికి చెందిన వ్యక్తి కి కూడా న్యాయం చేకూర్చే దిశలో పాత్రికేయుల పాత్ర శ్లాఘనీయం. పాత్రికేయుల ఆర్థిక అభివృద్ధికి దేశంలోనే ఇలాంటి సంస్థ ఉండడం అభినందనీయమని గవర్నర్ అన్నారు. విలేకరుల సమస్యలపై అందరూ స్పందించాలన్నారు. సంఘం అధ్యక్షుడు రమేశ్ పాళ్య, దొడ్డ బొమ్మయ్, మోహన్ కుమార్, ఎం.ఎస్.రాజేంద్రకుమార్, వినోద్‌కుమార్ బీ.నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గనుల దందాపై పరిషత్‌లో రచ్చ

బనశంకరి: అక్రమ గ్రానైట్ తవ్వకాలపై మంగళవారం బెళగావి విధాన పరిషత్‌లో వాగ్వాదం చోటుచేసుకుంది. బీజేపీ సభ్యుడు నారాయణస్వామి మాట్లాడుతూ కోలారులో జరుగుతున్న అక్రమ గ్రానైట్ దందాను ప్రస్తావించారు. అక్రమ గనులు, ఎం శాండ్ ఉత్పత్తి జోరుగా సాగుతోందని, జిల్లాలో 40 క్రషర్లు పనిచేస్తున్నాయని, ఇందులో ఎన్ని అనధికారికమైనవో చెప్పలేదు, అక్రమగనులపై ఎందుకు జరిమానా విధించలేదని సర్కారును ప్రశ్నించారు. మంత్రి చలువరాయస్వామి సమాధానమిస్తూ అక్రమగనులపై జరిమానా విధించారా అనే ప్రశ్నలో ఎమ్మెల్సీ సొంత లాభం ఉందన్నారు. దీనికి నారాయణస్వామి అభ్యంతరం తెలిపారు. మంత్రి మాటలపై జేడీయస్-బీజేపీ సభ్యులు ధర్నాకు దిగడంతో సభాపతి బసవరాజ్ హొరట్టి స్పందించి సొంత ప్రయోజనం అనే పదాన్ని రికార్డుల నుంచి తొలగించాలని సూచించారు.

కోలారు వార్తలు...


ఈఈ ఇంటిపై లోకాయుక్త దాడి



కేజీఎఫ్‌లోని తిమ్మరాయప్ప ఇల్లు

కేజీఎఫ్: రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం లోకాయుక్త నిర్వహించిన దాడుల్లో భాగంగా కేజీఎఫ్‌లోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తిమ్మరాయప్ప ఇంటిపై లోకాయుక్త అధికారులు ఉదయం దాడి నిర్వహించారు. బెళగావిలో విధులు నిర్వహిస్తున్న తిమ్మరాయప్పకు చెందిన కేజీఎఫ్‌లోని ఆయన నివాసంపై లోకాయుక్త అధికారులు దాడి చేశారు. తిమ్మరాయప్ప సంబంధీకుల ఇళ్లపై కూడా లోకాయుక్త అధికారులు ఏకకాలంలో దాడి జరిపారు. అయితే దాడుల్లో అధికారులు స్వాధీనం చేసుకున్నవేంటో మాత్రం ఇంకా బహిరంగ పరచలేదు.

కబ్జాల తొలగింపునకు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: తాలూకాలోని దుగ్గసంద్ర అటవీ భూముల్లో కొందరు నాయకులు సాగించిన ఆక్రమణలను తొలగించడమే కాకుండా వారికి సహకరించి నకిలీ దాఖలాలు సృష్టించిన వారిపై కేసు నమోదు చేయాలని రైతు సంఘం పదాధికారులు మంగళవారం వలయ అటవీ శాఖ అధికారి నవీన్‌ను డిమాండ్ చేశారు. అమాయక రైతులు సాగు చేసుకుంటున్న 2-3 ఎకరాల భూములను నిర్దాక్షిణ్యంగా స్వాధీనం చేసుకునే అటవీ శాఖ అధికారులు వందలాది ఎకరాలను కబ్జా చేసిన బడాబాబుల జోలికి మాత్రం వెళ్లడం లేదని ఆరోపించారు. శ్రీనివాసపురలో అటవీ ఆక్రమణల తొలగింపును జోరుగా సాగించిన అటవీశాఖ అధికారులు క్రమంగా మెత్తబడడానికి కారణమేంటని ప్రశ్నించారు. అటవీ శాఖ అధికారులు ఇకనైనా కళ్లు తెరిచి పక్షపాతరహితంగా అటవీ భూముల్లో ఆక్రమణలను తొలగించాలని వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫారూక్‌పాషా, సునీల్‌కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఆక్రమణల తొలగింపు



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగవేణి

కేజీఎఫ్: గ్రామ స్కెచ్ ప్రకారం కాలువ ఎంత విస్తీర్ణంలో ఉంటుందో గుర్తించి ఆక్రమిత భాగాన్ని తొలగించి తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ నాగవేణి హెచ్చరించారు. మంగళవారం నగరంలోని మెస్కాం సర్వే నెంబరు-100లో గొడనకెరె ప్రభుత్వ కాలువ సర్వేను నిర్వహించి మాట్లాడారు. ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ కాలువను ఆక్రమించుకుని కాంపౌండు నిర్మించినట్లు గత నెలలో నిర్వహించిన జనతా దర్శన్‌లో అధికారులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వేలో ఆక్రమణ అని తెలిస్తే వెంటనే జేసీబీ సహాయంతో ఆక్రమణలు తొలగిస్తున్నామన్నారు. కాలువపై నిర్మించిన ప్రభుత్వ, ప్రైవేట్ కట్టడాల సమాచారాన్ని సంబంధిత శాఖ నుంచి తీసుకుని పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణను బాధ్యతగా తీసుకుంటామన్నారు. సర్వేలో కమిషనర్ పవన్‌కుమార్, నగరాభివృద్ధి కమిషనర్ ధర్మేంద్ర, ఇన్‌స్పెక్టర్ నవీన్ పాల్గొన్నారు.

ఉద్యోగుల అలసత్వం ఖండిస్తూ ధర్నా



నగరసభ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

కోలారు: నగరసభ అధికారులు, సిబ్బంది సకాలంలో ప్రజా సమస్యలపై స్పందించడం లేదని, ప్రజా పనులపై తీవ్ర నిర్లక్ష్యభావంతో ఉన్నారని ఆరోపిస్తూ మంగళవారం పలువురు నగరసభ సభ్యులతో పాటు నగర ప్రజలు నగరసభ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా చేశారు. నగరసభ కార్యాలయంలో అధికారులతో పాటు సిబ్బంది వర్గం ఎవరూ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఆసక్తి కనపర్చడం లేదని, విధులకు ఇష్టారాజ్యంగా ఎప్పుడంటే అప్పుడు వచ్చి వెళుతుంటారని ఆందోళనకారులు ఆరోపించారు. పలువురు సిబ్బంది మధ్యాహ్నం అయిందంటే కార్యాలయంలో కనిపించరని వాపోయారు. నగరసభ సభ్యుడు ఎస్ ఆర్ మురళీగౌడ మాట్లాడుతూ నగరసభ పాలన గాడి తప్పిందన్నారు. సిబ్బంది ఎప్పుడు ప్రశ్నించినా క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్నామని సాకులు చెబుతారన్నారు. కార్యాలయంలో లంచం లేనిదే ఏ పనీ జరగడం లేదన్నారు. రెవిన్యూ విభాగంలో అవినీతి తాండవిస్తోందన్నారు. నగరసభ సభ్యుడు ప్రవీణ్‌గౌడ, వడగూరు రాకేష్, రమేష్, గుణశేఖర్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

ప్రజాప్రభుత్వ వ్యవస్థకు పునాది యువత



పోటీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

కోలారు: యువత భాగస్వాములై క్రియాశీలంగా వ్యవహరించడం ద్వారా ప్రజాప్రభుత్వ వ్యవస్థకు గట్టి పునాదులు వేయాలని, ప్రజల్లో వ్యవస్థపై విశ్వాసం కల్పించాలని జెడ్పీ ఉప కార్యదర్శి శివకుమార్ తెలిపారు. నగరంలోని విద్యార్థులకు ఏర్పాటు చేసిన వివిధ పోటీ పరీక్షలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాప్రభుత్వ వ్యవస్థ కలిగిన దేశంలో యువతరం పాత్ర ఎంతో మహత్తరమైందన్నారు. ఓటర్లు ప్రజాప్రభుత్వ వ్యవస్థ విజయవంతానికి ఓటింగ్ ప్రక్రియలో క్రియాశీలంగా పాల్గొనాలన్నారు. 18 ఏళ్లు పైబడిన ప్రతి విద్యార్థి తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు. జెడ్పీ ప్రణాళికా డైరెక్టర్ రవిచంద్ర మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారందరూ వీహెచ్ఏ యాప్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు తమ స్నేహితులు, ఇరుగు పొరుగు వారి పేర్లను కూడా ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పీయూ విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రప్ప, ఉపన్యాసకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న కావేరి ధర్నా



ధర్నాలో పాల్గొన్న స్థానికులు, రైతు నేతలు

మండ్య: కావేరి నీటిని తమిళనాడుకు విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ మండ్య జిల్లా రైతు హిత రక్షణ సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న నిరాహార దీక్ష 11వ రోజుకు చేరుకుంది. నగరంలోని సర్ ఎంవీ విగ్రహం వద్ద జరుగుతున్న ధర్నాలో మంగళవారం స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు తెలిపారు. ఇక్కడి ప్రజలు సాగు, తాగునీరు లభించక ఇబ్బందులు పడుతుంటే తమిళనాడుకు నీటిని విడుదల చేయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దతుగా స్థానిక బన్నూరు నారాయణ, జయరామేగౌడ, పార్థ, ఎం.వి.కృష్ణప్ప, రంగస్వామి, మేగలకొప్పలు, తమ్మయ్య తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

మనుషుల అక్రమ రవాణాను అరికట్టాలి

మైసూరు: మనుషుల అక్రమ రవాణా ప్రస్తుతం దేశంలో పెద్ద సమస్యగా మారిందని, దీన్ని అరికట్టడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని మైసూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభావతి హీరెమఠ తెలిపారు. మంగళవారం మైసూరు నగరంలోని జిల్లా పంచాయతీ సమావేశం హాల్లో మనుషుల అక్రమ రవాణా విషయంపై ఏర్పాటు చేసిన ఒకరోజు న్యాయ సేవల ప్రాధికార కార్యక్రమాన్ని ప్రారంభించిన న్యాయమూర్తి మాట్లాడుతూ... 21వ శతాబ్దంలో సమాజంలో వివిధ అవసరాల కోసం మనుషులను అనేక రకాలుగా అక్రమంగా రవాణా చేస్తున్నారని, దీన్ని అరికట్టాలన్నారు. ఈనెలలో పది కేసులు నమోదు కావడం ఆవేదన కలిగిస్తోందన్నారు.

సీనియర్ నటులకు సన్మానం




నటులను సన్మానించిన దృశ్యం

బొమ్మనహళ్లి : బెంగళూరు నగరంలోని బవసనగుడి నేషనల్ పీయూ కళాశాల రంగ ప్రయోగశాల ఆవరణంలో కళాశాల వజ్రోత్సవం, నాటక పోటీల ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్ఇఎస్ సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్.హెచ్.ఎస్. సుబ్రమణ్యం అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన కన్నడ నటులు, ప్రముఖ నిర్మాత రమేశ్ భట్, కళాశాల పూర్వ విద్యార్థి, నటుడు, నిర్మాత సుందర్‌రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరిని ఘనంగా సన్మానించారు.

ఆ కౌన్సిలర్‌ను తొలగించాలి

దొడ్డబళ్లాపురం: చెన్నపట్టణ నగరసభ కార్యాలయం ఆవరణలో తనపై దాడికి పాల్పడ్డ 28వ వార్డు కౌన్సిలర్ అబిదాబాను సభ్యత్వాన్ని కలెక్టర్ రద్దు చేయాలని కాంగ్రెస్ కౌన్సిలర్ వాసిల్ అలీఖాన్ డిమాండు చేశారు. చెన్నపట్టణలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల నగరసభలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో కొన్ని ప్రశ్నలు లేవనెత్తినందుకు తనపై కౌన్సిలర్ అబిదాబాను, కుమారుడు సుహేల్ ఇద్దరూ దాడి చేశారన్నారు. అన్ని ఆధారాలను కలెక్టర్‌కు సమర్పించానని, వాటి ఆధారంగా అబిదాబాను సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండు చేసారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు మతిన్, లియాఖత్, సానిక మైనారిటీ నేతలు షబీర్, తౌసిఫ్ తదితరులు హాజరయ్యారు.

రైతులు బ్రహ్మచారులుగా మిగిలిపోతున్నారు



మాట్లాడుతున్న రైతు సంఘం నేతలు

మైసూరు: రైతులను పెళ్లి చేసుకోవడానికి యువతులు ముందుకు రావడం లేదని, ప్రభుత్వం రైతు కుటుంబాలకు ఉద్యోగంలో రిజర్వేషన్ కల్పించడంతో పాటు రైతులను పెళ్లి చేసుకునే వధువుకు రూ. 5 లక్షలు ప్రోత్సాహ ధనం ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బడగలపుర నాగేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మైసూరులో విలేకరులతో మాట్లాడుతూ... అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతిని రైతులు అప్పుల పాలవుతున్నారని, దీంతో రైతు కుటుంబాల్లో పెళ్లిళ్లు కావడం లేదన్నారు. వారు బ్రహ్మచారులుగా మిగిలిపోతున్నారని, వారికి ప్రభుత్వం అండగా నిలవాలన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం

రొళ్ల: మండల పరిధిలోని కె.బ్యాడిగెర గ్రామంలో మంగళవారం వైభవంగా కొల్హాపురి మహాలక్ష్మీదేవికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా సోమవారం సాయంత్రమే గ్రామం నడిబొడ్డున పట్టం కూర్చోబెట్టారు. మహిళలు బియ్యం పిండితో చేసిన జ్యోతులను ఊరేగింపుగా తీసుకుని వచ్చి పట్టం కూర్చోన్న ప్రదేశానికి తరలివెళ్లి చుట్టు ప్రదక్షిణలు చేసి జ్యోతులు సమర్పించారు.

సైబర్ క్రైం క్యాపిటల్‌గా సిలికాన్‌సిటీ

- ఎన్‌సీఆర్‌బి నివేదికలో వెల్లడి
- సైబర్ నేరాల్లో బెంగళూరు టాప్





బనశంకరి: దేశంలో సైబర్ నేరాలు 24 శాతం హెచ్చుమీరగా కర్ణాటక రెండోస్థానంలో ఉంది. మహానగరాలపైకి బెంగళూరు నగరం మొదటిస్థానంలో నిలిచింది. దేశంలో 2021లో 52,974 సైబర్ కేసులు నమోదు కాగా, 2022లో 65,893 కేసులు నమోదయ్యాయి. అంతేగాక ఆర్థిక నేరాలు 11 శాతం, సీనియర్ సిటిజన్ల నేరాలు 9 శాతం, మహిళలపై 4 శాతం నేరాలు పెరిగాయని జాతీయ నేరాల నమోదు సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) ఇటీవల విడుదల చేసిన నివేదికలో వెలుగులోకి వచ్చింది.

తెలంగాణాలో 2022లో 15,297 కేసులు నమోదై మొదటిస్థానంలో నిలిచింది. కర్ణాటకలో 12,556 కేసులు, ఉత్తరప్రదేశ్‌లో 10,117 కేసులు నమోదయ్యాయి. కర్ణాటకలో నమోదైన 12,556 సైబర్‌క్రైం పైకి 11,025 వంచనలు, 338 లైంగిక వేధింపులు, 379 దోపిడీలు, 27 వేధింపులు కేసులు నమోదయ్యాయి. ఇక దేశంలోని మహానగరాలతో పోలిస్తే బెంగళూరు నగరంలో అత్యధిక సైబర్‌క్రైం కేసులు నమోదయ్యాయి. 2021లో 6,423 కేసులు నమోదైతే 2022లో 9,940 కేసులు నమోదు కాబడ్డాయి. అనంతరం ముంబయి 4,724, హైదరాబాద్ 4,436 రెండు, మూడుస్థానాల్లో ఉన్నాయి.

అవినీతి రాష్ట్రంలో కర్ణాటక మూడోస్థానం

మహారాష్ట్ర 749, రాజస్థాన్ 511, కర్ణాటక 389 మూడోస్థానంలో అవినీతిలో ఉంది. మధ్యప్రదేశ్ 294, ఒడిస్సా 287 అవినీతి నియంత్రణ చట్టం కింద కేసులు నమోదయ్యాయి. కర్ణాటక మూడో స్థానంలో ఉంది. ఇందులో 250 ట్రాపింగ్ కేసులు, 56 ఆదాయానికి మించిన ఆస్తుల సంపాదన కేసులు నమోదయ్యాయి.

ఆర్థిక నేరాలు

దేశంలోని మహానగరాలపైకి బెంగళూరు నగరంలో 2021లో 2,715 ఆర్థిక నేరాలు నమోదు కాగా 2022లో 3,245 కేసులు నమోదై 5వ స్థానంలో నిలిచింది. 3083 నకిలీ, వంచన కేసులు, 147 నమ్మకద్రోహం కేసులు నమోదయ్యాయి. మొదటిస్థానంలో ముంబై 6,960, హైదరాబాద్ 6015, జైపూర్ 5332, ఢిల్లీ నగరంలో 5007 కేసులు నమోదైయ్యాయి.

సైబర్‌క్రైం ఆచూకీ కనిపెట్టడంలో లాస్ట్

మహా నగరాల్లో సైబర్ నేరాలు

నగరం	2021	2022
బెంగళూరు నగర	6,423	9,940
ముంబై	2883	4724
హైదరాబాద్	3303	4436
లక్నో	1067	1134
ఢిల్లీ నగర	345	685

సైబర్ నేరాల కేసుల్లో ఆచూకీ కనిపెట్టడంలో కర్ణాటక పోలీసులు వెనుకబడ్డారు. 12,556 కేసుల్లో 612 మంది పురుషులు, 67 మంది మహిళలతో పాటు 679 మంది వంచకులను అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్ పోలీసులు 8,249 కేసుల్లో 15 మంది మహిళలతో పాటు 7,122 మందిని అరెస్ట్ చేసి మొదటిస్థానంలో నిలిచింది. అనంతరం మహారాష్ట్ర 2,582 , తెలంగాణా 2,442 రెండు మూడు స్థానాల్లో ఉండగా కర్ణాటక 11 స్థానంలో ఉంది.

4.45 లక్షల మంది మహిళలపై దౌర్జన్యం

గత ఏడాది దేశంలో 4,45,256 మహిళలపై నేర కార్యకలాపాల కేసులు నమోదు కాగా 2021లో 4,28,278 ఎఫ్ఐఆర్‌లు, 2020లో 3,71,503 కేసులు, 2022లో మహిళలపై నేరాలకు సంబంధించి గంటకు 51 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

ఉత్తరప్రదేశ్‌లో అధికంగా హత్యలు

దేశవ్యాప్తంగా 28,522 హత్యకేసులు నమోదు కాగా ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా నమోదు కాగా సిక్కింలో అతి తక్కువ హత్యకేసులు నమోదైనట్లు ఎన్‌సీఆర్‌బీ నివేదిక తెలిపింది. కానీ ప్రతిరోజు సరాసరి 78 హత్యలు లేదా ప్రతి గంటకు మూడుకు పైగా కేసులు నమోదయ్యాయని ఎన్‌సీఆర్‌బీ నివేదికలో ప్రస్తావించింది.

రూ.10.86 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

- 47 మంది అరెస్ట్

బనశంకరి: మాదక ద్రవ్యాలు విక్రయం, సరఫరాకు పాల్పడుతున్న 8 మంది విదేశీయులతో పాటు 47 మందిని అరెస్ట్ చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ దయానంద్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నవంబరులో సీసీబీ పోలీసులు 59 కిలోల గంజాయి, హాశీశ్అయిల్, ఎండీఎంఏ 18 కిలోలు, అంపెటమైన్, మైదకోలిన్ 15 గ్రాములు, 150 ఎక్స్‌టిసీ, యాబ మాత్రలు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్‌పెడ్లర్లపై 32 కేసులు నమోదు చేసి రూ.10.86 కోట్ల విలువచేసే మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామని సీపీ దయానంద్ తెలిపారు.

కేరళ వ్యక్తి హత్య

శివమొగ్గ: కేరళకు చెందిన ఓ కార్మికుడిని హత్య చేసిన ఘటన శివమొగ్గ జిల్లా సొరబ తాలూకా కట్టినకెరె గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కేరళలోని కణ్ణూరు ప్రాంతానికి చెందిన శిజు (42) హత్యకు గురయ్యాడు. రబ్బరు తోటల్లో పనిచేసే సమయంలో అతని సహచరుడే ఈ హత్య చేసినట్లు తెలుస్తోంది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

నైస్ భూములను వెనక్కి తీసుకుంటాం

బనశంకరి: నైస్ సంస్థకు ఇచ్చిన 554 ఎకరాల భూమిని వెనక్కి తీసుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శరణబస్సగౌడ తెలిపారు. మంగళవారం బెళగావి అసెంబ్లీలో సమావేశంలో ప్రశ్నోత్తరాల సమయంలో బీజేపీ సభ్యుడు మునిరాజుగౌడ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ నైస్ సంస్థకు ఇచ్చిన భూములను వెనక్కి తీసుకునే విషయంలో వెనక్కి తగ్గేది లేదన్నారు. సర్వే జరుగుతోందని, పూర్తయిన వెంటనే స్వాధీనం చేసుకుంటామన్నారు.

చికిత్స లభించక డయాలసిస్ రోగి మృతి

యశవంతపుర: ఉద్యోగ భద్రత, ఇతర డిమాండ్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా డయాలసిస్ సిబ్బంది ఆందోళనలు చేస్తుండటంతో కిడ్నీ రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉత్తర కన్నడ జిల్లాలో చికిత్స లభించక ఓ కిడ్నీ రోగి మృతి చెందాడు. ముండగోడు ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ ఘటన జరిగింది. గుంజావతి గ్రామానికి చెందిన సైయద్ మొహమ్మద్‌గౌస్ (58) రెండు నెలల నుంచి ముండగోడు ఆస్పత్రిలో డయాలిసిస్ చేసుకుంటున్నారు. గత కొద్ది రోజులుగా డయాలసిస్ సిబ్బంది విధుల్లోకి రాకపోవడంతో సరైన సమయానికి చికిత్స లభించక గౌస్ మృతి చెందాడు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్టాపన



పూజలు చేస్తున్న అర్చకులు

తుమకూరు : తుమకూరు నగరంలోని ఏపీఎంసీ యార్డు ఎదురుగా ఉన్న మహాలక్ష్మి లేఔట్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ గోవిందరాజ స్వామి, ఆళ్వార్ ఆచార్యుల విగ్రహాల ప్రతిష్టాపన వేడుకల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 4 నుంచి నాలుగు రోజుల పాటు ఆలయంలో వివిధ ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. తిరుమల వేద పాఠశాలకు చెందిన ప్రధాన గురువులు ఎల్. వెంకటేశన్, జీవీ దీక్షిత్ ఆధ్వర్యంలో 11 మంది వేద పండితులు ఈ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. మంగళవారం ఉదయం నుంచి వివిధ పూజాది కార్యక్రమాలు, హోమాలు చేశారు.

కులం పేరుతో దూషణ, కేసు నమోదు

మైసూరు: ఆలయంలో డప్పు వాయించడానికి నిరాకరించిన వ్యక్తిపై దాడి చేసి కులం పేరుతో దూషించిన ఘటన మైసూరు జిల్లా పిరియా పట్టణ తాలూకా మాకోడు గ్రామంలో జరిగింది. పరమయ్య అనే వ్యక్తి బాధితుడు. ఇతనిపై దాడి చేసిన కుమార్ అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు...బసవేశ్వరస్వామి ఆలయంలో పూజా కార్యక్రమంలో డప్పు వాయించడానికి రావాలని పరమయ్యకు కుమార్ చెప్పాడు. అయితే తాను ఇప్పుడు డప్పు వాయించడం లేదని పరమయ్య చెప్పడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. పరమయ్య కూడా ఎదురు తిరగడంతో దాడి చేసి కులం పేరుతో దూషించాడు. గాయపడిన పరమయ్యను స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరమయ్య కుమారుడు బసవరాజ పిరియా పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అసెంబ్లీలో మాట్లాడతా: కుమార

బనశంకరి: బదిలీలు దందా, ఇతర విషయాలపై ఉభయసభల్లో మాట్లాడతానని, ఒక వేళ వ్యక్తిగతంగా మాట్లాడితే ఊరుకునేదిలేదని మాజీ సీఎం హెచ్‌డీ.కుమారస్వామి హెచ్చరించారు. మంగళవారం సువర్ణసౌధలో విలేకరులతో కుమారస్వామి మాట్లాడుతూ కరువు, ఉత్తర కర్ణాటక అభివృద్ధికి తన ప్రాధాన్యంపై శీతాకాల సమావేశాల్లో ప్రస్తావిస్తానని ఈ ప్రాంత వాసులు అనేక ఆశలతో ఉన్నారని, దీనిపై బీజేపీతో కలిసి పోరాటం చేస్తామన్నారు. జనవరిలో ఉభయసభల సమావేశాల్లో బదిలీలు దందా ఇతర విషయాలపై ప్రస్తావిస్తానని ఒకవేళ వ్యక్తిగత దూషణలకు నేను ఊరుకునేదిలేదన్నారు.

కాంట్రాక్ట్ రద్దు చేయాలి

బనశంకరి: బ్లాక్‌లిస్టులోకి చేరాల్సిన సంస్థలకు పాడిచెత్త సేవలు కాంట్రాక్ట్ కల్పించారని, తక్షణం వీటిని రద్దు చేయాలని బెంగళూరు దక్షిణ జిల్లా బీజేపీ శాఖ అధ్యక్షుడు ఎన్ఆర్.రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎన్ఆర్.రమేశ్ విలేకరులతో మాట్లాడుతూ... 2017 నుంచి 2021 వరకు పాలికె పరిధిలోని వార్డుల్లో ఆర్ఎంఎస్ యజమాని శివస్వామి, వెంకటప్ప ఆనంద యాజమాన్యంలోని రెండు సంస్థలకు పాడిచెత్త పర్యవేక్షకులను కాంట్రాక్టు ఆధారంగా తీసుకోవడాన్ని అప్పగించారు. రెండు సంస్థలు యజమానులకు 2020 మార్చి నెల నుంచి 17 నెలల పాటు పాలికె కాంట్రాక్టు ఆధారంగా విధులు నిర్వహిస్తున్న పాడిచెత్త పర్యవేక్షకులకు సంబంధించి కచ్చితంగా చెల్లించాల్సిన ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బు చెల్లించకుండా పెద్ద ఎత్తున వంచనకు పాల్పడ్డారని ఆరోపణలు వినిపించాయి. అంతేగాక కాంట్రాక్టు అవధి చివరి ఏడు నెలలపాటు పాడిచెత్త పర్యవేక్షకులకు వేతనం చెల్లించలేదు. కానీ పాలికె నుంచి కంపెనీకి అందాల్సిన డబ్బు పూర్తిగా తీసుకుంది. దీనికి సంబంధించి ఈ రెండు సంస్థలను బ్లాక్‌లిస్టులోకి చేర్చాలని 2021 సెప్టెంబరులో ఆధారాలతో సమా సంబంధిత అధికారులకు అందజేశానని ఎన్ఆర్.రమేశ్ తెలిపారు. ఈ రెండు సంస్థలకు అందించిన కాంట్రాక్టును రద్దు చేసి అర్హులకు ఇవ్వాలని ప్రత్యేక కమిషనర్‌ను ఎన్ఆర్.రమేశ్ డిమాండ్ చేశారు.

బీజేపీ నాయకుడిపై చాకుతో దాడి

- కేసు నమోదు

శివాజీనగర: బెళగావిలో బీజేపీ నాయకుడు పృథ్వీసింగ్‌ను చాకుతో పొడిచిన ఘటనకు సంబంధించి చివరకు కేసు నమోదైంది. తండ్రి పృథ్వీ సింగ్ తరపున కుమారుడు జస్విర్ సింగ్ బెళగావి ఏపీఎంసీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ చన్నరాజ్ హట్టిహొళి, సుజీత్ జాధవ్, ఇద్దరు గన్‌మెన్లు, సద్దాంపై ఫిర్యాదు చేశారు. హత్యాయత్నం, కులం పేరుతో దూషణ, ప్రాణ బెదరింపుకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పృథ్వీ సింగ్ చేతికి, వెన్నెముకకు గాయాలు కాగా, కేఎల్ఇ ఆసుపత్రికి తరలించారు. మాజీ మంత్రి రమేశ్ జారకిహొళి అత్యంత సన్నిహితుడిగా ఉన్న పృథ్వీసింగ్‌పై మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ సోదరుడు, కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ చన్నరాజ హట్టిహొళి సన్నిహితుడు దాడి జరిపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కేఎల్ఇ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పృథ్వీసింగ్‌ను విధాన పరిషత్ సభ్యుడు చలవాది నారాయణస్వామి, కేశవ ప్రసాద్ పరామర్శించారు.

ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా పోలీసులపై ఒత్తిడి

బీజేపీ కార్యకర్తపై దాడి కేసులో బెంగళూరులోని ఏడీజీపీ స్థాయి పోలీస్ అధికారులు స్థానిక పోలీసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఒత్తిడి చేస్తున్నారని మాజీ మంత్రి రమేశ్ జారకిహొళి ఆరోపించారు. పృథ్వీసింగ్ దాడి కేసులో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం అనుమానంగా ఉంది. హైదరాబాద్ నుంచి పోలీసులపై ఒత్తిడి వస్తోంది. తనకు వచ్చిన సమాచారం ప్రకారం బెంగళూరులోని ఏడీజీపీ స్థాయి పోలీస్ అధికారులు పోలీసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేయరాదని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ కార్యకర్త పృథ్వీసింగ్ ఆరోగ్యం విచారించిన తరువాత మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన, దురదృష్టకరమైన సంగతి అంటే పోలీసుల చర్యలని అన్నారు. పోలీసులు నిర్లక్ష్యంతో ప్రవర్తిస్తున్నారని రమేశ్ జారకిహొళి ఆరోపించారు. పోలీసులను తాను హెచ్చరిస్తున్నాను. వాస్తవాలు బయటికి రావాలి. తప్పు చేసినవారిపై చర్యలు తీసుకోవాలి. పోలీసులు ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే సీబీఐ తనిఖీకి, హైకోర్టును ఆశ్రయించాల్సి వస్తుందన్నారు.

రూ. 27 లక్షలు టోకరా

మైసూరు: ఆన్‌లైన్ మోసాల గురించి తరచూ వార్తలు వస్తున్నా అమాయకులు జాగృతం కావడం లేదు. తాజాగా ఓ వ్యక్తి రూ. 27 లక్షలు పోగొట్టుకున్న ఘటన మైసూరు నగరంలో చోటుచేసుకుంది. మైసూరు హెబ్బాల్‌కు చెందిన మంజునాథ్‌కు ఓ సైబర్ నేరగాడు ఫోన్ చేసి మా సంస్థలో పెట్టుబడి పెడితే రెండింతల నగదు ఇస్తామని చెప్పడంతో వారు చెప్పిన ఖాతాలకు రూ. 27 లక్షలు బదలాయించాడు. ఆ తరువాత వారి ఫోన్లు స్విచాఫ్ రావడంతో బాధితుడు మోసపోయామని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని ధర్నా



బీబీఎంపీ ఆవరణంలో ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

శివాజీనగర : బృహత్ బెంగళూరు మహానగర పాలికె పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, మేస్త్రీలు, డ్రైవర్లు, సహాయకులు, లోడర్స్‌లను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీబీఎంపీ ఆవరణంలో పారిశుధ్య కార్మికులు ధర్నా చేపట్టారు. ఏళ్ల తరబడిగా అతి తక్కువ వేతనాలతో సేవలు అందిస్తున్నామని, 2018లో అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రభుత్వం కాంట్రాక్ట్ పద్ధతిని తొలగించి బయోమెట్రిక్ పద్ధతిని అమలుపరచి నేరుగా కార్పొరేషన్ ద్వారా జీతాలు అందేటట్లు చేశారు. ఈ విధానం అమల్లోకి వచ్చి ఏడేళ్లు గడచినా కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, దీంతో శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కార్మిక నాయకులు సుబ్బరాయుడు, ఎం.సీ.శ్రీనివాస్, జయరామ్ తదితరులు డిమాండ్ చేశారు. అంతేకాకుండా 25 వేల మంది పౌర కార్మికులను పర్మనెంట్ చేస్తామని కూడా హామీ కూడా ఇచ్చారు. ఈ మేరకు ఇటీవల ఉప ముఖ్యమంత్రి డీ.కే శివకుమార్‌తో కార్మిక సంఘాల నాయకులు భేటీ కాగా, ఇచ్చిన మాట ప్రకారంగా 25 వేల మంది పౌర కార్మికులను పర్మనెంట్ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అందుచేత బెళగావి అసెంబ్లీ సమావేశాల్లో పౌర కార్మికులకు న్యాయం చేసే విధంగా తీర్మానం చేయాలని విన్నవించుకొంటున్నామని తెలిపారు. కార్మికుల సమస్యలపై విడివిడిగా పోరాటం చేస్తూ వస్తున్న 16 కార్మిక సంఘాలు కలసి ఒకే వేదికపై బీబీఎంపీ ఆవరణంలో ఉన్న గ్లాస్‌హౌస్‌లో జనాందోళన అభియాన్‌ను కూడా చేపట్టారు.

హోసూరు వార్తలు..

సేంద్రియ ఎరువులు ఉత్తమం

హోసూరు: రైతులు సేంద్రియ ఎరువులకు పెద్దపీట వేయాలని మంగవారం హోసూరు తాలూకా ఆంలట్టి గ్రామంలో జరిగిన శిక్షణా శిబిరంలో వ్యవసాయ శాఖాధికారులు సూచించారు. హోసూరు వ్యవసాయ శాఖ ఉపడైరక్టర్ భువనేశ్వరి మాట్లాడుతూ ఎక్కువ దిగుబడులకు ఆశపడి రసాయన ఎరువులను వాడడం వల్ల భూసారాన్ని కోల్పోతోందని చెప్పారు. అలాగే పంటలకు నయం కాని తెగుళ్లు సోకుతున్నాయన్నారు. కాబట్టి స్థానికంగా దొరికే కూరగాయలు, ఇతర వృథా పదార్థాలతోనే సేంద్రియ ఎరువులను తయారు చేసుకొని పంటలకు వినియోగించాలని, దీంతో పంట దిగుబడులు పెరుగుతుందని తెలిపారు. సేంద్రియ వ్యవసాయంపై మొగ్గుచూపాలని తెలిపారు. అధికారులు రాసుకణ్ణు, రేణుక, భారతి, సుగుణ, షణ్ముగం తదితరులు పాల్గొని శిక్షణ అందజేశారు.

వివాహిత ఆత్మహత్య

హోసూరు: ప్రేమించి పెళ్లి చేసుకొన్న దంపతుల మధ్య ఏర్పడిన విభేదాలతో జీవితంపై విరక్తి చెందిన మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన బాగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... బాగలూరు సమీపంలోని చూడాపురం గ్రామానికి చెందిన విజయ్, ఆషిక (23) మూడేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకొన్నారు. ఈ నేపథ్యంలో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. సోమవారం రాత్రి కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆషిక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. మృతురాలి సోదరి సుభాషిని బాగలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుక్క మొరిగిందని... వ్యక్తిపై యాసిడ్ దాడి



గాయపడిన సుందర్ (ఫైల్)

యశవంతపుర: కుక్క మొరిగిందనే కోపంలో ఇంటి యజమానిపై యాసిడ్ దాడి చేసిన ఘటన చిక్కమగళూరు జిల్లా ఎన్ఆర్‌పుర తాలూకా హళ్ కరగుంద గ్రామంలో జరిగింది. జేమ్స్ అనే వ్యక్తి, కుక్క యజమాని సుందర్ రాజ్‌పై యాసిడ్ దాడి చేశారు. ఇద్దరు పక్క పక్కల ఇళ్లల్లో ఉంటున్నారు. కొద్ది రోజుల నుంచి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం ఇంటి ముందు వెళ్తున్న జేమ్స్‌ను చూసి కుక్క మొరిగింది. దీంతో తీవ్ర ఆగ్రహంతో జేమ్స్ తన ఇంటిలో బాత్ రూమ్‌లు శుభ్రం చేయడానికి తెచ్చిన యాసిడ్‌ను తీసుకుని సుందర్‌పై చల్లాడు. ముఖభాగం కాలిపోయింది. బాధితుడిని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం శివమొగ్గకు తరలించారు.

లారీ ఢీ, బైకిస్టు దుర్మరణం

మైసూరు: లారీ బైక్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా మల్లన మూలె మఠం వద్ద చోటు చేసుకుంది. మృతుడిని నంజనగూడు చామలాపుర హుండి లేఔట్‌కు చెందిన శంకర్ (61)గా గుర్తించారు. శంకర్ బైక్‌పై వస్తుండగా మల్లన మూలమఠం వద్ద మూల మలుపు వద్ద లారీ వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. గాయపడిన శంకర్‌ను ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అంతటా జయలలిత వర్ధంతి



హోసూరు రాయకోట రోడ్డులో జయలలిత వర్ధంతి కార్యక్రమం



పుష్పాంజలి సమర్పిస్తున్న దృశ్యం

హోసూరు: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలిత 7వ వర్ధంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా అన్నాడీఎంకే నాయకులు, కార్యకర్తలు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. మాజీ మంత్రి పి. బాలక్రిష్టారెడ్డి అధ్యక్షతన పట్టణంలోని 45 వార్డుల్లోనూ జయలలిత చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. బాలక్రిష్టారెడ్డి మాట్లాడుతూ పార్టీ అధినేత్రి జయలలిత రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని, బీద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి, మహిళాభివృద్ధి కోసం జయలలిత ప్రవేశపెట్టిన పథకాలు చిరస్థాయిగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జే.పి. జయప్రకాష్, కుబేరశంకర్, హేమకుమార్, వాసుదేవన్, పార్టీ నాయకులు, పాల్గొన్నారు. సూళగిరి, డెంకణీకోట, కెలమంగలం, అంచెట్టి, తళి, రాయకోట, బాగలూరు, బేరికె ప్రాంతాల్లో కూడా జయలలిత వర్ధంతిని జరుపుకొన్నారు.

బడిలో జయలలితకు నివాళులు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా బేవనత్తం పంచాయతీ కాడులక్కసంద్రం గ్రామంలో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలిత వర్ధంతిని జరుపుకొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన జయలలిత చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. ఉపాధ్యాయులు, పిటిఏ సభ్యులు పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

సత్యసాయి సేవా సమితి, నారాయణ నేత్రాలయ సిబ్బంది ఉచిత కంటి చికిత్సా శిబిరంలో ఎంపికైన 23 మంది వృద్ధులకు మంగళవారం ఉచిత కంటి అద్దాలను అందజేశారు. వారికి కంటి పరీక్షలు చేసి అద్దాలు అవసరమని గుర్తించి అందజేశారు.

పాఠశాలలో విజ్ఞాన ప్రదర్శన



కెలమంగలం: డెంకణీకోట తాలూకా బాలతోటపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శన ఆలోచింపజేస్తోంది. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను బయటకు తీసే ఉద్దేశంతో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాల యంత్రాంగం విజ్ఞాన ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో వారు కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ, సోలార్ విద్యుత్ తయారీ, చంద్రయాన్–3 రాకెట్ ఉపయోగాలు, తక్కువ విద్యుత్‌తో ఎల్ఈడీ బల్బులు తదితర అంశాలపై ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయిని హెలన్ నేతృత్వంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను అభినందించారు.

చైన్ స్నాచర్లు అరెస్టు



పట్టుబడ్డ నగలతో పోలీసులు

దొడ్డబళ్లాపురం: ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళలను టార్గెట్‌గా చేసుకుని చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్న నలుగురిని కనకపుర గ్రామీణ పోలీసులు అరెస్టు చేసారు. కనకపుర తాలూకా జవనమ్మనదొడ్డి గ్రామంలో 13 రోజుల క్రితం పద్మమ్మ అనే మహిళ నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన దుండగులు 50 గ్రాముల మాంగల్యం చైను లాక్కెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు కనకపుర తాలూకా విరూపసంద్ర గ్రామానికి చెందిన మంజు అనే వ్యక్తిని అరెస్టు చేసారు. ఇతడిని ఇంటరాగేషన్ చేయగా లక్ష్మీపుర గ్రామానికి చెందిన బసవ, నాడనహళ్లికి చెందిన మనోజ్, ఎరగనహళ్లి ప్రదీప్ కూడా భాగస్వాములని తెలిసింది. పోలీసులు వారిని కూడా అరెస్టు చేసారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీకి విఫలయత్నం

ఉపాధ్యాయుడి ఇంట్లో దొంగలు చోరీకి విఫలయత్నం చేసిన సంఘటన దొడ్డ పట్టణ పరిధిలోని సోమేశ్వర కాలనీలో చోటుచేసుకుంది. స్థానిక నివాసి, ఉపాధ్యాయుడు మునిరాజు ఇంట్లో చోరీయత్నం జరిగింది. సోమవారం రాత్రి మునిరాజు కుటుంబ సమేతంగా ఇంటిపై పోర్షన్‌లో పడుకున్నాడు. కింద ఉన్న ఇంటికి తాళం వేసారు. అర్ధరాత్రి దొంగలు డోర్‌లాక్ తీయడానికి విఫలయత్నం చేసారు. వీలుకాకపోవడంతో వెనుదిరిగారు. చుట్టుపక్కల ఇళ్ల వద్ద కూడా దొంగలు తిరిగినట్టు స్థానికులు తెలిపారు. దొడ్డ పట్టణ పోలీసులు ఇంటిని పరిశీలించారు.


పోలవరం తొలి దశ సవరించిన అంచనా వ్యయం రూ.31,625.36 కోట్లు

ఆమోదించే ప్రక్రియను వేగవంతం చేసిన కేంద్రం

సాక్షి, అమరావతి: పోలవరం జాతీయ ప్రాజెక్టు తొలి దశ సవరించిన అంచనా వ్యయాన్ని ఆమోదించే ప్రక్రియను కేంద్రం వేగవంతం చేసింది. తొలి దశ సవరించిన అంచనా వ్యయం రూ.31,625.36 కోట్లుగా ఖరారు చేస్తూ కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) పంపిన ప్రతిపాదనను మదింపు చేసి సోమవారం కేంద్ర జల్ శక్తి శాఖకు నివేదిక ఇస్తామని రివైజ్డ్ కాస్ట్ కమిటీ (ఆర్సీసీ) చైర్మన్ ఏఎస్ గోయల్ మంగళవారం తెలిపారు. ఆ నివేదిక ఆధారంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఏర్పాటైన ప్రాజెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు (పీఐబీ)కి కేంద్ర జల్ శక్తి శాఖ ప్రతిపాదన పంపుతుంది. పీఐబీ ఆమోద ముద్ర వేస్తే సవరించిన అంచనా వ్యయం మేరకు పోలవరం తొలి దశ పనులకు తాజా ధరల మేరకు కేంద్రం నిధులు మంజూరు చేస్తుంది.

మూడో సారి సమావేశమైన ఆర్సీసీ

తొలి దశ అంచనా వ్యయంపై సీడబ్ల్యూసీ ప్రతిపాదనను మదింపు చేసేందుకు ఆర్సీసీ ఇప్పటికే రెండుసార్లు సమావేశమైంది. మంగళవారం ఢిల్లీలో మూడోసారి సమావేశమైంది. ఆర్సీసీ చైర్మన్, కేంద్ర జల్ శక్తి శాఖ కమిషనర్ (ఎస్పీఆర్) ఏఎస్ గోయల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులైన సీడబ్ల్యూసీ(పీపీవో) పుష్కర్‌సింగ్ కుతియాల్, కేంద్ర ఆర్థిక శాఖ (వ్యయ విభాగం) ప్రధాన సలహాదారు రిచా మిశ్రా, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సభ్య కార్యదర్శి రఘురాం, సీడబ్ల్యూసీ సీఈ (పీఏవో) యోగేష్ పైతంకర్ పాల్గొన్నారు. పోలవరం సీఈ సుధాకర్‌బాబు ప్రత్యేక ఆహ్వానితుడిగా పాల్గొన్నారు. సీడబ్ల్యూసీ ఆమోదించిన ప్రకారం పోలవరం ప్రాజెక్టు తొలి దశ సవరించిన అంచనా వ్యయం రూ.31,625.36 కోట్లని, ఇందులో రూ.16,119.56 కోట్ల పనులు ఇప్పటికే పూర్తయ్యాయని రఘురాం వివరించారు. ఇంకా రూ.15,505.80 కోట్ల విలువైన పనులు మిగిలాయని తెలిపారు. తొలి దశ పనులకు రూ.12,911.15 కోట్లు మంజూరు చేసేందుకు జూన్ 5న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అంగీకరించారని ఆ శాఖ ప్రధాన సలహాదారు రిచా మిశ్రా గుర్తు చేశారు. తొలి దశ పనుల పూర్తికి మంత్రి ఆమోదించిన వ్యయంకంటే అదనంగా రూ.2,594.65 కోట్లు అవసరమని సీడబ్ల్యూసీ తేల్చిందన్నారు. తొలి దశ పనులకు 2013–14 ధరల ప్రకారం ఎంత అవసరం, 2017–18 ధరల ప్రకారం ఎంత అవసరమన్నది మరింత విపులంగా శుక్రవారంలోగా నివేదిక ఇవ్వాలని సీడబ్ల్యూసీని కోరారు.



సీడబ్ల్యూసీ ఆమోదించిన ప్రకారం పోలవరం తొలి దశ సవరించిన అంచనా వ్యయం ఇలా (రూ.కోట్లలో)

పనులు	2023 మార్చి 31కి పూర్తయిన పనుల వ్యయం	మిగిలిన పనుల వ్యయం	మొత్తం వ్యయం
భూసేకరణ	3,143.25	2,125.27	5,268.52
నిర్వాసితుల పునరావాసం	1,878.73	5,677.58	7,556.31
హెడ్ వర్క్స్	7,754.13	6,867.03	14,621.16
ఎడమ కాలువ	1,465.58	782.14	2,247.72
కుడి కాలువ	1,877.87	53.78	1,931.65
మొత్తం	16,119.56	15,505.80	31,625.36

త్వరలో విశాఖలో 'క్యాస్కేడింగ్ స్కిల్స్ పారడైం'

- మంత్రి బుగ్గన వెల్లడి

సాక్షి, అమరావతి: సీఎం జగన్ అధ్యక్షతన త్వరలో విశాఖలో క్యాస్కేడింగ్ స్కిల్స్ పారడైం పేరుతో మెగా ఈవెంట్‌ను నిర్వహించనున్నట్లు రాష్ట్ర మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తెలిపారు. సదస్సు ఏర్పాట్లపై మంగళవారం నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రభుత్వం సాధించిన విజయాలను యువతకు తెలిసేలా విశాఖ సదస్సు ఉండాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించబోయే ఈ ఈవెంట్‌కు ఆహ్వానించాల్సిన పరిశ్రమల జాబితాపైనా చర్చించారు. 'భవిత' శీర్షికన నిర్వహించే కార్యక్రమానికి ట్యాగ్ లైన్‌గా 'షేపింగ్ ఫ్యూచర్'ను ఎంపిక చేశారు. సదస్సు తేదీ, లోగో, స్కిల్ గీతం, ఆహ్వానం, ఫ్లయర్, ఫ్లాగ్, బ్రోచర్, డయాస్ బ్యాక్ డ్రాప్‌ల ఖరారుపై సమీక్షించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఏపీఎస్ఎస్డీసీ ఎండీ, సీఈవో డాక్టర్ వినోద్ కుమార్, సీడాప్ ఎండీ, సీఈవో శ్రీనివాసులు, ఏపీఎస్ఎస్డీసీ ఈడీ దినేశ్ కుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబు నమ్మించి మోసం చేశారు

- టీడీపీ నేత సివేరి అబ్రహం మండిపాటు
- అరకు టీడీపీలో భగ్గుమన్న వర్గ విభేదాలు
- నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి కేటాయింపుపై వ్యతిరేకత

అరకులోయ రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): అరకు నియోజకవర్గ టీడీపీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. దొన్ను దొరకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి కేటాయింపుపై మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ తనయుడు సివేరి అబ్రహం అధిష్టానంపై మండిపడ్డారు. నియోజకవర్గంలోని ముఖ్య అనుచరులు, పార్టీ కార్యకర్తలతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అబ్రహం మాట్లాడుతూ టీడీపీ అధిష్టానం తనకు తీవ్ర అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. 2019లో తాను టీడీపీ టికెట్ ఆశించగా అనివార్య కారణాల వల్ల దివంగత మాజీ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు తనయుడు శ్రావణ్‌కుమార్‌కు కేటాయించి, 2024 ఎన్నికల్లో తనకు తప్పక కేటాయిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. పార్టీని నమ్ముకుని పనిచేస్తే ఇప్పుడు మొండిచెయ్యి చూపించారన్నారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకుల్లో ఏఒక్కరిని సంప్రదించకుండా దొన్నుదొరను అరకు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఏవిధంగా నియమిస్తారన్నారని ధ్వజమెత్తారు. మొదటి నుంచి టీడీపీ కోసం ఎంతో శ్రమించానని, నమ్మించి ఇలా గొంతు కోస్తారని తాను ఊహించలేదని అన్నారు. టీడీపీలో ఉంటే ఇక భవిష్యత్తు ఉండదని తెలుస్తోందన్నారు. దొన్ను దొర వద్దు అబ్రహమే ముద్దు అని ముఖ్య నాయకులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శాస్త్రిబాబు, రైతు సంఘం ఉపాధ్యక్షులు భూషణ్, మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

వాగులో కొట్టుకుపోయిన ఏఈ, లైన్‌మెన్

- కాపాడిన చెట్టు కొమ్మలు

వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): భారీ వర్షాలకు విద్యుత్ సరఫరాలో ఏర్పడిన సమస్యలను పరిశీలించేందుకు అరుదూరు మార్గంలో వెళ్లిన విద్యుత్‌శాఖ ఏఈ శివప్రసాద్, లైన్‌మెన్ కరుణానిధి ఉపకాలువ వద్ద నీటి ఉధృతికి కొట్టుకుపోయారు. వాగు మధ్యలో ఎత్తుగా ఉన్న చెట్టు కొమ్మలు పట్టుకుని చెట్టుపైకి చేరారు. తమ వద్ద ఉన్న సెల్ ఫోన్ ద్వారా దేవాంగ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, తోటి విద్యుత్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు పోలీసులకు విషయం తెలియజేయడంతో ఏఎస్ఐ షణ్ముగం, సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సాయంతో పొడవైన తాడుతో వారిని కాలువ మధ్య నుంచి ఒడ్డుకు చేర్చి ప్రాణాలు కాపాడారు.

కరకట్టకు గండి.. నీట మునిగిన యూనియన్ బ్యాంకు

- తిరుపతి జిల్లా బాలిరెడ్డిపాళెంలో ఘటన

వాకాడు (తిరుపతి జిల్లా): మూడు రోజులుగా స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సోమవారం రాత్రి వాకాడు మండలం బాలిరెడ్డి పాళెం వద్ద కరకట్టకు గండిపడింది. దీంతో సమీపంలోని యూనియన్ బ్యాంకు భవనం నీట మునిగింది. రాత్రి వేళ బ్యాంకులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వెంకట నరసయ్య, ఆయన భార్య సుగుణమ్మ ఉన్నారు. ఒక్కసారిగా వరద బ్యాంకు వద్దకు రావడంతో వారిద్దరూ బ్యాంకు మిద్దెపైకి చేరుకున్నారు. అక్కడే వర్షంలో రాత్రంతా గడిపారు. వారి వద్ద ఉన్న సెల్ ఫోన్‌తో మంగళవారం కలెక్టర్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశారు. స్పందించిన గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్, వాకాడు సీఐ హరికృష్ణ, అగ్నిమాపక శాఖ, రక్షణ బృందాలతో అక్కడికి చేరుకున్నారు. బోట్‌లో ఆ భవనం వద్దకు వెళ్లి వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. బ్యాంకులో డబ్బు, బంగారు ఆభరణాలు, విలువైన పత్రాలు ఉన్నాయి. అలాగే బ్యాంకు పక్కనే ఉన్న శ్రీలత, వసంతమ్మ, సుబ్రహ్మణ్యంలకు చెందిన మూడు మిద్దె ఇళ్లు వరదలో కొట్టుకుపోయాయి.

ఢిల్లీలో వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి ధర్నా

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయలకు ఎస్టీ రిజర్వేషన్ సాధించడం కోసం ఎటువంటి త్యాగాలకైనా సిద్ధపడతామని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కర్నూలు బహిరంగ సభలో ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయలకు ఇచ్చిన హామీని విస్మరించారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి చేసిన సిఫార్సును పార్లమెంటులో ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ పార్లమెంటులో వాల్మీకి బోయల ఎస్టీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించే దాకా కేంద్ర ప్రభుత్వంపై చేస్తున్న ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి రవీంద్ర చౌదరి, ఢిల్లీ వాల్మీకి నేత సుధీర్, వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామ్ భీమ్ నాయుడు ప్రసంగించారు.

రాయలసీమ వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్లకు ఎన్‌బీడబ్ల్యూ

సాక్షి, అమరావతి: కోర్టుధిక్కార కేసులో వ్యక్తిగతంగా హాజరుకానందుకు రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎ.ఆనందరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బైనేని శ్రీనివాసులకు హైకోర్టు మంగళవారం నాన్ బెయిలబుల్ వారెంట్లు (ఎన్‌బీడబ్ల్యూలు) జారీచేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీచేశారు. ఎంఈడీ కళాశాలల గుర్తింపు కోసం గతంలో పలు కాలేజీలు హైకోర్టును ఆశ్రయించాయి. విచారించిన హైకోర్టు ఆ కాలేజీలకు గుర్తింపునివ్వాలని రాయలసీమ విశ్వవిద్యాలయ అధికారులను ఆదేశించింది. వర్సిటీ కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడంతో ఆ కాలేజీలు కోర్టుధిక్కార వ్యాజ్యాలు దాఖలు చేశాయి. ఇందులో రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎ.ఆనందరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బైనేని శ్రీనివాసులను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చాయి. ఈ ధిక్కార వ్యాజ్యాలపై విచారించిన హైకోర్టు.. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎ.ఆనందరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బైనేని శ్రీనివాసుల వ్యక్తిగత హాజరుకు ఆదేశాలిచ్చింది. వారు మంగళవారం హైకోర్టుకు హాజరుకాకపోవడంతో వారికి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీచేశారు.

భార్య, బిడ్డను హత్యచేసిన వ్యక్తికి జీవితఖైదు

రాయచోటి టౌన్: అనుమానమనే పెనుభూతంతో కట్టుకున్న భార్యను, కన్న కొడుకును హతమార్చిన వ్యక్తికి జీవితఖైదు పడింది. పోలీసుల కథనం మేరకు... అన్నమయ్య జిల్లా, సంబేపల్లె మండలం, దుద్యాల గ్రామం, మొరంకిందపల్లెకు చెందిన గుండ్లపల్లె కుమార్ అలియాస్ జయకుమార్ జీవనోపాధి కోసం రాయచోటికి వచ్చాడు. పట్టణంలోని కొత్తపేటలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని భార్య కౌసల్య (26), కుమారుడు భానుప్రకాష్ (2)లతో కలిసి ఉండేవాడు. కూలి పనులకు వెళుతూ జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యంలో తన భార్య ప్రవర్తనపై అనుమానం రావడంతో 2016 ఏప్రిల్, 30వ తేదీన సాయంత్రం ఇంట్లో పడుకొని ఉన్న భార్య, ఆమె ఒడిలో ఉన్న కుమారుడిపై కిరోసిన్ పోసి నిప్పు పెట్టాడు. ఈ ఘటనపై మరుసటిరోజు రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. దీనిపై లోతైన విచారణ జరుపగా, వాస్తవం వెలుగుచూసింది. మంగళవారం జిల్లా కోర్టులో వాదనలు విన్న ఐదో అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి నిందితుడికి జీవిత కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. రూ.3000 జరిమానా కూడా విధించారు.

రాజస్థాన్‌లో ఎమ్మెల్యేగా గెలిచిన బెంగళూరు వ్యాపారి

యశవంతపుర: బెంగళూరులో వస్త్ర వ్యాపారం చేసుకుంటున్న వ్యక్తి రాజస్థాన్‌లో ఎమ్మెల్యేగా గెలిచి అందర్నీ ఆశ్చర్యపరిచారు. రాజస్థాన్‌కు చెందిన పిట్లియా బెంగళూరు ఐటీ సిటీలో రాజాజీనగర్–2 బ్లాక్ జుగనహళ్లిలో నివాసం ఉంటున్నారు. తన కొడుకులతో కలిసి బెంగళూరులో వస్త్ర వ్యాపారం చేస్తున్నారు. రాజస్థాన్‌లో జరిగిన తాజా అసెంబ్లీ ఎన్నికల్లో సహరా నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పిట్లియా పోటీ చేసి విజయం సాధించారు. పిట్లియాకు 1.17 లక్షల ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి రాజేంద్ర త్రివేదికి 54,684 ఓట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు రాజాజీనగర్‌లో ఇద్దరు ఎమ్మెల్యేలంటూ పిట్లియా సోషల్ మీడియాలో సరదాగా ఓ పోస్ట్ చేశారు.

విజయవాడ డివిజన్‌కు రైల్వే వీక్ అవార్డ్స్

- 10 అవార్డులు సొంతం చేసుకున్న డివిజన్
- అధికారులు, సిబ్బందిని అభినందించిన డీఆర్ఎం



డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): గడచిన ఆర్థిక సంవత్సరంలో విజయవాడ డివిజన్‌లోని పలు విభాగాలు అత్యుత్తమ ప్రతిభ కనబరచినందుకు గాను 68వ రైల్వే వీక్ అవార్డ్స్ (విశిష్ట రైల్ సేవా పురస్కార్–2023)లలో ప్రతిష్ఠాత్మక జనరల్ మేనేజర్ ఎఫీషియెన్సీ షీల్డ్‌ను విజయవాడ, సికింద్రాబాద్ డివిజన్‌లు సంయుక్తంగా అందుకున్నాయి. దక్షిణ మధ్య రైల్వేలోని పలు డివిజన్‌లలో రైల్వేశాఖ మొత్తం 35 అవార్డులు ప్రకటించగా అందులో వివిధ విభాగాల్లో విజయవాడ డివిజన్ 10 అవార్డులను కైవశం చేసుకుంది. ఈ సందర్భంగా డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ డివిజన్‌లోని పలు విభాగాల్లో సిబ్బంది ప్రతిభకుగాను అవార్డులు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందికి ఈసందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో డివిజన్ రూ. 5306.58 కోట్లు అత్యధిక ఆదాయం సాధించడంతో పాటు 12.125 టన్నుల లోడింగ్‌తో భారతీయ రైల్వేలోనే రెండోస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.

డివిజన్‌లో అవార్డులు సాధించిన విభాగాలు

ఓవర్ ఆల్ జనరల్ మేనేజర్ ఎఫీషియెన్సీ షీల్డ్‌ను విజయవాడ, సికింద్రాబాద్ డివిజన్‌లు సంయుక్తంగా అందుకోవడంతో పాటు బెస్ట్ డీజిల్/ఎలక్ట్రిక్ లోకో షెడ్ల నిర్వాహణలో గుంతకల్లు డివిజన్‌తో కలిపి విజయవాడ డివిజన్ అవార్డు అందుకుంది. వీటితో పాటు కమర్షియల్, ఫైనాన్స్, వర్క్స్, బ్రిడ్జిలు, రాజమండ్రి మెమో కార్ షెడ్డు, లోడింగ్ పనితీరు, ఆపరేటింగ్, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ విభాగాల్లో కూడా విజయవాడ డివిజన్ అవార్డులు సాధించింది.

కులోన్మాద రాజకీయాలకు చరమగీతం

1,164వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: కులోన్మాదంతో బహుజనులను అణగదొక్కుతున్న బాబు అండ్ కోకు రాజకీయ చరమగీతం తప్పదని, రాబోయే ఎన్నికల్లో బహుజన పక్షపాత ప్రభుత్వమే ఏపీలో విజయఢంకా మోగిస్తుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,164వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సమాన ఫలాలు అందినపుడే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని, ఓ సామాజిక వర్గమే ఎదుగుతూ అందరినీ విస్మరించినందుకే చంద్రబాబుకు ఈ దుస్థితి వచ్చిందన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండి పేదలకు జానెడు జాగా ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఊతమందించలేని బాబు.. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇస్తుంటే చూసి ఓర్వలేక తప్పుడు కేసులతో వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచస్థాయి రాజధాని నిర్మిస్తానని చెప్పి మాటల గారడీ చేసిన బాబు.. అమరావతి ప్రాంత రైతులు, రైతు కూలీల భవిష్యత్తును రోడ్డున పడేసి నిలువునా ముంచాడని మండిపడ్డారు. పేదల హక్కుల సాధనే లక్ష్యంగా కొనసాగుతున్న బహుజన ఉద్యమంతో మూడు రాజధానుల దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుండడం శుభపరిణామమన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, పులి దాసు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక నిపుణుల సూచనలతో పోలవరం పనులు

- సీడబ్ల్యూసీ, పీపీఏ, రాష్ట్ర అధికారులకు కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దిశానిర్దేశం
- పది రోజుల్లోగా తొలి దశ సవరించిన అంచనా వ్యయాన్ని ఖరారు చేస్తామని వెల్లడి
- ప్రాజెక్టు పనులకు నిధుల సమస్యల లేకుండా చూస్తామని భరోసా
- నిపుణుల కమిటీ కోసం టెండర్ నోటిఫికేషన్ జారీ చేశామన్న పీపీఏ చైర్మన్
- పనుల పరీక్షల కోసం స్వీడన్‌కు చెందిన ఆఫ్రిన్ సంస్థతో ఒప్పందం
- ఆఫ్రిన్ నివేదిక ఆధారంగా స్టోన్ కాలమ్స్, డయాఫ్రమ్ వాల్‌పై నిపుణుల కమిటీ సలహాలు
- సీడబ్ల్యూసీ ఆమోదించిన పనులకు డిజైన్లు రూపొందించనున్న నిపుణుల కమిటీ

సాక్షి, అమరావతి: జాతీయ, అంతర్జాతీయ సాంకేతిక నిపుణుల సూచనలు, సలహాలు తీసుకుని పోలవరం ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేయాలని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులకు కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ దిశానిర్దేశం చేశారు. తొలి దశ సవరించిన అంచనా వ్యయాన్ని పది రోజుల్లోగా ఖరారు చేసి, పనులకు నిధుల సమస్య లేకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించి, గడువులోగా పూర్తి చేయడానికి ఈ సీజన్‌లో చేపట్టాల్సిన పనులను ఖరారు చేసేందుకు మంగళవారం ఢిల్లీలో కేంద్ర జల్ శక్తి శాఖ కార్యాలయంలో ఆమె ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్ (డీడీఆర్పీ) చైర్మన్ ఏబీ పాండ్య, సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్ సింగ్ వోరా, పీపీఏ చైర్మన్ శివ్ నందన్‌కుమార్, సభ్య కార్యదర్శి రఘురాంతో పాటు రాష్ట్ర జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్సీ నారాయణరెడ్డి, పోలవరం సీఈ సుధాకర్‌బాబు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పీపీఏ సభ్య కార్యదర్శి రఘురాం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని వివరించారు.

నిపుణుల కమిటీ కోసం పీపీఏ టెండర్లు

ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య గోదావరి వరదల ఉధృతికి కోతకు గురైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ నిర్మాణ ప్రాంతాన్ని యథాస్థితికి తెచ్చేందుకు చేస్తున్న పనులను వివరించారు. ఒక స్టోన్ కాలమ్ 45 నిమిషాల్లో పూర్తి చేయాల్సి ఉండగా 2.30 గంటలు పడుతోందని, దీని వల్ల పనుల్లో జాప్యం జరుగుతోందని తెలిపారు. స్టోన్ కాలమ్స్ వేయడంలో సహకరించేందుకు, డిజైన్లను రూపొందించేందుకు వేస్తామన్న నిపుణుల కమిటీని ఇప్పటిదాకా నియమించలేదని రాష్ట్ర అధికారులు చెప్పారు. డయాఫ్రమ్ వాల్‌లో జాయింట్లను అతికించడంలో కూడా నిపుణుల సలహాలు, సూచనలు అవసరమన్నారు. డయాఫ్రమ్ వాల్, స్టోన్ కాలమ్స్ వేయడంలో దేశంలో నిపుణుల కొరత ఉన్నందున, టెండర్ నోటిఫికేషన్ జారీ చేశామని పీపీఏ చైర్మన్ చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ నిపుణులు కమిటీగా ఏర్పడి ఈ టెండర్‌లో పాల్గొంటారన్నారు. ఆ టెండర్‌ను ఖరారు చేసి నిపుణుల కమిటీని అందుబాటులోకి తెస్తామన్నారు. ఆలోగా డయాఫ్రమ్ వాల్, స్టోన్ కాలమ్స్, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణం సహా హెడ్ వర్క్స్‌లో చేయాల్సిన పరీక్షలను జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో చేయించి, నివేదిక సిద్ధంగా ఉంచాలని సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా ఆదేశించారు. ఆ పరీక్షల కోసం స్వీడన్‌కు చెందిన ఆఫ్రిన్ అనే సంస్థతో కాంట్రాక్టు సంస్థ మేఘా ఇప్పటికే ఒప్పందం చేసుకుందని అధికారులు వివరించారు.

నిపుణుల కమిటీ సలహాతోనే డయాఫ్రమ్ వాల్

ఆఫ్రిన్ సంస్థ పరీక్షల నివేదిక ఆధారంగా పీపీఏ ఖరారు చేసే నిపుణుల కమిటీ స్టోన్ కాలమ్స్‌ను వేగంగా వేయడంపై సలహాలు ఇస్తుంది. ఆ పరీక్షల నివేదిక ఆధారంగా దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, దానికే మరమ్మతులు చేయాలా లేదంటే సమాంతరంగా కొత్త వాల్ నిర్మించాలా అనే అంశంపై సూచనలు చేయనుంది. వాటి ఆధారంగా డయాఫ్రమ్ వాల్ నిర్మాణంపై సీడబ్ల్యూసీ తుది నిర్ణయం తీసుకోనుంది. సీడబ్ల్యూసీ నిర్ణయం ఆధారంగా డయాఫ్రమ్ వాల్ డిజైన్లను నిపుణుల కమిటీ రూపొందిస్తుంది.

అత్యున్నత ప్రమాణాలతో అన్నప్రసాదాలు అందిస్తున్నాం

- టీటీడీ చైర్మన్ భూమన వెల్లడి

తిరుమల: తిరుమలకు ప్రతి రోజు ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే లక్షలాది మందికి టీటీడీ అత్యున్నత ప్రమాణాలతో అన్నప్రసాదాలు అందిస్తోందని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మంగళవారం తెలిపారు. ఇటీవల తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో బియ్యం సరిగా ఉడకలేదని కొందరు భక్తులు ఆందోళన చేసినట్లు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. దాదాపు 700 మందికి సరిపడా ఉన్న హాల్‌లో..15 మంది భోజనం చేస్తోన్న మిగిలిన వారిని రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం పలు అనుమానాలు కలిగిస్తోందన్నారు. ఒక్కొక్కరి ఆహారపు అలవాట్లు ఒక్కో విధంగా ఉంటాయని, స్వామి వారి దగ్గర ప్రతి ఒక్కరూ సంయమనంతో ఉండాలన్నారు. అన్నప్రసాదంలో పొరపాట్లు జరిగి ఉంటే సరిదిద్దుకుంటామని చెప్పారు.

ఏనుగుదాడిలో వ్యక్తి మృతి



మస్తాన్ మృతదేహం

కల్లూరు (చిత్తూరు జిల్లా): ఏనుగు దాడిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చిత్తూరు జిల్లా, పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లెలో మంగళవారం చోటుచేసుకుంది. ఎర్రపాపిరెడ్డిగారి పల్లెకు చెందిన పఠాన్ మస్తాన్(37)ఇతరులతో కలిసి పశువులను మేపుకునేందుకు గ్రామ సమీపంలోని క్రిష్ణమ్మ చెరువు ప్రాంతానికి వెళ్లాడు. అదే సమయంలో ఓ ఏనుగు దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో పక్కనే పశువులు మేపుకుంటున్న వారంతా పరుగులు తీశారు. దాదాపు ఎనిమిది ఏనుగులు గుంపుగా అక్కడికి వచ్చినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, డీఎఫ్ఓ చైతన్య కుమార్‌రెడ్డి, రేంజ్ ఆఫీసర్ థామస్ సుకుమార్, తహసీల్దారు శేషగిరిరావు, ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి, మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, వైస్ ఎంపీపీ రాశిప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వపరంగా అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

52వేల మంది ఆర్టీసీ ఉద్యోగులకు మేలు

- ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి, వేదికపై ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి

చిట్టినగర్ (విజయవాడ పశ్చిమ): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి 52 వేల మంది ఉద్యోగులకు సీఎం వైఎస్ జగన్ మేలు చేశారని ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు చెప్పారు. ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ మహా సభ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌బుజ్జి, ప్రధాన కార్యదర్శి నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వెలంపల్లి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు. వేదికపై ఏర్పాటు చేసిన బీఆర్ అంబేద్కర్, జగజీవన్‌రామ్‌ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెలంపల్లి, మల్లాది విష్ణు మాట్లాడుతూ..ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చినట్లయితే వాటి పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

16 నుంచి పశ్చిమ గోదావరిలో శ్రీనివాస కల్యాణాలు

తిరుపతి(అలిపిరి): శ్రీవారి వైభవాన్ని వ్యాప్తి చేయడంలో భాగంగా టీటీడీ శ్రీనివాస కల్యాణం ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు పశ్చిమ గోదావరి జిల్లాలో శ్రీనివాస కల్యాణాలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఈవో ధర్మారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 16న పాలకొల్లు, 17న యలమంచిలి మండలం కట్టుపాళెం, 18న తణుకు మండలం దువ్వ, 19న తాడేపల్లిగూడెం మండలం పడాల మార్కెట్ యార్డులో శ్రీనివాస కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు.

బాబు కోసం ఇంత బరితెగింపా!?

చంద్రబాబుకు మేలు చేకూర్చేందుకు ప్రభుత్వంపై నిత్యం ఈనాడు విష ప్రచారం



సాక్షి, అమరావతి: ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ ఈనాడు రామోజీరావు బరితెగింపు రోజురోజుకీ మితిమీరుతోంది. తన ఆత్మ చంద్రబాబు వచ్చే ఎన్నికల్లోనైనా గట్టెక్కుతాడో లేదోనన్న అనుమానం ఆయనలో ఎక్కువైపోతోంది. దీంతో తన విషపుత్రిక ఈనాడులో ఏం రాస్తున్నారో కూడా చూసుకోలేని దుస్థితి ఆయనకు దాపురించింది. ఎందుకంటే.. తాజాగా ఈనాడులో 'గుండె గోడు వినపడదా..?' అంటూ మంగళవారం అచ్చేసిన ఓ తప్పుడు కథనం ఆయన పరిస్థితికి అద్దంపడుతోంది. నిజానికి.. వైద్యానికి డబ్బులేక ఏ ఒక్క పేద వ్యక్తి గుండె ఆగిపోకూడదనే సంకల్పంతో సీఎం జగన్ డాక్టర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలుచేస్తున్నారు. రాష్ట్రంతో పాటు, దేశంలోనే వైద్య రంగంలో ఇదొక విప్లవాత్మక పథకమని సాక్షాత్తు నీతిఆయోగ్ సైతం ప్రశంసించింది. కానీ, రామోజీరావుకు మాత్రం ఇది అర్థకాదు. నిత్యం పథకంపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారు. అందులో భాగమే ఈ క్షుద్ర రాతలు. అందులోని వాస్తవాలను పరిశీలిస్తే..

టీడీపీ ప్రభుత్వంలో కేవలం 1,059 ప్రొసీజర్లతో మొక్కుబడిగా ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలుచేశారు. దీంతో అప్పట్లో జబ్బుల బారినపడిన నిరుపేద ప్రజలు ఉచితంగా వైద్యసేవలు అందక నానా అవస్థలు పడ్డారు. చేతి నుంచి డబ్బు ఖర్చుపెట్టి వైద్యం చేయించుకోలేక దేవుడిపై భారం వేసిన దుస్థితి వారిది. ఈ పరిస్థితుల్లో రామోజీ ఏనాడూ వీరి వేదనను పట్టించుకున్న పాపాన పోలేదు. కానీ, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం 3,257 ప్రొసీజర్లతో పథకాన్ని అమలు చేస్తూ, చికిత్స అనంతరం ఆరోగ్య ఆసరా ద్వారా కూడా రోగులకు అండగా నిలుస్తుండడంతో రామోజీ జీర్ణించుకోలేకపోతున్నారు. చంద్రబాబుకు ఇక ఎప్పటికీ అధికారం రాదనే కలవరంతో ఆయన ఇష్టమొచ్చింది చేతికొచ్చినట్లు రాసిపారేశారు.

4.53 లక్షల మందికి ఉచిత గుండె చికిత్సలు..

ఇక గుండె చికిత్సల విషయానికొస్తే.. 2019 నుంచి ఇప్పటివరకు సీఎం జగన్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద ఏకంగా 4,53,486 మంది హృద్రోగ బాధితులకు ఉచితంగా చికిత్స చేయించింది. ఇందుకు రూ.2,074 కోట్లను ఖర్చుచేసింది. ఇందులో..

- 23,789 మందికి కరోనరీ బైపాస్ సర్జరీలకుగాను రూ.278.88 కోట్లు..
- 2,255 మందికి ఇంట్రా కార్డియాక్ రిపేర్ ఆఫ్ ఏఎస్‌డీ సర్జరీకి రూ.17.66 కోట్లు చొప్పున వెచ్చించారు.
- అంతేకాక.. పథకాన్ని బలోపేతం చేయడంలో భాగంగా గత ఏడాది ప్యాకేజీ రివిజన్ ప్రక్రియలో టెక్నికల్ కమిటీ సలహాల మేరకు ఆరోగ్యశ్రీ చికిత్సలను ఆయుష్మాన్ భారత్, వివిధ రాష్ట్రాల ప్యాకేజీలతో సరిపోల్చి చాలావరకూ పెంచారు.

ఒక చికిత్సను మరో చికిత్సతో పోల్చి..

ఈ నేపథ్యంలో.. దేశం మొత్తం ఆరోగ్యశ్రీని ఆదర్శంగా తీసుకుంటుంటే రామోజీ మాత్రం రంధ్రాన్వేషణ చేస్తున్నారు. ఈ పథకంలోని ఒక చికిత్సను ఆయుష్మాన్ భారత్‌లోని మరో చికిత్సతో పోల్చి ప్యాకేజీ రేట్ ఎక్కువ అంటూ అవాస్తవాలతో ప్రజల్లో అపోహలను కలిగించే కార్యక్రమానికి బరితెగించారు. చికిత్సలకు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులు వెనకడుగు వేస్తున్నాయంటూ అడ్డగోలుగా రాసిపారేశారు. ఇదే వాస్తవమైతే గడిచిన నాలుగున్నరేళ్లలో 4.53 లక్షల మందికి పైగా గుండె చికిత్సల కోసం నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చేరిన వారికి ఎక్కడా ఇబ్బందుల్లేకుండా ఎలా చికిత్స జరిగిందో ఆ పెద్దమనిషి రామోజీనే సమాధానం చెప్పాలి.


రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా పురస్కారం..


జ్యోత్స్న ఫణిజ... తెలుగమ్మాయి.
ఢిల్లీ... ఏఆర్ఎస్‌డీలో అసిస్టెంట్ ప్రొఫెసర్.
దేశవిదేశాల్లో అవార్డులందుకున్న కవయిత్రి
మిస్ కాలేజ్... బెస్ట్ హాఫ్ శారీ విజేత.
ర్యాంప్ వాకరే కాదు... మారథాన్ రన్నర్ కూడా.
కర్ణాటక, హిందుస్థానీ సంగీత గాయని...
చిన్న వయసులో డాక్టరేట్ అందుకున్న చదువరి.
స్క్రైబ్ సహాయంతో పరీక్షలు రాసిన జ్యోత్స్న...
ఆత్మస్థయిర్యం... ఆత్మవిశ్వాసమే నా కళ్లు అంటోంది.

తాను అందుకున్న జ్ఞాపికలతో జ్యోత్స్న

మనోనేత్రంతో ముందడుగు...

జ్యోత్స్న ఫణిజ సొంతూరు ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, కైకలూరు. ఆమె పుట్టినప్పుడు ఆమెలోని జన్యు సమస్యను డాక్టర్లు గుర్తించలేకపోయారు. కంటి సమస్య గురించి ఆరు నెలలకు తెలిసింది. మేనరికపు వివాహం కారణంగా ఇలా జరిగిందని, వైద్యచికిత్సలతో ప్రయోజనం లేదన్నారు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ డాక్టర్‌లు. అమ్మాయి చదువు కోసం నర్సాపురంలో ఉన్న స్పెషల్ స్కూలు గురించి కూడా వాళ్లే చెప్పారు. ఊహ తెలిసినప్పటి నుంచి తన జీవనప్రయాణాన్ని సాక్షితో పంచుకున్నారు జ్యోత్స్న ఫణిజ.

అంతులేని ఆప్యాయత

''నా సమస్య తెలిసిన తరవాత ఇంట్లో అందరూ నా గురించి ప్రత్యేక శ్రద్ధ చూపించారు. నా చదువు కోసం అమ్మమ్మ నర్సాపురంలో ఇల్లు తీసుకుని ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు సంరక్షించింది. అమ్మ సాహిత్యాభిలాషి. నన్ను సాహిత్యానికి దగ్గర చేయడానికి కథలు, హిందీ పాటల క్యాసెట్‌లు తెచ్చేది. నాకు అనేక ప్రదేశాలు తెలియడం కోసం తరచూ టూర్‌లకు తీసుకెళ్లేవారు. వాళ్ల కళ్లతో చూసినవన్నీ పూసగుచ్చినట్లు వివరిస్తుంటే నేను మనోనేత్రంతో చూసేదాన్ని. డిగ్రీ వరకు బ్రెయిలీలో చదివాను. డిగ్రీ విజయవాడలోని మేరిస్ స్టెల్లా కాలేజీలో చదివాను. బ్రెయిలీలో త్వరగా పేజీ నిండిపోతుంది. లెక్చరర్‌లు నోట్స్ డిక్టేట్ చేసేటప్పుడు నన్ను గమనిస్తూ నాకు పేపర్ మార్చుకునే విరామం ఇచ్చేవారు. పరీక్ష రాయడానికి కొన్నిసార్లు లెక్చరర్‌లే స్క్రైబ్‌గా సహకరించేవారు. ఎగ్జామ్ రాయడానికి నాకు మామూలు వాళ్లకంటే ఎక్కువ సమయం ఇచ్చేవారు. నా పరీక్ష పూర్తయ్యే వరకు నా ఫ్రెండ్స్ నా కోసం వెయిట్ చేసేవాళ్లు. క్లాస్ మేట్స్ నుంచి క్లాస్ లీడర్, లెక్చరర్‌లు, ప్రిన్సిపల్ అందరూ ఆప్యాయంగా చూశారు. వారందరి సహకారం వల్లే ఇప్పుడు ఈ స్థాయికి చేరగలిగాను. హైదరాబాద్‌లో ఇఫ్లూలో ఎం.ఏ ఇంగ్లిష్ లిటరేచర్, పీహెచ్‌డీ చేశాను. పీజీకి వచ్చిన తర్వాత మొత్తం బ్రెయిలీలో రాయడం కుదరదని టైపింగ్ నేర్చుకున్నాను. దాంతో కంప్యూటర్ ఆపరేట్ చేయడం సులువైంది.


హెల్పర్ సాయంతో మారథాన్‌లో...

చదువుతోపాటు కర్ణాటక, హిందూస్థానీ సంగీతం నేర్చుకుని టీవీ ప్రోగ్రాముల్లో పాటలు పాడాను. కాలేజ్‌లో బ్యూటీ కాంటెస్ట్‌లు, ఫ్యాషన్ ర్యాంప్ వాక్ చేశాను. ఇప్పుడు ఢిల్లీలో కూడా మారథాన్‌లు చేస్తున్నాను. దేనికీ 'నో' చెప్పను. అందరూ చర్మచక్షువులతో చూస్తే నేను మనోనేత్రంతో చూస్తాను. రన్‌లో మాత్రం హెల్పర్‌ల సహాయం తీసుకుంటాను.

పాఠాలు... పేపర్‌లు

ఢిల్లీలో ఏఎస్ఆర్‌డీ కాలేజ్‌లో ఉద్యోగం వచ్చింది. ఇక్కడ కూడా సహోద్యోగులు, ప్రిన్సిపల్, స్టూడెంట్స్ ఎంతగా స్నేహపూర్వకంగా ఉంటారో చెప్పలేను. పాఠాలు చెప్పడంలో ఎటువంటి ఇబ్బంది లేదు. కానీ స్టూడెంట్స్ పేపర్‌లు దిద్దడంలో మాత్రం మా వారి సహకారం తీసుకుంటాను. రొటేషన్‌లో భాగంగా ఇంగ్లిష్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ బాధ్యతలు వచ్చాయి. అప్పుడు కొలీగ్స్ 'చేయలేనని చెప్పకు. అది కెరీర్‌లో పెద్ద అడ్డంకి అవుతుంది. బాధ్యతలు తీసుకో, మేమున్నాం' అన్నారు. ఆ భరోసాతో అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు తీసుకున్నాను. 'నువ్వు పేరుకి ఉంటే చాలు, పని మేము చేసి పెడతాం' అన్నారు. కానీ నా మనసే అంగీకరించలేదు. టైమ్‌టేబుల్ సెట్టింగ్ నుంచి స్టూడెంట్స్ ఎన్‌రోల్‌మెంట్ వరకు స్వయంగా చేశాను. పేపర్ వర్క్ అయితే కష్టమయ్యేదేమో, టెక్నాలజీతో అప్‌డేట్ అవుతుంటాను కాబట్టి మొత్తం డిజిటల్‌గానే చేయగలిగాను.

రాష్ట్రపతి పురస్కారం

ఇంగ్లిష్ పాఠాలు చెప్పడం నా వృత్తి అయితే, ఇంగ్లిష్ సాహిత్యం నా ప్రవృత్తి అని చెప్పవచ్చు. తెలుగులో నాకు నచ్చిన సాహిత్యాన్ని ఇంగ్లిష్‌లోకి అనువాదం చేస్తున్నాను. నెల్లూరులో పెన్నా రైటర్స్ అసోసియేషన్‌కు చెందిన ప్రముఖ రచయిత మోపూరు పెంచల నరసింహం గారి ఎర్రదీపం రచనను క్రిమ్‌సన్ ల్యాంప్ పేరుతో, రాతిపాటను స్టోన్‌సాంగ్ పేరుతో అనువదించాను. వివిధ సామాజికాంశాల మీద జర్నల్స్‌లో 12 వ్యాసాలు రాశాను. రచయితల సదస్సుకు హాజరవుతుంటాను. రచయితల నుంచి 'దృష్టిలోపం' అనే ఇతివృత్తం ఆధారంగా రచనలను ఆహ్వానించి ప్రచురించడం, కలకత్తా రైటర్స్ వర్క్‌షాప్‌లో పోయెట్రీ కలెక్షన్‌ను ప్రచురించడంలో కీలకంగా పని చేశాను. డిసెంబర్ మూడవ తేదీ ఇంటర్నేషనల్ డిజేబులిటీ డే సందర్భంగా 2017లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌గారి చేతుల మీదుగా 'రోల్‌మోడల్' జాతీయ పురస్కారం అందుకోవడం, ప్రధానమంత్రి నుంచి ప్రశంసాపూర్వకమైన అధికారిక ఉత్తరం అందుకోవడం మాటల్లో చెప్పలేని ఆనందం. ఏడు కవితలకు అవార్డులు వచ్చాయి. అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ, హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్, నాటా సభలకు ఆహ్వానం, దర్భంగా, మైథిలీ రీజియన్‌లో కుల అణచివేత, ఆదివాసీ సాహిత్యం, దళితుల సమస్యల మీద రాయడం... వంటివి నేను నా జీవితాన్ని ఆదర్శవంతంగా జీవిస్తున్నాననే సంతోషాన్ని కలిగించిన సందర్భాలు. స్ట్రీట్ చిల్డ్రన్ గురించి రాసిన 'వీధిచుక్క' రచనకు తెలుగు వాళ్ల నుంచి అందుకున్న ప్రశంసలకు లెక్కలేదు.

అందమైన కుటుంబం

కుటుంబం విషయానికి వస్తే... డిగ్రీ కాగానే పెళ్లయింది. మా వారు బంధువులబ్బాయే. ఆయనది ఫైనాన్స్ సెక్టార్. పెళ్లి తర్వాత హైదరాబాద్‌లో కాపురం ఉన్నాం. అప్పుడు పీజీ, పీహెచ్‌డీ చేశాను. నాకు ఢిల్లీలో ఉద్యోగం రావడంతో ఇద్దరు పిల్లలతో ఢిల్లీలో ఉంటున్నాం. ఇక్కడకు వచ్చిన తర్వాత ఫ్రెంచ్‌లో అడ్వాన్స్‌డ్ డిప్లమో చేశాను. నిత్యం చదువుతూ, రాస్తూ ఉండడం ఇష్టం. అలాగే పిల్లలకు కథలు చెప్పడం ఇంకా ఇష్టం'' అన్నారు జ్యోతి ఫణిజ.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

యూత్ పల్స్

యువతరంలో ప్లాంట్ ఇన్‌ఫ్లూయెన్సర్‌ల సంఖ్య పెరుగుతోంది. 'ఆలోచన-అవగాహన-అధ్యయనం' అనే కాన్సెప్ట్‌తో మొక్కల పెంపకానికి సంబంధించిన సమస్త విషయాలపై లోతైన అధ్యయనం చేస్తున్నారు. 'ప్లాంట్ ఇన్‌ఫ్లూయెన్సర్'గా తాము తెలుసుకున్న విషయాలను సామాజిక మాధ్యమాల ద్వారా నలుగురితో పంచుకుంటున్నారు. ఎంతోమందిని పచ్చదనం వైపు నడిపిస్తున్నారు...



ప్లాంట్ ఇన్‌ఫ్లూయెన్సర్స్

జెనరేషన్ గ్రీన్

ప్రపంచంలోని 25 కాలుష్య బాధిత పట్టణాలలో తొమ్మిది మన దేశంలోనే ఉన్నాయి! ఇదే సమయంలో కాంక్రీట్ జంగిల్స్‌లో మొక్కల ప్రేమికుల సంఖ్య పెరుగుతోంది. గ్రీన్ ఇంటీరియర్ డెకర్ ట్రెండ్ ఊపందుకుంది. దీనికి కారణం ప్లాంట్ ఇన్‌ఫ్లూయెన్సర్‌లు. మొక్కలను ప్రేమించడమే కాదు ఇతరులు కూడా ప్రేమించేలా చేయడంలో, మొక్కల గురించి సమగ్ర సమాచారం తెలుసుకోవడమే కాదు ఇతరులు కూడా తెలుసుకునేలా చేయడంలో ప్లాంట్ ఇన్‌ఫ్లూయెన్సర్‌లు క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు.

'ఇంట్లో పచ్చటి మొక్కలు కనిపిస్తే ఆ అందం, ఆనందమే వేరు' అంటున్నాడు ఆన్‌లైన్ స్టార్టప్ 'లేజీ గార్డెనర్' ఫౌండర్ వినాయక్ గార్గ్. 'మొక్కలకు ఏది మంచిది?' లాంటి ప్రశ్నలు ఫాలోవర్‌ల నుంచి గార్గ్‌కు వస్తుంటాయి,

'గతంలో నర్సరీలకు వెళ్లి అందుబాటులో ఉన్న మొక్కలను కొనేవారు. ఇప్పుడు అలా కాదు. రకరకాల డిమాండ్స్‌తో వస్తున్నారు. స్థానికేతర మొక్కలపై కూడా ఆసక్తి చూపుతున్నారు' అంటున్నాడు గార్గ్.

'మొక్కలకు సంబంధించిన కంటెంట్‌ను పాపులరైజ్ చేయడంలో ప్లాంట్ ఇన్‌ఫ్లూయెన్సర్‌లు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తున్నారు. యువతలో ప్లాంట్ ఇన్‌ఫ్లూయెన్సర్‌ల సంఖ్య పెరుగుతోంది. మొక్కలపై ప్రేమ, వాటికి సంబంధించిన పరిజ్ఞానం అనేది హాబీ మాత్రమే కాదు అంతకు మించిన సామాజిక బాధ్యత' అంటుంది సీమా త్రిపాఠీ. పుణెకు చెందిన సీమ ఆన్‌లైన్ నర్సరీ నిర్వహిస్తోంది.

'గార్డెన్ అప్' పేరుతో యూట్యూబ్ చానల్ నడుపుతోంది ఏక్తా చౌధురి. ఆమె చానల్‌కు 1.5 మిలియన్‌ల సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు. ఈ చానల్ ద్వారా మొక్కల పెంపకానికి సంబంధించిన చిట్కాలు, సలహాలు చెబుతుంటుంది ఏక్తా. ఇండోర్ ప్లాంట్స్‌పై చేసిన వీడియో తన తొలి వైరల్ వీడియో. ఈ వీడియో ఒక మిలియన్ వ్యూస్‌ను దక్కించుకుంది.

'2020లో ఒక మొక్కతో పచ్చటి ప్రయాణం ప్రారంభించిన వారి బాల్కనీ, టెర్రస్‌లలో ప్లాంట్ ఇన్‌ఫ్లూయెన్సర్‌ల ప్రభావం వల్ల ఇప్పుడు 200 వరకు మొక్కలు కనిపిస్తున్నాయి. ఇది నమ్మశక్యం కాని నిజం' అంటుంది ఏక్తా.

హరియాణాకు చెందినఏక్తా చౌధురి ఐఐఎస్‌సీ పబ్లిక్ యూనివర్శిటీ, బెంగళూరులో ఎకాలజీలో పీహెచ్‌డీ స్టూడెంట్. కొన్ని సంవత్సరాల క్రితం తన హాస్టల్ రూమ్‌లో రెండు మూడు మొక్కలు ఉండేవి. ఆ తరువాత ఈ మినీ ప్లాంట్స్ సంఖ్య యాభైకి చేరింది 'గార్డెన్ అప్' చానల్ ద్వారా సక్సెస్ అయిన ఏక్తా రిటైల్ విభాగంలోకి కూడా అడుగుపెట్టింది. 'గార్డెన్ అప్: యువర్ వన్ స్టాప్ గైడ్ టు గ్రోయింగ్ ప్లాంట్స్ ఎట్ హోమ్' పేరుతో పుస్తకం కూడా రాసింది.

ఇండస్ట్రీయల్ ఇంజినీరింగ్‌లో ఎం.టెక్. చేసిన విశాఖ సిన్హాకు మొక్కలు అంటే ఎంతో ఇష్టం. ఆమెకు సొంతంగా నర్సరీ, గార్డెనింగ్ స్టోర్ ఉంది. 'ఇ బగీయా' పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పేజి ఉంది. పెద్దగా శ్రమ అవసరం లేకుండానే మొక్కలను ఎలా పెంచాలో ఇన్‌స్టా ద్వారా చెబుతోంది విశాఖ.

సీఏ స్టూడెంట్ అయిన రక్షా అగర్వాల్‌కు గార్డెనింగ్ అంటే ఇష్టం. ప్లాంట్ ఇన్‌ఫ్లూయెన్సర్ కూడా. ఇన్‌స్టాగ్రామ్‌లో 'గార్డెన్ విత్ హర్' అనే పేజీ ఉంది. ఈ పేజీలోకి వెళితే పచ్చటిమొక్కలు, వాటికి సంబంధించిన సమాచారం కనిపిస్తుంది. మొక్కలు, కూరగాయల పెంపకానికి సంబంధించి వర్క్‌షాప్‌లు కూడా నిర్వహిస్తుంటుంది.

'ఇండోర్‌కు ఎలాంటి మొక్కలు సరిపోతాయి... అనే అంశంపై ఇన్‌స్టాగ్రామ్‌లో ఎన్నో స్టోరీలు చేశాను. ఇండోర్ గార్డెనింగ్ అనేది టఫ్ హాబీ కాదు. మీనియేచర్ ట్రీ గార్డెన్‌లు కూడా పెరుగుతున్నాయి. మొక్కల పెంపకానికి సంబంధించి ప్రాచుర్యంలో ఉన్న కొకేడమ అనే జపనీస్ మెథడ్‌కు ప్రాధాన్యత పెరుగుతోంది. ఇతరులను ఇన్‌స్పైర్ చేయడానికి. తమ పరిసరాలలో పచ్చదనం నింపుకోవడానికి మొక్కలకు సంబంధించిన ఇమేజ్‌లను ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తుంటాను' అంటుంది నవీ ముంబైకి చెందిన యాక్టివ్ ప్లాంట్ ఇన్‌ఫ్లూయెన్సర్ సీమా గుప్తా.

'ఎప్పుడైనా ఒత్తిడిగా అనిపిస్తే మొక్కల మధ్య కూర్చుంటాను. ప్రశాంతంగా అనిపిస్తుంది. మొక్కలలో ఏదో శక్తి ఉంది. ప్లాంట్ ఇన్‌ఫ్లూయెన్సర్‌ల సూచనలను ఫాలో అవుతుంటాను' అంటుంది ఢిల్లీకి చెందిన నందిని.

ఇంజినీరింగ్ స్టూడెంట్ అయిన నందినికి మొదట్లో మొక్కల పెంపకంపై అవగాహన లేదు. అయితే ఒక ఇన్‌ఫ్లూయెన్సర్ యూట్యూబ్ వీడియో చూసిన తరువాత వాటిపై ఆసక్తి పెరగడమే కాదు తన స్టడీ రూమ్‌లో రకరకాల మొక్కలను పెంచుతుంది.

'సోషల్ మీడియా ద్వారా యువతరంలో ఇండోర్ గార్డెనింగ్ హాబీ పెరుగుతోంది. ప్లాంట్ ఇన్‌ఫ్లూయెన్సర్‌లలో ఎక్కువమంది తమ వయసు వారే ఉండడంతో సులభంగా కనెక్ట్ అవుతున్నారు' అంటున్నాడు హార్టికల్చరిస్ట్ అండ్ ల్యాండ్‌స్కేప్ డిజైనర్ షాన్ లాల్వానీ.

ఇరవై నాలుగు సంవత్సరాల అన్వేష్ నాయర్ ప్లాంట్ ఇన్‌ఫ్లూయెన్సర్. అతడి గదిలో రకరకాల అందమైన మొక్కలతోపాటు గోడపై ఉన్న అక్షరాలు కూడా ఆకట్టుకుంటాయి.

'నీ గదిలో ఒక్క మొక్క ఉన్నా సరే పదిమంది స్నేహితులు ఉన్నట్లే'

సమాచార కొరత ఉంది

చాలామందికి మొక్కల పెంపకంపై ఆసక్తి ఉన్నా వాటికి సంబంధించి సమాచార కొరత ఉంది. నేను జీవావరణ శాస్త్రం చదువుకోవడంతో మొక్కలు, పర్యావరణ సంబంధింత విషయాలు, మొక్కల పెంపకంలో ఎదురయ్యే సమస్యల నివారణకు మార్గాలను ఇతరులతో పంచుకోవడానికి గార్డెన్ అప్ ఒక వేదిక అయింది. పచ్చటి మొక్కలు పర్యావరణానికి మేలు చేస్తాయి. మానసిక ప్రశాంతత కలిగిస్తాయి

- ఏక్తా చౌధురి, ప్లాంట్ ఇన్‌ఫ్లూయెన్సర్



మానసిక ప్రశాంతత లభిస్తుంది

మొక్కలను చూస్తే ఆత్మీయులను చూసినట్లుగా అనిపిస్తుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఆత్మస్థైర్యం వస్తుంది. మొదట్లో గార్డెనింగ్‌కు సంబంధించి నాకు పెద్దగా తెలియదు. పొరపాట్ల నుంచి ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. ప్లాంట్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా నేను నేర్చుకున్న విషయాలను పదిమందితో పంచుకుంటున్నాను.

- రక్షా అగర్వాల్, ప్లాంట్ ఇన్‌ఫ్లూయెన్సర్



న్యూస్‌మేకర్

అంగారక గ్రహం పై మానవ నివాస యోగ్యత కోసం సాగుతున్న అన్వేషణలో నాసా ప్రయోగించినరోవర్‌ను ఆపరేట్ చేసే మొదటి ఇండియన్‌గా, మొదటి భారతీయ వనితగా ఘనత సాధించింది బెంగళూరుకు చెందిన అక్షత కృష్ణమూర్తి. నాసాలో పని చేయాలనే ఏకైక లక్ష్యంతో అమెరికా వెళ్లిన అక్షత ఈ స్థాయికి ఎదగడానికి కేవలం పట్టుదలే కారణం అంటోంది. తనను చూసి యువత స్ఫూర్తి పొందాలని కోరుకుంటోంది.

మన అంగారక వనిత

దాదాపు కారు సైజులో ఉండి, వెయ్యి కిలోల బరువు ఉండే 'ప్రెజెర్వరెన్స్ రోవర్' 2021 ఫిబ్రవరి 18న అంగారక గ్రహం మీద దిగినప్పటి నుంచి శాంపిల్స్ సేకరణకు దాదాపు 21 కిలోమీటర్లు తిరిగిందంటే ఆశ్చర్యమే కదా. 1020 రోజులుగా అది అంగారక తలం మీద పని చేస్తూనే ఉందంటే కారణం భూతలం నుంచి దానిని ఆపరేట్ చేస్తున్న నాసా శాస్త్రవేత్తల మేధో శ్రమే. ఇప్పుడు ఆ మేధోశ్రమలో మన భారతీయురాలు కూడా భాగం అయ్యింది. బెంగళూరుకు చెందిన అక్షత కృష్ణమూర్తి లాస్ ఏంజెలెస్‌లోని నాసా జెట్ ప్రొపల్షన్ లాబొరేటరీ నుంచి ప్రెజెర్వరెన్స్ రోవర్‌ను ఆపరేట్ చేయనుంది. ఈ అవకాశం దక్కిన తొలి భారతీయురాలు ఆమె.

చిన్నప్పటి కల

అక్షత కృష్ణమూర్తికి నాసాలో పని చేయాలని చిన్నప్పటి ఉంచి కోరిక. ఇండియాలో చదువుకున్నాక 13 ఏళ్ల క్రితం నాసాలో పని చేయడానికి అమెరికా చేరుకుంది. అయితే భారతీయ పౌరసత్వం కలిగిన ఆమెకు అది అంత సులువుగా సాధ్యమయ్యే పని కాదని మెల్లగా అర్థమైంది. ఎన్నో ప్రయత్నాలు చేసినా ఆమెకు పూర్తి స్థాయి నాసా ఉద్యోగం దొరకలేదు. నాసాలో పని చేసేందుకే మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఏరోనాటిక్స్ అండ్ ఆస్ట్రోనాటిక్స్‌లో పీహెచ్‌డీ చేసింది. ఫిబ్రవరి 2020 నుంచి ఆమెకు నాసాలో ఉద్యోగం దొరికింది. నాసా సైంటిస్ట్‌గా ఆమె చూపించిన ప్రతిభ ఆమె అంగారక గ్రహంపై రోవర్‌ను ఆపరేట్ చేసే స్థాయికి చేర్చింది.



గురి చెదరని కృషి

ఈ సందర్భంగా అక్షత ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక స్ఫూర్తినిచ్చే కథనం రాసింది. 'ప్రయత్నిస్తూనే ఉండండి. మీ కలల సాధ్యాసాధ్యాలపై ఎవరు ఏమన్నా లెక్క చేయకండి. మీ పట్ల మీరు నిజాయితీగా ఉండండి. మీ సామర్థ్యాలను విశ్వసించండి. గురి చెదరని కృషి చేసిన వారినే విజయం అనుసరిస్తుంది. నాసాలో శాస్త్రవేత్తను కావడానికి ఎన్నో ఆటంకాలు ఎదుర్కొన్నాను. వంద తలుపులు తట్టాను. చివరకు సాధించాను. నన్ను చూసి స్ఫూర్తి పొందండి. పెద్దకలలు కనడానికి వెరవకండి.' అని రాసిందామె.

ఒక భారతీయ శాస్త్రవేత్త నాసాలో ఇలాంటి గుర్తింపు పొందడం చూసి వేలాది మంది భారతీయులు ఆమెను అభినందనల్లో ముంచెత్తుతున్నారు.



మార్స్‌పై రోవర్

భూమి తరువాత సౌర కుటుంబం మొత్తమ్మీద మనిషి బతికేందుకు కొద్దో గొప్పో అవకాశాలున్న ఏకైక గ్రహం అంగారకుడు. ఈ కారణంగానే మన ఇస్రో సహా అనేక దేశాల అంతరిక్ష పరిశోధన సంస్థలు అరుణగ్రహంపై బోలెడన్ని ప్రయోగాలు చేపడుతున్నాయి. అగ్రరాజ్యం అమెరికాకు చెందిన నాసా దశాబ్దాలుగా అంగారకుడిపై ప్రయోగాలు నిర్వహిస్తూనే ఉంది. 1971లో సోవియట్ యూనియన్ తొలిసారి మార్స్ లాండర్ -2ను ప్రయోగించినా అది ల్యాండయ్యే సమయంలోనే కుప్పకూలిపోయింది. ఆ తరువాత నాసా 1976లో వైకింగ్-2 లాండర్‌ను విజయవంతంగా ప్రయోగించడంతో అంగారకుడిపై మొట్టమొదటిసారి మానవ నిర్మిత యంత్రం ఒకటి దిగినట్లు అయ్యింది. ఆ తరువాతి కాలంలో కొన్ని రోవర్లు, లాండర్లు మార్స్‌పై అడుగుపెట్టాయి. మూడేళ్ల క్రితం నాసా ప్రయోగించిన రోవర్ ప్రిసెర్వరెన్స్, 2020 జూలై 30న నేలపై నుంచి నింగికి ఎగసిన ఈ రోవర్ ప్రధాన ఉద్దేశం అరుణ గ్రహంపై పాతకాలపు సూక్ష్మజీవుల అవశేషాలేమైనా ఉన్నాయా.... పరిశీలించడం. దీంతోపాటే అక్కడి రాతి, మట్టి నమూనాలను సేకరించి వీలైతే భూమికి తిప్పి పంపడం. ఇందుకు తగ్గట్టుగా ఈ రోవర్‌లో పలు శాస్త్ర సంబంధిత పరికరాలను ఏర్పాటు చేశారు. నాసా ప్రిసెర్వరెన్స్ ఏడు నెలల సుదీర్ఘ ప్రయాణం తరువాత 2021 ఫిబ్రవరి 18న అంగారక గ్రహంపైని జెజిరో లోయలో కాలు మోపింది. ఇంకో గ్రహంపై ఎగిరిన తొలి విమానంగా రికార్డు సృష్టించింది కూడా. జెజిరో లోయ ప్రాంతంలో కొన్ని కోట్ల ఏళ్ల క్రితం నీరు ప్రవహించిందని, సరస్సుల్లాంటివి ఉండేవని శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు.

ఇంటిప్స్




- సెలెరీని సిల్వర్ ఫాయిల్‌లో చుట్టి రిఫ్రిజిరేటర్‌లో పెడితే రెండు మూడు వారాలపాటు తాజాగా ఉంటుంది.



- మిగిలిపోయిన పాలను ఐస్‌ట్రేలో పోసి ఫ్రీజర్‌లో పెట్టాలి. గడ్డకట్టిన పాల బిళ్లలను టీ కాఫీలలో వాడుకోవచ్చు.



- ఒక్కోసారి క్యారట్‌పైన ఎక్కువగా మట్టి పేరుకుపోతుంటుంది. అటువంటప్పుడు .. స్టీల్ స్క్రబర్‌తో రుద్ది కడిగితే, సులభంగా మట్టి వదులుతుంది.



- టొమాటోలను పసుపు నీళ్లల్లో వేసి పదినిమిషాలు ఉంచాలి. తరువాత కడిగి తుడిచిపెట్టుకుంటే ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి.



- కేక్ మిగిలిపోయినప్పుడు అంచులకిరువైపులా బ్రెడ్‌స్లైసులను పెట్టాలి. స్లైసులు పడిపోకుండా టూత్ పిక్ గుచ్చి, రిఫ్రిజిరేటర్‌లో పెడితే కేక్ పాడవకుండా తాజాగా ఉంటుంది.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి!

ఇండియా నుంచి విదేశాల వెళ్లే యువతకు ఉండే అవకాశాలను తెలియజేసేందుకు ఇటీవల బిజినెస్ స్కూల్ 'గ్రాడ్ రైట్' ప్రోగ్రామ్ హైదరాబాద్‌లో జరిగింది. గ్రాడ్యుయేట్స్ తమ ఆసక్తులకు తగిన కోర్సులను ఎంచుకోవడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమం ఇది. ఈ కార్యక్రమంలో అమెరికా నుంచి సదరన్ మెథడిస్ట్ యూనివర్శిటీ ప్రతినిధి జెస్సికా పాల్గొన్నారు. గ్లోబల్ హయ్యర్ ఎడ్యుకేషన్ మీద జరిగిన సదస్సుల్లో భాగంగా ఆమె విదేశాలలో యువతకు ఉండే అవకాశాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా జెస్సికాతో చిట్‌చాట్.

విదేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థుల్లో యువతుల సంఖ్య ఎలా ఉంది?

ఒక్క భారతీయ విద్యార్థులు అనే కాదు, మా బిజినెస్ స్కూల్‌కి అన్ని దేశాల నుంచి విద్యార్థులు ఉన్నారు. మహిళలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో మా స్కూల్ నుంచి కొన్ని ఫౌండేషన్స్ కూడా వర్క్ చేస్తుంటాయి. బిజినెస్ స్కూల్స్‌కి యువకులే కాదు యువతులు కూడా ముందుకు రావాలి అని కూడా చెబుతుంటాం. ఓవరాల్‌గా పర్సెంటేజీ చూస్తే మాత్రం మహిళల శాతం తక్కువే అని చెప్పవచ్చు.

విదేశాలకు వచ్చే విద్యార్థులు ఏ కోర్సులను ఎక్కువ ఎంచుకుంటున్నారు?

సదరన్ మెథడిస్ట్ యూనివర్శిటీ నుంచి నేను వర్క్ చేస్తున్నాను. ఇక్కడ ఇంజినీరింగ్, లా, ఎంబీయే ప్రోగ్రామ్స్... వంటివి ఉన్నాయి. వీటిలో ఎంబీయే ప్రోగ్రామ్స్‌లో ఎక్కువమంది విద్యార్థులు కనిపిస్తుంటారు.

జెండర్ బేస్డ్‌గా రూల్స్ ఎలా ఉంటాయి?

మాస్టర్స్ ప్రోగ్రామ్‌లలో జెండర్ బేస్డ్ అనేది ఏమీ ఉండదు. చదువుకు సంబంధించి ఆడా-మగ ఇద్దరూ ఒకటే. వారి వారి సమర్థతల మీదనే వారి భవిష్యత్తు ఉంటుంది.



జాబ్స్ విషయంలో ఎలా చూస్తారు?

జాబ్స్ విషయంలోనూ అదే విధానం అప్లై అవుతుంది. అయితే, స్టూడెంట్స్ జాబ్స్‌ను ఎంచుకునే విధానం, వ్యక్తిగత ఆసక్తులను బట్టే ఉంటుంది. ముఖ్యంగా స్టూడెంట్స్ సమర్థతపైనే ఆధారపడి ఉంటుంది. ముందస్తుగా మాత్రం స్టూడెంట్ జాబ్స్ మీద యూనివర్శిటీలు అంతగా దృష్టి పెట్టవు. చదువు మీద ఫోకస్ ఉండదని. విద్యార్థుల పని గంటలలో ఒక పరిమితి విధించడానికి కూడా అదే కారణం. లీగల్‌గా అయితే యూనివర్శిటీ క్యాంపస్‌లోనే పనిచేయాలి. ఈ పనుల్లోనూ స్టూడెంట్స్‌కి క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఇస్తుంది. ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ఆ జాబ్స్‌కు కూడా డిఫరెంట్‌గా ఉంటాయి. లైబ్రరీలు, కెఫ్టేరియాలు.. వంటివి. ఇక్కడ కూడా జాబ్స్ లిమిటెడ్‌గానే ఉంటాయి. సెర్చ్ చేస్తూ ఉండాలి. ఎవరికి వారు అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఉండాలి. ఒకసారి యూనివర్శిటీలోకి అడుగుపెట్టామంటే.. ప్రతిరోజూ కనుక్కుంటూనే ఉండాలి.

ఇక్కడ నుంచి వెళ్లే విద్యార్థులకు మీరెలాంటి సలహా ఇస్తారు?

అండర్ గ్రాడ్యుయేషన్ కోర్స్ ఏది చేసినా విదేశాలలో పై చదువులకు ఇప్పుడు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. అయితే, రూల్స్ అండ్ రెగ్యులేషన్స్‌ను బట్టి అప్లై చేసుకోవాలి. విదేశాలకు వెళ్లే విద్యార్థులు చదువుతోపాటు మరో రెండు విషయాలపై ఫోకస్ పెట్టాలి. ఒకటి యూనివర్శిటీకి కట్టే ఫీజు, రెండు బతకడానికి కావల్సిన అమౌంట్. విదేశాల్లో చదువు పూర్తయ్యాక కూడా ఆ తర్వాత మూడేళ్ల వరకు జాబ్‌కు ప్రయత్నం చేయవచ్చు. అయితే, మూడు నాలుగు నెలల్లో ఓపీటీ ని కన్ఫర్మ్ చేసుకోవాలి. ఈ మధ్య చాలామంది ఒత్తిడిని ఎదుర్కొనేవారుంటారు. ఇదంతా ఫోకస్డ్‌గా ఉంటే సమస్య రాదు'' అని చెప్పుకొచ్చారు జెస్సికా.

- నిర్మలారెడ్డి



అశ్విని-తనీషా జోడీ ర్యాంక్‌లో పురోగతి

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) మహిళల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) జోడీ పురోగతి సాధించింది. తాజా ర్యాంకింగ్స్‌లో అశ్విని-తనీషా ద్వయం నాలుగు స్థానాలు మెరుగుపర్చుకొని 28వ ర్యాంక్‌కు చేరుకుంది. గతవారం లక్నోలో జరిగిన సయ్యద్ మోడి ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో అశ్విని-తనీషా జోడీ రన్నరప్‌గా నిలిచింది.

న్యూజిలాండ్‌పై పాక్ తొలిసారి సిరీస్ సొంతం



సమష్టి ప్రదర్శనతో పాకిస్తాన్ మహిళల క్రికెట్ జట్టు తొలిసారి న్యూజిలాండ్ జట్టుపై టి20 సిరీస్‌ను సొంతం చేసుకుంది. డ్యూనెడిన్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో పాక్ పది పరుగులతో నెగ్గి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో దక్కించుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అలియా రియాజ్ (32 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), మునీబా అలీ (35; 6 ఫోర్లు) రాణించడంతో... పాక్ 6 వికెట్లకు 137 పరుగులు చేసింది. అనంతరం న్యూజిలాండ్ 7 వికెట్లకు 127 పరుగులకే పరిమితమైంది.

యువ భారత్ శుభారంభం

- దక్షిణ కొరియాపై 4-2తో విజయం
- అరైజీత్ సింగ్ 'హ్యాట్రిక్'



కౌలాలంపూర్: జూనియర్ పురుషుల అండర్-21 ప్రపంచకప్ హాకీ టోర్నమెంట్‌లో మాజీ చాంపియన్ భారత జట్టు శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన పూల్ 'సి' తొలి మ్యాచ్‌లో టీమిండియా 4-2 గోల్స్ తేడాతో దక్షిణ కొరియాను ఓడించింది. భారత్ తరఫున అరైజీత్ సింగ్ హుండల్ మూడు గోల్స్‌తో 'హ్యాట్రిక్' సాధించాడు. అరైజీత్ 11వ, 16వ, 41వ నిమిషాల్లో గోల్స్ చేశాడు. మరో గోల్‌ను అమన్‌దీప్ (30వ ని.లో) సాధించాడు. కొరియా తరఫున డోహూన్ లిమ్ (38వ ని.లో), మిన్‌క్వాన్ కిమ్ (45వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. రేపు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో స్పెయిన్‌తో భారత్ ఆడుతుంది. మంగళవారమే జరిగిన ఇతర లీగ్ మ్యాచ్‌ల్లో ఫ్రాన్స్ 3-1తో ఈజిప్ట్‌పై, జర్మనీ 5-3తో దక్షిణాఫ్రికాపై, స్పెయిన్ 7-0తో కెనడాపై, అర్జెంటీనా 1-0తో ఆస్ట్రేలియాపై, మలేసియా 7-1తో చిలీపై గెలుపొందాయి.

భారత్ 'పంచ్' పవర్



నిషా



ఆకాంక్ష



పాయల్

- మూడు స్వర్ణాలు సహా మొత్తం 17 పతకాలు సొంతం
- ప్రపంచ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్

యెరెవాన్ (అర్మేనియా): అంతర్జాతీయ వేదికపై మరోసారి భారత బాక్సర్లు తమ పంచ్ పవర్‌ను చాటుకున్నారు. అర్మేనియాలో ముగిసిన ప్రపంచ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మహిళల, పురుషుల విభాగాల్లో కలిసి భారత్ ఖాతాలో మొత్తం 17 పతకాలు చేరాయి. ఇందులో మూడు స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి. చివరిరోజు భారత్‌కు మూడు పసిడి పతకాలు, ఆరు రజత పతకాలు లభించాయి. మూడు స్వర్ణాలూ మహిళా బాక్సర్లే నెగ్గడం విశేషం. పాయల్ (48 కేజీలు), నిషా (52 కేజీలు), ఆకాంక్ష (70 కేజీలు) బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. ఫైనల్స్‌లో పాయల్ 5-0తో హెజినె పెట్రోసియాన్ (అర్మేనియా)పై, నిషా 5-0తో ఫరినోజ్ అబ్దుల్లాఇవా (తజికిస్తాన్)పై, ఆకాంక్ష 5-0తో తైమజోవా ఎలిజవెటా (రష్యా)పై విజయం సాధించారు. ఇతర ఫైనల్స్‌లో వినీ (57 కేజీలు) 0-5తో మమతోవా సెవర (ఉజ్బెకిస్తాన్) చేతిలో... సృష్టి (63 కేజీలు) 0-5తో సియోభ్రా లాలెస్ (ఐర్లాండ్) చేతిలో... అనా బుజులెవా (రష్యా) చేతిలో నాకౌట్ అయిన మేఘ (80 కేజీలు) ఫైనల్లో ఓడిపోయి రజత పతకాలు దక్కించుకున్నారు. పురుషుల విభాగంలో సాహిల్ (75 కేజీలు), హేమంత్ సాంగ్వాన్ (ప్లస్ 80 కేజీలు), జతిన్ (54 కేజీలు) ఫైనల్లో పరాజయం చవిచూసి రజత పతకాలు గెల్చుకున్నారు. సాహిల్ 0-5తో అల్బెర్ట్ హరుతిన్యాన్ (అర్మేనియా) చేతిలో... హేమంత్ 0-5తో సలిఖోవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో... జతిన్ 1-4తో తులెబెక్ (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయారు.

సమరానికి సై...

- నేడు ఇంగ్లండ్ మహిళల జట్టుతో భారత్ తొలి టి20 మ్యాచ్
- రాత్రి 7 గంటల నుంచి 'స్పోర్ట్స్-18'లో ప్రత్యక్ష ప్రసారం



స్మృతి మంధాన

భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్

ఇంగ్లండ్ కెప్టెన్ హీతెర్ నైట్

ముంబై: భారత పురుషుల జట్టు ఇటీవల పొట్టి ఫార్మాట్‌లో ఆస్ట్రేలియాపై అదరగొట్టింది. ఇప్పుడు భారత మహిళల జట్టు కూడా అలాంటి ప్రదర్శనే ఇచ్చేందుకు ఇంగ్లండ్‌తో టి20 సమరానికి సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భాగంగా బుధవారం ఇక్కడి వాంఖెడె స్టేడియంలో తొలి మ్యాచ్ జరుగుతుంది. ఈ ఏడాది హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం ప్రత్యేకించి టి20 ఫార్మాట్‌లో రాణించింది. ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సహా... బంగ్లాదేశ్ గడ్డపై 2-1తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. సఫారీ గడ్డపై జరిగిన ముక్కోణపు టి20 సిరీస్‌లోనూ భారత మహిళల జట్టు మెరుగ్గా రాణించి ఫైనల్లో రన్నరప్‌గా సంతృప్తి పడింది. అక్కడే జరిగిన టి20 ప్రపంచకప్‌లో ఒకే గ్రూప్‌లో ఉన్న భారత్, ఇంగ్లండ్ సెమీఫైనల్ చేరాయి. కానీ ప్రత్యర్థుల చేతిలో ఇరు జట్లు ఓటమి చవిచూశాయి. గతంలో కంటే మెరుగ్గా కనిపిస్తున్న భారత జట్టు ఇప్పుడు ఇంగ్లండ్‌తో పేలవమైన గత రికార్డును మరిచేలా చక్కని ప్రదర్శన ఇవ్వాలనే పట్టుదలతో ఉంది. ఐసీసీ టి20 ర్యాంకుల్లో నాలుగో స్థానంలో ఉన్న భారత్ తమ సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో తొమ్మిది టి20 మ్యాచ్‌లాడితే కేవలం రెండు మ్యాచ్‌ల్లోనే నెగ్గింది. మరోవైపు రెండో ర్యాంకులో ఉన్న ఇంగ్లండ్ జట్టు 1-2తో శ్రీలంక చేతిలో ఓడింది. ఈ అనుకూలతలను వినియోగించుకొని ఫామ్‌లో ఉన్న హర్మన్ బృందం ఈ సిరీస్‌లో గట్టి సవాల్ విసిరేందుకు సన్నద్ధమైంది. పురుషులతో పోల్చితే పరిమిత సంఖ్యలో జరిగే మ్యాచ్‌లతో అమ్మాయిల జట్టు... వచ్చే ఏడాది బంగ్లాదేశ్ ఆతిథ్యమిచ్చే టి20 ప్రపంచకప్‌కు మేటి జట్టుగా బరిలోకి దిగాలని ఆశిస్తోంది. ఓపెనర్ స్మృతి మంధాన, టాపార్డర్‌లో జెమీమా రోడ్రిగ్స్, మిడిలార్డర్‌లో హర్మన్‌ప్రీత్ ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో దీప్తి శర్మ, పూజ వస్త్రకర్ నిలకడగా రాణిస్తున్నారు.

పిచ్, వాతావరణం

వాంఖెడె వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. తూర్పు తీరాన్ని తుఫాను వణికిస్తున్నా... ముంబైలో ఆ బెడద లేదు. మ్యాచ్‌కు వర్షం ముప్పు లేదు. ఈ సిరీస్‌లోని మూడు మ్యాచ్‌లను తిలకించేందుకు ప్రేక్షకులకు ఉచితంగా మైదానంలోకి అనుమతి ఇస్తున్నారు.


27 ఓవరాల్‌గా భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఇప్పటి వరకు 27 టి20 మ్యాచ్‌లు జరిగాయి. 7 మ్యాచ్‌ల్లో భారత్ గెలుపొందగా... 20 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ విజయం సాధించింది. భారత్‌లో ఈ రెండు జట్ల మధ్య తొమ్మిది మ్యాచ్‌లు జరిగాయి. 2 మ్యాచ్‌ల్లో టీమిండియా, 7 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ గెలిచాయి.

రాహుల్ సింగ్ మెరుపు శతకం

- 56 బంతుల్లో 10 ఫోర్లు, 7 సిక్స్‌లతో 105 పరుగులు చేసిన కెప్టెన్
- ఐదు వికెట్లు తీసిన కార్తికేయ
- చివరి లీగ్ మ్యాచ్‌లో మేఘాలయపై హైదరాబాద్ ఘన విజయం



రాహుల్



కార్తికేయ

జైపూర్: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌ను హైదరాబాద్ జట్టు విజయంతో ముగించింది. మేఘాలయ జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొమ్మిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచిన హైదరాబాద్ ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయ 41.1 ఓవర్లలో 158 పరుగులకు ఆలౌటైంది. కార్తికేయ కక్ 36 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి మేఘాలయను కట్టడి చేశాడు. రోహిత్ రాయుడు రెండు వికెట్లు తీశాడు. అనంతరం హైదరాబాద్ కేవలం 18.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 161 పరుగులు సాధించి గెలిచింది. కెప్టెన్ గహ్లోత్ రాహుల్ సింగ్ (56 బంతుల్లో 105 నాటౌట్; 10 ఫోర్లు, 7 సిక్స్‌లు) అజేయ మెరుపు శతకం సాధించి హైదరాబాద్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. రోహిత్ రాయుడు (0) డకౌట్‌కాగా... మరో ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (54 బంతుల్లో 49 నాటౌట్; 8 ఫోర్లు)తో కలిసి రాహుల్ సింగ్ రెండో వికెట్‌కు అజేయంగా 159 పరుగులు జోడించాడు. ఎనిమిది జట్లున్న గ్రూప్ 'బి'లో హైదరాబాద్ తమ ఏడు మ్యాచ్‌లను పూర్తి చేసుకుంది. నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచి, మూడు మ్యాచ్‌ల్లో ఓడిన హైదరాబాద్ 16 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించడంలో విఫలమైంది. గ్రూప్ 'డి'లో పోటీపడ్డ ఆంధ్ర జట్టు ఆరు పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. మంగళవారంతో విజయ్ హజారే ట్రోఫీ లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాయి. హరియాణా, రాజస్తాన్, విదర్భ, కర్ణాటక, ముంబై, తమిళనాడు జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి. మిగిలిన రెండు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ల కోసం ఈనెల 9న ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో బెంగాల్‌తో గుజరాత్; కేరళతో మహారాష్ట్ర తలపడతాయి. ఈ మ్యాచ్‌ల్లో నెగ్గిన రెండు జట్లు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశిస్తాయి.

గుజరాత్ జెయింట్స్ జోరు



అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో గుజరాత్ జెయింట్స్ జట్టు విజయపరంపర కొనసాగుతోంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 39-37తో మాజీ చాంపియన్ యు ముంబా జట్టును ఓడించింది. ఈ లీగ్‌లో గుజరాత్‌కిది వరుసగా మూడో విజయం కావడం విశేషం. రెయిడర్ సోనూ జగ్లాన్ 11 పాయింట్లు స్కోరు చేసి గుజరాత్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు. రాకేశ్ (9 పాయింట్లు), రోహిత్ గులియా (7 పాయింట్లు) కూడా రాణించారు. యు ముంబా తరఫున గుమన్ సింగ్, అమీర్ మొహమ్మద్ పది పాయింట్ల చొప్పున స్కోరు చేసినా కీలకదశలో గుజరాత్ జెయింట్స్ ఆటగాళ్లు పైచేయి సాధించారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో తెలుగు టైటాన్స్‌తో పట్నా పైరేట్స్; యూపీ యోధాస్‌తో హరియాణా స్టీలర్స్ తలపడతాయి.

ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
గుజరాత్ జెయింట్స్	3	3	0	0	15
యు ముంబా	2	1	1	0	6
తమిళ్ తలైవాస్	1	1	0	0	5
పుణేరి పల్టన్	1	1	0	0	5
బెంగాల్ వారియర్స్	1	1	0	0	5
బెంగళూరు బుల్స్	2	0	2	0	2
యూపీ యోధాస్	1	0	1	0	1
జైపూర్ పింక్ పాంథర్స్	1	0	1	0	1
తెలుగు టైటాన్స్	1	0	1	0	1
దబంగ్ ఢిల్లీ	1	0	1	0	0

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

శివాంశిక గెలుపు

సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్-13 చెస్ చాంపియన్‌షిప్ బాలికల విభాగంలో తెలంగాణ అమ్మాయి శివాంశిక వరుసగా మూడో విజయం సాధించింది. మంగళవారం జరిగిన రెండో గేమ్‌లో ధనుష్క (కర్ణాటక)పై, మూడో గేమ్‌లో ప్రియదర్శిని (ఒడిశా)పై శివాంశిక గెలిచింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నీనా గోర్లి, ఆముక్త, శ్రావ్యశ్రీ కూడా వరుసగా మూడు విజయాలు నమోదు చేశారు. ఓపెన్ విభాగంలో కొల్లా భావన్ కూడా వరుసగా మూడు విజయాలతో 'హ్యాట్రిక్' సాధించాడు.

సినిమా

కేరళకు గుంటూరు కారం



మహేశ్‌బాబు

కేరళకు ప్రయాణం కానున్నారు మహేశ్‌బాబు. 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. శ్రీ లీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో మొదలైన ఈ సినిమా తాజా షూటింగ్ షెడ్యూల్ ముగిసిందని తెలిసింది. కొన్ని కీలక సన్నివేశాలతో పాటు మహేశ్‌బాబు, మీనాక్షీ చౌదరి కాంబినేషన్‌లో ఓ పాటను చిత్రీకరించారని సమాచారం. కాగా 'గుంటూరు కారం' నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ కేరళలో ఆరంభం కానుందట. కొంత టాకీ పార్టుతో పాటు మహేశ్‌బాబు, శ్రీలీల కాంబినేషన్‌లో ఓ సాంగ్‌ను ప్లాన్ చేసిందట యూనిట్. నాన్‌స్టాప్‌గా షూటింగ్ జరిపి, ఈ నెలాఖరుకల్లా సినిమాని పూర్తి చేయాలనుకుంటున్నారట. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ నిర్మిస్తున్న 'గుంటూరు కారం' సినిమా జనవరి 12న విడుదల కానుంది.

ప్రతి సినిమా ఓ పరీక్ష

- హేషమ్ అబ్దుల్ వాహబ్



''ఈ ఏడాది నేను సంగీతం అందించిన 'ఖుషి', 'స్పార్క్' చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఇప్పుడు 'హాయ్ నాన్న' రాబోతోంది. ప్రతి సినిమా నాకో పరీక్ష.. ఓ లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్.. ఇక సంగీత దర్శకుడిగా 'హాయ్ నాన్న' నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవడానికి తోడ్పడింది'' అన్నారు హేషమ్ అబ్దుల్ వహాబ్. నాని, మృణాల్ ఠాకూర్ హీరో హీరోయిన్లుగా శ్రుతీహాసన్, బాల నటి కియారా ఖన్నా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'హాయ్ నాన్న'. మోహన్ చెరుకూరి, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ చిత్రం రేపు రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో హేషమ్ అబ్దుల్ వాహబ్ చెప్పిన విశేషాలు.

- ఇటీవల నేను సంగీతం అందించిన సినిమాల్లో ప్రేమకథలే ఎక్కువ. అబ్బాయి, అమ్మాయిల మధ్య ఉండే ప్రేమకథలు ఒకే విధంగా ఉంటాయి. అయితే ఆ కథను దర్శకుడు ఎంత కొత్తగా చూపించారు? అన్నది ముఖ్యం. అలాగే ప్రేమ పాటలు కూడా. ఆ పాటలను ఎవరు పాడారు? ఏ సందర్భంలో పాడారు? ఎలాంటి సాహిత్యం ఉంది? అన్న అంశాలతో కొత్త క్రియేషన్ ఉంటుంది. ఇప్పుడు ఆడియన్స్ చాలా అప్‌డేటెడ్‌గా ఉంటున్నారు. నా మలయాళ సినిమా 'హృదయం'లోని 'దర్శన..', 'హాయ్ నాన్న'లోని 'సమయమా..' పాటలకు శ్రోతలు పోలిక పెడుతున్నారు. అయితే 'దర్శన..' కంటే 'సమయమా..'లో క్లాసిక్ కంపోజిషన్ ఎక్కువగా ఉంటుంది. అయినా.. ఈ రెండు పాటలు నావే. రెండూ వైరల్ అయ్యాయి (నవ్వుతూ).
- 'హాయ్ నాన్న' సాఫ్ట్ రొమాంటిక్ మూవీ. సంగీతం కూడా అంతే సాఫ్ట్‌గా చేశాం. 'సమయమా'.., 'గాజుబొమ్మ', 'అమ్మాడి..' ఇలా సినిమాలోని ప్రతి పాటకూ ప్రాముఖ్యత ఉంది. కథలో ఓ పెద్ద పార్టీలో భాగంగా 'ఓడియమ్మ..' పాట వస్తుంది. ఈ పాటలను శౌర్యువ్ ఆవిష్కరించిన తీరు నన్ను సర్‌ప్రైజ్ చేసింది.
- దాదాపు 40 రోజుల పాటు 15 మంది మ్యూజిషియన్స్‌తో హైదరాబాద్‌లోనే 'హాయ్ నాన్న' కోసం పని చేశాం. మరో 20 మందికి పైగా మ్యూజిక్ ప్లేయర్స్ పాల్గొన్నారు. నిర్మాతలు ఎక్కడా రాజీ పడలేదు. అలాగే ఆర్ఆర్ కోసం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టెక్నాలజీని వాడాం. ఈ తరహాలో ఆర్ఆర్ చేసిన తొలి ఇండియన్ సినిమా 'హాయ్ నాన్న' కావొచ్చేమో. ప్రస్తుతం తెలుగులో రష్మికా మందన్నా 'ది గర్ల్‌ఫ్రెండ్', శర్వానంద్‌గారి సినిమాలకు సంగీతం అందిస్తున్నాను.

కాలర్ ఎగరేసుకుని బయటకు వస్తారు

- నితిన్



సుధాకర్ రెడ్డి, వక్కంతం వంశీ, నితిన్, శ్రీ లీల, రాజశేఖర్, నిఖితా రెడ్డి

''ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' సినిమాలో నేను ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్. కానీ రియల్ లైఫ్‌లో శ్రీ లీల ఎక్స్‌ట్రార్డినరీ ఉమెన్. ఎందుకంటే వ్యక్తిగతంగా తను డాక్టర్. అలాగే స్విమ్మింగ్, హాకీ, కూచిపూడి, భరతనాట్యం, వీణ.. ఇలా ఎన్నో ప్రతిభలు ఉన్నాయి. ఇక సినిమాల్లో మంచి యాక్టర్, డ్యాన్సర్. నాకు, దర్శకుడు వంశీకి ఈ చిత్రం చాలా ముఖ్యం. ఈ మూవీ పెద్ద హిట్ అవ్వాలి.. నిర్మాతలకు లాభాలు రావాలి. సినిమా చూసిన నా అభిమానులు, ప్రేక్షకులు కాలర్ ఎగరేసుకుని థియేటర్ నుంచి బయటకు వస్తారు'' అని హీరో నితిన్ అన్నారు. వక్కంతం వంశీ దర్శకత్వంలో నితిన్, శ్రీ లీల జంటగా నటుడు రాజశేఖర్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్'. రాజ్‌కుమార్ ఆకెళ్ల సమర్పణలో ఎన్. సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో నితిన్ మాట్లాడుతూ– ''ఇప్పటి వరకు నేను చేయని పాత్రని ఈ చిత్రంలో ఇచ్చిన వక్కంతం వంశీకి థ్యాంక్స్. రాజశేఖర్‌గారు హీరోగా చేసిన 'మగాడు' సినిమాతో మా నాన్న (సుధాకర్ రెడ్డి) డిస్ట్రిబ్యూషన్ ఆరంభించారు. ఆ సినిమా హిట్ అవడం వల్లే నాన్న ఇండస్ట్రీలో ఉన్నారు.. ఆయన ఇండస్ట్రీలో ఉన్నారు కాబట్టే నేను హీరోగా ఉన్నాను. రాజశేఖర్ గారు లేకపోతే 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' లేదు'' అన్నారు. ''ఈ చిత్రం సూపర్ హిట్ కాబోతోంది. అందరం సక్సెస్ మీట్‌లో కలుద్దాం'' అని సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి అన్నారు. వక్కంతం వంశీ మాట్లాడుతూ– ''ప్రతి విషయంలో నాకు తోడుగా ఉన్న నితిన్, సుధాకర్ రెడ్డిగార్లకు థ్యాంక్స్. రాజశేఖర్‌గారు లేకుంటే ఈ సినిమాని ఊహించుకునేవాణ్ని కాదు. ఈ మూవీతో రెండున్నర గంటల సేపు కుటుంబాన్ని కడుపుబ్బా నవ్విస్తాం'' అన్నారు. ''ఈ చిత్రంలో నాది అతిథి పాత్ర. నా క్యారెక్టర్ ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు డా. రాజశేఖర్. ''ఈ సినిమా అందర్నీ నవ్విస్తుంది.. థియేటర్లో చూసి ఎంజాయ్ చేయండి'' అన్నారు శ్రీలీల.



సాయి పల్లవి

యశ్‌కు జోడీగా..?

కన్నడ స్టార్ హీరో, 'కేజీఎఫ్' ఫేమ్ యశ్‌కు జోడీగా సాయిపల్లవి నటించనున్నారనే టాక్ శాండిల్‌వుడ్‌లో వినిపిస్తోంది. యశ్ హీరోగా కేవీఎన్ ప్రొడక్షన్స్ ఓ సినిమాను నిర్మించనున్న సంగతి తెలిసిందే. 'కేజీఎఫ్: చాప్టర్-1', 'కేజీఎఫ్: చాప్టర్-2' చిత్రాల తర్వాత యశ్ చేయనున్న ఈ సినిమాకు ఎవరు దర్శకత్వం వహిస్తారనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొని ఉంది. కాగా మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తారని, ఈ చిత్రంలో సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ ప్రచారంలోకి వచ్చింది. ఈ నెల 8న ఈ సినిమాకి సంబంధించిన వివరాలు అధికారికంగా రానున్నాయి. మరి.. ఈ చిత్రానికి దర్శకురాలిగా గీతూ మోహన్‌దాస్, హీరోయిన్‌గా సాయిపల్లవి పేర్లే ఖరారు అవుతాయా? వేచి చూడాల్సిందే.

లీడర్ మీనల్ రాథోడ్




దీపికా పదుకోన్

హృతిక్ రోషన్, దీపికా పదుకోన్ హీరో హీరోయిన్లుగా అనిల్ కపూర్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ఫైటర్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా జనవరి 25న విడుదల కానుంది. ఈ సినిమాలో స్క్వాడ్రన్ లీడర్ మీనల్ రాథోడ్ పాత్రలో దీపికా పదుకోన్ నటించినట్లుగా వెల్లడించి, ఆమె లుక్‌ను మంగళవారం విడుదల చేశారు. ఇక స్క్వాడ్రన్ లీడర్ షంషేర్ పఠానియా పాత్రలో నటించారు హృతిక్ రోషన్. భారత వైమానిక దళం నేపథ్యంలో 'ఫైటర్' సినిమా కథనం సాగుతుంది.

రీల్స్

ఆడు మచ్చా...



రవితేజ

రవితేజ హీరోగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ఈగల్'. ఇందులో అనుపమా పరమేశ్వరన్, కావ్యా థాపర్ హీరోయిన్లుగా, నవదీప్, మధుబాల కీలక పాత్రల్లో నటించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 13న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'ఆడు మచ్చా..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. దావ్‌జాంద్ స్వరకల్పనలో కల్యాణ చక్రవర్తి సాహిత్యం అందించిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ''రవితేజ మల్టీషేడ్స్‌లో నటించిన చిత్రం ఇది. ఓ గ్రామీణ పండగ నేపథ్యంలో 'ఆడు మచ్చా..' పాట వస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

ఆకాశంలోకి ఎగరాలి



తాప్సీ, షారుక్ ఖాన్

హీరో షారుక్ ఖాన్, దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణీ కాంబినేషన్‌లో రూపొందిన సినిమా 'డంకీ'. తాప్సీ హీరోయిన్‌గా నటించారు. ఈ నెల 21న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా 'డంకీ' డ్రాప్ 4' అంటూ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఐదుగురు స్నేహితులు లండన్ వెళ్లే నేపథ్యంలో 'డంకీ' ఉంటుంది. 'శతాబ్దాలుగా బ్రిటిష్ వాళ్లు మనల్ని పరిపాలించారు. వాళ్లు ఇక్కడికి వచ్చినప్పుడు మనం అడగలేదు... మీకు హిందీ వచ్చా? అని. మనం వారిని ఆపలేదు. అలాంటప్పుడు మనల్ని ఆపడానికి వారికి ఎంత ధైర్యం?' అంటూ షారుక్ చెప్పిన డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ''ఎమోషనల్ రోలర్ కోస్టర్‌లో ప్రయాణించడానికి సిద్ధంగా ఉండండి. మీ కలలు విమానాల్లా ఆకాశంలోకి ఎగరాలి. స్నేహం విరబూయాలి'' అని యూనిట్ పేర్కొంది.

విప్లవ వీరుడు వస్తున్నాడు



సభావత్

క్యూబా పోరాట యోధుడు చేగువేరా జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'చే'. బీఆర్ సభావత్ నాయక్ టైటిల్ రోల్ పోషించి, దర్శకత్వం వహించారు. లావణ్య సమీర, పూల సిద్ధేశ్వర్, కార్తీక్ నూనె, వినోద్, పసల ఉమా మహేశ్వర్ కీలక పాత్రధారులు. సూర్య, బాబు, దేవేంద్ర నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదల కానుంది. సభావత్ నాయక్ మాట్లాడుతూ– ''విప్లవ వీరుడు చేగువేరా జీవిత చరిత్రను సినిమాగా తెరకెక్కించినందుకు గర్వంగా ఉంది. క్యూబా తర్వాత ప్రపంచంలోనే తొలిసారి భారతీయ చిత్ర పరిశ్రమలో రూపొందిన చేగువేరా బయోపిక్ ఇది. ఆయన చేసిన పోరాటాలు, త్యాగాలను ఈ చిత్రంలో చూపించాం. వీరాంజనేయ పిక్చర్స్ ద్వారా 100కుపైగా థియేటర్స్‌లో మా సినిమా రిలీజ్ కానుంది'' అన్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
6-12-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	431	69,296
నిఫ్టీ ▲	169	20,855

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్‌	14,220	▲ 35
డోజోన్స్‌	36,103	▼ 102
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,490	▼ 23
డాక్స్‌	16,533	▼ 128
పాంఘై	2,972	▼ 51
నికాయ్‌	33,776	▼ 455

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ (రూ.లలో)

ముంబై		
బంగారం (24 క్యారట్)	62,287	▼ 994
బంగారం (22 క్యారట్)	62,038	▼ 990
వెండి (కేజీ)	71,576	▼ 2,047

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఒకటి	82.63	84.30
£	బ్రిటన్‌ పౌండ్‌	ఒకటి	103.73	107.17
€	యూరో	ఒకటి	88.94	92.08
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఒకటి	55.84	57.58
AUS	ఆస్ట్రేలియా డాలర్‌	ఒకటి	54.87	56.20
S$	సింగపూర్‌ డాలర్‌	ఒకటి	61.38	63.37
SAR	సౌదీ రియాల్‌	ఖామినేటి	21.28	22.90
UAE D	యూఏఈ దిర్హామ్‌	ఖామినేటి	21.80	23.60
¥	చైనా యువాన్‌	ఖామినేటి	10.55	12.63

అదానీ గ్రూప్‌ చేతికి సంఘీ ఇండస్ట్రీస్‌

సవరించిన ధరతో కొనుగోలు ప్రక్రియ పూర్తి



న్యూఢిల్లీ: సంఘీ ఇండస్ట్రీస్‌ (ఎస్‌ఐఎల్‌) కొనుగోలు ప్రక్రియ పూర్తయినట్లు అదానీ గ్రూప్‌లో భాగమైన అంబుజా సిమెంట్స్‌ (ఏసీఎల్‌) వెల్లడించింది. షేరు ఒక్కింటికి రూ. 121.90 చొప్పున సవరించిన ధర మేరకు కొనుగోలు చేసినట్లు వివరించింది. గతంలో ఎస్‌ఐఎల్‌లో పబ్లిక్‌ షేర్‌హోల్డర్లకు ఉన్న 26 శాతం వాటాల కోసం కంపెనీ రూ. 114.22 రేటును ఆఫర్‌ చేసింది. ఎస్‌ఐఎల్‌ విలువను రూ. 5,185 కోట్లుగా లెక్కగట్టి దక్కించుకున్నట్లు ఏసీఎల్‌ తెలిపింది. సంఘీ ఇండస్ట్రీస్‌లో తమకు నియంత్రణాధికారాలతో 54.51 శాతం వాటాలు లభించినట్లు వివరించింది. దేశీ సిమెంటు పరిశ్రమలో తమ స్థానాన్ని పటిష్టపర్చుకునేందుకు ఈ డీల్‌ ఉపయోగపడుతుందని అదానీ గ్రూప్‌ సిమెంట్‌ వ్యాపార విభాగం సీఈవో అజయ్‌ కపూర్‌ తెలిపారు.

74.6 ఎంటీపీఏకి ఉత్పత్తి సామర్థ్యాలు

ఎస్‌ఐఎల్‌కు గుజరాత్‌లోని సంఘీపురంలో 2,700 హెక్టార్లలో క్లింకర్, సిమెంటు సమగ్ర తయారీ యూనిట్‌ ఉంది. ఇందులో 6.6 ఎంటీపీఏ క్లింకర్‌ ఉత్పత్తికి రెండు బట్టీలు, 6.1 ఎంటీపీఏ సిమెంటు గ్రైండింగ్‌ యూనిట్, 13 మెగావాట్ల క్యాప్టివ్‌ విద్యుదుత్పత్తి ప్లాంటు మొదలైనవి ఇందులో ఉన్నాయి. ఈ కొనుగోలుతో ఏసీఎల్‌ ఉత్పత్తి సామర్థ్యం వార్షికంగా 68.5 మిలియన్‌ టన్నులు (ఎంటీపీఏ) నుంచి 74.6 ఎంటీపీఏకి చేరుతుందని పేర్కొంది. కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్‌ తదితర పశ్చిమ తీర ప్రాంత మార్కెట్లలో తమ కార్యకలాపాలను మరింతగా విస్తరించనున్నట్లు కంపెనీ తెలిపింది. వచ్చే 30 నెలల్లో ఉత్పత్తి సామర్థ్యాలను అదనంగా పెంచుకోనున్నట్లు వివరించింది.

మరిన్ని భాషల్లో మైక్రోసాఫ్ట్‌ సేవలు

ఐడీసీ సిల్వర్‌ జూబ్లీ వేడుకల్లో వెల్లడి



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: టెక్‌ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌ దేశీయంగా మరిన్ని ప్రాంతీయ భాషల్లో తమ ఉత్పత్తులు, సేవలను అందుబాటులోకి తేవడంపై దృష్టి పెడుతోంది. హైదరాబాద్‌లోని ఇండియన్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌ (ఐడీసీ)ని ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన సిల్వర్‌ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న సంస్థ ఎండీ రాజీవ్‌ కుమార్‌ ఈ విషయం వెల్లడించారు. అమెరికా రెడ్‌మండ్‌లోని తమ ప్రధాన కార్యాలయం తర్వాత ఇది రెండో అతి పెద్ద రీసెర్చ్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ కేంద్రమని ఆయన తెలిపారు. ఐడీసీ వేడుకల్లో ప్రఖ్యాత క్రికెటర్‌ కపిల్‌దేవ్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్‌ 365తో పాటు జుగల్‌బందీ, అజూర్‌ స్పెషలైజ్డ్‌ ఏఐ సూపర్‌ కంప్యూటర్‌ను కంపెనీ ఆవిష్కరించింది.

ఇమేజ్‌ను టెక్ట్స్‌ రూపంలోకి మార్చి, ఎంచుకున్న భాషలోకి అనువదించే మైక్రోసాఫ్ట్‌ 365 యాప్‌ను ఇటీవల అందుబాటులోకి తెచ్చినట్లు కుమార్‌ చెప్పారు. అలాగే, ఇంగ్లిష్‌ను ప్రాంతీయ భాషల్లోకి అనువదించి, వాయిస్‌ రూపంలో అందించే జుగల్‌బందీ అనే కోపైలట్‌ టూల్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఇది తెలుగుతో పాటు 10 భాషల్లో ఉండగా త్వరలో 22 ప్రాంతీయ భాషలకు విస్తరించనున్నట్లు వివరించారు. అలాగే భాషిణి అనే చాట్‌బాట్‌ను కూడా త్వరలో అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. మనకు తెలిసిన భాషలో సందేహాలు అడిగితే జనరేటివ్‌ ఏఐ సాయంతో సమాధానాలు చెప్పేలా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు.

రెండో రోజూ రికార్డుల ర్యాలీ

- 69 వేల స్థాయిపైకి సెన్సెక్స్‌
- 20,850 పాయింట్లపైకి నిఫ్టీ
- ఆరో రోజూ కొనసాగిన సూచీల ర్యాలీ

ముంబై: స్టాక్‌ మార్కెట్‌లో రెండో రోజూ ర్యాలీ కొనసాగింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, మెటల్‌ షేర్లు రాణించడంతో సూచీలు మంగళవారం ఇంట్రాడే, ముగింపులోనూ చరిత్రాత్మక గరిష్టాలను అందుకున్నాయి. సెన్సెక్స్‌ 431 పాయింట్లు లాభపడి 69,296 వద్ద వద్ద, నిఫ్టీ 169 పాయింట్లు పెరిగి 20,855 వద్ద స్థిరపడ్డాయి. సూచీలకిది వరుసగా ఆరోరోజూ లాభాల ముగింపు కావడం విశేషం. గరిష్ట స్థాయిల వద్ద టెలికం, ఫార్మా, ఎఫ్‌ఎంసీజీ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ద్వితీయార్థంలో మరోసారి కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు సరికొత్త రికార్డుల వద్ద ట్రేడింగ్‌ ముగిశాయి.

రికార్డుల ర్యాలీ ఎందుకంటే..?

అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మూడు రాష్ట్రాల్లో గెలిచిన సానుకూలతలు రెండోరోజూ దలాల్‌ స్ట్రీట్‌లో ప్రతిబింబించాయి. అదానీ గ్రూప్‌ షేర్లు 20% వరకు లాభపడి ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించవచ్చనే ఆశావహ అంచనాలు నెలకొన్నాయి. జీడీపీతో సహా కీలక స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించాయి. క్రూడ్‌ ధరలు దిగి రావడంతో విదేశీ ఇన్వెస్టర్లు 8 సెషన్లలో రూ.17,133 కోట్ల షేర్లు కొన్నారు.



రూ.14 లక్షల కోట్లకు చేరువలో అదానీ గ్రూప్‌ మార్కెట్‌ క్యాప్‌


అమెరికా ఏజెన్సీ ఐడీఎఫ్‌సీ క్లీన్‌చిట్‌ ఇవ్వడంతో అదానీ గ్రూప్‌ షేర్ల ర్యాలీ కొనసాగింది. అదానీ ఎనర్జీ, అదానీ టోటల్‌ గ్యాస్‌ 20%, అదానీ ఎంటర్‌ప్రైజెస్‌ 17%, అదానీ పవర్‌ 16%, అదానీ పోర్ట్స్‌ 15%, అదానీ విల్మార్‌ 10%, ఏసీసీ 8%, అంబుజా సిమెంట్స్‌ 7% లాభపడ్డాయి. సంఘీ ఇండస్ట్రీస్‌ (5%)తో సహా మొత్తం 11 కంపెనీల మార్కెట్‌ క్యాపిటలైజేషన్‌ మంగళవారం ఒక్కరోజే రూ.1.92 లక్షల కోట్లు పెరిగింది. గ్రూప్‌ సంయుక్త మార్కెట్‌ క్యాపిటలైజేషన్‌ రూ.14 లక్షల కోట్ల చేరువలో రూ.13.91 లక్షల కోట్ల వద్ద ముగిసింది.

- సెన్సెక్స్‌ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్‌ విలువ రూ.2.99 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి రూ. 346.47 లక్షల కోట్లకు చేరింది. కాగా ఆరోరోజూ ర్యాలీతో బీఎస్‌ఈలో రూ.17.75 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది.

క్యాబ్‌ సర్వీసుల్లోకి ర్యాపిడో

హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలో షురూ

న్యూఢిల్లీ: వాహన సేవల సంస్థ ర్యాపిడో కొత్తగా క్యాబ్‌ సర్వీసుల విభాగంలోకి ప్రవేశించింది. తద్వారా దిగ్గజ సంస్థలు ఓలా, ఉబెర్‌తో పోటీపడనుంది. ముందుగా హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ–ఎన్‌సీఆర్‌ (నేషనల్‌ క్యాపిటల్‌ రీజియన్‌)లో 1.2 లక్షల క్యాబ్‌లతో సేవలను ప్రారంభించినట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు పవన్‌ గుంటుపల్లి వెల్లడించారు. 2024 సెప్టెంబర్‌ నాటికల్లా 35 నగరాలకు కార్యకలాపాలను విస్తరించనున్నట్లు వివరించారు. ఇటు యూజర్లపై భారం పడకుండా, అటు జీరో కమీషన్‌ మోడల్‌తో అటు డ్రైవర్‌ భాగస్వాముల ఆదాయాలను పెంచడంపై దృష్టి పెడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విధానంలో కస్టమర్‌ చెల్లించే డబ్బు మొత్తం డ్రైవర్లకే (కెప్టెన్లు) వెడుతుంది. ర్యాపిడో ఎటువంటి కమీషను తీసుకోదు. అయితే, డ్రైవర్ల ఆదాయం నిర్దిష్ట స్థాయిని దాటిన తర్వాత మాత్రం వారు కొంత సబ్‌స్క్రిప్షన్‌ ఫీజు కట్టాల్సి ఉంటుంది. 2024 జనవరి–మార్చి నాటికి ముంబై, పుణె, కోల్‌కతా, చెన్నైకి విస్తరిస్తామని పవన్‌ వివరించారు.



2030 నాటికి

మూడో అతిపెద్ద ఎకానమీగా భారత్‌!

- ఎస్‌అండ్‌పీ గ్లోబల్‌ రేటింగ్స్‌ నివేదిక
- ప్రపంచ తయారీ కేంద్రంగా మారడమే ముందున్న సవాలు

న్యూఢిల్లీ: భారత్‌ 2030 నాటికి ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని ఎస్‌అండ్‌పీ గ్లోబల్‌ రేటింగ్స్‌ విశ్లేషించింది. అయితే 'అపారమైన అవకాశాన్ని' అన్‌లాక్‌ చేసి తదుపరి అతిపెద్ద ప్రపంచ తయారీ కేంద్రంగా మారడం దేశానికి ప్రధాన పరీక్ష అని పేర్కొంది. ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2023–24) అంచనా వేసిన 6.4 శాతం వృద్ధి వేగం 2026 నాటికి 7 శాతానికి చేరుకుంటుందని పేర్కొంది. రాబోయే మూడేళ్లలో భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా మారుతుందని అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న రేటింగ్‌ ఏజెన్సీ అంచనా వేస్తోంది. సేవల–ఆధిపత్య ఆర్థిక వ్యవస్థ నుండి భారత్‌ తయారీ–ఆధిపత్యంగా మార్చడానికి బలమైన లాజిస్టిక్స్‌ ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం కీలకమని 'గ్లోబల్‌ క్రెడిట్‌ ఔట్‌లుక్‌ 2024: కొత్త ఇబ్బందులు, మార్గాలు' అన్న అంశంపై విడుదల చేసిన నివేదికలో రేటింగ్‌ సంస్థ పేర్కొంది. 2022–23లో భారత్‌ ఎకానమీగా వ్యవసాయ రంగం వాటా 18.4 శాతం. పారిశ్రామిక రంగం వాటా 28.3 శాతం. సేవల రంగం వాటా 53.3 శాతం. 25.5 ట్రిలియన్‌ డాలర్లతో అమెరికా ప్రస్తుతం ప్రపంచంలో అతిపెద్ద ఎకానమీగా కొనసాగుతోంది. ఇక 17.9 శాతం ప్రపంచ జీడీపీ వాటాతో 18 ట్రిలియన్‌ డాలర్ల ఎకానమీగా చైనా రెండవ స్థానంలో ఉంది. తరువాతి స్థానాల్లో జపాన్‌ (4.2 ట్రిలియన్‌ డాలర్లు), జర్మనీ (4 ట్రిలియన్‌ డాలర్లు)లు ఉన్నాయి. 3.75 ట్రిలియన్‌ డాలర్లతో భారత్‌ ఐదవ స్థానంలో నిలుస్తోంది. కాగా, 2022 నాటికి భారత్‌ ఎకానమీ బ్రిటన్, ఫ్రాన్స్‌లను అధిగమించగా, 2023 నాటికి జర్మనీని అధిగమించే అవకాశం ఉందన్న అంచనాలు ఉన్నాయి. తాజా నివేదికలో ఎస్‌అండ్‌పీ పేర్కొన్న ముఖ్యాంశాలు..



- శ్రామిక మార్కెట్‌ సామర్థ్యాన్ని అన్‌లాక్‌ చేయడం అనేది కార్మికుల నైపుణ్యం పెంపొందించడం, శ్రామికశక్తిలో మహిళా భాగస్వామ్యాన్ని పెంచడంపై ఆధారపడి ఉంటుంది. ఈ రెండు అంశాల్లో విజయం ద్వారా భారత్‌ తన అధిక శాతం యువత నుంచి ఆర్థిక ప్రయోజనం పొందగలుగుతుంది.
- వృద్ధి చెందుతున్న దేశీయ డిజిటల్‌ మార్కెట్‌ వచ్చే దశాబ్దంలో భారత్‌లో అధికంగా వృద్ధి చెందుతున్న స్టార్టప్‌ రంగానికి ప్రయోజనం చేకూర్చుతుంది.
- 2024లో 50 కంటే ఎక్కువ దేశాల్లో ఎన్నికలు (అధ్యక్ష/లేదా శాసన సభలు) ఉన్నాయి. వీటి ఫలితాలపై ఆధారపడి చాలా వరకు ప్రపంచ పరిణామాలు ఉండవచ్చు.
- త్వరలో మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టనున్న యుద్ధంలో చిక్కుకున్న రష్యా– ఉక్రెయిన్‌ రెండు దేశాల్లో మార్చిలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమాసియా సంక్షోభంలో ప్రత్యక్ష సంబంధం ఉన్న అమెరికాలో కూడా అధ్యక్ష ఎన్నికలు జరగనుండడం గమనార్హం. భారత్‌సహా ఇండోనేషియా, దక్షిణాఫ్రికా, మెక్సికో వంటి వర్ధమాన దేశాలు కూడా ఎన్నికలకు వెళ్లనున్నాయి.

నవంబర్‌లో సేవలు పేలవం..

56.9 పతనమైన బిజినెస్‌ యాక్టివిటీ ఇండెక్స్‌ • ఏడాది కనిష్ట స్థాయి

న్యూఢిల్లీ: భారత్‌ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో దాదాపు 53 శాతం వాటా కలిగిన సేవల రంగం నవంబర్‌లో పేలవ పనితీరును కనబరిచింది. ఎస్‌అండ్‌పీ గ్లోబల్‌ ఇండియా సర్వీసెస్‌ బిజినెస్‌ యాక్టివిటీ ఇండెక్స్‌ అక్టోబర్‌లో 58.4 వద్ద ఉంటే, నవంబర్‌లో 56.9కి పడిపోయింది. గడచిన ఏడాది కాలంలో ఇంత తక్కువ స్థాయికి సేవల రంగం సూచీ పడిపోవడం ఇదే తొలిసారి. ధరల ఒత్తిడి తగ్గినప్పటికీ, నవంబర్‌లో కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి స్పీడ్‌ నెమ్మదించడం మొత్తం ఫలితాలపై ప్రభావం చూపినట్లు ఎస్‌అండ్‌పీ గ్లోబల్‌ మార్కెట్‌ ఇంటెలిజెన్స్‌లో ఎకనామిక్స్‌ అసోసియేట్‌ డైరెక్టర్‌ పోలియానీ డీ లిమా పేర్కొన్నారు. కాగా, ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగానే పరిగణించడం జరుగుతుంది. ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన సేవల రంగం సూచీ వరుసగా 28 నెలల నుంచీ వృద్ధి బాటలోనే కొనసాగుతోంది.



సేవలు–తయారీ కలిపినా కిందకే..

మరోవైపు సేవలు–తయారీ రంగాలను కలిసి లెక్కించే ఎస్‌అండ్‌పీ గ్లోబల్‌ ఇండియా కాంపోజిట్‌ పీఎంఐ అవుట్‌పుట్‌ ఇండెక్స్‌ అక్టోబర్‌లో 58.4 వద్ద ఉంటే, తాజా సమీక్షా నెల నవంబర్‌లో 57.4కు పడిపోయింది.

కులగణన కూడా చేపట్టండి

కేంద్రాన్ని కోరిన ఎంపీ సత్యవతి



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జనగణనతోపాటు కులగణన చేపట్టాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ బీవీ సత్యవతి కేంద్రాన్ని డిమాండ్‌ చేశారు. శాసనసభల్లో ఓబీసీ రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో ఓబీసీల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. మంగళవారం లోక్‌సభలో జమ్మూ కశ్మీర్‌ రిజర్వేషన్‌ (సవరణ) బిల్లు–2023పై చర్చలో వైఎస్సార్‌సీపీ తరఫున మద్దతు ఇస్తూ ఎంపీ సత్యవతి మాట్లాడారు. బిల్లు సవరణలో భాగంగా బలహీనమైన, వెనుకబడిన తరగతుల స్థానంలో ఇతర వెనుకబడిన తరగతులుగా మార్చడం ద్వారా జమ్మూకశ్మీర్‌లో సామాజిక పురోభివృద్ధి చెందుతుందన్నారు.

'స్కిల్‌ స్కామ్‌' కేసులో అప్రూవర్‌గా మారుతా

ఏసీబీ కోర్టుకు తెలిపిన నిందితుడు చంద్రకాంత్‌ షా

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున ప్రజాధనాన్ని కొల్లగొట్టిన 'స్కిల్‌'కుంభకోణం కేసు నిందితుడు(ఏ–13)గా ఉన్న ఏసీఐ కంపెనీ ఎండీ చంద్రకాంత్‌ షా విజయవాడలోని ఏసీబీ కోర్టులో మంగళవారం హాజరయ్యారు. తాను అప్రూవర్‌గా మారుతానని కోర్టుకు చెప్పారు. అప్రూవర్‌గా మారేందుకు అనుమతి కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఆమోదించాలని కోరారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం ఆయన అప్రూవర్‌ వాంగ్మూలాన్ని నమోదు చేసేందుకు కేసు విచారణను జనవరి 5కు వాయిదా వేసింది.

బలమైన ఆర్థిక శక్తిగా భారత్‌

రాజ్యసభలో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ మందకొడిగా సాగుతున్న నేపథ్యంలో భారతదేశం బలమైన ఆర్థిక శక్తిగా రూపాంతరం చెందుతోందని వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. అత్యధిక జీడీపీ కలిగిన దేశాల్లో భారత్‌ 5వ స్థానంలో ఉందని చెప్పారు. మంగళవారం రాజ్యసభలో ఆర్థిక వ్యవస్థపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. రానున్న ఐదేళ్లలో 5 ట్రిలియన్‌ డాలర్ల మార్క్‌ను అధిగమించి ప్రపంచంలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ అవతరిస్తుందని అభిప్రాయపడ్డారు. గత ఏడాది దేశ జీడీపీ భారీగా పెరిగి 7.2 శాతంగా నమోదైందని తెలిపారు. మరోపక్క పన్నుల వసూళ్లు ఆర్థిక పురోగతికి ఇంధనంలా మారాయని చెప్పారు. 2013–14 కాలంలో రూ.6.40 లక్షల కోట్లు ఉన్న ప్రత్యక్ష పన్నుల వసూళ్లు.. 2022–23 నాటికి రూ.16.60 లక్షల కోట్లకు చేరిందని వివరించారు. డిజిటల్‌ చెల్లింపుల్లోనూ భారత్‌ ముందంజలో ఉందని, 2022లో దేశంలో 89 మిలియన్ల డిజిటల్‌ లావాదేవీలు నమోదయ్యాయని పేర్కొన్నారు. డిజిటల్‌ చెల్లింపుల విధానాన్ని అనుసరిస్తున్న అన్ని దేశాలను కలుపుకున్నా భారత్‌లో జరిగినన్ని డిజిటల్‌ లావాదేవీలు ఇతర దేశాల్లో జరగలేదని చెప్పారు. ఆర్థిక రంగం శరవేగంగా విస్తరిస్తున్న సమయంలో డాలర్‌తో రూపాయి మారకం విలువ అంతే వేగంగా పడిపోవడం ఆందోళనగా మారిందన్నారు. గత ఏడాది ఆసియాలో కరెన్సీ మారకం విలువ తీవ్ర ఒడిదుడుకులకు లోనై రూ.80 దాటిందని చెప్పారు. ప్రస్తుతం ఒక డాలర్‌కు రూపాయి విలువ రూ.83.40 చేరిందని తెలిపారు. ముడి సరుకులు, ఆయిల్‌ దిగుమతులపై భారత్‌ భారీగా ఆధారపడిన కారణంగా దేశంలోని ఉత్పాదక రంగంపై తీవ్ర ప్రభావం పడిందని పేర్కొన్నారు. రిజర్వ్‌ బ్యాంక్‌ గణంకాల ప్రకారం రూపాయి మారక విలువ క్షీణతతో ద్రవ్యోల్బణం 15 బేసిస్‌ పాయింట్లు పెరిగి సామాన్యుడిపై మరింత భారం పడిందని విజయసాయి రెడ్డి వివరించారు.



చెక్‌ పార్లమెంటరీ బృందంతో భేటీ

చెక్‌ రిపబ్లిక్, భారత మధ్య ప్రయోజనాలపై ఆ దేశ ప్రతినిధులతో రవాణా, పర్యాటకం, సంస్కృతి పార్లమెంటరీ స్థాయీ సంఘం ప్రతినిధులు, స్థాయి సంఘం చైర్మన్‌ వి.విజయసాయి రెడ్డి నేతృత్వంలో భేటీ అయ్యారు. మంగళవారం రాజ్యసభలో నిర్వహించిన ఈ భేటీలో రవాణా, పర్యాటకం, సంస్కృతిపై రెండు దేశాల్లోని కీలక విధానాలపై చర్చించారు. ద్వైపాక్షిక సంబంధాలు, సాంస్కృతిక సహకారంపై రెండు పార్లమెంటరీ ప్రతినిధి బృందాలు చర్చలు జరిపినట్టు విజయసాయి ఎక్స్‌ ద్వారా ట్వీట్‌ చేశారు. ఎంపీ మార్గాని భరత్, స్థాయి సంఘం ప్రతినిధుల సభ్యులు భేటీలో పాల్గొన్నారు.

రాజ్యసభ | **ఏపీ ఇన్‌ పార్లమెంట్‌**

ఏపీలో 6 ఎన్‌ఈఎల్‌ఎస్‌ నైపుణ్య కేంద్రాలు

ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో నేషనల్‌ ఎమర్జెన్సీ లైఫ్‌ సపోర్ట్‌ (ఎన్‌ఈఎల్‌ఎస్‌) కేంద్రాలు 6 ఉన్నాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ఎస్‌పీ సింగ్‌భగేల్‌ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌ (తిరుపతి), ఆంధ్ర మెడికల్‌ కాలేజీ (విశాఖపట్నం), గుంటూరు మెడికల్‌ కాలేజీ, రంగరాయ మెడికల్‌ కాలేజీ (కాకినాడ), సిద్ధార్థ మెడికల్‌ కాలేజీ (విజయవాడ), ఎయిమ్స్‌ (మంగళగిరి)లో ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

కేసీసీ పథకంలో ఆ ప్రతిపాదన లేదు

కిసాన్‌ క్రెడిట్‌ కార్డు (కేసీసీ) పథకం కింద రైతులకు పూచీకత్తు రహిత రుణాన్ని రూ.1.60 లక్షల నుంచి రూ.4 లక్షలకు పెంచాలని రైతులు లేదా ప్రజా ప్రతినిధుల నుంచి ఎలాంటి ప్రతిపాదన లేదని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి కరాడ్‌ తెలిపారు.

ఏపీలో స్వాస్థ్య యోజన



ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన అమలులో ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి మాన్సుఖ్‌ మాండవీయా తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు బీద మస్తానరావు ప్రశ్నకు సమాధానమిచ్చారు. తిరుపతిలోని ఎస్వీ, విజయవాడలోని సిద్ధార్థ, అనంతపురంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలకు కూడా కేంద్ర వాటా కింద నిధులు విడుదల చేశామన్నారు. కాగా, నేషనల్‌ ఇన్సూరెన్స్, ఓరియంటల్‌ ఇన్సూరెన్స్, యునైటెడ్‌ ఇండియా ఇన్సూరెన్స్‌ కంపెనీలకు గత మూడేళ్లలో రూ.17,450 కోట్లను మూలధనం కింద అందించినట్టు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్‌ కరాడ్‌ తెలిపారు.

కర్నూలు నుంచి విశాఖకు రైలు నడపండి

ఎంపీ సంజీవ్‌కుమార్‌ సింగారీ



సాక్షి, న్యూఢిల్లీ: కర్నూలు నుంచి విశాఖపట్నం వరకు డైలీ రైలు సర్వీస్‌ ప్రవేశపెట్టాలని ఎంపీ డాక్టర్‌ సంజీవ్‌ కుమార్‌ సింగారీ కేంద్రాన్ని కోరారు. మంగళవారం లోక్‌సభలో రూల్‌ 377 కింద అత్యవసర అంశాలపై మాట్లాడుతూ.. కర్నూలు నుంచి ముంబైకి వెళ్లే డైలీ రైలుకు మద్దికర, కొసిగి, ఆదోని రైల్వేస్టేషన్లలో హాల్ట్‌ ఇవ్వాలని కోరారు. తద్వారా లక్షలాది మంది కార్మికులు, వ్యాపారులకు ప్రయాణ సౌకర్యం అందుతుందన్నారు. కర్నూలు నుంచి విజయవాడ మీదుగా విశాఖపట్నం వెళ్లే 07237 వీక్లీ ట్రెయిన్‌ సేవలను పునరుద్ధరించాలని, రైల్వే రిహాబిలేషన్‌ కోచ్‌ వర్క్‌షాప్‌ పనులను పూర్తి చేయాలని కోరారు.

గ్యాస్‌ లీకేజీని అరికట్టండి: చింతా అనురాధ

తూర్పు గోదావరి జిల్లాలో పైప్‌లైన్లను మార్చి గ్యాస్‌ లీకేజీని అరికట్టాలని ఎంపీ చింతా అనురాధ కేంద్రాన్ని కోరారు. లోక్‌సభలో రూల్‌ 377కింద అత్యవసర అంశాలపై మాట్లాడుతూ.. జిల్లాలోని చమురు సంస్థల ద్వారా లీక్‌ అవుతున్న గ్యాస్‌ కారణంగా సమీపంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వివరించారు. దీనిపై కేంద్రం స్పందించి గ్యాస్‌ లీకేజీని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

లోక్‌సభ

రైతుల ఆదాయం రెట్టింపయ్యేలా చర్యలు



సాక్షి, న్యూఢిల్లీ: రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి కేంద్రం పలు చర్యలు చేపడుతోందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్‌ తోమర్‌ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు వైఎస్‌ అవినాష్‌రెడ్డి ప్రశ్నకు మంగళవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిస్తూ.. 2016లో ఏర్పాటు చేసిన కమిటీ 2018లో నివేదిక ఇచ్చిందన్నారు. ఆ కమిటీ ఆదాయ రెట్టింపునకు ఏడు వనరుల్ని గుర్తించిందని.. తదనుగుణంగా పలు పథకాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు కేంద్రమంత్రి వివరించారు.

వ్యవసాయాభివృద్ధికి నిధులు



ఏపీలో జాతీయ ఈ–గవర్నెన్స్‌ ప్లాన్‌ కింద వ్యవసాయాభివృద్ధికి నిధులు విడుదల చేసినట్టు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్‌తోమర్‌ తెలిపారు. 2020–21లో యూనిఫైడ్‌ డిజిటల్‌ ప్రోగ్రామ్‌ కింద రూ.4.25 కోట్లు, 2021–22లో రైతు భరోసా కేంద్రాల నిర్వహణకు రూ.6.66 కోట్లు విడుదల చేసినట్టు వైఎస్సార్‌సీపీ సభ్యుడు బాలశౌరి ప్రశ్నకు ప్రశ్నోత్తరాల్లో సమాధానమిచ్చారు.

రిజిస్టర్డ్‌ వెటర్నరీ వైద్యులు 5,324 మంది



ఆంధ్రప్రదేశ్‌లో 5,324 మంది రిజిస్టర్డ్‌ వెటర్నరీ వైద్యులు ఉన్నారని కేంద్ర పశు సంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాలా తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యురాలు చింతా అనురాధ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. 337 వెటర్నరీ ఆస్పత్రులు/పాలీ క్లినిక్‌లు, 1,577 వెటర్నరీ డిస్పెన్సరీలు, 1,558 వెటర్నరీ ఎయిడ్‌ సెంటర్లు ఉన్నాయని వెల్లడించారు.

గురజాలలో కేవీకేపై స్పందనేది



కరవు సమయంలో రైతుల్ని ప్రోత్సహించే కృషి విజ్ఞాన కేంద్రాన్ని (కేవీకే) గురజాల మండలం జంగ మహేశ్వరంలో ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఈ విషయంలో మూడేళ్లుగా కేంద్రం నుంచి స్పందన లేదని, 2023 ఎన్నికలలోపు మంజూరు చేస్తారా అని అడిగారు. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఏపీకి సంబంధించి పలు ప్రశ్నలు అడిగారు. ఏపీలో వర్షపాతం తక్కువగా ఉందని, పల్నాడు జిల్లాలో పత్తి, మిర్చి విస్తీర్ణం గణనీయంగా తగ్గిందని, పంటల బీమా ద్వారా ఉపశమనం కల్పించాలని కోరారు. అంతకు ముందు ఎంపీ అడిగిన ప్రధాన ప్రశ్నకు సంబంధం లేని కారణంగా తర్వాత దీనికి సమాధానం అందజేస్తామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్‌ తోమర్‌ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫసల్‌ బీమా యోజనలో 2020–21 నుంచి 2022–23 నుంచి రూ.1.75 కోట్ల మంది ఎన్‌రోల్‌ చేయించుకున్నారని కేంద్రమంత్రి తెలిపారు.

ఏపీలో 8,591 ఎకరాల్లో గంజాయి ధ్వంసం

ఆంధ్రప్రదేశ్‌లో 2018 నుంచి 2022 వరకు రాష్ట్ర ప్రభుత్వం 8,591 ఎకరాల్లో గంజాయి సాగును నాశనం చేసిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అత్యధికంగా 2021లో 7,083 ఎకరాల్లో గంజాయి సాగును ధ్వంసం చేసినట్టు నార్కోటిక్స్‌ కంట్రోల్‌ బ్యూరో వెల్లడించిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్‌ టీడీపీ ఎంపీ కేశినేని శ్రీనివాస్‌ అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో పేర్కొన్నారు.

ఫైబర్‌నెట్‌ స్కాం పాత్రధారికి భారీ జరిమానా

- రూ.34కోట్లు చెల్లించాలని ఏపీ డీఆర్‌ఐ నోటీసులు
- జీఎస్టీ నిధులను ఎగవేసిన ఫాస్ట్‌లేన్‌ ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీస్‌
- ఆ మొత్తం ఏ–1 వేమూరి హరికృష్ణ రియల్‌ ఎస్టేట్‌ సంస్థలోకి మళ్లింపు
- ఈ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్‌ పిటిషన్‌ 12న 'సుప్రీం'లో విచారణ

సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఫైబర్‌నెట్‌ ప్రాజెక్టు కుంభకోణానికి సంబంధించి నిధుల అక్రమ మళ్లింపులో కీలక సాధనంగా వ్యవహరించిన ఫాస్ట్‌లేన్‌ ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీస్‌ కంపెనీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జీఎస్టీ నిధులను ఎగవేసినట్లు రుజువు కావడంతో రాష్ట్ర రెవెన్యూ ఇంటెలిజెన్స్‌ (ఏపీ డీఆర్‌ఐ) ఆ సంస్థకు రూ.34.01 కోట్ల జరిమానా విధించింది. దారి మళ్లించిన జీఎస్టీ నిధులు, వాటిపై జరిమానాతో సహా మొత్తం రూ.34.01 కోట్లు చెల్లించాలని నోటీసులు జారీచేసింది.

జీఎస్టీ వసూలుచేసి మళ్లింపు..

ఫైబర్‌నెట్‌ కేసులో ఏ–1గా ఉన్న చంద్రబాబు సన్నిహితుడు వేమూరి హరికృష్ణ పన్నాగంలో ఆ కంపెనీ కీలక పాత్రధారిగా వ్యవహరించడం గమనార్హం. నిబంధనల ప్రకారం ఏదైనా ప్రాజెక్టు కోసం పరికరాలు సరఫరా చేసిన కంపెనీ కొనుగోలు కంపెనీ నుంచి జీఎస్టీ మొత్తాన్ని బిల్లుతో పాటు వసూలుచేస్తుంది. అనంతరం.. జీఎస్టీ మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాలి. కానీ, ఫైబర్‌నెట్‌ ప్రాజెక్టులో వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్‌ కంపెనీకి పలు పరికరాలు విక్రయించినట్లు.. జీఎస్టీతో సహా బిల్లులు వసూలుచేసినట్లు ఫాస్ట్‌లేన్‌ ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీస్‌ తన పత్రాల్లో చూపించింది. కానీ, జీఎస్టీ కింద ప్రభుత్వానికి చెల్లించాల్సిన నిధులను మాత్రం జమచేయకుండా దారి మళ్లించింది. ఏపీ డీఆర్‌ఐ దర్యాప్తులో ఈ వ్యవహారం వెలుగుచూసింది. మొత్తం రూ.10.81 కోట్ల జీఎస్టీ మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించకుండా తమ అనుబంధ కంపెనీల ఖాతాల్లోకి మళ్లించినట్లు ఆధారాలతో సహా వెల్లడైంది. నెట్‌టాప్స్, ఎక్స్‌వైజెడ్‌ ఇన్నోవేషన్స్, కాఫీ మీడియా సంస్థల ఖాతాల ద్వారా ఫాస్ట్‌లేన్‌ ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీస్‌ ఆ నిధులను అక్రమంగా మళ్లించినట్లు ఏపీ డీఆర్‌ఐ గుర్తించింది.

ఆ నిధులు వేమూరి హరికృష్ణ 'రియల్‌' కంపెనీల్లోకి..

ఇక మళ్లించిన నిధులను నెట్‌టాప్స్‌ కంపెనీ ఈ కేసులో ఏ–1గా ఉన్న వేమూరి హరికృష్ణకు చెందిన రియల్‌ ఎస్టేట్‌ కంపెనీల్లో పెట్టుబడిగా పెట్టినట్లు బహిర్గతమైంది. అంతేకాదు.. ఈ కేసులో మరో నిందితుడైన టెరాసాఫ్ట్‌ కంపెనీ ఎండీ తుమ్మల గోపీచంద్‌ సూచనల మేరకే ఫైబర్‌ నెట్‌ ప్రాజెక్టులో వారికి సహాయకారిగా ఉండేందుకు ఫాస్ట్‌లేన్‌ ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీస్‌ను నెలకొల్పినట్లు స్వయానా ఆ కంపెనీ ఎండీ వేమూరి విప్లవ్‌కుమార్‌ తన వాంగ్మూలంలో అంగీకరించారు. మరోవైపు.. ఈ కేసులో చంద్రబాబుకు ముందస్తు బెయిల్‌ ఇచ్చేందుకు ఏపీ హైకోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీం కోర్టులో ఈ కేసు విచారణ ఈనెల 12కు వాయిదా పడింది. ఇప్పుడు ఈ కేసులో తదుపరి పరిణామాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

క్లుప్తంగా...

పింఛన్ల పంపిణీకి అదనంగా మరో రోజు పొడిగింపు

తుపాను నేపథ్యంలో నిర్ణయం



విజయవాడ ఆసుపత్రిలో కిడ్నీ బాధితుడు మాధవరావుకు రూ. 10 వేలు పింఛన్ అందిస్తున్న వలంటీర్ జెస్సమ్మ

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా అవ్వాతాతల పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అదనంగా ఒక రోజు పొడిగించింది. సాధారణంగా ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించే పింఛన్ల పంపిణీని ప్రభుత్వం ఈ నెల 6 వరకు పొడిగించింది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో పాటు వలంటీర్లు సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పింఛన్ల పంపిణీని పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. వాస్తవానికి ఈ నెలకు సంబంధించి ప్రభుత్వం 65,33,781 మంది లబ్ధిదారుల కోసం రూ.1,800.96 కోట్లను విడుదల చేయగా.. నిర్ణీత ఐదో తేదీ(మంగళవారం) సాయంత్రానికే 64,62,991 మంది లబ్ధిదారులకు రూ.1,781.37 కోట్ల పంపిణీ పూర్తయ్యింది. రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నప్పటికీ మంగళవారం కూడా 81,702 మందికి పైగా లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ డబ్బులు పంపిణీ చేశారు.

తెలంగాణలో ఓటేసిన వారు ఇక్కడ ఓటేయకుండా చూడండి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కోరిన వైఎస్సార్‌సీపీ బృందం

సాక్షి, అమరావతి: తెలంగాణలో ఓటు వేసిన వారు ఏపీలో ఓటు వేయకుండా ఎన్నికల కమిషన్ కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు ఇవ్వాలని మంత్రి మేరుగు నాగార్జున, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ అప్పిరెడ్డితో కూడిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల బృందం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్‌కు విజ్ఞప్తి చేసింది. హైదరాబాద్‌లో ఓటు వేసిన వారు ఏపీలో ఓటు వేసేందుకు సిద్ధంగా ఉండటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనాను కలిసి ఓటర్ల నమోదుకు సంబంధించి టీడీపీ చేస్తున్న అక్రమాలపై మంగళవారం ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో టీడీపీ, ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఆధ్వర్యంలో ఏపీకి సంబంధించి ఓటర్ల నమోదు, రిజిస్ట్రేషన్ డ్రైవ్ నిర్వహించడంపై ఫిర్యాదు చేసి, ఆధారాలు సమర్పించారు. మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు హైదరాబాద్ ప్రగతి నగర్‌లో బ్యానర్లు కట్టి మరీ ఓటర్ల రిజిస్ట్రేషన్ చేస్తున్నారని వివరించారు. ఎమ్మెల్యే లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. మాజీ ఎన్నికల కమిషనర్ రమేష్‌కుమార్ సిటిజన్ ఫర్ డెమోక్రసీ పేరుతో సంస్థ పెట్టి, దానికి కార్యదర్శిగా ఉంటూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో లేని వారిని తీసుకువచ్చి టీడీపీ ఇక్కడ ఓటర్లుగా చేర్పిస్తోందన్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు.

కృష్ణా జలాల వివాదంపై భేటీ వాయిదా

8వ తేదీన నిర్వహించనున్నట్లు కేంద్రం వెల్లడి

సాక్షి, అమరావతి: కృష్ణా జలాల వివాదంపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో బుధవారం నిర్వహించాల్సిన సమావేశాన్ని ఈ నెల 8వ తేదీకి కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసింది. తమ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక సమావేశాన్ని నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ మంగళవారం ఈ నిర్ణయం తీసుకున్నారు. హక్కులను కాపాడుకోవడంలో భాగంగా తన భూభాగంలోని సాగర్ స్పిల్ వేలో సగం, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను ఏపీ ప్రభుత్వం గత నెల 30న స్వాధీనం చేసుకుంది. ఈ నేపథ్యంలో తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు ఈనెల 2న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సీఎస్‌లతో కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విభజన చట్టంలో పేర్కొన్న మేరకు కృష్ణా జలాల వివాదాన్ని పరిష్కరించి.. ఇరు రాష్ట్రాల హక్కులను పరిరక్షించడానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. సాగర్ వివాదంతో పాటు కృష్ణా జలాల పంపకం.. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను కృష్ణా బోర్డుకు అప్పగించడం అజెండాగా ఢిల్లీలో ఇరు రాష్ట్రాల సీఎస్‌లతో 6వ తేదీన సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. అప్పటివరకు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. తాజాగా తెలంగాణ సీఎస్ విజ్ఞప్తి మేరకు ఈ భేటీని 8వ తేదీకి వాయిదా వేశారు.

13న సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, అమరావతి: ఏపీ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్ష ఫలితాలను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాలను ఈ నెల 13న ఉదయం 10 గంటలకు విజయవాడలోని సర్వీస్ కమిషన్ కార్యాలయంలో పరిశీలించనున్నట్టు కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో చూడాలని విజ్ఞప్తి చేశారు.

జగన్ వచ్చాకే దళితులు, గిరిజనులకు రక్షణ

చంద్రబాబు హయాంలో నిత్యం ఈ వర్గాల ప్రజలపై దమనకాండ

- నాడు సీఎం హోదాలో చంద్రబాబే నీచంగా మాట్లాడిన వైనం
- చింతమనేని దాడులు, వర్ల రామయ్య వ్యాఖ్యలూ దళితులు మరవలేదు
- దళితులు, గిరిజనులను అక్కున చేర్చుకొన్న సీఎం వైఎస్ జగన్
- రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు సంపూర్ణ భద్రత
- ఆ కుటుంబాల జీవన ప్రమాణాలు పెంచేలా పలు కార్యక్రమాలు
- నేడు ఆత్మగౌరవంతో తలెత్తుకు తిరుగుతున్న దళితులు, గిరిజనులు
- ఎస్సీ, ఎస్టీలపై దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు
- నాలుగేళ్లలో ఎస్సీ, ఎస్టీలపై తగ్గిన దాడులు, వేధింపులు
- బాధితులకు పరిహారం పెంపు.. ఉదారంగా సహాయం
- ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడిస్తున్న వాస్తవాలివి
- ఆ నివేదికను వక్రీకరిస్తూ ఈనాడు రామోజీ దుష్ప్రచారం

ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి : 'ఎస్సీలుగా పుట్టాలని ఎవరు కోరుకుంటారు' అంటూ ముఖ్యమంత్రి వంటి అత్యున్నత పదవిలో ఉన్న నారా చంద్రబాబు రాష్ట్రంలోని దళిత జాతిని తూలనాడిన ఘటనను ఈనాడు రామోజీరావు ఉద్దేశపూర్వకంగానే విస్మరించారు. బాబు హయాంలో రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై జరిగిన దమనకాండను, టీడీపీ నేతల అవహేళనలను రామోజీ కనీసమాత్రంగానైనా ఖండించలేదు. ఈనాడు పత్రికలో ఒక్క ముక్కా రాయలేదు. అదే దళిత జాతిని, గిరిజనులను, బీసీలను, మైనార్టీలను తన వాళ్లుగా భావించి, వారి అభ్యున్నతికి పాటుపడుతున్న వైఎస్ జగన్ ప్రభుత్వంపై అభూత కల్పనలు, అసత్యాలతో కథనాలు రాస్తారు. దళితులు, గిరిజనులపై రామోజీరావు మరోసారి మొసలి కన్నీరు కార్చారు. రాష్ట్రంలోనే కాదు.. దేశ చరిత్రలోనే విప్లవాత్మక రీతిలో దళిత, గిరిజనులకు సంపూర్ణ భద్రత కల్పించి, వారి సంక్షేమం, అభ్యున్నతికి పాటుపడుతున్న వైఎస్ జగన్ ప్రభుత్వంపై దుష్ప్రచారానికి తెగబడ్డారు. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదికను వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు యత్నించారు. కనికట్టు కథనంతో విషం చిమ్మారు. కానీ వాస్తవం ఏమిటో దళితులకు, గిరిజనులకు తెలుసు. చంద్రబాబు, ఆయన పార్టీ నేతలు తమను తూలనాడిన విషయాన్ని మరచిపోలేదు. అప్పటి టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మహిళా అధికారిపై చేసిన దాష్టీకం వారి కళ్ల ముందు ఇంకా కదలాడుతూనే ఉంది. వర్ల రామయ్య వ్యాఖ్యలూ వారి చెవుల్లో మార్మోగుతూనే ఉన్నాయి. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచే దగాపడ్డ దళితులు, గిరిజనులను అక్కున చేర్చుకొన్నారు. ఆ కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టారు. సీఎం జగన్ ఇచ్చిన చేయూతతో ఈరోజు దళితులు, గిరిజనులు పూర్తి ఆత్మగౌరవంతో దర్జాగా జీవిస్తున్నారు. ఇది వారే చెప్పే వాస్తవం. రామోజీరావుకు మింగుడు పడని విషయమూ ఇదే. అందుకే వక్రీకరించిన కథనాలతో మానసిక సంతృప్తి చెందాలన్న వ్యథలు. రామోజీరావు కథనంలో అన్నీ అసత్యాలేనని తెలిపే వాస్తవాలతో ఫ్యాక్ట్ చెక్..



వైకాపా పాలనలో దళితులపై దమనకాండ

2022లో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై తగ్గిన తీవ్ర నేరాలు

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై జరిగిన తీవ్ర నేరాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థంగా కట్టడి చేస్తోంది. అందుకు ఎన్‌సీఆర్‌బీ-2022 నివేదికే నిదర్శనం. ఆ నివేదిక ప్రకారం...

కేసులు	2021	2022
దళితులపై తీవ్రమైన దాడులు	15	5
దళితులపై ఘర్షణ కేసులు	18	13
గిరిజనుల హత్యలు	15	8
గిరిజన మహిళలపై అత్యాచారంకేసులు	39	29
గిరిజనులపై ఘర్షణ కేసులు	4	1

నిందితులకు శిక్షల్లో ముందుకు

ఎస్సీ, ఎస్టీలపై నేరాలకు పాల్పడిన వారికి సత్వరం శిక్షలు విధించేలా చేయడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోంది. 2022లో ఎస్సీ, ఎస్టీలపై నేరాల కేసుల్లో 63.7 శాతం కేసుల్లో దోషులకు శిక్షలు విధించడమే ఇందుకు నిదర్శనం. ఆ అంశంలో ఏపీ దేశంలో నాలుగో స్థానంలో నిలిచింది.

బాబు హయాంలో ఫిర్యాదు చేయాలంటేనే హడల్

టీడీపీ ప్రభుత్వ హయాంలో బాధిత ఎస్సీ, ఎస్టీలు పోలీసులకు ఫిర్యాదు చేసే సాహసం చేయలేకపోయేవారు. ధైర్యం చేసి బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేసేందుకు వస్తే బెదిరించి వెనక్కి పంపించేవారు. ఎందుకంటే అప్పుడు దళితులు, గిరిజనులపై దాడులు చేసిన వారిలో అధిక శాతం టీడీపీ నేతలు, వారి అనుచరులే. అందుకే బడుగు వర్గాల ప్రజలు ఫిర్యాదు చేయడానికి భయపడే పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిస్థితి వేరు. సీఎం వైఎస్ జగన్ వారిలో భరోసా కల్పించారు. పలు కార్యక్రమాల ద్వారా వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. దీంతో వారిపై దాడులు గణనీయంగా తగ్గిపోయాయి. ఒకవేళ ఎక్కడైనా దాడులు జరిగినా, ఎస్సీ, ఎస్టీలు ధైర్యంగా ఫిర్యాదు చేసే పరిస్థితులను ప్రభుత్వం కల్పించింది. కేసుల సంఖ్య పెరిగినట్టు కనిపించినా పర్వాలేదు.. బాధితులకు న్యాయం జరగాలి.. దోషులకు శిక్షలు పడాలి అనే విధానాన్ని అమలు చేస్తోంది. ఎస్సీ, ఎస్టీలపై దాడులు, వేధింపులకు పాల్పడే వారి పట్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. ఆధారాల సేకరణ కోసం వీడియో కాన్ఫరెన్స్ విధానాన్ని దేశంలోనే తొలిసారిగా 2020 ఆగస్టులోనే ప్రవేశపెట్టింది. ఇవన్నీ సత్ఫలితాలిస్తున్నాయి.

ఎస్సీ, ఎస్టీలపై కేసుల దర్యాప్తులోనూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేగవంతమైన చర్యలు చేపడుతోంది. టీడీపీ హయాంలో 2014 - 2019 మధ్య దర్యాప్తు పూర్తిచేయడానికి సగటున 206 రోజులు పడితే.. ఇప్పుడు ఆ సరాసరి 86 రోజులకు తగ్గింది. టీడీపీ హయాంలో 44 శాతం కేసుల్లోనే చార్జ్‌షీట్లు దాఖలు చేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చార్జ్‌షీట్ల నమోదు 73 శాతానికి పెరిగింది. శిక్షలూ గణనీయంగా పెరిగాయి.

ఎస్సీ, ఎస్టీలపై దాడుల కేసుల్లో శిక్షల శాతం టీడీపీ ప్రభుత్వంలో	ఏడాది	శిక్షల శాతం
	2014	5.4
	2015	5.5
	2016	3.2
	2017	5.5
	2018	5.7

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బాధితులకు మెరుగైన పరిహారం

2019	6.8
2020 నుంచి	10

దాడులు, వేధింపుల కేసుల్లో బాధితులైన ఎస్సీ, ఎస్టీలను ఆదుకోవడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉదారంగా వ్యవహరిస్తోంది. బాధితులకు పరిహారాన్ని భారీగా పెంచింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో దాడులు, వేధింపులకు గురైనవారికి కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిహారాన్ని పంపిణీ చేసింది. చంద్రబాబు ప్రభుత్వం 2014 నుంచి 2019 వరకు అయిదేళ్లలో కేవలం రూ.54.60 కోట్లే బాధితులకు పరిహారంగా ఇచ్చింది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలోనే మొత్తం రూ.159.30 కోట్లు పరిహారంగా అందించి బాధితులను ఆదుకుంది.

బాబు హయాంలో దమనకాండ.. వైఎస్సార్‌సీపీ హయాంలో భరోసా

చంద్రబాబు ప్రభుత్వ హయాంను ఎస్సీ, ఎస్టీలపై యథేచ్ఛగా సాగిన దమనకాండ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలను ఎప్పటికీ వెన్నాడే పీడకలే. 2014-19 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో దేశంలోనే ఎస్సీ, ఎస్టీలపై దాడులు అత్యధికంగా జరిగిన టాప్-10 రాష్ట్రాల జాబితాలో ఆంధ్ర ప్రదేశ్ కూడా ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎస్సీ, ఎస్టీలపై దాడులు గణనీయంగా తగ్గాయి. ఇందుకు ఈ గణాంకాలే నిదర్శనం..

ఎవరి హయాంలో ఎన్ని...	ఏడాదికి సగటున నమోదైన ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల కేసులు	లక్షమంది ఎస్సీ, ఎస్టీ జనాభాకు నమోదైన కేసులు
2014-18 (టీడీపీ ప్రభుత్వంలో)	3,418	25
2019-22(వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో)	2,312	20.45

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఆపన్నహస్తం

టీడీపీ హయాంలో ఆత్మహత్యకు పాల్పడిన రైతులకు రూ.5 లక్షల పరిహారం ఇచ్చేవారు. దాంట్లో రూ.1.5 లక్షల్ని అప్పులకు జమ చేసుకుని, మిగిలిన 3.5 లక్షలు కూడా విత్‌డ్రా చేసుకునేందుకు వీలు లేకుండా డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని మాత్రమే వాడుకునే పరిస్థితి కల్పించేవారు. ఎప్పుడో ఐదేళ్లకో, పదేళ్లకో ఆ డబ్బును విత్ డ్రా చేసుకునే అవకాశం ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే సీఎం వైఎస్ జగన్ ఈ పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచారు. ఆ మొత్తాన్ని ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాల ఖాతాలకు నేరుగా జమ చేస్తున్నారు. వ్యవసాయాధారిత కారణాల వల్ల ఆత్మహత్య చేసుకునే కౌలుదారుల కుటుంబాలకు కూడా రూ.7 లక్షలు పరిహారం నేరుగా వారి ఖాతాకు జమ చేస్తున్నారు. ఇలా 2019 నుంచి ఇప్పటివరకు 1,270 రైతు కుటుంబాలకు రూ. 88.90 కోట్లు పరిహారం చెల్లించారు. ఇందులో 485 మంది కౌలు రైతులుండగా, ఆ కుటుంబాలకు రూ.33.95 కోట్లు సాయం అందించారు. 2014 - 19 మధ్య జరిగిన రైతు ఆత్మహత్యలపై పునర్విచారణ జరిపి 474 మందికి రూ.23.70 కోట్లు పరిహారం చెల్లించగా, వీరిలో కూడా 212 మంది కౌలు రైతులున్నారు. వీరికి రూ.10.60 కోట్ల పరిహారం చెల్లించారు. ఈ వాస్తవాలను విస్మరించి రామోజీరావు అసత్యాలతో ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారు.

డోన్ టీడీపీ ఇన్‌చార్జికి రెండు చోట్ల ఓటు

కుటుంబ సభ్యులకూ డబుల్ ఎంట్రీ

డోన్: దొంగే.. దొంగ అన్నట్లుగా ఉంది టీడీపీ నాయకుల వ్యవహారం. ఓటర్ల జాబితాలో అధికారపార్టీ అవకతవకలకు పాల్పడుతోంది అని విష ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులే.. తాము చేసిన అక్రమాలతో వరుసగా బయట పడుతున్నారు. తాజాగా ఆ పార్టీ డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి కుటుంబ సభ్యుల పేర్లు ఓటర్ల జాబితాలో రెండు చోట్ల ఉన్నట్లు బయటపడింది. ధర్మవరం గ్రామంలో పోలింగ్ బూత్ 142, 91లలోని ఓటర్ల జాబితాలో ధర్మవరం సుబ్బారెడ్డి, ఆయన సతీమణి మన్నె మల్లేశ్వరిల పేర్లు 962, 963, 985, 988 సీరియల్ నంబర్లలో ఉన్నాయి. ఆయన కుమారుడు గౌతంకుమార్‌రెడ్డి డోన్ పట్టణంలోని 142, 91వ పోలింగ్ బూత్‌లలో సీరియల్ నంబర్ 47, 984గాను, ఆయన పెద్దకోడలు సాత్విక ఓటు పోలింగ్ బూత్‌లు 142, 92లో 54, 199 సీరియల్ నంబర్‌లో ఉన్నాయి. వారి బంధువు జగన్‌మోహన్‌రెడ్డి పేరు ఓటర్ల జాబితాలో 142, 118 పోలింగ్ బూత్‌లలో 25, 56 సీరియల్ నంబర్లలో ఉన్నాయి. ధర్మవరం సుబ్బారెడ్డి తన గ్రామంలో స్నేహితులు, బంధువులు, సన్నిహితుల పేర్లను దొంగ ఓట్లుగా జాబితాలో చేర్పించడం ఆనవాయితీగా వస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుత డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డితో పాటు మరో 168 పేర్లను ధర్మవరం ఓటర్ల జాబితాలో సుబ్బారెడ్డి డబుల్ ఎంట్రీ చేయించిన సంగతి ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. ఈ డబుల్ ఎంట్రీల విషయాన్ని ఆర్డీవో వెంకటరెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన డోన్ తహసీల్దార్ విద్యాసాగర్‌ను విచారణ చేయాల్సిందిగా ఆదేశించారు.



రెండు పోలింగ్ బూత్‌ల ఓటర్ల జాబితాలో నమోదైన ధర్మవరం కుటుంబ సభ్యుల వివరాలు

పెన్నా, సంగం బ్యారేజ్‌ల గేట్లు ఎత్తివేత

సముద్రంలోకి 6,950 క్యూసెక్కుల విడుదల

- మిచాంగ్ తుపాను ప్రభావంతో తిరుపతి, నెల్లూరు, వైఎస్సార్, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాలు
- తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో నిండిన చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులు
- తిరుమలలో నిండిన కుమారధార, పసుపుధార, పాపవినాశం, గోగర్భం డ్యామ్‌లు
- సోమశిలలోకి 10,915, కండలేరులోకి 10,350 క్యూసెక్కుల ప్రవాహం

సాక్షి, అమరావతి : మిచాంగ్ తుపాను ప్రభావంతో తిరుపతి, నెల్లూరు, వైఎస్సార్, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో పెన్నా, దాని ఉప నదులు, వాగులు, వంకలు ఉరకలెత్తుతున్నాయి. వరద ప్రవాహం చేరుతుండటంతో చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులు నిండుతున్నాయి. అలాగే, తిరుమల కొండపై విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కుమారధార, పసుపుధార, పాపవినాశం, గోగర్భం డ్యామ్‌లు నిండిపోయాయి. తిరుపతి జిల్లాలోనూ విస్తారంగా వర్షాలు కారణంగా పెన్నా ఉప నదులు అరణియార్, స్వర్ణముఖి నదులు వరదెత్తాయి. దీంతో అరణియార్ (1.85 టీఎంసీలు) నిండిపోవడంతో గేట్లు ఎత్తి 7,100 క్యూసెక్కులు దిగువకు వదిలేస్తున్నారు. తిరుపతి జిల్లాలో మల్లిమడుగు, కళ్యాణ్ తదితర చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులు కూడా నిండుకుండలను తలపిస్తున్నాయి.

స్వర్ణముఖి బ్యారేజ్ గేట్లు ఎత్తివేత

ఇక ప్రకాశం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో గుండ్లకమ్మ ప్రాజెక్టులోకి 4,949 క్యూసెక్కులు చేరుతున్నాయి. దీంతో ఈ ప్రాజెక్టులో నీటినిల్వ 1.55 టీఎంసీలకు చేరుకుంది. స్వర్ణముఖి నది పరవళ్లు తొక్కుతుండటంతో స్వర్ణముఖి బ్యారేజ్ గేట్లు ఎత్తేశారు. ఉప నదులు ఉరకలెత్తుతుండటంతో పెన్నా నుంచి సోమశిలలోకి 10,915 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఫలితంగా సోమశిలలో నీటినిల్వ 30.76 టీఎంసీలకు చేరుకుంది. కండలేరులోకి 10,350 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 12.52 టీఎంసీలకు చేరుకుంది. సోమశిల దిగువన కురుస్తున్న వర్షాలకు పెన్నా నుంచి సంగం బ్యారేజ్‌లోకి 6,035 క్యూసెక్కులు చేరుతున్నాయి. బ్యారేజ్‌లో నీటినిల్వ గరిష్ట స్థాయికి అంటే 0.45 టీఎంసీలకు చేరుకోవడంతో గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదిలేస్తున్నారు. పెన్నా బ్యారేజ్‌లోకి 6,800 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ గరిష్ఠ స్థాయికి అంటే 0.25 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ నుంచి వరద వస్తుండటంతో బ్యారేజ్ గేట్లు ఎత్తి 6,950 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు.

శాంతికి భద్రత.. నేరానికి శిక్ష

▶ మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేసింది. ఎన్‌సీఆర్‌బీ తాజా నివేదికలోని అంశాలు సంగ్రహంగా..

అన్ని రకాల నేరాలు తగ్గుదల

రాష్ట్రంలో అన్ని రకాల నేరాలు తగ్గాయి. నేరాలకు పాల్పడితే నమోదు చేసే ఐపీసీ సెక్షన్ల కేసులు, పౌరులు చట్టబద్ధంగా వ్యవహరించేలా చేసేందుకు ప్రత్యేక స్థానిక చట్టాల కింద (స్పెషల్ లోకల్ లాస్ - ఎస్ఎల్ఎల్) నమోదు చేసే (ట్రాఫిక్ ఉల్లంఘన, కోవిడ్ నిబంధనల ఉల్లంఘన వంటివి) కేసులు కూడా తగ్గడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. 2022లో రాష్ట్రంలో మొత్తం 1,95,284 కేసులు నమోదయ్యాయి. వాటిలో ఐపీసీ సెక్షన్ల కేసులు 1,56,503, ఎస్ఎల్ఎల్ కేసులు 36,737 ఉన్నాయి. గత రెండేళ్లతో పోలిస్తే రాష్ట్రంలో నేరాల సంఖ్య బాగా తగ్గడం ప్రాధాన్యత సంతరించుకుంది. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో ఐపీసీ నేరాలు 11.72 శాతం, ఎస్ఎల్ఎల్ నేరాలు 13.73 శాతం తగ్గాయి. వెరసి రాష్ట్రం మొత్తం మీద 12.11 శాతం కేసులు తగ్గాయని ఎన్‌సీఆర్‌బీ నివేదిక స్పష్టం చేసింది. నేరాలకు పాల్పడేవారికి న్యాయస్థానం ద్వారా శిక్షలు విధించేలా పర్యవేక్షించడంలో పోలీసు శాఖ చిత్తశుద్ధితో వ్యవహరిస్తోంది. అందుకోసం సత్వరం చార్జిషీట్లు దాఖలు చేస్తూ దర్యాప్తును వేగవంతం చేస్తోంది. 2022లో ఐపీసీ కేసుల్లో 86.5 శాతం, ఎస్ఎల్ఎల్ కేసుల్లో 96.4 శాతం కేసుల్లో నిర్ణీత వ్యవధి 60 రోజుల్లో చార్జిషీట్లు దాఖలు చేసింది. మొత్తం మీద 88.9 శాతం కేసుల్లో నిర్ణీత వ్యవధిలో చార్జిషీట్లు దాఖలు చేసింది.

తగ్గిన హత్యలు

అసాంఘిక శక్తుల ఆటకట్టించడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో హత్యలు తగ్గడమే అందుకు నిదర్శనం. 2021లో రాష్ట్రంలో 956 మంది హత్యకు గురికాగా.. ఆ సంఖ్య 2022లో 925కి తగ్గింది. హత్యల రేటు ఉత్తరాది రాష్ట్రాల్లో మూడు శాతానికిపైగా ఉండగా.. తెలంగాణలో 2.5 శాతం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇది 1.7 శాతం మాత్రమే. హత్యకేసుల్లో దేశంలో టాప్-20 రాష్ట్రాల జాబితాలో కూడా ఆంధ్రప్రదేశ్ లేదు.

అత్యాచారాలు 47.72 శాతం తగ్గుదల, వరకట్న వేధింపుల కట్టడి

దిశ యాప్, దిశ వ్యవస్థ వంటి విప్లవాత్మక విధానాలతో మహిళల భద్రత కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. రాష్ట్రంలో మహిళలపై వేధింపులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ప్రధానంగా అత్యాచారాలు, వరకట్న వేధింపుల కేసులు తగ్గడం దీనికి నిదర్శనం. 2021లో రాష్ట్రంలో 1,188 అత్యాచారాల కేసులు నమోదు కాగా 2022లో 621 కేసులు నమోదయ్యాయి. అత్యాచారాల కేసులు దేశంలోకెల్లా అత్యధికంగా రాష్ట్రంలో 47.72 శాతం తగ్గడం ప్రభుత్వం సాధించిన విజయంగా చెప్పుకోవచ్చు. ఇక 2021లో రాష్ట్రంలో 111 వరకట్న కేసులు నమోదు కాగా 2022లో వందకు తగ్గాయి. వరకట్న కేసుల రేటు కేవలం 0.4 శాతానికే పరిమితమైంది. ఇక యాసిడ్ దాడుల కేసులు 2021లో ఏడు నమోదు కాగా 2022కు అవి నాలుగుకు తగ్గాయి.

ఘర్షణలు, అల్లర్ల కట్టడి

రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు అల్లరిమూకలు చేసే కుట్రలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా కట్టడి చేస్తోంది. ఘర్షణలు, అల్లర్ల కేసులు గణనీయంగా తగ్గాయి. 2021లో రాష్ట్రంలో 444 ఘర్షణలు, అల్లర్ల కేసులు నమోదు కాగా 2022లో వాటి సంఖ్య 304కు తగ్గడం శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వ చిత్తశుద్ధిని వెల్లడిస్తోంది.

ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం మూడేళ్లలో రాష్ట్రంలో కేసుల వివరాలు

కేసులు	2020	2021	2022
ఐపీసీ కేసులు	1,88,997	1,79,611	1,58,547
ఎస్ఎల్ఎల్ కేసులు	49,108	42,588	36,737
మొత్తం కేసులు	2,38,105	2,22,199	1,95,284

తగ్గిన రైతుల ఆత్మహత్యలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వం అని మరోసారి నిరూపించుకుంది. రైతు సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు విజయవంతమవుతున్నాయి. సాగు లాభసాటిగా మారడంతో రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయి. 2021లో రాష్ట్రంలో 481 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వారిలో భూయజమానులైన రైతులు 359 మంది, కౌలురైతులు 122 మంది ఉన్నారు. 2022లో రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు 369కి తగ్గాయి. వారిలో భూయజమానులైన రైతులు 309 మంది, కౌలురైతులు 60 మంది ఉన్నారు. 2021లో 584 మంది వ్యవసాయ కూలీలు ఇతరత్రా కారణాలతో ఆత్మహత్య చేసుకోగా.. 2022లో వ్యవసాయ కూలీల ఆత్మహత్యలు 548కి తగ్గాయి. మొత్తం మీద వ్యవసాయంపై ప్రత్యక్షంగా ఆధారపడేవారు 2021లో 1,065 మంది ఆత్మహత్య చేసుకోగా.. 2022లో ఆ సంఖ్య 917కు తగ్గింది.

తిరుమల జలాశయాలు కళ కళ

- నిండు కుండల్లా పాపవినాశం, గోగర్భం, కుమారధార, పసుపు ధార, ఆకాశగంగ డ్యాంలు
- ఏడాదికి సరిపడా తాగునీళ్లు



గోగర్భం డ్యాంను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

తిరుమల: తుపాన్ ప్రభావంతో గత నాలుగు రోజు లుగా కురుస్తున్న వర్షాలకు తిరుమలలోని జలాశయాలన్నీ నిండుకుండలా మారిపోయాయి. తిరుమలలో ఉన్న ఐదు ప్రధాన జలాశయాలైన పాపవినాశం, గోగర్భం డ్యాం గేట్లను ఎత్తి నీటిని వదిలి వేస్తుండగా కుమారధార, పసుపు ధార, ఆకాశగంగ డ్యాంలలో నుంచి నీరు ఓవర్ ఫ్లో అవుతుంది. దీంతో తిరుమలకు మరో రెండు వందల యాభై రోజుల వరకు తాగునీటి అవసరాలకు ఎలాంటి ఢోకా ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. పాప వినాశం డ్యామ్‌లో 693 మీటర్లు, గోగర్భం డ్యాంలో 2887 అడుగులు, ఆకాశగంగా డ్యామ్‌లో 859, కుమారధార డ్యాంలో 895, పసుపుధార డ్యామ్‌లో 895 మీటర్ల ఎత్తుకు నీటి ప్రవాహం చేరుకుంది. కళ్యాణి డ్యాంలో కూడా ఇప్పటికే 35 శాతం నీరు నిండగా మరోవైపు 5 వైపులనుంచి నీటి ప్రవాహం వస్తుండడంతో మరో రెండు మూడు రోజుల్లో నిండే అవకాశాలున్నాయి. ప్రస్తుతం కళ్యాణి డ్యాంకు 2000 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా.. తిరుపతి తాగునీటి అవసరాల కోసం ఐదు క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. కాగా, మిచాంగ్ తుఫాను కారణంగా తిరుమలలో నిండిన జలాశయాలను మంగళవారం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

ఘనంగా నారా జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నారా సూర్యనారాయణరెడ్డి

సాక్షి బళ్లారి: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కురుగోడు మాజీ ఎమ్మెల్యే, సమాజ సేవకుడు నారా సూర్యనారాయణరెడ్డి 70వ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. తన జన్మదినాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు కాలనీల్లో అన్నదానం చేశారు. ఆయన తనయుడు, నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డితో కలిసి కేక్ కట్ చేసి పరస్పరం స్వీట్లు పంచుకొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు గాంధీనగర్‌లోని తన కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

బైక్‌ను లారీ ఢీకొని ఇద్దరు మృతి

హుబ్లీ: బైక్, లారీల మధ్య మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. కలఘటగి వైపు నుంచి హుబ్లీ వైపునకు వస్తున్న లారీ వేగాన్ని నియంత్రించలేక హుబ్లీ నుంచి కలఘటగి వైపునకు వస్తున్న బైక్‌పై బోల్తా పడింది. ఫలితంగా లారీ కింద బైక్ చోదకుడు గఫార్‌సాబ్, వెనుక సీట్లో కూర్చొన్న హుస్సేన్ నబీలపై లారీలో ఉన్న మొక్కజొన్న బస్తాలు పడిపోయాయి. దీంతో వారిద్దరూ గాయపడి ఊపిరి ఆడక మృతి చెందారు. ఘటనపై కలఘటగి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా బసవేశ్వర రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, భక్తులు

రాయచూరు రూరల్: తాలూకాలోని హొసపేటెలో బసవేశ్వర జాతర, రథోత్సవం వైభవంగా జరిగింది. సోమవారం రాత్రి రథోత్సవాన్ని వందలాది మంది భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ తదితరులు హాజరయ్యారు.

ఓటరుగా పేరు నమోదు చేసుకోండి

రాయచూరు రూరల్: జిల్లాలో ఓటరు జాబితాలో 18 ఏళ్ల వయస్సు నిండిన యువతీ, యువకులు పేర్లు నమోదు చేసుకోవాలని అదనపు జిల్లాధికారి దురుగేష్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరు పేరు నమోదు చేసుకునేందుకు ముందుకు రావాలన్నారు.

హట్టిలో బైపాస్ రోడ్డు నిర్మించరూ



వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

రాయచూరు రూరల్: లింగసూగూరు తాలూకా హట్టిలో బైపాస్ రోడ్డు నిర్మించాలని హిందూ, దళిత సంఘర్ష సమితి అధ్యక్షుడు వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి మాట్లాడారు. హట్టిలో వంతెన నిర్మాణంలో జాప్యం జరగడంతో క్యాంప్ నుంచి హట్టికి వెళ్లడానికి ఇబ్బందులు నెలకొన్నాయన్నారు. అందుకోసం ప్రత్యామ్నాయంగా నిర్మించిన బైపాస్ రోడ్డు అధ్వానంగా మారిందని, దాన్ని పునర్నిర్మించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

పంచాక్షరి మంత్రంతో ప్రశాంతత



మంత్రాన్ని పఠిస్తున్న దృశ్యం

కంప్లి: నిత్యం పంచాక్షరి మంత్ర పఠనంతో మానసిక ప్రశాంతత పొందవచ్చని బాదనహట్టి కరిబసవ శరణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. బాదనహట్టి గ్రామంలోని బ్రహ్మనిష్ఠ బసయ్య తాత మఠంలో ఏర్పాటు చేసిన సోలాపుర సిద్దరామేశ్వర పురాణ ప్రవచనంలో ఆయన ఆశీర్వాదం అందించారు. లింగభస్మం, రుద్రాక్ష ధారణ చేయడం వల్ల రోగాల నుంచి కాపాడుకోవచ్చన్నారు. బాదనహట్టి కే.మౌనేష్ ఆచార్ పురాణ ప్రవచనం అందించగా, కే.మంజునాథ్ పురాణ పఠనం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి వేటలో వలస కూలీల మృత్యుఘోష



ప్రమాదస్థలిలో సహాయక చర్యలు చేపట్టిన దృశ్యం



సహాయక చర్యల్లో పాల్గొన్న పోలీసు, అగ్నిమాపక సిబ్బంది



మృతదేహాలను తరలిస్తున్న పోలీసులు

- మొక్కజొన్న రాశి కింద చిక్కిన కార్మికులు
- ఏడు మంది దుర్మరణం
- విజయపుర జిల్లాలో ఘోరం

సాక్షి, బళ్లారి: ఎక్కడో పరాయి రాష్ట్రం నుంచి వచ్చి కర్మాగారంలో పని చేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నారు. కానీ విధి చిన్నచూపు చూసింది. విజయపుర జిల్లా కేంద్రంలో ఘోర ప్రమాదంలో ఏడుమంది బిహార్ వలస కూలీలు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం రాత్రి రాజ్‌గురు ఇండస్ట్రీస్ మొక్కజొన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో పని చేస్తున్న 11 మంది కార్మికులపై ఒక పెద్ద కంటైనర్ ధ్వంసమై మొక్కజొన్న బస్తాలు పడ్డాయి. ఇవి సుమారు వంద టన్నుల వరకూ బరువు ఉంటాయని అంచనా.

భారీగా సహాయక చర్యలు

పెద్ద మొక్కజొన్న రాశి కింద అందరూ చిక్కుకుపోయారు. వెంటనే జిల్లా యంత్రాంగం జేసీబీలు, బుల్డోజర్లతో సహా పెద్దసంఖ్యలో సహాయక సిబ్బందితో రక్షణ చర్యలు చేపట్టి మంగళవారం మధ్యాహ్నం వరకు నలుగురిని రక్షించారు. మిగతా 7 మంది రాజేష్ ముఖియా (25), సంబు ముఖియా (26), రఫ్రీద్ ముఖియా (29), రాంబాలక్ (38), లోకి జాధవ్ (56), కిషన్ కుమార్ (20), దాలచంద (30) అనేవారు అప్పటికే ఊపిరి ఆడక మృతి చెందారు. రక్షించినవారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారిని ఆస్పత్రికి తరలించారు.

రూ.7 లక్షల పరిహారం: మంత్రి

పరిశ్రమల మంత్రి ఎంబీ పాటిల్ ఘటనాస్థలిని పరిశీలించి మాట్లాడారు. పరిశ్రమ యజమాని కిషోర్‌కుమార్ జైన్ నుంచి రూ. 5 లక్షలు, సర్కారు నుంచి రూ. 2 లక్షలు చొప్పున ఒక్కో కుటుంబానికి రూ. 7 లక్షల పరిహారం ఇప్పిస్తామని మంత్రి ప్రకటించారు. గాయపడిన వారికి రూ.2 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చారు. మృతదేహాలను విమానంలో బిహార్‌కు పంపుతామని తెలిపారు. ఫ్యాక్టరీలో ప్రమాదం చోటు చేసుకోవడంతో సిబ్బంది పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఘటనపై ఎస్పీ రిషికేష్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

జాతర కాదు బస్టాండే.!



బస్సుల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు, ప్రజలు

కంప్లి: కొట్టూరు ఆర్‌టీసీ బస్టాండ్ చాలా ఏళ్లుగా మౌలిక సదుపాయాలు లేక సమస్యలకు నిలయంగా మారింది. నిత్యం 300కు పైగా బస్సులు ఈ బస్టాండ్ గుండా రాకపోకలు సాగిస్తుంటాయి. విద్యార్థులు, రైతులు తమ పనుల కోసం నిత్యం పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. డ్రైవర్లు బస్సులు నిలిపేందుకు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ప్రధానంగా బస్టాండ్ ప్రాంతం చిన్నదిగా ఉన్నా మరొక వైపు వీధి పశువుల బెడద వల్ల ప్రయాణికులు, రైతులు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి.

మిరప రైతుకు మిగిలింది నష్టాలే

కంప్లి: గోరుచుట్టుపై రోకటి పోటులా అసలే కరువు, వర్షాలు లేక పంటలు దిగుబడి అందించి ఆదుకుంటాయో..లేదో? ఇలా అనేక సమస్యలతో సతమతమవుతున్న మిరప రైతుకు అన్నీ నష్టాలే ఎదురవుతున్న పరిస్థితి. రైతాంగం వరి, అరటిసాగు తప్పితే అత్యధికంగా మిరప సాగు చేస్తున్నారు. గతంలో శ్రీరామరంగాపుర, సుగ్గేనహళ్లి గ్రామాలతో పాటు అనేక గ్రామాల్లో 4500 కంటే పైగా ఎకరాల్లో మిరప పంటకు వల్ల నుసిరోగం(బ్లాక్ రైస్స్) సోకింది. లక్షలాది రూపాయలు మిరపసాగు కోసం పెట్టుబడి పెట్టినా చివరికి నష్టాలే చవిచూడవలసి వచ్చిందని శ్రీరామరంగాపుర, సుగ్గేనహళ్లి గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

సమాజంలో సౌహార్ధతకే పెద్దపీట

- సీఎం సిద్ధరామయ్య



కార్యక్రమంలో పాల్గొన్న సీఎం సిద్ధరామయ్యను అభినందిస్తున్న ముస్లిం పెద్దలు

హుబ్లీ: ఎట్టి పరిస్థితిలోను ముస్లింలెవరికీ అన్యాయం జరగడానికి అంగీకరించబోమని, వారి రక్షణకు తమ సర్కారు ఉందని, మైనార్టీ సంక్షేమం, ధార్మిక కేంద్రాల అభివృద్ధికి రూ.10 వేల కోట్లు ఇచ్చామని సీఎం సిద్ధరామయ్య తెలిపారు. నగర శివారులోని పాల గ్రామంలో సూఫీ సంతుల సమావేశంలో మాట్లాడారు. తమ ప్రభుత్వంలో పెద్ద, చిన్న అనే భేదం లేదన్నారు. తాము అధికారంలో ఉన్నంత వరకు సమాజంలో సౌహార్ధత నెలకొల్పడానికి కృషి చేస్తామన్నారు. అన్ని మతాలు, ధర్మాలు మానవత్వాన్ని బోధించాయి. ముస్లింలు కూడా ఈ దేశ ప్రజలు. ఈ దేశ సంపదలో వారికీ వాటా ఉంది. అందరికీ సమానంగా సంపదను పంచాలన్నారు. కొన్ని శక్తులు రాజకీయ కారణాలతో సమాజంలో కులమతాల మధ్య విద్వేషాలు రగిలిస్తున్నారు. ఈ విషయంలో ప్రజలు చైతన్యవంతులు కావాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కోరారు. కార్యక్రమంలో మంత్రులు హెచ్‌కే పాటిల్, సంతోష్ లాడ్, ఎమ్మెల్యేలు ప్రసాద్ అబ్బయ్య, కోనరెడ్డి, సలీం అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల ప్రదానం ప్రోత్సాహకరం



అవార్డును అందుకుంటున్న దృశ్యం

రాయచూరు రూరల్: సమాజ సేవకులకు అవార్డులు అందించడం ప్రోత్సాహకరమని యాదగిరి జిల్లాధికారి సుశీల పేర్కొన్నారు. ఆమె సోమవారం సాయంత్రం యాదగిరిలోని విస్తార భవనంలో విద్యారంగంలో ఉత్తమ ఉపాధ్యాయులకు, సమాజానికి సేవలు అందించిన వారికి అవార్డులు అందించి మాట్లాడారు. సమాజంలో ఒడిదుడుకులను ఎదుర్కొని అన్ని రంగాల్లో పైమెట్టు ఎక్కాలన్నారు. సమాజంలోని మంచి చెడులను గురించి ఆలోచించే స్వభావం ఉండాలన్నారు. అవార్డులు పొందిన ప్రతి ఒక్కరూ సమాజాన్ని సన్మార్గం వైపు తీసుకెళ్లాలని పిలుపు ఇచ్చారు. కందుకూరులో సైన్స్ ఉపాధ్యాయిని మధుమతి రూ.3 లక్షల స్వంత ఖర్చుతో విద్యార్థులకు ప్రయోగశాల పరికరాలను అందించడం అభినందనీయమన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం తప్పనిసరి



మాట్లాడుతున్న చేతన్ కుమార్

రాయచూరు రూరల్: పిల్లలకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి చేతన్ కుమార్ పిలుపు ఇచ్చారు. మంగళవారం నగరంలోని లాల్ బహదూర్ శాస్త్రినగరలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమావేశంలో సీడీపీఓ వెంకటేష్ దేశాయి, సూపర్ వైజర్లు గంగమ్మ, భారతి, శరణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త సరస్వతిలున్నారు.

యోగా, ధ్యానంతో ఆయుష్షు వృద్ధి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: యోగా, ధ్యానంతో మానవుడి ఆయుష్షు వృద్ధి చెందుతుందని తాలూకా వ్యాయామ విద్యాధికారి బాషా సూచించారు. మంగళవారం ఆయుర్వేద సభా భవనంలో వ్యాయామ ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేటి రోజుల్లో పిల్లలు, పెద్దలు ఎండ వానలోకి వెళ్లాలంటే భయపడుతున్నారన్నారు. గొడుగు పట్టడం, క్యాప్ ధరించడం లేదా వర్షం పడని చోటకు పరుగున వెళ్లడం చేస్తున్నారన్నారు. వర్షపు నీరు ఎంతో శ్రేష్ఠమైనవని, వాటి వల్ల శరీరంపై భాగంలో ఉన్న చర్మానికి మంచిదన్నారు. యోగాసనాలు చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆయుర్వేద, యునాని ఆస్పత్రి అధికారి శంకర్‌గౌడ, వైద్యులు షకీల్, అమ్జాద్, కనకలక్ష్మి, పూజ, బసవరాజ్‌లున్నారు.

దాతల సౌకర్యాలచే లబ్ధి పొందాలి



యూనిఫాం పంపిణీ చేస్తున్న దృశ్యం

మాలూరు: పోటీ ప్రపంచంలో ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి దాతలు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని లక్కూరు ప్రభుత్వ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మంజునాథ్ తెలిపారు. మంగళవారం లక్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల సభాంగణంలో సమాజ సేవకుడు, ఏపీఎంసీ మాజీ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరెడ్డి కళాశాల విద్యార్థులకు యూనిఫాం, ఐడీ కార్డులు, విద్యా పరికరాలను అందించే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రామాణికత, క్రమశిక్షణతో మెలగాలని హితవు పలికారు. తల్లిదండ్రులు పిల్లలకు ఇళ్లలో సంస్కారాన్ని నేర్పించాలన్నారు. మొబైల్, టీవీలకు దూరంగా ఉంచాలన్నారు. డిగ్రీ కళాశాల కన్నడ విభాగం ప్రముఖుడు మనోహర్, కళాశాల ఉపన్యాసకుడు డాక్టర్ పి.శేఖర్ పాల్గొన్నారు.

హత్య కేసులో ఐదుగురి అరెస్ట్

హుబ్లీ: ఆస్తి కోసం ధార్వాడలో జరిగిన హత్య కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. హెబ్బళ్లి గ్రామ కల్లప్ప, అశోక్, మల్లికార్జున, శ్రీకాంత్, కిరణ్ అరెస్ట్ అయిన నిందితులు. నింగప్ప హతుడు. అవివాహితుడైన నింగప్పకు పెదనాన్న నుంచి 36 ఎకరాల పొలం వంశపారంపర్యంగా లభించింది. ఈక్రమంలో నింగప్ప తమ్ముడు కల్లప్ప వివాహితుడు, పిల్లలు ఉన్నారు. పిల్లల్లో ఒకరిని దత్తత తీసుకోవాలని అన్నయ్య నింగప్పను కల్లప్ప కోరాడు. అయితే దీనికి అంగీకరించని నింగప్ప ఇటీవలే 5 ఎకరాల పొలాన్ని విక్రయించాడు. ఇలాగే కొనసాగితే అన్న ఆస్తి మొత్తం చేజారి పోతుందన్న అక్కసుతో తమ్ముడు కల్లప్ప మారణాయుధాలతో నింగప్పను హత్య చేసినట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది.

అధ్యాపకుల డిమాండ్లు తీర్చండి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు

గంగావతి: అతిథి అధ్యాపకుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఒత్తిడి చేస్తూ వైయూఎస్‌టీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. సంఘం జిల్లాధ్యక్షుడు సర్వజ్ఞ మాట్లాడుతూ అతిథి అధ్యాపకులు తరగతులను బహిష్కరించి ధర్నా కొనసాగిస్తుండటంతో విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు లేక విద్యాభ్యాసం కుంటుపడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం అధ్యాపకుల సమస్యలను పరిష్కరించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని, లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ట్రాక్టర్ బైక్‌ను ఢీకొని యువకుడి మృతి

గంగావతి: వేగంగా వస్తున్న బైక్‌ను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనగా బైక్‌పై వెళుతున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన హణవాళ- ఉడమకల్ రోడ్డులో మంగళవారం జరిగింది. వివరాలు..ఉడమకల్‌కు చెందిన హనుమంత(26) అనే యువకుడు బైక్‌పై హణవాళకు వెళుతుండగా, హణవాళ నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి చేర్చగా, ట్రాక్టర్‌ను గంగావతి రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మొబైల్ ప్రయోగశాలతో విజ్ఞాన పాఠాల బోధన

కోలారు: విద్యార్థులకు మొబైల్ ప్రయోగశాల ద్వారా విజ్ఞాన శాస్త్ర విషయాలను నేర్పిస్తుండడం హర్షణీయమని అరాభికొత్తనూరు ప్రభుత్వ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం అరాభికొత్తనూరు ప్రభుత్వ పాఠశాలలో టెస్ట్ విద్యార్థులకు కుప్పంకు చెందిన అగస్త్య ఫౌండేషన్ మొబైల్ ప్రయోగశాల ద్వారా విజ్ఞానశాస్త్ర విషయాల అభ్యసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

పక్కాగా ఆక్రమణల తొలగింపు



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగవేణి

కేజీఎఫ్: గ్రామ స్కెచ్ ప్రకారం కాలువ ఎంత విస్తీర్ణంలో ఉంటుందో గుర్తించి ఆక్రమిత భాగాన్ని తొలగించి తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ నాగవేణి హెచ్చరించారు. మంగళవారం నగరంలోని మెస్కాం సర్వే నెంబరు-100లో గొడనకెరె ప్రభుత్వ కాలువ సర్వేను నిర్వహించి మాట్లాడారు. ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ కాలువను ఆక్రమించుకుని కాంపౌండు నిర్మించినట్లు గత నెలలో నిర్వహించిన జనతా దర్శన్‌లో అధికారులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వేలో ఆక్రమణ అని తెలిస్తే వెంటనే జేసీబీ సహాయంతో ఆక్రమణలు తొలగిస్తున్నామన్నారు. కాలువపై నిర్మించిన ప్రభుత్వ, ప్రైవేట్ కట్టడాల సమాచారాన్ని సంబంధిత శాఖ నుంచి తీసుకుని పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణను బాధ్యతగా తీసుకుంటామన్నారు. సర్వేలో కమిషనర్ పవన్‌కుమార్, నగరాభివృద్ధి కమిషనర్ ధర్మేంద్ర, ఇన్‌స్పెక్టర్ నవీన్ పాల్గొన్నారు.

వినూత్న రీతిలో పంటల రక్షణ



పొలంలో ఏర్పాటు చేసిన స్పీకర్

కంప్లి: మూగజీవాలు, అడవి జంతువులు, పక్షుల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు హగరిబొమ్మనహళ్లి తాలూకాలోని భువనహళ్లి, శిరనాయకనహళ్లి గ్రామాల రైతులు వినూత్న పద్ధతిని ప్రారంభించారు. పొలం మధ్యలో కట్టను పాతి చిన్న స్పీకర్ అమర్చారు. స్పీకర్ స్విచ్ వేయగానే ఆ శబ్దం సుమారు ఒక ఫర్లాంగు దూరం వరకు వినిపిస్తుంది. ఆ శబ్దానికి భయపడి అడవి పందులు పరుగులు తీయగా, చిలకలు, పిచ్చుకలు ఎగిరి పోతాయి. ఈ రెండు గ్రామాల్లో సుమారు 20కు పైగా స్పీకర్లు అమర్చారు. వీటితో రైతులు పొలాల్లో కావలా కాసే పని తప్పిందని చెప్పవచ్చు.

చెక్‌పోస్టులు ప్రారంభం



వరిగడ్డిని ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

కంప్లి: పక్క రాష్ట్రానికి వరిగడ్డి రవాణాను అరికట్టేందుకు తాలూకా సరిహద్దు ప్రాంతాల్లో 4 చెక్‌పోస్ట్‌లను ప్రారంభించినట్లు తహసీల్దార్ హెచ్.విశ్వనాథ్ తెలిపారు. ఆయన మంగళవారం తాలూకా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చెక్‌పోస్ట్‌ల్లో రెవెన్యూ సిబ్బంది, ఒక పోలీసు కానిస్టేబుల్ పని చేస్తున్నట్లు తెలిపారు. తమ గడ్డిని తమ వద్దనే మిగుల్చుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ప్రారంభించామన్నారు. వర్షాలు ఒక వైపు కనుమరుగై తాలూకా కరువు కోరల్లో చిక్కుకొని చాలీచాలని వరిగడ్డి దిగుబడి రావడంతో ఆ వచ్చిన దాంట్లో వరి గడ్డిని తమ తాలూకాలోని పశువుల కోసం మిగుల్చుకోవడం ఎంతో ముఖ్యమన్నారు.

ఈఈ ఇంటిపై లోకాయుక్త దాడి



కేజీఎఫ్‌లోని తిమ్మరాయప్ప ఇల్లు

కేజీఎఫ్: రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం లోకాయుక్త నిర్వహించిన దాడుల్లో భాగంగా కేజీఎఫ్‌లోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తిమ్మరాయప్ప ఇంటిపై లోకాయుక్త అధికారులు ఉదయం దాడి నిర్వహించారు. బెళగావిలో విధులు నిర్వహిస్తున్న తిమ్మరాయప్పకు చెందిన కేజీఎఫ్‌లోని ఆయన నివాసంపై లోకాయుక్త అధికారులు దాడి చేశారు. తిమ్మరాయప్ప సంబంధీకుల ఇళ్లపై కూడా లోకాయుక్త అధికారులు ఏకకాలంలో దాడి జరిపారు. అయితే దాడుల్లో అధికారులు స్వాధీనం చేసుకున్నవేంటో మాత్రం ఇంకా బహిరంగ పరచలేదు.

ఉద్యోగుల అలసత్వం ఖండిస్తూ ధర్నా



నగరసభ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

కోలారు: నగరసభ అధికారులు, సిబ్బంది సకాలంలో ప్రజా సమస్యలపై స్పందించడం లేదని, ప్రజా పనులపై తీవ్ర నిర్లక్ష్యభావంతో ఉన్నారని ఆరోపిస్తూ మంగళవారం పలువురు నగరసభ సభ్యులతో పాటు నగర ప్రజలు నగరసభ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా చేశారు. నగరసభ కార్యాలయంలో అధికారులతో పాటు సిబ్బంది వర్గం ఎవరూ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఆసక్తి కనపర్చడం లేదని, విధులకు ఇష్టారాజ్యంగా ఎప్పుడంటే అప్పుడు వచ్చి వెళుతుంటారని ఆందోళనకారులు ఆరోపించారు. పలువురు సిబ్బంది మధ్యాహ్నం అయిందంటే కార్యాలయంలో కనిపించరని వాపోయారు. నగరసభ సభ్యుడు ఎస్ ఆర్ మురళీగౌడ మాట్లాడుతూ నగరసభ పాలన గాడి తప్పిందన్నారు. సిబ్బంది ఎప్పుడు ప్రశ్నించినా క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్నామని సాకులు చెబుతారన్నారు. కార్యాలయంలో లంచం లేనిదే ఏ పనీ జరగడం లేదన్నారు. రెవిన్యూ విభాగంలో అవినీతి తాండవిస్తోందన్నారు. నగరసభ సభ్యుడు ప్రవీణ్‌గౌడ, వడగూరు రాకేష్, రమేష్, గుణశేఖర్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

18 నుంచి జాగృతి సమావేశాలు



పార్కు నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న దృశ్యం

కంప్లి: పోలీసు అధికారులు నెలకోసారి 8 నుంచి 10 గ్రామాలకు వెళ్లి గ్రామస్తులతో సమావేశాలు జరపాలని ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో ఈనెల 18 నుంచి జాగృతి సమావేశాలు ప్రారంభిస్తున్నట్లు జిల్లా ఎస్పీ హరిబాబు తెలిపారు. హరపనహళ్లి పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో ఉద్యానవనం నిర్మాణానికి భూమిపూజ నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో వసతి నిర్మాణాలకు చర్యలు చేపట్టగా త్వరలో టెండర్ల ప్రక్రియ జరపనున్నట్లు తెలిపారు. విజయనగర జిల్లాలో 2బీ వసతి గృహాల నిర్మాణానికి పథకం రూపొందించామన్నారు. వాటిలో హరపనహళ్లి తాలూకాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో 90 వసతి గృహాలు నిర్మిస్తామన్నారు.

సత్ఫలితాలు సాధించండి



మాట్లాడుతున్న సీఈఓ రాహుల్ తుకారాం పాండే

రాయచూరు రూరల్: 2023–24 విద్యా సంవత్సరానికి వచ్చే మార్చి నెలలో జరగనున్న టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే పేర్కొన్నారు. ఆయన మంగళవారం ప్రైవేట్ పాఠశాలలో హైస్కూల్ టీచర్లకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశంలో మాట్లాడారు. గతేడాది కంటే ఈ ఏడాది ఫలితాల్లో రెట్టింపు శాతం సాధించాలని, అధికారులు కూడా విద్యార్థుల నిష్పత్తికి తగ్గట్టుగా ఉపాధ్యాయులను నియమించాలన్నారు. సమావేశంలో డీడీపీఐ బడిగేర్, విద్యాశాఖాధికార్లు సుఖదేవ్, చంద్రశేఖర్, ప్రభు కన్నన్, వెంకటేశ్వరావులున్నారు.

దివ్యాంగుల్లో ప్రతిభను గుర్తించాలి



దివ్యాంగ ఉత్తమ సేవకులను సన్మానిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: దివ్యాంగుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ పిలుపు ఇచ్చారు. మంగళవారం కన్నడ భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగులతో సౌజన్యంగా మెలుగుతూ వారిలోని ప్రతిభను గుర్తించాలన్నారు. దివ్యాంగులు ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలన్నారు. అన్ని శాఖల అధికారులు 5 శాతం బడ్జెట్‌ను దివ్యాంగుల సంక్షేమానికి కేటాయించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే, ఎస్పీ నిఖిల్, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి శరణప్ప, మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి చేతన్ కుమార్, సీనియర్ సిటిజన్ల సంఘం అధ్యక్షుడు పవన్‌లున్నారు.

ప్రజాప్రభుత్వ వ్యవస్థకు పునాది యువత



పోటీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

కోలారు: యువత భాగస్వాములై క్రియాశీలంగా వ్యవహరించడం ద్వారా ప్రజాప్రభుత్వ వ్యవస్థకు గట్టి పునాదులు వేయాలని, ప్రజల్లో వ్యవస్థపై విశ్వాసం కల్గించాలని జెడ్పీ ఉప కార్యదర్శి శివకుమార్ తెలిపారు. నగరంలోని విద్యార్థులకు ఏర్పాటు చేసిన వివిధ పోటీ పరీక్షలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాప్రభుత్వ వ్యవస్థ కలిగిన దేశంలో యువతరం పాత్ర ఎంతో మహత్తరమైందన్నారు. ఓటర్లు ప్రజా ప్రభుత్వ వ్యవస్థ విజయవంతానికి ఓటింగ్ ప్రక్రియలో క్రియాశీలంగా పాల్గొనాలన్నారు. 18 ఏళ్లు పైబడిన ప్రతి విద్యార్థి తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు. జెడ్పీ ప్రణాళికా డైరెక్టర్ రవిచంద్ర మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారందరూ వీహెచ్‌ఏ యాప్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు తమ స్నేహితులు, ఇరుగు పొరుగు వారి పేర్లను కూడా ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పీయూ విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రప్ప, ఉపన్యాసకులు పాల్గొన్నారు.